# బంధం

నవల

- శ్రీకళ అబ్బరాజు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 188

కౌముది మాసపత్రికలో

జనవరి 2018 సంచిక నుంచి ఆగస్ట్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

**"ఇక్కడున్నావా?** నీ కేరాఫ్ అడ్రస్ ఈ గార్డెన్ అని తెలిసికూడా అనవసరంగా నీకోసం యిల్లంతా వెదికి వస్తున్నాను."

మల్లెపొదని ప్రూనింగ్ చేస్తూ వున్న ఆదిత్య ఆ మాటలు వినిపించిన వైపుకి తలతిప్పి చూశాడు.

తెల్లని చుడీదార్‌లో మెట్లు దిగి పరిగెత్తి వస్తూ కనిపించింది సుమ. ఆ వేగానికి మెట్ల పక్కగా వున్న సన్నజాజి తీగె రెమ్మలు. ఒక్కసారి ఆమె భుజాలని తాకి ఆనందంగా తుళ్ళిపడ్డాయి.

మెడచుట్టూ కప్పుకున్న పల్చటి చున్నీ గాలికి ఎగిరిపోకుండా చేత్తో పట్టుకుని, ఆయాసపడుతూ ఆదిత్య దగ్గరకు వచ్చింది.

"బావా! నీతో అర్జెంటుగా ఒక విషయం మాట్లాడాలి. ముందా కట్టర్ పక్కన పడేసి యిటురా!" అంది ఆదిత్య చేయిపట్టి లాగుతూ.

"ఒక్క నిముషం ఉండు" ఆదిత్య చెప్పేలోపలే, అతని చేతిలోని పనిముట్టుని లాగి పక్కన పడేసింది.

"అరె..రె.." ఆదిత్య ఏదో అనబోయాడు.

ఇంతలో, రామయ్య అక్కడికి వచ్చాడు.

"ఈ పని నేను చేస్తలే.. నువ్వెల్లు బాబు. లేకుంటే సుమమ్మ గాలిగిట్ల పీల్సనియ్యదు. చిన్నప్పటి సంది సుమమ్మ గిట్లనే వుండే జర్రంత మారలే!" అన్నాడు నవ్వుతూ.

రామయ్య ఇరవైయేళ్ళ నుంచి ఆ యింట్లో నమ్మకంగా పనిచేస్తున్న మనిషి.

"థాంక్యూ.. కాకా! నీకు తెలుసు నా సంగతి సరిగ్గా" అంటూ ఆదిత్యని చేయిపట్టుకుని లాక్కొచ్చి "కూర్చో" అంటూ లాన్‌లో బెంచీమీదకి తోసింది.

"నాకో చిన్న రికమండేషన్ కావాలి" అడిగింది అందంగా మూతి విరుస్తూ.

"....."

సాయంకాలం నీరెండకి, పసిడిరంగుతో మెరుస్తూ వున్న సుమ మొహంలోకి రెప్పవేయకుండా చూస్తూ ఉండిపోయాడతను.

"హలో! ఏంటలా ఫ్రీజ్ అయిపోయావు?"

మొహం మీద చిటికెలు వేయడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

"ఏంటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? నిన్న నీకు చెప్పిన సంగతి కూడా యిలాగే పరధ్యానంలో పడి మర్చిపోయావా?" పక్కనే కూర్చుంటూ అంది.

"ఏంటా? ఇందాక నన్ను 'బావా' అని పిలిచావు కదూ! అలా పిలవొద్దని ఎన్నిసార్లు చెప్పాను? అన్నాడు మాటమార్చి కోపం ప్రదర్శిస్తూ.

సుమ కిలకిలా నవ్వింది. "సర్లే.. ఆదీ అనే పిలుస్తాను."

"నీకు తెలుసా! అమ్మ నిన్ను ఆదిత్యా...ఆ.." అంటూ సాగదీసి పిలవాలని చెబుతుంది. నాకన్నా ఆరేళ్ళు పెద్దకదా నువ్వు పోనీ 'మీరు'.. 'గారు'' అని పిలవమంటావా? " అంటూ మళ్ళీ గలగలా నవ్వేసింది.

"ఇంతకీ విషయం ఏమిటో చెప్పు" చిరాగ్గా అన్నాడతను.

"అందుకే నాకు నీమీద కోపం వచ్చేది. ఇవాళ నా ఫ్రెండ్ సీమ బర్త్‌డే పార్టీ వుందని చెప్పానుగా! నాన్నకి నువ్వు రికమెండ్ చేయాలి. లేకపోతే నన్ను పంపరు" గారాలు పోతూ అడిగింది.

"నాన్నా!.. నాన్నా! అంటూ నాన్న కూచిలా మామయ్య భుజాలు పట్టుకుని వేళ్ళాడుతుంటావుగా మరి, యిప్పుడు నా హెల్ప్ దేనికి?" అన్నాడు సరదాగా ఆటపట్టిస్తూ.

"అమ్మో! నాన్న దగ్గర ముద్దుకి ముద్దు. రూల్సుకి రూల్సు. దేనిలో తేడా వచ్చినా ఊరుకోడు ఆదీ. అందుకే నీ హెల్ప్‌కావాలి. ప్లీజ్.. ప్లీజ్.. ప్లీజ్.." అంది బతిమాలుతూ.

"సరే! మామయ్య వాకింగ్ నుంచి వచ్చాక మాట్లాడతాను. ఇక నా పని నేను చేసుకోవచ్చా రాణీగారూ?" బెంచీ మీద నుంచి లేచిపడుతూ అన్నాడు.

"ఓ యస్..!" సంతోషంగా ఎగిరి గంతేసి... తుఫానులా ఎలా వచ్చిందో అలాగే వెళ్ళిపోయింది సుమ.

రెండంతస్థులు ఉన్న ఆ బంగళాలో మేడమీద ఉన్న ప్రసాదరావుగారి స్టడీరూంలోకి అడుగుపెట్టింది సుమ.

ఆ గది అచ్చంగా ఒక లైబ్రరీలా ఉంది.

గదిలో రెండువైపుల గోడలకి పెద్ద పెద్ద బుక్‌షెల్ఫులు.. వాటినిండా అరుదైనవి అవసరమైనవి అయిన పుస్తకాలు.

గది మధ్యగా ఒక సోఫాసెట్. ఇంకోవైపుకి, బుక్ షెల్ఫుకి వారగా, ఇక చిన్న దివాను వేసి వుంది. వాటికి ఒక పక్కగా చిన్న టేబుల్, మోడ ,మంచినీళ్ళు, మందులు, కాఫీమేకర్‌లాంటి సదుపాయాలన్నీ చక్కగా అమర్చబడి ఉన్నాయి.

ఇంకో పక్క ఎత్తైన గుండ్రటి గ్లాస్ టేబుల్ మీద పంచలోహాలతో చేసిన సరస్వతీ దేవి విగ్రహం పెట్టివుంది.

కిటికీ అద్దాలలో నుంచి గదినిండా పరుచుకున్న సాయంకాలపు నీరెండ జ్ఞానసరస్వతీదేవి పాదాల నుంచి వస్తున్న వెలుగుపరుచుకున్నదా అన్నట్టుంది.

చుట్టూ వున్న పుస్తకాలు నిశ్శబ్ధంగా మునుల్లా నిలబడినట్టు వుంటే గాలిచప్పుళ్ళు ఆమెను నాదంతో ఆరాధిస్తున్నట్టున్నాయి.

సుమ గదిలోకి వస్తూనే చేతిలోని మల్లెపూలదండని అమ్మవారి మెడలో వేసింది. టేబుల్ మీద న్యూస్‌పేపర్లు సర్దబోతుండగా కిటికీలో నుంచి కింద గార్డెన్‌లో పనిచేస్తున్న ఆదిత్యని చూసింది.

కొనదేలినట్టున్న ముక్కు, కొద్దిగా నొక్కులతో పక్కకి దువ్వినట్టున్న క్రాఫు దూరం నుంచి అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఇంకా మొక్కల సేవలోనే వున్నాడన్నమాట. విచిత్రమైన మనిషి. కదిలిస్తేగానీ కదలడు. నేను చెప్పిన విషయం గుర్తుందో లేదో" అనుకుంటూ, అసహనంగా గడియారం వంక, ఆదిత్య వంక మార్చి మార్చి చూసింది.

ఇంతలో గుమ్మంలో అడుగుల చప్పుడు వినిపించింది.

తలతిప్పి, ప్రసాదరావుని చూస్తూనే, "నాన్నా!" అంటూ పరుగున వెళ్ళి, చిన్నపిల్లలా రెండు చేతులూ మెడచుట్టూ వేసి కావలించుకుంది.

"ఆహా!" ఒక్కసారి బరువుగా గాలిపీల్చాడాయన.

"మా చిట్టితల్లి అప్పుడే మల్లెపూలు తెచ్చిందనమాట!" సుమ భుజం మీద చేయివేసి లోపలికి వస్తూ అన్నాడాయన.

"మీకు మల్లెపూల వాసనంటే యిష్టంకదా! అందుకే సీజన్‌లో పూలు వచ్చినన్ని రోజులూ మీకోసం స్టడీలో, నాచురల్ జాస్మిన్ ... అరోమా!" అంది నవ్వుతూ.

"ఇంతకీ యివాళ కాలేజ్ ఎలా జరిగింది?"

చదువు సంగతి రాగానే, బుద్ధిమంతురాలిలాగా అయిపోయింది సుమ మొహం.

"గ్రేట్.. నాన్నా! ఇంటర్నల్ టెస్ట్‌లో బెస్ట్ స్కోర్ నచ్చింది"

"వెరీగుడ్ నీకింకో న్యూస్ చెప్పాలి. నీ ఫైనల్ యియర్ అయిపోయేలోపే నువ్వు సివిల్ సర్వీసెస్‌కి కోచింగ్ తీసుకోవాలి. ఇవ్వాళే నీ అడ్మిషన్ గురించి మెహతా అంకుల్‌తో మాట్లాడి వచ్చాను. నెక్స్ట్ మండే నుంచే నీకు క్లాసులు ప్రారంభమవుతాయి. ఇక నుంచీ నీ షెడ్యూలు చాలా టైట్‌గా ఉంటుంది."

"తప్పకుండా నాన్నా! కానీ మీరు రోజూ నాతో గడిపే టైం మాత్రం ఎప్పటికీ మారడానికి వీల్లేదు. రోజూలాగే మనం రాజకీయాల గురించి, తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుకోవాలి. కలిసి పుస్తకాలు చదువుకోవాలి. దానికోసం, అవసరమైతే మీ టైం టేబుల్ కూడా మార్చుకోవాలి.."

"తప్పకుండా అమ్మా!"

"మామయ్యా!" ఆదిత్య గదిలోకి వచ్చి ప్రసాదరావు ముందు చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"ష్..ష్. చెప్పు" సోఫాలో తండ్రి పక్కన కూర్చున్న సుమ ఆదిత్యకి మాత్రం కనిపించేలా సైగలు చేసింది.

"మీకోసం సిటీ ప్లానింగ్ ఆఫీసు నుంచి మనిషి వచ్చారు. డ్రాయింగ్ రూంలో కూర్చోబెట్టాను" వినయంగా చెప్పాడు ఆదిత్య.

"అబ్బా!" సుమ గట్టిగా చేత్తో నుదురుకొట్టుకుంది.

"ఈ ఆదిత్య కూడా శరత్‌చంద్ర నవల్లో హీరోలా అసలు విషయం సూటిగా చెప్పడు" అనుకుంటూ

"నాన్నా! ఇవాళ నా ఫ్రెండ్ సీమ బర్త్‌డే పార్టీ వుంది. వెళ్ళొస్తాను. ప్లీజ్" అడిగింది తండ్రిని.

"ఎక్కడ? ఎప్పుడు?" ప్రసాదరావు గొంతు గంభీరంగా మారింది.

"సీమ వాళ్ళింట్లోనే. రాత్రి తొమ్మిది. ఊహూ పదిగంటలవ్వచ్చు పార్టీ అయిపోయేసరికి" చెప్పింది.

"నీకు తెలుసుగా నాకిలాంటివన్నీ నచ్చవని. ఫోన్ చేసి విష్ చేసి, రావడంలేదని చెప్పు నీ ఫ్రెండ్‌కి" అన్నాడు మందలింపుగా.

"ప్లీజ్ నాన్నా! నా ఫ్రెండ్సందరూ వస్తున్నారు. నేనూ వెళతాను." అంది చిన్నపిల్లలా కాళ్ళు నేలకి తాటిస్తూ.

"నో..వే" ప్రసాదరావు యింకేదో అనబోతుండగా ఆదిత్య మధ్యలో కల్పించుకున్నాడు.

"మామయ్యా! మీరే అన్నారుగా సుమ తెలివైనది. మంచి రిజల్ట్స్ తెస్తుంది అని. రివార్డ్‌గా ఒక్కసారికి పార్టీకి పంపించండి. ఒప్పుకోండి" అన్నాడు బతిమాలుతూ.

ఆయన ఒక్క క్షణం ఆలోచించాడు.

"నువ్వు చెబితే సరే! కానీ, సుమని జాగ్రత్తగా తీసుకువెళ్ళి జాగ్రత్తగా తీసుకువచ్చే బాధ్యత నీది. అలాగైతేనే ఒప్పుకుంటాను" అన్నాడాయన ఆదిత్య వంక చూస్తూ.

"యస్స్.." ఆనందంగా అరిచింది సుమ.

"సుమా! నువ్వు యింటికి మరీ ఆలస్యంగా రాకూడదు. నేను నా ఆర్టికల్ రాయడం పూర్తిచేశాను. రేపొద్దున్నే లేచి నువ్వు లాప్‌టాప్‌లో టైపింగ్ చేయాలి. నలభై పేజీల దాకా వుంది" సుమకి చెప్పి వెళ్ళిపోయాడాయన.

"ఇదే సీమవాళ్ళ యిల్లు" సుమ డైరెక్షన్ యిచ్చిన వైపు స్టీరింగ్ తిప్పి కారు పార్క్ చేశాడు ఆదిత్య.

కారు డోర్ తీస్తూనే, సీమ వాళ్ళ బంగ్లాలో నుంచి పార్టీ మ్యూజిక్ లౌడ్‌గా వినిపించింది.

"పార్టీ మొదలైనట్టుంది" అనుకుంటూ సుమ కారు దిగి హడావుడిగా వెళ్ళబోతుండగా..

"సుమా!" అంటూ ఆదిత్య పిలిచాడు.

"ఏంటి?"

హఠాత్తుగా వెనక్కి తిరగడంతో, షాంపూ చేసి నీట్‌గా దువ్వి వదిలివేసిన ఆమె పొడవైన జుట్టు రెండు భుజాల మీద అందంగా పరుచుకుంది.

పీచ్ కలర్ చుడీదార్‌లో మెరిసిపోతున్నట్టున్న సుమని ఒకసారి కళ్ల నిండుగా చూశాడు ఆదిత్య.

"కారులోనే వెయిట్ చేస్తూ ఉంటాను. అవసరమైతే ఫోన్ చెయ్యి. సరేనా!" మృదువుగా చెప్పాడు.

సుమ చిరుకోపంగా ఆదిత్య వైపు చూసింది

"కారులో మగ్గిపోయే బదులు నువ్వూ పార్టీకి రావచ్చుకదా! నువ్వు మారవు" అంటూనే గబగబా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది.

"హాయ్!" సుమని చూస్తూనే, పరుగున వచ్చి ఆనందంగా కావలించుకుంది సీమ.

"నువ్వు వస్తావనుకోలేదు. మీ డాడీ చాలా స్ట్రిక్ట్ కదా. పంపరనుకున్నాను. ప్చ్ నువ్వు రావని విక్కీతో బెట్ కూడా కట్టాను. ఫైవ్ థౌజండ్ లాస్" అంది నవ్వుతూ.

"కమాన్ సీమా! మా నాన్న మరీ అంత స్ట్రిక్ట్ కాదు" అంది సుమ కూడా నవ్వుతూ.

"ఏనీవే.. నువ్వు వచ్చావు.. అది చాలు! డ్రింక్స్ ఫుడ్. ఫ్రెండ్స్ ఎలా అయినా టైం పాస్ చెయ్యి" చెప్పి, అప్పుడే వచ్చిన యింకొక అతిథిని పలకరించడానికి వెళ్ళింది సీమ.

సుమ ఒకసారి తలతిప్పి చుట్టూ చూసింది. అక్కడ అందరూ దాదాపుగా పాతికేళ్ళకి అటూయిటూగా వున్నవాళ్ళే. సర్వ్ చేసేవాళ్ళలో ఒకరిద్దరు తప్ప పెద్దవాళ్ళు ఎక్కడా కనిపించలేదు.

"సీమ స్టైల్‌కి, టేస్ట్‌కి తగినట్టుగా వుంది పార్టీ.." అనుకుంటూ బఫే కౌంటర్ దగ్గరకు నడిచింది.

"హాయ్!" డిన్నర్ ప్లేట్ పట్టుకుని వస్తున్న సుమ దారికి అడ్డం వస్తూ పలకరించాడో యువకుడు.

బ్రౌన్ కలర్ లెదర్ జాకెట్. నైక్ షూస్, లైట్‌గా పెరిగిన గడ్డం, మణికట్టుకి తగిలించివున్న బేండ్ అతని రఫ్‌నెస్‌నీ, ఆటిట్యూడ్‌ని చూపిస్తున్నట్టున్నాయి.

"హలో" మొక్కుబడిగా చెప్పి పక్కకు తప్పుకోబోయింది.

"అయామ్ మోహిత్" అతను కూడా ఒక అడుగు పక్కకి జరిగి ఆమెను ఆపాడు.

"నా పేరు సుమ. ఇక నేను వెళ్ళొచ్చా" అంది చిరాగ్గా. మొహం పెట్టి.

"నీ పేరు నాకు ముందే తెలుసు" సూటిగా కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"స్టుపిడ్! మేనర్స్ బొత్తిగా లేనట్టుంది" మనసులోనే గొణుక్కుంది.

"మన మొదటి పరిచయానికి నువ్వు యింతకన్నా ఎక్కువ మాట్లాడవని నాకు తెలుసు. ప్రసాదరావు యింట్లో పెరుగుతున్నవు కదా! బట్. డోంట్ వర్రీ మన పరిచయం యిక్కడితో ఆగిపోదు."

"హలో..! ప్లీజ్ మైండ్ యువర్ లాంగ్వేజ్. పెద్దవాళ్ళ పేరు తీసుకునేటప్పుడు మర్యాదగా మాట్లాడాలని ఎవ్వరూ నేర్పించలేదు కాబోలు" కోపంగా అంది.

ఆమె కోపాన్ని లెక్కచేయనట్టు నవ్వాడతను.

అతని నవ్వు చూసి ఒక్క క్షణం ఉలిక్కిపడింది సుమ. చాలా పరిచయం వున్న నవ్వు.

ఎక్కడో చూసినట్టుగా వుందా నవ్వు.

కేవలం పరిచయం వున్న వ్యక్తిలా మాత్రమే కాదు. ఎంతో కావలిసిన వ్యక్తిలా కూడా అనిపించాడా క్షణం.

మనసులో మెదిలిన భావాలకి కారణాలు వెతుక్కునే పనిలో పడింది. మస్తిష్కంలో ఆలోచనలు పరుగులు పెడుతూ వుంటే మాటలు రానట్టు అతని వంక చూస్తూ ఉండిపోయింది.

"తొందరలోనే మళ్ళీ కలుద్దాం" అని చెప్పి వెళ్ళబోతూ, "అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. ఈ డ్రస్‌లో నువ్వు చాలా బావున్నావు. ఈ కలర్ నీకు బాగా నప్పింది" అని కనుబొమలు ఎగరేస్తూ చిలిపిగా నవ్వాడు.

పరిచయం అయిన క్షణంలోనే ఏకవచనం అవతలి వాళ్ళని మాట్లాడనివ్వని దురుసుతనం ముఖ్యంగా తన గురించిన అన్ని విషయాలు తెలిసినట్టు మాట్లాడడం చూసి సుమ అయోమయంలో పడింది.

అతని మాటలకు జవాబిచ్చేలోపలే ఉన్నట్టుండి మాయమైపోయాడు.

"మనిషి చూడ్డానికి బావున్నాడు. కానీ, బోలెడంత ఆటిట్యూడ్ మోహిత్ అనే పేరు యిదే మొదటిసారి వినడం. అతన్ని యింతకు ముందెప్పుడూ చూడలేదు. అయినా, మొదటి పరిచయంలోనే ఎందుకో. అతను బాగా దగ్గర వ్యక్తిలా అనిపించాడు. స్ట్రేంజ్" మనసులోనే అనుకుంది. సుమ.

పార్టీ నుంచి యింటికి తిరిగి వస్తూనే, హాల్లో సోఫాలో కూర్చుని ఎదురుచూస్తూ కనిపించింది వసుంధర.

"అమ్మా నువ్వింకా నిద్రపోలేదా?" తల్లిని చూస్తూనే ప్రశ్నించింది సుమ.

"ఇవాళ నేను కాలేజీనుంచి యింటికి వచ్చాక నా కంటికి కనిపించావా నువ్వు?" కోపం నటిస్తూ అందామె.

"సారీ.. అమ్మా! నేను నాన్నతో స్టడీలో కూర్చుని వున్నాను. ఆ తర్వాత తొందరగా బర్త్‌డే పార్టీకి వెళ్ళాల్సొచ్చింది సారీ" వసుంధర గడ్డం పట్టుకుని బతిమాలుతున్నట్టుగా అంది.

"మీ నాన్న రిటైరయ్యారు. రోజంతా ఇంట్లోనే ఉంటారు. కనీసం నేను జాబ్ నుంచి యింటికి వచ్చిన తర్వాతన్నా నాతో కొంచెం టైం గడపొచ్చు కదా!"

"సారీ అన్నానుగా! నన్ను తిట్టడం కోసమే యింతవరకు మేలుకుని ఉన్నావా?" కళ్ళు పెద్దవి చేస్తూ అడిగింది.

"నీ కోసం కాదు. ఎదురు చూస్తుంది. ఆదిత్య కోసం నువ్వు హాయిగా పార్టీలో తీసేసి ఎప్పటిలాగే ఆదిత్య గురించి పట్టించుకుని ఉండవు. నా బిడ్డ తినొద్దూ" అంది ఆదిత్య వైపు చూస్తు లాలనగా.

"అవును. నీకెప్పుడూ నాకన్నా ఆదిత్య అంటేనే యిష్టం" కోపంగా ఉడుక్కుంటూ అంది.

"మీ యిద్దరూ ఈ యింట్లో నా దగ్గరే పెరిగారు. ఎవరెలాంటివాళ్ళే నాకు బాగా తెలుసు.

ఆదిత్య అచ్చం నాలాంటివాడు. మనసులో మాట అడిగితేగానీ బైటపెట్టడు. నువ్వు నీకు కావాల్సింది సాధించుకునేదాకా ఎదుటివాళ్ళని నిద్రపోనివ్వవు. నీ గురించి పట్టించుకోనవసరంలేదు"

సుమ అలిగినట్టుగా కనుబొమ్మలు ముడివేసింది.

"అమ్మా.. మరీ ఎక్కువ అన్నావంటే యిప్పుడు మనతో యుద్ధం చేస్తుంది. వదిలెయ్యి" అన్నాడు ఆదిత్య నవ్వుతూ.

"వాళ్ళ నాన్నతో బాటు నువ్వూ గారాబం చేయడం వల్లే యిది యిట్లా తయారవుతుంది" అంది వసుంధర చిరుకోపంగా.

జవాబుగా ఆదిత్య నవ్వాడు.

"మీరిద్దరూ ఏమైనా అనండి. నాకనవసరం. నేను నాన్నని చూసి వస్తా" అంటూ మాస్టర్ బెడ్రూం వైపుకి పరుగుతీసింది.

"మామయ్య పడుకుని ఉంటారు" వెనుకనుంచి ఆదిత్య చెబుతున్నా వినిపించుకోలేదు.

"ఇప్పుడు వెళ్ళి మందుల డబ్బా చెక్ చేసి, మీ మామయ్య టాబ్లెట్స్ అన్నీ సరిగ్గా వేసుకున్నారో లేదో చూసి గానీ నిద్రపోదు" వసుంధర అంటుంటే, ఆదిత్య సుమ వెళ్ళిన వైపుకి చూస్తూ చిరునవ్వు నవ్వాడు.

స్టడీ రూంలో ప్రసాదరావు ఎదురుగా కూర్చుని వుంది సుమ. ఇద్దరి మధ్య తెలుగు సాహిత్యంలోని ఉపమానాలగురించి చర్చ జరుగుతూ ఉంది.

"నాన్నా! ఆడవాళ్ళని ఎక్కువగా పూవులతోనే ఎందుకు పోలుస్తారు?" చేతిలో వున్న పుస్తకం మధ్యలో వేలుపెట్టి మూస్తూ అడిగింది.

"మన గార్డెన్లో ఎన్నో రకాల మొక్కలు ఉన్నాయి. వాటికి ధృఢమైన వేళ్ళు, ఆహారాన్ని తయారు చేసే ఆకులు ఉండి ఎంత ఏపుగా పెరిగినా మన దృష్టిని ఆకర్షించవు. అవే మొక్కలు రంగురంగులపూలతో సువాసనలు వెదజల్లుతూ ఉన్నప్పుడు తెలియకుండానే మన మనసుల్ని పట్టిలాగేస్తాయి.

ఆ పూలు మనకి ఎలా ఉపయోగిస్తాయి? అవి ఆ తర్వాత కాయలుగా, పండ్లుగా మారుతాయా? అన్న ఆలోచన లేకుండా వాటిని యిష్టపడతాం. మన ప్రమేయంలేకుండానే సహజసిద్ధంగా ప్రేమిస్తాం.

పూలకి వాటి సౌకుమార్యం ఎలాగో ఆడవాళ్ళకి సహజంగా వుండే దయ, జాలి ప్రేమని పంచేగుణాలు. ప్రత్యేకం. అవి అవతలివారి హృదయాల్ని కట్టిపడేస్తాయి. వాటికి లెక్కలు, ఆలోచనలు లేవు. భగవంతుడు మనుషుల హృదయాల్లో సహజసిద్ధంగా ఆ గుణాన్ని పెట్టేశాడు. నేచురల్ ఇన్స్టింక్ట్ అన్నమాట.

అందుకే, ఆడవాళ్ళని పూలతో పోల్చారు.

మరి మనింట్లో ఆడబిడ్డని ఎవరితో పోల్చాలి?

ఆడపిల్ల మనసెప్పుడూ పుట్టింటి మీద ప్రేమని కురిపిస్తూనే ఉంటుంది. అమ్మ నీడ నెత్తిమీద నుంచి పోయిన ముసలి తల్లిదండ్రులకి ఒక్క కూతురు మాత్రమే తల్లికాగలదు.

అందుకే ఆడవాళ్ళని పూలతో పోల్చారు. మన యింటి ఆడబడుచుని దేవుడిచ్చిన వరం అన్నారు."

"నాన్నా! యిప్పటిదాకా నా పేరు 'సుమ' అంటే జస్ట్ పువ్వు అనుకునేదాన్ని. కానీ, మీరు చెప్పింది విన్న తర్వాత, 'పువ్వుని' ఎన్ని ఉదాత్తగుణాలకి ప్రతీకగా వ్యవహరిస్తారో తెలుసుకున్నాను. అన్నింటికంటే ఎక్కువగా "మీరు నాకు నాన్న నేను మీకు కూతుర్ని" ఇది నాకు గర్వంగా వుంటుంది. కానీ మీలాగా ఎందుకు అందరు ఆలోచించరు? పూవుల్లాగే, ఆడవాళ్ళూ ఈ సమాజంలో ఎందుకు నలిగిపోతూ, వేధింపులకి గురౌవుతూవుంటారు" ఆవేదనగా అడిగింది.

"అలాంటివాళ్ళని మూర్ఖులనే అనాలి" అని యింకా ఏదో అనబోతుండగానే.

"ఏం జరుగుతుంది యిక్కడ?" అంటూ, వసుంధర టీ కప్పులు, స్నాక్స్ ఉన్న ట్రే పట్టుకుని లోపలికి వచ్చింది.

"నేనూ, నాన్న పుస్తకం చదివి చర్చించుకుంటున్నాం" అంది తల్లి చేతిలోని ట్రేని అందుకుని బల్లమీద పెడుతూ.

అప్పుడే, ఆదిత్య కూడా లోపలికి వచ్చాడు.

"ఓహో! బావ కూడా వచ్చాడన్నమాట. బావా నాకో చిన్నపనుంది నీతో" హుషారుగా అంది సుమ.

"ఏయ్! ముందు ఆదిత్యని టీ తాగనివ్వు" వసుంధర కూతుర్ని మందలించింది.

"ఆదిత్యా!" ప్రసాదరావు మధ్యలో కల్పించుకున్నాడు "రేపట్నుంచి సుమ సివిల్ సర్వీసెస్ కోచింగ్ మొదలవుతుంది. ఒక కారు అమ్మాయికి క్లాసులకి అటెండ్ అవడానికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. డ్రైవర్‌కి టైమింగ్స్ కుదరకపోతే నువ్వే డ్రాపింగ్, పికింగ్ చేయాల్సి వుంటుంది. కారు మాత్రం సుమ చేతికి యివ్వకూడదు. ట్రాఫిక్‌లో అనవసరంగా అలిసిపోతుంది. తర్వాత చదువుకోవడానికి యిబ్బంది టైం వేస్టు. నాకు యిష్టంలేదు" చెప్పాడాయన.

"అలాగే మామయ్యా" టీ కప్పు బుద్ధిగా తలవూపాడు ఆదిత్య.

"బావా! త్వరగా కానీయ్."

ఒక్క గుక్కలో టీ తాగేసి, ఆదిత్యని తొందరపెట్టింది సుమ.

"పద" వెంటనే, కప్పు బల్లమీద పెట్టి లేచాడతను. వాళ్ళిద్దరూ గుమ్మం దాటుతూనే

"సుమని మీరు మరీ నెత్తికెక్కించుకుంటున్నారు. మీరు చెప్పినట్టుగా ప్రతి విషయంలో క్రమశిక్షణతో నడుచుకుంటుందని అనుకుంటున్నారు కాబోలు. ఆదిత్యని తోడు చేసుకుని మిమ్మల్ని మాయ చేస్తూ ఉంటుందని తెలుసుకోండి" వసుంధర భర్తకి ఫిర్యాదు చేసింది.

ప్రసాదరావు నవ్వాడు. "నీకు నా కూతురి సంగతి తెలియదు. అది ఎంత అల్లరి చేసినా, అటూ యిటూ గడబిడ చేసినా ఆఖరికి అనుకున్న రిజల్టు తెచ్చి చూపిస్తుంది" అన్నాడాయన గర్వంగా నవ్వుతూ.

"ఏంటీ.. మీ నమ్మకం మీది" నిట్టూర్చింది వసుంధర.

ఇంతలో ప్రసాదరావు సెల్‌ఫోన్ మోగింది.

"హలో" అంటూ అవతల వ్యక్తి గొంతు వింటూనే, ఆయన మొహం వెలిగిపోయింది.

ఆ ఫోన్ ఎక్కడి నుంచో యిట్టే గ్రహించగలిగింది వసుంధర.

"**వసూ!** సుధీర్ భార్యాపిల్లలతో అమెరికానుంచి సెలవలకి వస్తున్నాడు. మొత్తం పూర్తి రెండు నెలలు ఉంటారిక్కడ. మూడేళ్ళ తర్వాత చూడబోతున్నాను సుధీర్‌ని" ఫోన్ పెట్టేస్తూనే ఆనందంగా చెప్పాడు భార్యతో.

కొడుకూ, కోడలూ పిల్లలతో సహా వస్తున్నారంటే భర్తపడే సంతోషం అర్ధమైంది వసుంధరకి. సుధీర్ అమెరికా నుంచి, తండ్రిని చూడడానికి మూడేళ్ళపాటు రాలేదు. దానికి కారణం తనే అనుకుంటూనే వసుంధర మొహంలో విచార రేఖలు అల్లుకున్నాయి.

"వసూ! ఏమిటాలోచిస్తున్నావ్?" ఆమె మనసుని పసిగట్టినట్టే అడిగాడాయన.

"ఏం లేదు సుధీర్ చాలా కాలం తర్వత ఇండియా వస్తున్నాడు కదా! వాళ్ళకి ఏమేమి ఏర్పాట్లు చేయాలా? అని ఆలోచనలో పడ్డాను" అంటూ తెచ్చిపెట్టుకున్న నవ్వుతూ జవాబిచ్చింది వసుంధర.

"ఆదీ నాన్న చూడు ఏ విషయమైనా నేనడిగితే ఒప్పుకోరు. నువ్వు చెబితే ఠకీమని ఓ.కే అంటారు" లాన్‌లో ఆదిత్య పక్కనే నడుస్తూ అంది సుమ.

"ఎందుకంటే నీకింకా బాధ్యత తెలియదని మామయ్య నమ్మకం" అన్నాడతను నవ్వుతూ.

"నువ్వు బిజినెస్ చూసుకుంటూ బాగా డబ్బు సంపాదిస్తున్నావని నీమీద నమ్మకమా?" అంది మూతి విరుస్తూ.

ఆదిత్య నడుస్తున్నవాడల్లా ఠక్కున ఆగి సుమ వైపుకి తిరిగాడు.

"డబ్బు సంపాదించే ప్రతివాడూ బాధ్యతాపరుడు, మర్యాదస్తుడు అయిపోడు.

మనిషికీ మనిషికీ ప్రత్యేకమైన గుర్తింపు ఒకటి ఉంటుంది. అది చెబితే తెలిసేది కాదు. మన ఉనికిని బట్టి, ప్రవర్తనని బట్టి మనసుతో తెలుసుకునేది. మామయ్యకి ఆ జ్ఞానం ఉంది. నీకే యింకా తెలియడం లేదు" ఆమె కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు.

అతని చూపుల్లో భావాలు, ఆమె మనసుదాకా చేరలేదు.

"హూ! చూస్తూ వుండు. ఎప్పటికైనా నాన్న దగ్గర నీ మాటకంటే నా మాటే చెల్లించుకుంటాను" ఉడుక్కుంటూ అంది.

"అలాగే!" చిన్నగా నవ్వాడతను.

"ఇంతకీ నేనడిగిన బుక్స్ తెచ్చావా? అందుకే నిన్ను రమ్మన్నది" అంటూ అసలు విషయం గుర్తుచేసింది.

"పద" అంటూ పార్క్ చేసివున్న కారువైపు దారితీడాడు ఆదిత్య. కారు వెనక డోర్ తీసి బుక్స్ వున్న కవర్‌తోబాటు ఒక చిన్న బాక్స్ కూడా ఆమె చేతిలో పెట్టాడు.

"వావ్! ఐ ఫోన్ 10.. లేటెస్ట్ మోడల్." అట్టపెట్టెను చూస్తూనే ఆనందంగా ఎగిరి గంతేసింది.

"కొత్త వెర్షన్ వచ్చిందని కొన్నాను. వచ్చే సంవత్సరం యింకో మోడల్ రిలీజ్ అయితే కొత్తది నువ్వు తీసుకుని యిది నాకు యిచ్చెయ్యి. సరేనా!?"

"పూర్ ఆదిత్యా.. ఇంత సంపాదిస్తూ నేను వాడిన ఫోన్ వాడుకుంటాననంటావేంటి? ఎనీహౌ నువ్వు యింకా బాగా సంపాదించి నాకోసం యిలాగే హేపీగా ఖర్చుపెట్టు" చెయ్యి పైకెత్తి ఆశీర్వదిస్తున్నట్టు ఫోజ్‌పెట్టి కిలకిలా నవ్వింది.

"ఎనీథింగ్ ఫర్ యూ!?" ఆమె సంతోషమంతా తనదే అయినట్టు చిరునవ్వు నవ్వాడతను.

గార్డెన్‌లో మల్లెపందిరి కింద ఒంటరిగా కూర్చుని ఉన్నాడు ఆదిత్య. లాన్‌లో అక్కడక్కడా వున్న లాంప్ పోస్ట్‌ల నుండి పల్చటి వెలుతురు నేలమీద పరుచుకుని ఉంది. దానిమీద చెట్లపొదల నీడలు చీకటి ముద్రలు వేస్తున్నాయి.

"నువ్వీ టైంలో యిక్కడే కూర్చుని ఉంటావనుకున్నాను" ఉన్నట్టుండి మాటలు వినిపించడంతో తలతిప్పి చూశాడు ఆదిత్య.

ఎదురుగ్గా వసుంధర కనిపించింది.

"అమ్మా! మీరేంటి యిలా వచ్చారు? ఒక్క కాల్ చేస్తే నేనే వచ్చేవాడిని కదా!" అన్నాడు గబుక్కున లేచి నిలబడుతూ.

"కాస్సేపు చల్లగాలికి కూర్చుని నీతో మాట్లాడాలని వచ్చాను" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది వసుంధర. అక్కడక్కడా నెరసిన వెంట్రుకలతో వెనక్కి దువ్వి వేసిన ముడి సాదాసీదాగా వుండే నేతచీరలు, ప్రశాంతమైన ముఖం, ఆమె గుర్తింపు. అలాంటిది ఆమె మొహంలో విచారం చూసి కలవరపడ్డాడు ఆదిత్య.

"అమ్మా! అంతా బానే వుందికదా! కాలేజీలో ఏదైనా ప్రాబ్లమా?" ఆదుర్దాగా అడిగాడు.

"అక్కడేం సమస్యలుంటాయి ఆదీ! రోజూ వెళ్ళడం పిల్లలకి పాఠాలు చెప్పి రావడం" అంటూ ఎదురుగా ఉన్న చెట్లపొదల వైపు చూసి ఆగిందో క్షణం.

"సుధీర్ ఫ్యామిలీతోబాటు హాలిడేస్‌కి యిక్కడికి వస్తున్నాడు" చెప్పింది చిన్నగా.

ఓహ్! సుధీర్ వస్తున్నాడా! సంతోషంగా అంటూ వసుంధరవైపు చూసి తక్కున ఆగిపోయాడు. విచారంగా ఉన్న ఆమెను చూస్తూనే అతని మొహంలో రంగులు మారాయి.

"అయామ్ సారీ.. ఆదీ! డోంట్ టేక్ మీ రాంగ్. సుధీర్ వస్తున్నందుకు నాకూ సంతోషంగానే ఉంది. కానీ, నీకు తెలుసుగా మా రిలేషన్ చాలా విచిత్రమైనది"

ఆదిత్య మౌనంగా అవునన్నట్టు తల ఊపాడు.

"ప్రసాదరావుగారితో నాకు జరిగింది రెండోపెళ్ళి. ఆయన కొడుకు సుధీర్. నా కూతురు సుమ. మా పెళ్ళి జరిగినరోజునుంచి మేమిద్దరం యిద్దరు పిల్లల్నీ మా స్వంత పిల్లల్లాగే పెంచాలని నిర్ణయించుకున్నాం. సుమ చాలా చిన్నది అప్పటికి. రావుగారు తన సొంత తండ్రి కాదని తెలిసినా, ఆయనకు చాలా దగ్గరైపోయింది. ఎంతగా అంటే నిజంగా రక్తసంబంధం ఉన్న తండ్రీకూతుళ్ళయినా అంత ఆప్యాయంగా ఉంటారా? అన్నంతగా!

కానీ సుధీర్ అప్పటికే పన్నెండేళ్ళ పిల్లవాడు. నేనెంతగానో సుధీర్‌కి దగ్గరవ్వాలని ప్రయత్నించాను. కానీ అతను ఎప్పుడూ నన్ను వాళ్ళమ్మ స్థానంలోనే చూసి ద్వేషం పెంచుకున్నాడు. నామీద ఉన్న కోపం వాళ్ళ నాన్నపట్ల విధేయతలేకుండా చేసింది. రావుగారిని వదిలి అమెరికా వెళ్ళిపోయాడు, పెళ్ళై పిల్లలు పుట్టినా అతనిలో ఆ విముఖత పోలేదు.

మీ మామయ్య మాత్రం ఆ విషయంగా ఎప్పుడూ నన్ను ఒక్క చిన్నమాట కూడా అనలేదు.

మూడేళ్ళ పిల్లతో భవిష్యత్తు తెలీకుండా అయోమయంలో వున్న నా చేత పి.హెచ్.డి చేయించి ఈరోజు నలుగురిలో గౌరవంగా ఉండే స్థానంలో కూర్చోబెట్టారు. సుమ పట్ల ఎటువంటి బేధభావం చూపించలేదు.

ఈరోజు వరకు నన్ను నా కూతుర్ని యింత బాగా చూసుకుంటున్నారు. కానీ నావల్ల ఆయనకేం జరిగింది? మీ మామయ్య మీ అత్తయ్యని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. ఆవిడ చనిపోయేవరకు ప్రాణంగా చూసుకున్నారట. ఆవిడ ఏకైక గుర్తు సుధీర్. సుధీర్ పిల్లలు ఆయన స్వంత మనవడు, మనవరాలు. ఆయన రక్తసంబంధం.

వాళ్ళని రావుగారికి దూరంగా ఉంచి, నేనూ నా కూతురు యిక్కడ సంతోషంగా ఉంటున్నాం అనుకుంటేనే మనసుకి ఎంతో బాధగా ఉంటుంది.

మాకు యింత చేశారాయన. సుధీర్‌ని నేను గుండెల్లో పెట్టుకోలేనంటావా? లేకపోతే నాలోనే ఏదో లోపం వుందా? సుధీర్ దూరంగా ఉండడానికి నేనే కారణం. ఈ గిల్టీ ఫీలింగ్ నన్ను తొలిచేస్తూ ఉంటుంది ఎప్పుడూ" చెబుతూ ఉంటే వసుంధర కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అమ్మా! ప్లీజ్ డోంట్ బ్లేమ్ యువర్ సెల్ఫ్. మిమ్మల్ని గుర్తించలేకపోవడం సుధీర్ దురదృష్టం. మా అమ్మా, నాన్నా యిద్దరూ నా చిన్నతనంలోనే యాక్సిడెంట్‌లో చనిపోయారు. నువ్వే లేకపోతే నేను ఏమైపోయేవాడిని? మామయ్య మా అమ్మకి సొంత అన్నయ్య అయినా ఆయనకంటే నువ్వే నన్ను బాగా చూసుకున్నావు. ఎప్పుడూ నిన్ను 'అత్తయ్యా' అని పిలవాలనిపించదు. 'అమ్మ' అనే అంటాను. అలాంటప్పుడు నీ గురించి నువ్వు తక్కువ చేసుకుని ఎందుకు మాట్లాడతావు?" ఓదార్పుగా అన్నాడు.

వసుంధర రెండు నిముషాలపాటు మాట్లాడలేదు. దుఃఖాన్ని అదుపు చేసుకుంటున్నట్టుగా రెండు పెదవులను ఒత్తిపట్టింది.

"సుధీర్ వాళ్ళు ఉన్నన్ని రోజులూ వాళ్ళకి కావలసిన ఏర్పాట్లన్నీ జాగ్రత్తగా చూసుకోవాలనుకుంటున్నాను. అవసరమైతే నీ హెల్ప్‌కూడా అడుగుతాను" అంది మామూలు ధోరణిలోకి వస్తూ.

"తప్పకుండా"

"నీ గురించి నాకు తెలుసు ఆదీ. ఎప్పుడెలా నడుచుకోవాలో నీకు తెలుసు. సుమకే బొత్తిగా జ్ఞానం లేదు. దాని గురించే నా దిగులంతా."

"సుమ గురించా!?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నీకు గుర్తుందా? సుమ ఈ యింటికి వచ్చినప్పుడు చాలా చిన్నది. ఇంత పెద్ద బంగ్లాలో తనకి స్నేహితులెవ్వరూ లేరు. సుధీర్ ఆడించేవాడు కాదు. చిన్నపిల్లల తోడుకోసం వెతుక్కునేది. దానితో మొదట స్నేహం చేసింది నువ్వే.

ఒకరోజు టీచర్స్‌డేకి సుమ వాళ్ళ క్లాస్‌టీచర్‌కి ఎల్లోరోజ్ యివ్వాలని పట్టుబట్టింది. డ్రైవర్‌ని పంపి సిటీలో ఎంత గాలించినా ఆ రోజు ఆ రంగు గులాబీలు దొరకలేదు.

అప్పుడే నువ్వు ఆ పసుపుపచ్చ గులాబీ మొక్కల్ని అక్కడ వరుసగా నాటావు. ఈ రోజుకీ వాటికి పాదులు చేసి, నీళ్ళు పోసి శ్రద్ధగా పెంచి పూలు పూయిస్తూ ఉన్నావు" చీకట్లో గుబురుగా వున్న గులాబీ పొదలవైపు వేలు చూపిస్తూ అంది. ఆదిత్య వసుంధరవైపు సంభ్రమంగా చూశాడు. ఉన్నట్టుండి ఆమె పాత విషయాలను ఎందుకు జ్ఞాపకం చేసుకుంటుందో అతనికి బోధపడలేదు.

వసుంధర మళ్ళీ చెప్పడం మొదలుపెట్టింది. "నేను ఏ ఆధారం లేక యిబ్బందుల్లో ఉన్నప్పుడు రావుగారు నన్ను దేవుడిలా ఆదరించారు. నేను రెండో పెళ్ళి చేసుకుని తప్పుచేశానో ఒప్పు చేశానో నాకు తెలియదు. ఆయన్ని నమ్మి నాకున్న అన్ని బంధాల్నీ తెంపుకుని వచ్చేశాను. సుమకి మేము తప్ప ఎవ్వరూ లేరు. మా తర్వాత అది ఒంటరి అయిపోతుంది. సుధీర్ అన్నగా తోడు ఉండడని నాకు తెలుసు. కానీ సుమకి నువ్వు తోడుంటావు అనుకుంటే నాకు నిశ్చింతగా ఉంటుంది.

ఆదీ.. నీకు వరసకి అత్తయ్యని అయినా అమ్మలా పెంచాను. నీ మనసులోని ప్రతిభావం, నీ మొహంలో నేను చదవగలను.

నీకు సుమ అంటే యిష్టం కదూ! సుమని పెళ్ళిచేసుకుని, దానికి జీవితాంతం తోడుంటావా?" ఆదిత్య చేతులు పట్టుకుని అడిగింది.

వసుంధర నుంచి ఊహించని ప్రశ్నకి ఆదిత్య ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంది. చప్పున ఆమె చేతుల్ని గుప్పిట్లో బంధించి ఆమె ముందు మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

"సుమ అంటే నాకు ప్రాణం. కానీ ఈ విషయం యిప్పటిదాకా సుమకి కూడా చెప్పలేదు" మెరిసేకళ్ళతో చెప్పాడు.

"నేను తొందరపడి ముందే మాట్లాడుతున్నానని నాకు తెలుసు. సుమ యింకా చిన్నపిల్ల. లైఫ్‌లో ముందు సాధించాల్సినవి చాలా ఉన్నాయి. కానీ.. ఈ విషయం ఎప్పట్నుంచో నా మనసులో తొలుస్తూ ఉంది. అందుకే ఉండబట్టలేక అడిగాను. ఇప్పుడు నీ సమాధానం విన్నాక నాకు నిశ్చింతగా ఉంది" అంది ఆప్యాయంగా ఆదిత్య తల నిమురుతూ.

అప్పుడే పిల్లగాలి తెమ్మెర ఒకటి వచ్చి చల్లగా తాకింది యిద్దరినీ. మాటలకూ, చేతి స్పర్శకూ అందని ఆమె తల్లిహృదయం ఒక్కసారి అంతరంగంలో ప్రత్యక్షమైనట్టనిపించిందతనికి.

"క్యాంటిన్‌కి వెళదామా? రాజారావు సార్ లెక్చర్ విన్నాక తలబద్దలైపోతుందనుకో. వేడిగా టీ తాగితేగానీ శాంతి రాదు" బ్యాగ్‌లో బుక్స్ సర్దుకుంటున్న సుమ దగ్గరికి వచ్చి అడిగింది సీమ.

"పద వెళదాం" బ్యాగ్ భుజానికి తగిలించుకుని లేచింది. కారిడార్‌లోకి వచ్చి నాలుగడుగులు వేయగానే "సుమా! నీకోసం విజిటర్స్" ఎదురుగా వస్తున్న క్లాస్‌మేట్ గావుకేక పెట్టాడు.

అప్రయత్నంగానే, అతను వేలితో చూపించిన వైపుకి తలతిప్పి చూసింది సుమ.

కాస్త దూరంలో చెట్టుకింద పార్క్ చేసి వున్న బైక్ మీద పక్కకి తిరిగి కూర్చుని కనిపించాడు మోహిత్.

సుమకి, సీమ బర్త్‌డే పార్టీలో, అతనితో జరిగిన సంభాషణ అంతా ఒక్కసారి మెదడులో రివైండ్ అయ్యింది.

గబుక్కున సీమ చేతిని గిల్లి "ఏయ్! నీ బర్త్‌డే పార్టీకి వచ్చిన గెస్ట్, నా వెనకాల ఎందుకు పడుతున్నాడు?" కోపంగా అడిగింది.

"ఎవరూ?" సుమ చూపించిన వైపుకి చూసి, "ప్చ్.. నాకు తెలియదు" చెప్పింది భుజాలెగరేస్తూ.

"నీ యింటికి నువ్వు యిచ్చిన పార్టీకి వచ్చిన గెస్టు. నీకు తెలియకపోవడం ఏమిటి? డ్రామా చెయ్యకు" అంది సుమ కోపంగా.

"నేను నీతోబాటు ఆదిత్యని కూడా పార్టీకి తీసుకురావచ్చని చెప్పానా? అలాగే నేను పిలిచిన గెస్టులెవరో, వాళ్ళ ఫ్రెండ్‌నో, కజిన్‌నో తీసుకొచ్చి ఉండొచ్చుగా" లాజిక్ చెప్పింది.

"అతనికీ సీమకీ పరిచయం లేదు. అయినా, పనిగట్టుకుని పార్టీకి వచ్చాడు. పరిచయం లేకుండానే చనువు తీసుకున్నాడు. రెండురోజుల తర్వాత ఏకంగా కాలేజీకే వచ్చేశాడు. అంటే నన్ను టార్గెట్‌గా పెట్టుకున్నాడా?" సుమ మెదడు వేగంగా ఆలోచించింది. "నువ్వు యిక్కడే ఉండు. నేను వెళ్ళి, అతని సంగతి తేల్చుకుని వస్తాను" అని వేగంగా అక్కడనుంచి కదిలింది.

"ఏయ్ మిస్టర్! కాలేజీకి వచ్చి నా పేరు చెప్పి గొడవ చేస్తున్నవేంటి?" కోపంగా దబాయించింది మోహిత్‌ని.

అతను ఒకసారి సుమవైపు విచిత్రంగా చూశాడు. "పక్కనే ఐస్‌క్రీం పార్లర్ వుంది. అక్కడ కూర్చుని ఐస్‌క్రీం తిని చల్లబడొచ్చు వెళదామా?" అన్నాడు బైక్ మీదనుంచి కిందకి దిగుతూ.

"నేనెవర్నో తెలుసా? ఇలా నా వెంటపడుతున్నావని ఒక్కమాట మా నాన్నకి చెబితే నువ్వు తిన్నగా నిలబడలేవు. వెళ్ళిక్కడ్నుంచి. మళ్ళా కనిపించకు" కోపంగా చెప్పి రెండడుగులు ముందుకి వేసింది.

అతను ఒక్క అంగలో ముందుకి దూకి ఆమె దారికి అడ్డం వచ్చాడు. "మీ నాన్న సంగతి నా దగ్గర చెప్పకు"

అతని మాటల్ని పూర్తి చేయనివ్వలేదామె. "నేనేం నీ గురించి తెలుసుకోనక్కర్లేదు" అంటూ అతన్ని తోసి ముందుకు వెళ్ళబోయింది.

"తెలుసుకోవాలి" గట్టిగా చేయిపట్టుకుని ఆపాడు.

"నీకూ నాకూ రిలేషన్ ఉంది. నువ్వు నా స్వంత మేనమామ కన్నకూతురివి నీకు తెలుసా? నీకు నిన్ను పెంచిన నాన్నేకాక రక్తసంబంధం ఉన్న ఒక బాబాయి, మేనత్తలాంటి అనుబంధాలు ఉన్నాయని తెలుసా? నిన్ను చూడాలని మీ బామ్మ కలవరించి కలవరించి ఆ కోరిక తీరకుండానే చచ్చిపోయిందని తెలుసా?" పదునుగా అన్నాడు.

అప్పటిదా అతనిపట్టు విడిపించుకోవాలని పెనుగులాడుతున్న సుమ ఆ ప్రయత్నమే మర్చిపోయి బొమ్మలా నిలబడిపోయింది. కరెంట్ షాక్ కొట్టి మెదడంతా మొద్దుబారిపోయినట్టైంది ఆమె పరిస్థితి.

ఆమె మానసిక స్థితిని అర్ధం చేసుకుని అతను నెమ్మదిగా చేయి వదిలేశాడు.

"నీకు యిలా సడెన్ షాక్ యివ్వకూడదనే, కూర్చుని మాట్లాడుకుందాం అన్నాను. నీకు మేము తెలియకపోయినా నీ గురించి మేము తెలుసుకుంటూనే ఉన్నాము. మొన్న పార్టీలో నువ్వు కనిపించావని యింట్లో చెబితే అందరూ నిన్ను చూడాలని తహ తహలాడుతున్నారు. ఇప్పుడర్ధమైందా? నేను నీకోసం ఎందుకు వచ్చానో" విషయం వివరించాడు.

సుమ అతను చెప్పిన మాటలను ఒక్కొక్కటిగా అర్ధం చేసుకునే ప్రయత్నం చేసింది.

"నువ్వు చెప్పినవన్నీ నిజాలని నమ్మకం ఏంటి?" అడిగింది అనుమానంగా.

"వెల్ నేను నిన్ను నమ్మమని బలవంతపెట్టను. నీ అంతట నువ్వే బాగా ఆలోచించుకో. వచ్చేవారం ఇదే టైంకి యిక్కడికి వస్తాను బై" అని క్లుప్తంగా చెప్పి సుమ సమాధానం కోసం ఎదురుచూడకుండా బైక్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

తెల్లవారి ఆరుగంటలకల్లా బ్లాక్ కలర్ కారు వచ్చి ప్రసాదరావు బంగ్లా ముందు ఆగింది.

ఎయిర్‌పోర్టునుంచి వస్తున్న సుధీర్‌ని, అతని ఫ్యామిలీని రిసీవ్ చేసుకోవడానికి తెల్లవారుఝామున ఐదుగంటలనుంచే యింట్లోని వాళ్ళందరూ ఎదురుచూస్తూ కూర్చున్నారు.

చూస్తూ ఉండగానే సుధీర్, అతని భార్య స్నేహ వాళ్ళ ఐదేళ్ళ బాబు, ఇంకో మూడేళ్ళ పాపతో బాటు కారు దిగి లోపలికి వచ్చారు.

"ప్రయాణం బాగా జరిగిందా?" హాల్లోనే కొడుక్కి ఎదురువచ్చి అడిగాడు ప్రసాదరావు.

"బానే జరిగింది నాన్నా! మీరెలా ఉన్నారు?" పలకరించాడు.

"చాలాకాలం తరువాత చూశాను. బావున్నావా?" వసుంధర పలకరిస్తుంటే వినిపించుకోనట్టే వెళ్ళిపోయాడు సుధీర్.

"హాయ్ పింకీ! హలో బంటీ" పిల్లలిద్దర్నీ ముద్దుచేసింది సుమ.

"ఫ్లైట్ జర్నీ అంటే ఆషామాషీకాదు. మొత్తం ఇరవైనాలుగుగంటలు ప్రయాణం చేసివచ్చాం. రాగానే పిల్లలమీదబడి నలిపేయకు" సుమ వైపు చూసి నిరసనగా అంది సుధీర్ భార్య స్నేహ.

"ఏదీ బుజ్జిదానికి ఒక్కముద్దు యిచ్చాక వదిలేస్తా వదినా! ఇది పుట్టాక యిప్పుడేగా మేం చూడడం. నాన్నా! చూడండి ఎంత ముద్దొస్తుందో" అంటూ పాపని ఎత్తుకుని ప్రసాదరావు దగ్గరికి తెచ్చింది.

"ఇక్కడి మనుషులకి ఒకసారి చెబితే అర్ధంకాదులా ఉంది" గట్టిగానే విసుక్కుంది స్నేహ.

"సుమా!" అరిచింది వసుంధర.

"వదిన చెబుతుంటే వినిపించడంలేదా?" కూతుర్ని గట్టిగా మందలించింది.

"అర్ధమైంది" అంటూ మొహం చిన్నబుచ్చుకుని పాపని కిందకి దించి, వెళ్ళిపోయింది సుమ.

"అమ్మా! ఇవ్వాల్లేంటి పొద్దుగాలే వంటగదివైపు వచ్చిను" వసుంధరని చూసి ఆశ్చర్యంగా అడిగాడు రామయ్య. అప్పటికి టైం ఐదున్నరకూడా కాలేదు.

"సుధీర్ పిల్లలు వచ్చారు కదా! వాళ్ళకి జెట్‌లాగ్ అంటే మనకీ వాళ్ళకీ చాలా టైం తేడా ఉంటుంది. మనకి రాత్రి అయితే వాళ్ళకి పగలన్నమాట. అందుకే పిల్లలు పెందలాడే నిద్రలేచి తినడానికి కావాలని పేచీ పెడతారు. వంటమనిషి వచ్చేసరికి ఆలస్యం అవుతుందని నేనే వచ్చాను" అంటూ ఫ్రిజ్‌లో నుంచి పాలు, కూరలు బైటికి తీసింది.

"ఉండండమ్మా నేనూ సాయం జేస్త" అంటూ కూరల బుట్ట అందుకున్నాడు రామయ్య.

అప్పుడే నైట్ డ్రస్‌లో మొహం మీద పడ్డ జుట్టుని ఎగదోసుకుంటూ వంటగదివైపుకి వచ్చింది సుమ.

అంత పెందలాడే వంటింట్లో పొయ్యిదగ్గర నిల్చున్న తల్లిని చూసి మొహం చిట్లించింది.

"అమ్మా! నిద్రలేస్తూనే వంట మొదలుపెట్టావా? కొత్తచుట్టాలకి చేస్తున్న సేవలు సరిపోవడం లేదా? వంటకూడా స్వయంగా నీ చేతులతో చేసిపెట్టాలని కోరారా?" అంది చిరాగ్గా మొహం పెట్టి.

"చుట్టాలేమిటి? సరిగ్గా మాట్లాడు. నీకు అన్నా వదినా అవుతారు వాళ్ళు" అంది వసుంధర కోపంగా.

"అవును. నాకే వాళ్ళు అన్నా వదినలు. నువ్వూ, నేను వాళ్ళకేమీకాము. వదిన పేరుకి మాత్రం స్నేహ. స్నేహంగా ఒక్కమాటకూడా మాట్లాడదు. వాళ్ళకోసం వారం నుంచి షాపింగ్ చేశావు. కూర్చున్న చోటికే కాఫీలు, టీలు, టిఫెన్లు వాళ్ళతోబాటు వాళ్ళని కలవడానికి వచ్చే ఫ్రెండ్స్‌కి, చుట్టాలకి విందులూ, వినోదాలూ. అన్నీ నువ్వు ఏర్పాటు చేస్తేనేగా! లేకపోతే యిదేమన్నా మాయా ద్వీపమా అనుకోగానే అన్నీ అయిపోవడానికి. నువ్వు నడుములు పడిపోయేలా చాకిరి చేస్తున్నా కనీసం ఒక్క 'థాంక్స్' కూడా చెప్పలేదు వాళ్ళు. దారిలో వెళ్ళేవాళ్ళు కిందపడ్డ కర్చీఫ్‌ని తీసిస్తేనే మనం 'థాంక్స్' చెబుతాము. అంతపాటి చేయంకాబోలు మనం" అంది కోపంగా.

"**సరేలే!** నీ పిచ్చివాగుడు యింక ఆపి కాస్త కూరలు తరిగిపెట్టు. కాకాకి వేరే పనులు ఉన్నాయి" అంది వసుంధర చిరాగ్గా.

"థాంక్యూ! లివింగ్ రూంలో ఫ్రిజ్‌లో వాటర్ బాటిల్స్ లేవు. అందుకని వంటింటిదాకా రావాల్సి వచ్చింది. కూరలు తరగడమంటే నా వల్ల కాదు" అంటూ ఫ్రిజ్ డోర్ తీసి మంచినీళ్ళ బాటిల్ అందుకుంది.

"ఆడపిల్ల అన్నాక కొద్దో గొప్పో యింటిపని, వంటపని నేర్చుకోవాలి" వసుంధర పూరీలకి పిండి తడుపుతూ అంది.

"అమ్మా! మీరాగుర్రి" మధ్యలో కల్పించుకున్నాడు రామయ్య.

"సుమమ్మ గిట్ల వంటగదిలోకి వచ్చిందంటే అయ్య గుస్స జేస్తడు. కలెకటరు గావల్సిన బిడ్డని నే బాసన్లు ముట్టుకోనివ్వ" అన్నాడు భయంగా.

"విన్నావా అమ్మా?" అని నవ్వుతూ సుమ చల్లగా జారుకుంది అక్కడ నుంచి.

"ఈ పిల్ల సంగతి ఏంటో నాకేమో అర్థం కావడంలేదు" సుమ వెళ్ళినవైపు చూస్తూ భారంగా నిట్టూర్చింది వసుంధర.

"నాన్నా! ఇవ్వాళ నేను టైప్ చేయాల్సిన పేపర్స్ ఏవైనా వున్నాయా?" డిన్నర్ అయిన తర్వాత రావుగారితో బాటు మేడమెట్లు ఎక్కుతూ అడిగింది సుమ.

"కొన్ని పేజీలు రాశాను. కానీ వాటిల్లో యింకా కరెక్షన్స్ వున్నాయి. ముందుగా ఫెయిర్ కాపీ చేయాలి" అంటూ స్టడీ రూం వైపుకి నడిచాడాయన.

వాళ్ళిద్దరూ గదిలోకి అడుగుపెడుతూనే "తాతయ్యా!" అంటూ పరిగెత్తుకుని వచ్చాడు బంటి.

బంటి వెనకాలే స్నేహ.

స్నేహ చేయి పట్టుకుని పింకీ లోపలికి వచ్చారు.

"స్టోరీ టైం" అని ఆనందంగా అరుస్తూ పిల్లలిద్దరూ ప్రసాదరావుని చుట్టేశారు.

"ఇప్పుడా?" ఆశ్చర్యంగా అన్నాడాయన గడియారం వంక చూస్తూ.

"నాన్నా! ఒక్కరోజుకి మీ టైం టేబుల్ మారితే ఏం కాదు. ఇవిగోండి బుక్స్. పిల్లలకి కథలు చెప్పండి" అంటూ షెల్ఫ్‌లోనుంచి చిన్నపిల్లల బొమ్మల కథల పుస్తకాలు తీసి అందించింది సుమ.

"ఆంటీ ఒళ్ళో నేను కూర్చుంటాను" సుమ దివాను మీద కూర్చుంటూనే బంటి దగ్గరకు వచ్చాడు.

"అలాగే.. అయితే పింకీ తాతయ్య పక్కన కూర్చుంటుంది" అని నవ్వుతూ పింకీని ఎత్తి ప్రసాదరావుగారి దగ్గర కూర్చోబెట్టింది.

"సరిగ్గా కూర్చోవాలి లేకపోతే, కితకితలు పెట్టేస్తాను" అని సుమ చక్కిలిగింతలు పెడుతున్నట్టు నటిస్తే పిల్లలిద్దరూ పగలబడి నవ్వారు.

ఇంతలో "హ్మ్..హ్మ్" గట్టిగా గొంతు సవరించిన శబ్దం వినిపించడంతో సుమ తలతిప్పి స్నేహ వైపు చుసింది.

"పిల్లలు వాళ్ళ తాతయ్యతో క్వాలిటీ టైం స్పెండ్ చేస్తారని యిక్కడికి తీసుకొచ్చాను. మూడు సంవత్సరాల తర్వాత వచ్చాం మాకు ప్రైవసీ యివ్వాలన్న జ్ఞానం కూడా లేదు నీకు" సుమ వైపు కొరకొరా చూస్తూ అంది స్నేహ.

"స్నేహా..!" గట్టిగా అరిచాడు ప్రసాదరావు.

"సుమ ఎవరనుకున్నావు? నా కూతురు. నా యింట్లో ఉన్నన్నాళ్ళు నా బిడ్డకి మర్యాద యివ్వకపోతే నేను ఊరుకోను" కోపంగా అన్నాడు.

ప్రసాదరావు కోపం చూసి పిల్లలిద్దరూ బిక్కమొహాలు వేశారు.

స్నేహకూడా మావగారి కోపం చూసి వెనక్కి తగ్గింది.

"ఇప్పుడు నేను తప్పుగా ఏం మాట్లాడానని?" అంటూ సంజాయిషీ యివ్వబోయింది.

"తప్పు మాట్లాడావా? లేదా? అని కాదు. ఈ యింట్లో పద్ధతుల గురించి హెచ్చరిస్తున్నాను" అన్నాడాయన.

"సుమా!" గుమ్మంలో ఎప్పుడు వచ్చి నిలబడిందో వసుంధర కూతుర్ని గట్టిగా పిలిచింది" నువ్వు ఒకసారి యిటురా" కోపంగా మది.

"అమ్మా! పిల్లలకి కథలు చెప్పాక నాన్న రాసిన పేపర్స్ ఫెయిర్ కాపీ చేసి వస్తాను" అంది మాములుగా.

"ఇక్కడేమీ జరగడంలేదు. నువ్వేం కంగారుపడకు. కాస్సేపాగి వస్తుంది" వసుంధర మనసు చదివినట్టే అన్నాడాయన.

"సుమా! నీతో పనివుందని చెప్పాను. వస్తున్నావా? లేదా?" వసుంధర కంఠం వింటుంటే, ఆ క్షణం ఆమె ఎవరిమాటా వినిపించుకునే ధోరణిలో ఉన్నట్టు అనిపించలేదు.

సుమ మౌనంగా లేచి, తల్లి వెనకాలే నడిచింది. గది దాటి కారిడార్‌లోకి వస్తూనే, "నీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిరాదు. అన్నా, వదినల మాటకి ఎదురుగా పోతావెందుకు? నీ పనేదో నువ్వు చూసుకో అంతే" కూతుర్ని చివాట్లు వేసింది వసుంధర.

"నా పనే నేను చేస్తున్నాను. అయినా నేనేం తప్పు చేశానని నన్ను తిడుతున్నావు? పిల్లలతో కలిసి కాస్సేపు సరదాగా గడపాలనుకోవడం కూడా తప్పేనా?" అంది సుమ కోపంగా.

"ష్.. ష్. పెద్దగా అరవకు" అని సుమ చేయిపట్టుకుని, బరబరా బెడ్రూంలోకి లాక్కెళ్ళి తలుపేసింది.

"చూడూ..! సుధీర్ మీ నాన్నకి స్వంత కొడుకు. అతను, అతని కుటుంబం మీ నాన్న నిజమైన ఫ్యామిలి. వాళ్ళంతా ఒక్కటి. వాళ్ళ మధ్యలోకి వెళ్ళడానికి నీకూ, నాకూ ఎటువంటి హక్కులేదు. అర్ధం చేసుకో" అంది కూతురితో.

"హక్కు ఎందుకు లేదు?" మొండిగా అడిగింది సుమ.

"ఎందుకంటే.. వాళ్ళది బ్లడ్‌రిలేషన్ కాబట్టి"

"అదేం కాదు. నాన్న ఎప్పుడూ అలా ఆలోచించరు. నువ్వే నన్ను అందరి ముందు తక్కువ చేయడానికి అలా మాట్లాడుతున్నావు. నువ్వు నా గురించి తప్ప, మిగతా అందరి గురించి పట్టించుకుంటావు. సుధీర్. ఆదిత్య వీళ్ళే కావాలి నీకు" ఉక్రోషంతో సుమ గొంతు వణికింది.

"అది కాదు సుమా!" వసుంధర చెబుతున్నా వినిపించుకోకుండా గభాల్న తలుపు తీసుకుని బైటికి వచ్చింది.

"ఎందుకు మన యింట్లో మనం పరాయివాళ్ళలాగా ఒదిగి ఒదిగి వుండాలి? వాళ్ళంతా ఒకటిట. నేనెందుకు వేరు? మాట్లాడితే రక్తసంబంధం అంటూ లెక్చరు యిస్తుంది" తల్లి గురించి మనసులోనే సణుక్కుంటూ మేడదిగి కిందకి వచ్చింది.

మనసులో అశాంతి, అసహనం తెలియకుండానే ఆమెను యింటి బయటకు లాక్కొచ్చాయి. అలాగే నడుచుకుంటూ వచ్చి, వరండాలో గార్డెన్ వైపుకి వున్న మెట్లమీద చతికిలబడి ఆలోచించసాగింది. లోతుగా చూస్తే తల్లి మాటలవల్ల రేగిన అసంతృప్తి తప్ప బాధపడడానికి మరే కారణమూ కనిపించలేదు.

చల్లటి వాతావరణంలో కాస్సేపు కూర్చునేసరికి, ఆమె మనసు కూడా చల్లబడింది.

మెట్లమీద కీచురాళ్ళ సంగీతానికి లయబద్ధంగా ఊగుతున్నట్టున్న పూలతీగెల నీడలని చూస్తూ కొద్దిసేపు అలాగే ఒంటరిగా కూర్చుని ఉంది.

ఇంతలో "సుమా!" అంటూ ఆదిత్య గొంతు.

తెల్లని టీ షర్ట్, దాని కింద నల్లని షార్టులో నిద్రపోవడానికి రెడీ అయినట్టుగా వుంది అతని వాలకం.

"రాత్రిపూట ఒంటరిగా యిక్కడ కూర్చున్నావేమిటి?" చనువుగా వచ్చి పక్కన కూర్చుంటూ అడిగాడు.

"....."

"మా సుమ కొక్కిరాయిలా ఏదొకటి మాట్లాడకుండా కూర్చుందంటే సమస్యలో ఉన్నట్టే నీ ప్రోబ్లం ఏంటో చెప్పు" రెట్టించాడు.

సుమ ఒక్క క్షణం ఆలోచించి,

"ఆదీ! ఒక్క విషయం అడుగుతాను చెప్పు. మనతో ఉన్నవాళ్ళు మనకి ప్రేమని పంచినవాళ్ళు, మన స్వంత మనుషులు అంటే, మనతో రక్తసంబంధం వున్నవాళ్ళు కాదనుకో. ఆ బంధం ఎప్పటికీ బలహీనంగానే వుంటుందా?" ఆదిత్య మొహంలోకి చూస్తూ అడిగింది.

"నిజం చెప్పు సుధీర్ ఏమైనా అన్నాడా?" సూటిగా అడిగాడు.

"లేదు" తల అడ్డంగా ఊపింది సుమ.

"ఊరికే పిచ్చిపిచ్చి ఆలోచనలు చేయకు. ఈ యింట్లో అందరూ నిన్ను ప్రేమించేవాళ్ళే. ఇక సుధీర్ విషయం అంటావా నాలుగురోజులు వుండి వెళ్ళిపోతాడు. నువ్వు అనవసరంగా వర్రీ అవకు" సుమ భుజం మీద చేయివేస్తూ అన్నాడు.

"నీకు నా సిట్యుయేషన్ అర్థం కాదు ఆదీ. నువ్వు ఎంతగానో ప్రేమించే నాన్న, నీ కన్నతండ్రి కాదు కాబట్టి నీకే హక్కులేదు. అంటే, ఎలా వుంటుంది చెప్పు?" అంది ఉక్రోషంగా.

ఆదిత్య నీరసంగా నవ్వాడు.

"నిజంగానే నాకు తెలియదు. ఎందుకంటే, నాకు అమ్మా, నాన్నా లేరుగా"

"అయామ్ సారీ నేనే ఆలోచించకుండా మాట్లాడేశాను" అంది సుమ ఆదిత్య చేతులు పట్టుకుంటూ.

"ఇట్స్ ఓ.కే కానీ, నీలాగా నేనెప్పుడూ ఆలోచించలేదు. మీ అమ్మనే నేను 'అమ్మ'గా అనుకున్నాను మామయ్యనే నాన్న అనుకున్నాను. మనకి వాళ్ళు చూపించే ప్రేమ మీద నమ్మకం వుంటే, ఎవరెన్ని మాటలు అన్నా మనం పట్టించుకోనవసరం లేదు"

సుమ ఆలోచిస్తున్నట్టుగా మొహం పెట్టింది. "ఏంటీ నువ్వు చెప్పేవి విన్నప్పుడు బాగానే ఉన్నట్టనిపిస్తుంది. కానీ నీలాగా నేను ఉండలేను" అంది బుంగమూతి పెడుతూ.

ఆదిత్య నవ్వాడు.

"నాలాగా ఉండక్కర్లేదు. నువ్వు నీలాగే వుంటూ నీ హక్కుల కోసం పోరాటం చేసి సాధించుకుంటూ ఉండు. ప్రస్తుతానికి నీ మూడ్ సరి చేసుకో చాలు" అన్నాడు వేళాకోళంగా.

అతను అన్న తీరుకి సుమ కూడా నవ్వింది.

"మామయ్యా! లాకర్ నుంచి మీరు చెప్పినవన్నీ తీసుకొచ్చాను" రావుగారి స్టడీ రూంలోకి చిన్నసైజు బ్రీఫ్‌కేస్‌లాంటిదాన్ని, కొన్ని రశీదుల్ని తెచ్చి ఆయన బల్లముందు ఉంచాడు ఆదిత్య.

అప్పటికే ఆ గదిలో సుధీర్, స్నేహ రావుగారి ఎదురుగ్గా కూర్చుని ఉన్నారు.

"తాళాలు తీసుకురా" ఆయన అడగగానే ఆదిత్య వెళ్ళి సైడ్ టేబుల్ డ్రాలో నుంచి కీస్ తెచ్చి అందించాడు.

పెట్టె తెరుస్తూనే అందులో నగలు ఉంచిన చిన్న చిన్న అట్టపెట్టెలను సంచుల్ని ఒక్కొక్కటే జాగ్రత్తగా తీసి టేబుల్ మీద పెట్టాడాయన.

మావగారు నగల పంపకానికి పిలిచారని అర్థమై స్నేహ మొహం వెలిగిపోయింది.

సరిగ్గా అప్పుడే

"నాన్నా! కాలేజ్ నుంచి రాగానే కనిపించమని అడిగారట" గుమ్మంలో నుంచే మాట్లాడుతూ రయ్యిన లోపలికి వచ్చింది సుమ.

బల్లమీద పరిచి ఉంచిన నగలు, సీరియస్‌గా వున్న అన్నా, వదిన, ఆదిత్యలను చూసి ఒక్క క్షణం నిశ్శబ్దంగా అయిపోయింది.

"కాస్సేపాగి..రా!" సుమని చూస్తూనే చిరాగ్గా అన్నాడు సుధీర్.

"నువ్వు ఆగమ్మా! ఇలా వచ్చి కూర్చో" కొడుకు మాటల్ని కొట్టిపడేస్తూ, సుమని పిలిచి పక్కన కూర్చోబెట్టుకున్నాడు ప్రసాదరావు. ఆయన కల్పించుకున్న తర్వాత మాట్లాడేందుకు ధైర్యం చాల్లేదు ఎవరికీ.

"సుధీర్ యివి మీ అమ్మ నగలు.

ఇక నుంచి యిది మీ సొత్తు.

ఆదిత్యా! ఇవి మీ అమ్మ నగలు. మహాలక్ష్మి యివి నీ పెళ్ళికి కోడలికి యివ్వాలని అంటుండేది" గంభీరంగా చెప్పి, యిద్దరికీ వాళ్ళ వాళ్ళ వస్తువుల్ని అందించాడు.

"నేను ఎక్కడికి వెళుతున్నాను మామయ్యా! వీటిని మీ దగ్గరే ఉండనివ్వండి" తిరిగి చేతిలోని వస్తువుల్ని బల్లమీద ఉంచుతూ అన్నాడు ఆదిత్య.

"మనుషుల మధ్య తేడాలు తెచ్చేవి డబ్బు వ్యవహారాలే. నేను ఉండగానే ఎవరివి వారికి లెఖ్ఖ చెప్పాలనుకుంటున్నాను. లేకపోతే నా తర్వాత ఎవరివి వారికి లెఖ్ఖ చెప్పాలనుకుంటున్నాను. లేకపోతే నా తర్వాత ఏం జరుగుతుందో ఊహించలేనంత వెర్రివాడిని కాను. ఒకవేళ నువ్వు వీటిని నా దగ్గరే ఉంచాలనుకున్నా. నీ వస్తువుల్ని నువ్వు చూసుకుని గుర్తుంచుకుంటే మంచిది." చెప్పి సుమ వైపుకి తిరిగాడు.

"సుమా! యివి మా అమ్మ నగలు. అంటే మీ బామ్మవి. వీటిల్లో నీకు నచ్చింది తీసుకో. నా గుర్తుగా ఎప్పటికీ దాన్ని నీ దగ్గరే ఉంచుకోవాలి. మిగిలినవి స్నేహ తీసుకుంటుంది" అంటూ సుమ భుజం తట్టాడు.

సుమ బల్లమీద వరుసగా పేర్చి వుంచిన నగల్లో నుంచి తెల్లని పుష్యరాగాలతో చేసిన ఒక నెక్లెస్‌ని తీసింది.

"ఇది నాకు చాలా నచ్చింది నాన్నా! బావుందా?" అంటూ సంతోషంగా నెక్లెస్‌ని రెండు చేతులతో మెడకు దగ్గరగా పట్టుకుని చూపించింది.

ప్రసాదరావు నవ్వుతూ తలాడించాడు.

"అమ్మకి చూపించి వస్తానిప్పుడే" అంటూ లేచి, ఉత్సాహంగా పరుగు తీసింది.

"నీకు వయసు పెరిగింది కానీ, బుద్ధి పెరగలేదు. దీన్ని యిప్పుడే తీసుకెళ్ళి వెనక్కి యిచ్చేసిరా!" కోపంగా అరిచింది వసుంధర.

"ఎందుకివ్వాలి? నాన్న నాకు ప్రేమతో యిచ్చారు దీన్ని" అంది నెక్లెస్ ఉంచిన పెట్టెని రెండు చేతులతో పట్టుకుని గుండెకి హత్తుకుంటూ.

"సుమా దీన్ని యిప్పుడే యిచ్చేసిరా లేకపోతే నా మీద ఒట్టే" తీవ్రంగా అంది వసుంధర.

తల్లి కోపం చూసి వెనక్కి తగ్గింది సుమ. "సరే యిచ్చేస్తాను" అంటూ నీరసంగా బైటికి నడిచింది.

"రాను రానూ నాన్నగారికి ఆలోచన లేకుండా పోతోంది. ఆవిడంటే నాన్నగారికి భార్యకాబట్టి ఎలాగో భరించాలి. ఆ పిల్లని కూడా తెచ్చి మన నెత్తిన పెట్టారు. పిల్లని తల్లి నుంచి వేరు చేయలేక జాలిపడి ఉంచుకున్నారనుకుందాం. అంతమాత్రాన నెత్తికి ఎక్కించుకోవాలా? ప్రతిదానికీ ముందు "సుమ" అన్న పేరే వినిపిస్తుంటుందీ యింట్లో."

పక్క గదిలోనుంచి సుధీర్ మాటలు వినిపించడంతో ఠక్కున ఆగిపోయింది సుమ.

"ఇవాళ నగలు రేపు ఆస్తిలో వాటాలు. అసలు ఎవరి రక్తమో తెలియని వాళ్ళకి యింత యింపార్టెన్సా? దీన్ని యిక్కడితో ఆపేయాలి. మీరు వెంటనే మీ నాన్నగారికి చెప్పి రండి. మన యిష్టానికి వ్యతిరేకంగా వెళితే, రేపే మనం బయల్దేరి వెళ్ళిపోతామని" స్నేహ గొంతు ఖంగుమంది.

"ఆదిత్యా నువ్వు నా పక్షాన నిలబడితే యిద్దరం కలిసి నాన్నగారితో మాట్లాడొచ్చు. మనిద్దరం ఒకే మాట మీద వుంటే నాన్నగారు ఏమీ చేయలేరు"

"ఆదిత్య అంటే బావ కూడా ఈ చర్చలో ఉన్నాడా?" సుమ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవి అయ్యాయి.

"అలాగే సుధీర్" ఆదిత్య గొంతు లోపలినుంచి వినిపించింది. సుమ కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

"బావ కూడా వీళ్ళతో చేరాడన్నమాట" ఇన్నేళ్ళుగా ఆదిత్య మీద పెంచుకున్న అభిమానమూ, నమ్మకమూ పేకమేడల్లా కూలిపోయినట్టనిపించింది. క్షణం ఆలస్యం చేయకుండా గిరుక్కున వెనక్కి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది.

రాత్రి తొమ్మిది గంటలప్పుడు గది తలుపు తట్టిన చప్పుడు అవడంతో లేచి తలుపు తీశాడు ఆదిత్య.

"ఈ టైంలో వచ్చావేంటి?" గుమ్మంలో నిలబడ్డ సుమని చూసి ఆశ్చర్యపోతూ అడిగాడు.

"కంగారు పడకు. నీకు హాపీన్యూస్ చెప్పడానికే వచ్చాను. ఇదిగో ఈ నెక్లెస్‌ని తీసుకెళ్ళి వదినకిచ్చెయ్. నాన్నకి చెప్పక్కర్లేదు. ఆయనకి తెలిస్తే బాధపడతారు" అంటూ ఆదిత్య చేతిలో బాక్సుని పెట్టి విసురుగా వెనక్కి తిరగబోయింది.

"సుమా! ఒక్క నిముషం ఆగు" ఆమె భుజం పట్టుకుని ఆపాడు.

"ఎందుకిలా మాట్లాడుతున్నావ్? ఏమైందో సరిగ్గా చెప్పు" బతిమాలుతున్నట్టే అన్నాడు.

"ఏమీ తెలియనట్టు నాటకాలాడకు. నువ్వూ, సుధీర్ స్నేహ కలిసి మాట్లాడుకున్నవన్నీ నేను విన్నాను.

ప్రేమ నమ్మకం అంటూ చాలా పెద్ద పెద్ద మాటలు మాట్లాడావు న్ని. ఇవ్వాళేమైంది? నీకూ బ్లడ్ రిలేషనే ఎక్కువని నిరూపించావ్ అంది కోపంగా.

"ఓహ్! అదా నీ కోపానికి కారణం" తేలిగ్గా నిట్టూర్చాడు ఆదిత్య.

"సుధీర్ వాళ్ళు అలిగి వెళ్ళిపోకూడదని అలా మాట్లాడానంతే. ఇంకో విషయం ఏంటంటే నువ్వు అనవసరంగా ఎవరి దగ్గరా మాటపడడం నాకు యిష్టంలేదు. అదీ ఒక నెక్లెస్ కోసం. చెప్పు. నీకు ఏం కావాలన్నా నేను కొనిస్తాను" అన్నాడు బుజ్జగిస్తున్నట్టుగా.

"థాంక్యూ నాకేమీ అక్కర్లేదు. దీన్ని తీసుకెళ్ళి వదినకిస్తే చాలు" చెప్పి, విసురుగా వెనక్కి తిరిగి వచ్చేసింది.

మంచం మీద వాలాక, ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు సుమకి.

ఆమె మనసులో కొద్దిసేపటి క్రితం జరిగిన సంఘటనలే మెదులుతూ ఉన్నాయి.

"బ్లడ్ రిలేషన్స్" నిజంగా అంత గొప్పవా?

"వీళ్ళంతా పైకి నన్ను ప్రేమిస్తున్నట్టు కనిపించినా, మనసుల్లో ఆ దూరాన్ని చూస్తున్నారా?"

ఆ మాట అనుకోగానే సుమకి గుండెల్లో ముల్లు గుచ్చినట్టైంది.

మొదటిసారిగా సుమ మనస్ఫూర్తిగా తన కన్నతండ్రిని గుర్తుచేసుకుంది.

"నా కన్న తండ్రే బతికి వుంటే ఈ రోజు యిలాంటి మాటలు వినాల్సి వచ్చేది కాదు. ఆయనే వుంటే నా లైఫ్ వేరేలా ఉండేదేమో" అనుకుంటూ, బెడ్‌పక్కన డ్రాలో నుంచి చనిపోయిన తన తండ్రి ఫోటో ఫ్రేమ్‌ని బైటికి తీసి చూసింది.

వెయిస్ట్ వరకు మాత్రమే కనబడేలా తీసిన ఫోటో ఆది.

నల్లకోటులో, కొద్దిగా పక్కకి తిరిగి నవ్వుతూ ఉన్నాడందులో. ఆయన ముఖంలో పోలికలు, నవ్వు చూస్తుంటే, సుమకి మోహిత్ గురుత్కి వచ్చాడు.

అతన్ని మొదటిసారి చూసినప్పుడే పరిచయం వున్న వ్యక్తిలా అనిపించడం, అతని చొరవ, మాటలు జ్ఞాపకం వచ్చాయి. నాకు తెలియని, నా తండ్రి తరఫు బంధువులు, నా గురించి తెలుసుకుంటూ నన్ను చూడాలని తపిస్తూ వున్నారా? వీళ్ళంతా అరిచి చెప్పే, ఆ రక్తసంబంధం తాలుకు నిజమైన ఆప్తులు వాళ్ళేనా?

సుమ ఆలోచనలు పరిపరివిధాలుగ సాగాయి. ఆలోచనలన్నీ ఒక కొలిక్కి రాయకుండానే చేతిలో ఫోటోను అలాగే పట్టుకుని నిద్రపోయింది.

పడుకోబోయే ముందు కళ్ళజోడు తీసి బల్లమీద పెట్టి, మంచం మీద వాలాడు ప్రసాదరావు.

''ఏవండీ? సుమ యివాళ ఒక విచిత్రమైన కోరిక కోరింది'' మంచం మీద కూర్చుంటూ భర్తతో అంది వసుంధర.

''ఏంటా కోరిక?''

''సుమ యివాళ వాళ్ళ నాన్న, అంటే బయోలాజికల్ ఫాదర్‌ని గురించి, ఆయన తాలూకు బంధువుల గురించి అడిగింది'' అంది విచారంగా.

''అలాగా'' ఒక్క నిముషం ఆలోచించాడాయన.

''రేపు ఆదివారం సుమకి క్లాసులు కూడా లేవు. ఒకసారి నువ్వు సుమని తీసుకుని వెళ్ళివాళ్ళవాళ్ళకి పరిచయం చేసిరా'' అన్నాడు.

''మీరేం మాట్లాడుతున్నారో తెలుస్తుందా?'' కోపంగా అంది వసుంధర.

''ఇన్నేళ్ళలో నేను ఒక్కసారి కూడా ఆ యింటి గడప తొక్కలేదు. ఇక ముందు కూడా వెళ్ళబోను. సుమని పంపడం నాకు యిష్టంలేదు'' అంది కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యింది.

''చూడు వసూ! నిన్ను బాధపెట్టాలన్నది నా ఉద్దేశ్యం కాదు. కానీ, ఒక విషయం అర్థం చేసుకో. నిజాన్ని దాచిపెట్టడం, నిప్పుల్ని గుడ్డల్లో మూటకట్టడంలాంటిదే. ఎవరికీ దాన్ని ఆపే శక్తిలేదు. ఏదో ఒకనాటికి బయటపడుతుంది.

సుమ చిన్నపిల్లేమీ కాదు. తెలివిగలది. నువ్వు తండ్రి తరఫు బంధువుల్ని కలవనీయకుండా ఆపాలని ప్రయత్నం చేసేకొద్దీ తనతో అనుమానాలు కూడా పెరుగుతాయి. నా మాట విని.. సుమని వెళ్ళనివ్వు''

వసుంధర భారంగా నిట్టూర్చింది ''వాళ్ళు ఎలాంటివాళ్ళో మీకు తెలియదా? తెలిసీ తెలిసీ ఎలా పంపమంటారు?''

''తప్పదు. ఈ వయసులో సహజంగానే పిల్లలు ఎమోషనల్‌గా ఉంటారు. చిన్న పిల్లల్లా బుజ్జగించలేము. సుమని తన ప్రశ్నలకి తానే సమాధానాలు వెతుక్కోనివ్వు. నువ్వో, నేనే వాళ్ళ గురించి చెడుగా చెప్పటం తోచిన జడ్జిమెంట్ యివ్వడం కరెక్ట్ కాదు. సుమ తెలివైనది. మనుషుల్ని గుర్తించగలదు''

''మీ సిద్ధాంతాలూ, ఆలోచనలు నాకెప్పటికీ అర్థం కావు'' బరువుగా అంది.

''పిచ్చిదానా! మనం పిల్లలకి ఎప్పుడూ బోలెడంత ప్రేమనీ, నీడలా వుంటామన్న నమ్మకాన్నీ యివ్వాలి. అంతే తప్ప, వాళ్ళ జీవితాన్ని మన చేతుల్లోకి తీసుకోకూడదు. వాళ్ళ ప్రశ్నలకి వాళ్ళనే సమాధానాలు వెతుక్కోనివ్వాలి. నువ్వు అనవసరంగా ఆలోచించి హైరానా పడకు. నీకు అక్కడికి వెళ్ళడం యిష్టం లేకపోతే, ఆదిత్యని డ్రాప్ చేసి రమ్మంటాను'' చెప్పాడాయన.

''అలాగే'' పైకి మాత్రం ఆ మాట అనగలిగింది కానీ.. మెదడులో తొలుస్తున్న అనుమానాలు ఆమెని ప్రశాంతంగా నిద్రపోనివ్వలేదు.

**''ఇంకా కోపం పోలేదా** నా మీద'' కారు డ్రైవ్ చేస్తూ, తలపక్కకి తిప్పి, పక్క సీటులో ఉన్న సుమ వైపు చూస్తూ అడిగాడు ఆదిత్య.

''నాకేం కోపంలేదు. బాధేసింది. అంతే'' నెమ్మదిగా చెప్పింది.

"అయామ్ సారీ! నా ఉద్దేశ్యం వేరు, అది నీకు యింకో విధంగా అర్థమైంది. ఎనీవే.. లెట్స్ ఫర్‌గెటిట్" నిజాయితీగా చెప్పాడు.

"నిజంగా నువ్వు సుధీర్ అలిగి వెళ్ళకూడదని అలా చెప్పావా?"

"నూటికి నూరుపాళ్ళు నిజం. నన్ను నమ్మూ! ఇప్పటికైనా కోపం తగ్గించుకో" బతిమాలాడు.

"అయితే, యివాళ రాత్రికి నాకు ఐస్ క్రీం తినిపిస్తావా?"

"అంటే, కోపం పోయినట్టేగా!"

"నీ మీద నేను ఎక్కువసేపు అలగలేను ఆదీ ! అందువల్ల నాకే ఎక్కువ నష్టం. నా పనులన్నీ ఎవరు చేసి పెడతారు చెప్పు?" అంది నవ్వుతూ.

ఆదిత్య కూడా సుమతో చూపులు కలిపి చిరునవ్వు నవ్వాడు.

ఇంతలో, "యూ రీచ్‌డ్ యువర్ డెస్టినేషన్" అంటూ సెల్‌ఫోన్‌లో జి.పి.యస్ అరిచి చెప్పడంతో, కారుని ఒక పక్కగా ఆపాడు ఆదిత్య.

"ఈ యిల్లే అనుకుంటాను" అంది సుమ, కారుదిగి రెండంతస్థులు ఉన్న వైట్‌కలర్ బిల్డింగ్‌ని చూస్తూ.

"సుమా"

ఆదిత్య పిలవడంతో వెనక్కి తిరిగి చూసింది.

"ఏంటీ యివాళ నిన్ను యిక్కడ డ్రాప్ చేయడం నాకు కొత్తగా ఉంది. ఎప్పుడూ లేనిది, నాకు తెలియని బంధుత్వాలూ, మనుషులు నీకు ఉన్నారనుకుంటే నువ్వు దూరం అవుతున్నావన్న ఫీలింగ్ వస్తుంది" నిజాయితీగా చెప్పాడు.

"నాకూ యిదంతా కొత్తగా, నెర్వస్‌గా యింకా ఎగ్జయింటింగ్‌గా కూడా వుంది" అంది దుపట్టా అంచుల్ని వేలితో చుట్టేస్తూ.

"డోంట్ వర్రీ! ఏదైనా అవసరం వుంటే ఫోన్ చెయ్యి. సాయంత్రం సరిగ్గా నాలుగుగంటలకి వచ్చి పిక్ చేసుకుంటాను" చెప్పి, భుజం తట్టి వెళ్ళిపోయాడు.

సుమ కాలింగ్‌బెల్ నొక్కగానే, యాభైయ్యేళ్ళ వయసుకి కాస్త అటూ, యిటూగా వున్న ఒకావిడ తలుపు తీసింది.

"నేను వసుంధర కూతుర్ని నిన్న మీకు ఫోన్ చేశాను" అంటూ మొహమాటంగా పరిచయం చేసుకోబోయింది.

"సుమా! నువ్వు సుమవే కదూ" అంటూ పెద్దగా అందామె. ఆమె పిలుపులో ఆనందం, ఆశ్చర్యం రెండూ కొట్టొచ్చినట్టు ధ్వనించాయి. సుమకి ఒక్క క్షణం అయోమయంగా అనిపించింది.

నోరు తెరిచి యింకో మాట అనబోయేంతలో ఆవిడ చప్పున సుమని దగ్గరకి తీసుకుని, నుదుటిపై ముద్దుపెట్టుకుంది.

"ఎన్నాళ్ళకి చూశాను. నా బంగారు తల్లిని నువ్వు వచ్చావంటే నిజంగా నమ్మకం కలగడంలేదు" ఉద్వేగంగా అంది.

సుమ ఆవిడ మాటలకి ఎలా ప్రతిస్పందించాలో తెలియక, అలాగే బొమ్మలా చూస్తూ నిలబడిపోయింది.

"ఏంటలా చూస్తున్నావు? నేను రాజేశ్వరత్తని...నీ సొంత మేనత్తని" అని,

లలితా.. లలితా ఎవరొచ్చారో చూడు" అంటూ పెద్దగా కేక పెట్టింది.

లోపలనుంచి, దాదాపుగా అదే వయసున్న యింకొకావిడ చేతిలో గరిటెతో బాటు పరిగెత్తుకుని వచ్చింది.

"ఇదిగో సుమ రామకృష్ణ అన్నయ్య కూతురు. అచ్చం అన్నయ్యలానే వుంది కదూ" సంబరంగా చెప్పింది.

ఆ పరిచయం చాలా కొత్తగా, వింతగా అనిపించింది సుమకి. ఎన్నాళ్ళనుంచో తనని చూడాలన్నట్టుగా వున్న వాళ్ళ మాటలు, ఆప్యాయతతో తొణికిసలాడుతున్నట్టున్న వాళ్ళ చూపులు ఉక్కిరిబిక్కిరి చేశాయి.

అన్నింటికంటే సుమకి ఎక్కువ ఆనందాన్ని యిచ్చింది. ఆ యింటి గోడలకి వేల్లాడుతున్న తన కన్నతండ్రి ఫోటోలు.

అందరు కుటుంబసభ్యులు కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి. అందులో పక్కపక్కనే నిలబడ్డ తల్లీ, తండ్రి చూడడానికి ఈడూ జోడుగా చక్కగా ఉన్నారు.

ఇంకొకటి నల్లసూటులో వెయిస్ట్ వరకు వున్న పెద్ద ఫోటో తండ్రిది. ఇంకొక దానిలో రామకృష్ణారావు, తమ్ముడు, చెల్లెళ్ళతో కలిసి తీయించుకున్న ఫోటో ఎంతో సంతోషంగా నవ్వుతూ ఉన్నాడందులో.

కలలో నిద్రలేచి నడుస్తున్నట్టుగా నెమ్మదిగా ఒక్కొక్క అడుగే వేస్తూ అన్ని ఫోటోలు చూస్తూ వుంది.

తన ఉనికే పూర్తిగా మారిపోయినట్టు కొత్తప్రపంచంలో అప్పుడే రామకృష్ణారావు కూతురిగా పుట్టినట్టు అనిపించింది.

"మా నాన్న చనిపోవడం నిజంగా నాకు శాపమా? ఇంత మంచి కుటుంబాన్ని నేను కోల్పోయానా?"

"మా నాన్న చనిపోయాక కూడా వీళ్ళ మాటల్లో, గుండెల్లో సజీవంగా ఉన్నాడా?" సుమకి ఏమీ అర్థంకాలేదు.

కన్నకూతురికి మాత్రం ఆయన పాతబడిపోయిన ఓ జ్ఞాపకంలా మాత్రమే మిగిలిపోయాడు. "ఓ గాడ్! మా అమ్మ ఎందుకిలా చేసింది?" మొదటిసారిగా ఆ ప్రశ్న వేసుకుంది సుమ.

ఆనందంతో బాటు, అనుమానాలు గుండెని ఊపిరాడినట్టు చేస్తూ వుంటే నెమ్మదిగా ఒక్కొక్క అడుగే వేస్తూ వచ్చి సోఫాలో కూలబడింది.

సుమ మానసికస్థితిని గ్రహించి, రాజేశ్వరి చప్పున ముందుకు వచ్చి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంది.

"మా కళ్ళముందు పెరగాల్సిన పిల్లవి. ఇన్నేళ్ళకి బైటవాళ్ళలాగా కలవడం, పరిచయం చేసుకోవడం, అంతా కాస్త కంగారుగా వుండివుంటుంది" అంది పక్కనే కూర్చుని దగ్గరికి తీసుకుంటూ.

రెండు నిముషాల్లో ఇంట్లోని వాళ్ళందరూ సుమ కూర్చున్న సోఫా చుట్టూ చేరారు.

"ఈమె లలితాంబ నీకు పిన్నమ్మ, మీ బాబాయి భార్య. ఇది నా కూతురు రవళి. దానికొడుకు ఆర్ణవ్. మేమంతా బుజ్జిగాడని పిలుస్తాం" అంటూ వరుసబెట్టి ఒక్కొక్కరినే పరిచయం చేసింది రాజేశ్వరి.

"రవళికి సుమారుగా పాతికేళ్ళు ఉంటాయి. ఆమె చంకలో ఉన్న మూడేళ్ళ బుజ్జిగాడు ముద్దుగా ఉన్నాడు" అనుకుంది సుమ వాళ్ళని చూస్తూనే.

ఇంకా, సుమకి పరిచయం కాకముందే ఈ లోకం నుంచి వెళ్ళిపోయిన బామ్మని, బాబాయినీ ఫోటోల్లో చూపించింది రాజేశ్వరి.

"మా అన్నయ్య పోయిన తర్వాత నువ్వు ఈ యింటినుండి వెళ్ళిపోయేటప్పటికి నీకు రెండేళ్ళుంటాయేమో! నువ్వు మీ నాన్నకి గారాల పట్టివి మీ బామ్మకి నువ్వంటే ప్రాణం. ఆవిడ నిన్ను చూడాలని చనిపోయే చివరిక్షణం వరకు కలవరించింది.

కానీ, నువ్వు ప్రసాదరావుగారి కూతురివైపోయావు. డబ్బు, పేరు పలుకుబడి వున్న పెద్దమనిషాయన. ఆ కాంపౌండ్‌లోకి మమ్మల్నెలా అడుగుపెట్టనిస్తారు? అందులోనూ మీ అమ్మకి యిష్టంలేనప్పుడు.

నీ గురించి ఆ నోటా, ఈ నోటా తెలుసుకుని సంతృప్తిపడేవాళ్ళం. నువ్వక్కడ హాయిగా ఉన్నావని, బాగా చదువుకుంటున్నావని తెలుసుకుని మా అన్నయ్యని గుర్తుతెచ్చుకుని సంతోషపడేవాళ్ళం. అంతకు మించి మేము మాత్రం ఏం చేయగలం చెప్పు?" అంది రాజేశ్వరి విచారంగా!

"అత్తయ్య చేసిన పనికి పాపం అదేం చేస్తుంది? మనల్ని చూసింది కాబట్టి ఎప్పుడైనా కలవాలనుకుంటే అదే వస్తుందిలే" అంది రవళి తల్లి భుజం తడుతూ.

వాళ్ళమాటల్ని బట్టి గడిచిన నాలుగేళ్ళలో బామ్మ, బాబాయి, మేనత్త భర్త కాలం చేశారని అర్థమైంది. మేనత్త, ఆమె కుటుంబం మేడమీద భాగంలో, పిన్నికింద పోర్షన్‌లో వుంటున్నారు. వాళ్ళంతా అంత అన్యోన్యంగా వుండడం చూసి ముచ్చటేసింది సుమకి.

"ఉట్టినే కబుర్లతో కాలక్షేపం చేస్తారా? లేకపోతే అమ్మాయికి తినడానికి ఏమైనా యిచ్చేది వుందా?" రాజేశ్వరి అనడంతో,

"అందరికీ ఒకేసారి టిఫెన్ తెస్తాను. అత్తా నువ్వూ మాతోబాటే పైకి రా!" అంటూ లలితాంబని పిలిచింది రవళి. అందరూ మేడమీద, రాజేశ్వరి వాళ్ళు వుంటున్న భాగంలోకి వెళ్ళారు. హాట్‌బాక్స్‌లో నుంచి పూరీలు, కూర తీసి ప్లేట్లలో పెట్టి ఒక్కొక్కరికే అందించింది రవళి.

"మీ యింట్లో ఖరీదైన వంటకాలు, ఆర్గానిక్ ఫుడ్స్ లాంటివి డైనింగ్ టేబుల్ మీద కూర్చుని తినే అలవాటేమో కదా! మా యింట్లో డైనింగ్ టేబుల్ వున్నా దాన్ని వాడం" అంటూ సుమకి కూర్చున్న చోటుకే టిఫిన్ ప్లేటు తెచ్చి యిచ్చింది. సుమకి ఏం జవాబు చెప్పాలో అర్థంకాలేదు.

మోకాళ్ళు వంగవని, రాజేశ్వరి సోఫాలో కూర్చుని తింటుంటే, మిగిలిన అందరూ కింద నేలమీద కూర్చుని టి.వి చూస్తూ, మాట్లాడుకుంటూ తింటున్నారు.

"ఇలా తినడం గనుక నాన్న చూస్తే ఖచ్చితంగా కోప్పడతారు" అని మాత్రం అనుకుంది.

వాళ్ళ పద్ధతులు, అలవాట్లు పూర్తిగా వేరు. అయినా సుమకి ఏమాత్రం కొత్తగా, ఎబ్బెట్టుగా అనిపించలేదు.

సుమ ఆలోచనల్లో తేలిపోతూ ఉండగానే, "హలో" అన్న పిలుపుతోపాటు, భుజం మీద ఏదో పాకినట్టు అయ్యింది. భయంతో కెవ్వున అరిచిందామె.

చేతిలోని మంచినీళ్ళగ్లాసు జారి, శబ్దం చేస్తూ కిందపడిపోయింది.

"ఇట్స్ ఓ.కే.. డోంట్ వర్రీ! నేనే మోహిత్‌ని." సుమని కూల్ చేస్తున్నట్టుగా అన్నాడు.

"ఏం జరిగింది?" అంటూ అక్కడికి పరుగున రవళి, రాజేశ్వరి వచ్చారు. మోహిత్‌ని, భయంగా చూస్తున్న సుమని చూడగానే, వాళ్ళకి విషయం అర్థమైంది.

"వీడు ఆ అమ్మాయిని భయపెట్టి ఉంటాడు. ఇంకా నయం. గెస్టు కదా అని గాజుగ్లాసులో యివ్వలేదు మంచినీళ్ళు. ఈ పాటికి గ్లాసు తునాతునకలు అయిపోయివుండేది." అని రవళి గబగబా నీళ్ళు దొర్లినచోట తుడిచే ప్రయత్నం చేసింది.

"ఒరేయ్.. ఆ అమ్మాయి కాస్త నాజూగ్గా పెరిగినట్టుంది. నువ్వు పిచ్చివేషాలు వెయ్యకు" రాజేశ్వరి కొడుకుని మందలించింది. వాళ్ళటు వెళ్ళగానే, సుమ వెనక్కి తిరిగబోయింది. మోహిత్ గోడకి చేయిపెట్టి, ఆమె దారిని ఆపుతూ అడ్డంగా నిలబడ్డాడు.

"నేను తీసుకు వచ్చేదాకా ఆగలేకపోయావా? నువ్వే యిల్లు వెతుక్కుంటూ వచ్చావు?" ఆమె మొహానికి అతని మొహాన్ని చాలా దగ్గరగా తెస్తూ అన్నాడు. అతని మాటల్లో చూపుల్లో కాస్తంత రౌడీయిజంతోబాటూ కొంటెదనం కూడా కనిపించింది.

"ఎక్కువగా ఊహల్లో ఎగరకు. మా నాన్న బంధువుల్ని కలవడానికి వచ్చాను. ఒక్క నిన్ను తప్ప" అంటూ అతని చేతిని పక్కకి తోసి, నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

సుమ వచ్చిందని, మధ్యాహ్నం భోజనంలోకి ప్రత్యేకంగా వంటకాలు తయారు చేస్తూ హైరానా పడిపోయారు రాజేశ్వరి, లలితాంబ.

రవళి కూరలు తరిగి యిస్తూ, కావలసిన సరుకులు అందిస్తూ సాయం చేస్తూ వుంది. మధ్య, మధ్యలో సరదాగా పోట్లాడుకుంటూ, పాటలు పాడుకుంటూ పనిచేశారు.

సుమకి వాళ్ళు, ఒకరితో ఒకరు చనువుగా వుండడం, హాస్యాలాడుకోవడం ఎంతో నచ్చింది. అన్నింటికన్నా ముఖ్యంగా బుజ్జిగాడిని హాయిగా, ఫ్రీగా ఎత్తుకోగలగడం యింకా బాగా నచ్చింది. "స్నేహ వదినలాగా అరిచేవాళ్ళెవ్వరూ లేరు" సంతోషంగా అనుకుంది.

భోజనాలయిన రెండుగంటలలోపే కాఫీలు పట్టుకొచ్చింది రవళి. "ఇవాళంటే కబుర్లతో కాలక్షేపం అయిపోయింది. మామూలుగా అయితే మీరు ఏం చేస్తుంటారు?" కాఫీ అందుకుంటూ రవళిని అడిగింది సుమ.

"ఇంతకన్నా ఏం చేస్తాం? ఇంట్లో బోరుగా వుంటే సిన్మాకి వెళతా!" సుమని విచిత్రంగా చూస్తూ అంది రవళి.

"నీకు తెలీదులే రవళీ. సుమ సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేర్ అవుతుంది. ఆమెకి చాలా హాబీస్ ఉన్నాయి. పొరపాట్న నీకు మంచి హాబీస్ ఏమైనా ఉన్నాయేమో అనుకుని అడిగి వుంటుంది. "

"బట్.. నువ్వు చాలా రాంగ్ పర్సన్‌ని, రాంగ్ క్వశ్చన్ వేశావు సుమా" అంటూ చనువుగా వచ్చి దాదాపుగా ఆమెను అనుకున్నట్టే కూర్చున్నాడు.

అతను చాలా మామూలుగా, యిలాంటివన్నీ నాకు అలవాటే' అన్నట్టు ప్రవర్తిస్తున్నా కావాలని చేస్తున్నాడని సుమకి అర్థమైంది. వెంటనే, కొద్దిగా పక్కకి జరిగి సర్దుకుని కూర్చుంది.

అతనదేమీ పట్టించుకోనట్టు, తాపీగా ముందుకు వంగి టీపాయ్ మీద ఉన్న కాఫీ కప్పు అందుకున్నాడు.

"ఏంటే రవళీ! ఇందులో చక్కెర లేదు" అన్నాడు ఒక్క గుక్క తాగుతూనే.

"కాచేటప్పుడే చక్కెరవేసి, కప్పుల్లో పోశానే" అంది రవళి నమ్మకంగా.

"చూస్తానుండు" అంటూ అతను చప్పున వంగి, కాఫీ కప్పుపట్టుకున్న సుమ చేతివేళ్ళని గట్టిగా పట్టుకున్నాడు.

ఆమె అతని పట్టుని విడిపించుకునే ప్రయత్నం చేసింది. అయినా అతను వదల్లేదు.

అతనేం చేస్తున్నాడో ఆమెకు అర్థమయ్యేలోపలే ఆమె కప్పులో నుంచి కాఫీ సిప్ చేసి

"నువ్వు చెప్పింది కరెక్టే. చక్కెర బాగానే వేశావు" అన్నాడు రవళి వైపు చూసి నవ్వుతూ.

అతని చూపులు, స్పర్శని బట్టి వాటి వెనకాల అతని ఉద్దేశ్యం అర్థమైనట్టనిపించిందామెకి.

"ఇక నేను బయల్దేరాలి" అంటూ లేచి నిలబడింది వెంటనే.

"కాస్సేపాగి వెళ్ళొచ్చు. అమ్మా, అత్తయ్య నిద్రపోతున్నట్టున్నారు. లేచాక చెప్పి వెళుదువుగాని" రవళి అంది.

"లేదు. నేను సాయంత్రం ఐదుగంటలకల్లా యింట్లో ఉండాలి. నాన్న యింగ్లీషు లిటరేచర్ క్లాసు తీసుకుంటానన్నారు." అంది సుమ మొండిగా.

"సరే అయితే! అమ్మని, అత్తయ్యని పిలుచుకుని వస్తానుండు" చెప్పి, రవళి పక్కగదిలోకి వెళ్ళింది.

అక్కడ, సుమ మోహిత్ యిద్దరే మిగిలారు.

సుమ కూడా రవళి వెనకాలే వెళ్ళబోతుండగా మోహిత్ ఆమెకు దగ్గరగా వచ్చాడు.

"వీడేంటీ మాటిమాటికీ దారికడ్డం వస్తున్నాడు. అతి చనువు తీసుకుంటున్నాడు. వీడో పెద్ద ఫ్లర్ట్ అనుకుంటున్నావా?"

ఎలాంటి జులాయి వెధవైనా యింట్లో అమ్మ ముందు, అక్కముందు అమ్మాయితో చనువుగా వుండాలంటే ఆలోచిస్తాడు. అందులోనూ చుట్టాలమ్మాయితో తిక్కవేషాలు వేస్తే అస్సలూరుకోరు ఎవ్వరూ. తేడాలొస్తే బంధువుల్లో చెడ్డపేరే కాదు మక్కెలిరుగుతాయి కూడా.

"యివన్నీ తెలిసి కూడా నేనింత ఓపెన్ అవుతున్నానంటే ఏమిటర్థం?" కవ్విస్తూ అడిగాడు.

"నువ్వు ఎవ్వరికీ భయపడని రౌడీవని అర్థం" అంది ఒక్కొక్కపదాన్నే ఒత్తిపలుకుతూ.

మోహిత్ చిన్నగా నవ్వాడు. అతని మొహంలో అప్పటిదాకా కనిపిస్తూ వున్న నిర్లక్ష్యధోరణి, కొంటెదనం హఠాత్తుగా మాయమయ్యాయి.

"అసలు విషయం చెప్పనా?" మృదువుగా పలుకుతూ, సూటిగా ఆమె కళ్ళలోకి చూశాడు. "నువ్వంటే నాకు యిష్టం. మేము నీకు యివ్వాళే పరిచయమై వుండవచ్చు. కానీ, నువ్వు మాకు ఎప్పటినుంచో తెలుసు. మనమిద్దరం దగ్గరవడం మా యింట్లో వాళ్ళకు కూడా యిష్టం. ఇప్పటికైనా నన్ను సరిగ్గా అర్థం చేసుకుంటావా?" సమాధానం కోసం అభ్యర్థిస్తున్నట్టుగా వున్నాయి అతని కళ్ళు.

సంభాషణ ఊహించని మలుపు తిరగడంతో సుమ తత్తరపడింది. సూటిగా గుచ్చుకుంటున్నట్టున్న అతని చూపుల నుంచి తప్పించుకోవడానికి, అప్రయత్నంగానే ఆమె కనురెప్పలు కిందకి వాలిపోయాయి. ఇంతలో, సుమకి వీడ్కోలు పలకడానికి రవళితో బాటు రాజేశ్వరి, లలితాంబ రావడంతో పక్కకి తప్పుకున్నాడు మోహిత్. "అలా వచ్చి.. యిలా వెళుతున్నట్టుగా వుంది. అప్పుడప్పుడూ వస్తూ వుండు" రాజేశ్వరి సుమ నుదుటిని ముద్దాడింది.

"నిజంగానే అన్ని గంటలు ఎంత త్వరగా గడిచిపోయాయో. పంపడానికి ఒప్పుకున్నారు. ఒక్కరోజులోనే చుట్టరికాలు కలిపెయ్యకు" అన్నాడు చిరాగ్గా.

"ఒకటే ప్రశ్న. ఒకటే రియాక్షన్. యిద్దరి నుంచి. విచిత్రంగా ఉందే" భుజాలెగరేస్తూ మనసులోనే అనుకుంది సుమ.

"నాన్నా యివాళ మీరు ఎన్ని పేజీలు రాశారు?" ప్రసాదరావు పాఠం చెప్పడం పూర్తవుతునే అడిగింది సుమ.

"ఎక్కువ రాయలేదమ్మా! రాసిన కొన్ని పేజీలు. టేబుల్ మీద ఉంచాను. నీకు తీరికైనప్పుడు టైప్ చెయ్యి. కానీ అంతకన్నా ముందు ఈ పుస్తకం చదువు" అంటూ బుక్‌షెల్ఫులో నుంచి ఒక పుస్తకాన్ని తీసి సుమ చేతికి యిచ్చాడు.

"దీన్ని పూర్తిగా చదివి, పుస్తకం మీద నీ అభిప్రాయం, ఇందులో రాసిన విషయాల వాస్తవికతని, స్టాటిస్టిక్స్‌ని బేస్‌గా తీసుకుని, ఎగ్జాంపుల్స్‌తో సహా వివరిస్తూ రాయాలి" చెప్పాడాయన.

"అలాగే నాన్నా!" సుమ తలవూపింది బుద్ధిగా.

"నేను యివాళ బాగా అలసిపోయాను. రెస్టుకావాలి. నువ్వు కాస్సేపు చదువుకో" అని చెప్పి భుజం తట్టి వెనక్కి తిరగబోయాడు.

"ఒక్క నిముషం నాన్నా!" పిలిచింది సుమ. "ఈ పూట మీరు మందులు వేసుకోలేదు" అంటూ పరుగున వెళ్ళి టాబ్లెట్స్, మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

" నా స్టడీ టైంటేబిల్, నా క్లాసులు మాత్రం గుర్తుంటాయి మీకు. టాబ్లెట్స్ వేసుకోవడం మాత్రం గుర్తుండదు. ఊ! త్వరగా వేసుకోండి" అంది దబాయింపుగా.

"ఈ యింట్లో అందరికంటే నా మీద ఎక్కువ శ్రద్ధ చూపించేది నువ్వే తల్లీ" మందులు వేసుకుంటూ వాత్సల్యంగా అన్నాడాయన.

"ఎందుకంటే నేను చాలా భయస్థురాలిని. మీరు టైంకి మందులు వేసుకోకపోతే మీ ఆరోగ్యం పాడవుతుందని, నాకు కంగారుగా వుంటుంది" చెప్పింది అమాయకంగా.

"నేనూ నీకో విషయం చెప్పాలి తల్లీ! సుధీర్ వాళ్ళు నిన్నూ మీ అమ్మని వాళ్ళ మాటలతో బాధపెడుతున్నారు. అది నేను గమనించకపోలేదు. నువ్వు అవేమో నీ మనసుకి తీసుకోకూడదు. సరేనా? ఇంట్లో, ఆడపిల్లల స్థానం మరెవ్వరికీ రాదు. నువ్వెప్పటికీ మాకు బంగారుతల్లివే" అంటూ లాలనగా తలపై చెయ్యివేశాడు.

"డోంట్ వర్రీ నాన్నా! నేనేం బాధపడట్లేదు. మీరెళ్ళి హాయిగా పడుకోండి"

"అవునూ! మీ నాన్న బంధువుల యింటికి వెళ్ళావుగా. ఎలా అనిపించిందక్కడ నీకు? అడిగాడు.

సుమకి, అక్కడికి వెళ్ళాక మనసులో తలెత్తిన అనుమానాలన్నీ ఒక్క క్షణం గుర్తుకి వచ్చాయి. నా తండ్రి ఎలాంటివాడు? తల్లి, తనని కన్నతండ్రి తరపు బంధువులకి ఎందుకు దూరంగా ఉంచింది? ఇంకా ఎన్నో అనుమానాలు ప్రశ్నల రూపంలో మొలకెత్తాయి. కానీ, ప్రసాదరావుని ఏమీ అడగలేకపోయింది.

"బాగానే రిసీవ్ చేసుకున్నారు. ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీలేదు" చెప్పింది ముక్తసరిగా.

"సరే. అయితే" అంటూ భుజం తట్టి వెళ్ళిపోయాడు.

సుమ సోఫాలో కూర్చుని, పుస్తకం తెరిచి చదవడం మొదలుపెట్టింది. సమయం గడిచేకొద్దీ, క్రమంగా చదవడంలో లీనమైపోయింది.

అలా ఎంతసేపు గడిచిందో ఆమెకే తెలియలేదు. చదువుతూ చదువుతూ నెమ్మదిగా కళ్ళు మూతలు పడిపోయాయి. చేతిలోని పుస్తకం గుండెలమీదకి జారిపోయింది. సోఫాలోనే వెనక్కి చేరగిలబడి నిద్రపోయింది.

సుమ వున్న స్టడీరూం తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. శబ్దం చేయకుండా నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వచ్చాడు ఆదిత్య.

సోఫాలో మెడ పక్కకి వాల్చి నిద్రపోతూ కనిపించింది సుమ. వాలిపోయి వున్న ఆమె కనురెప్పలు, చూస్తూవుంటే నెలవంక నల్లగా వున్నా ఎంత అందంగా వుంటుందో అనిపించేట్టు వున్నాయి.

నిద్రమత్తులో కొద్దిగా విడివడ్డ గులాబీ రంగుపెదవులు, ఊపిరి తీసుకుంటున్నప్పుడు సన్నగా కంపిస్తూ ఉన్నాయి.

సుమ మొహంలోకి ఒక క్షణం అలాగే చూసి, నెమ్మదిగా ముందుకి వంగాడు ఆదిత్య.

**ఎవరో దగ్గరగా** వచ్చినట్టు నిద్రమత్తులో లీలగా తెలుస్తూ వుంది సుమకి. కనురెప్పలు మాత్రం తెరుచుకోవడానికి సహకరించడంలేదు. అది కలో, నిజమో అర్థంకావడంలేదు.

ఇంతలో, పాదాల మీద చేతిస్పర్శ వెచ్చగా తగలడంతో కొద్దిగా తెలివి వచ్చింది.

"ఆదిత్య.." కళ్ళతో పనిలేకుండానే, మనిషిని గుర్తించింది మనసు. అతను ఆమె పాదాలకి వున్న స్లిప్పర్స్‌ని తీసి కిందపడేశాడు. ఆమె చేతుల్లో నుంచి జారిపడ్డ పుస్తకాన్ని తీసి, దిండు సరిచేసి పక్కకి వాల్చి పడుకోబెట్టాడు.

దివాను మీద వున్న షాల్‌ని తీసి దుప్పటిలా కప్పి వెనక్కి తిరగబోతుంటే మూసుకుపోతున్న రెప్పల్ని బలవంతంగా తెరిచే ప్రయత్నం చేసిందామె.

చప్పుడు చేయకుండా, అతి జాగ్రత్తగా తలుపు దగ్గరికి వేస్తున్న ఆదిత్య రూపం అస్పష్టంగా కనిపించిందామె కళ్ళకి.

"యూ ఆర్ యింపాజిబుల్.. ఆదీ!" అనుకుని, షాల్‌ని భుజాల మీదకి లాక్కుంటూ, నవ్వుతూ పక్కకి ఒత్తిగిలింది.

లంచ్ బ్రేక్ అవుతూనే, ఆ రోజు సాయంకాలం క్లాసులగురించి ఆలోచించుకుంటూ కారిడార్‌లో నడుస్తూ వుంది సుమ.

"హాయ్! ఎలా గడిచింది నీ వీకెండ్?" వెనకాల నుంచి వచ్చి భుజం మీద చేయివేస్తూ అడిగింది సీమ.

"చెప్పానుగా.. మా నాన్న బంధువుల యింటికి వెళ్ళానని.."

"ఓ..యువర్ బయోలాజికల్ ఫాదర్ తరఫువాళ్ళా...?"

"ఊ..ఁ" తలాడించింది సుమ.

"ఇంతకీ ఎలా వున్నారు నీ కొత్త చుట్టాలు?"

"నథింగ్ స్పెషల్" క్లుప్తంగా చెప్పింది.

"పద. క్యాంటిన్‌లో కాఫీ తాగుదాం" సీమ బలవంతపెడితే వెనక్కి తిరిగింది సుమ.

నాలుగు అడుగులు వేస్తూనే ఆమె సెల్‌ఫోన్ రింగయ్యింది.

"హలో! ఐ యామ్ మోహిత్." అవతలివైపు నుంచి వినిపించింది.

"ఏంటి?"

"ఒకసారి పార్కింగ్‌లోకి వస్తావా? ఐయామ్ వెయిటింగ్"

"రాకపోతే"

"నేనే లోపలికి వస్తాను. అదేమన్నా లావామౌంటేనా? సరిగ్గా నాకు ఇరవై అడుగుల దూరంలో వుంది అంతే" అన్నాడు నవ్వుతూ.

"ఓ..గాడ్! మళ్ళీ తయారయ్యాడు" విసుక్కుంటూ తలకొట్టుకుంది.

"ఏమైంది?" కంగారుగా అడిగింది సీమ.

"ఆ రోజు నీ బర్త్‌డే పార్టీలో కలిశాడన్నానే.. అతనే! అప్పటినుంచి వెంటపడుతూనే ఉన్నాడు" అంది ఫోన్ కట్ చేస్తూ.

"మరీ విసిగిస్తుంటే చెప్పు. యిప్పుడే ఈవ్‌టీజింగ్ స్క్వాడ్‌కి కాల్ చేసి జైల్లో తోయించేద్దాం." అంది వెంటనే ఫోన్‌లో కాంటాక్ట్ లిస్ట్ తీసి నొక్కబోతూ.

"నో..నో.. అతను నా కజిన్" అంది సుమ కంగారుగా.

"ఓహో! అలా చెప్పుమరి. కొత్తగా పుట్టుకొచ్చిన బావన్నమాట. అందుకే అయ్యగారు అన్ని చక్కర్లు కొడుతున్నాడు" అంది అల్లరిగా నవ్వుతూ.

"షటప్. నేను వెళుతున్నా" అంటూ వెనక్కి తిరిగింది సుమ.

"మాటల్లో చూపించే కోపం మనసులో లేదులే వెళ్ళు వెళ్ళు" సీమ ఆటపట్టిస్తూ వుండగానే గబగబా బైటికి నడిచింది.

సుమని చూస్తూనే "పద వెళదాం" అంటూ బైక్ స్టార్ట్ చేయబోయాడు మోహిత్.

"ఏంటి అంత తొందర? ఎక్కడికెళ్ళాలి మనం?" ఆశ్చర్యంగా అడిగింది.

"పక్కనే రెస్టారెంట్ వుంది. అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం"

"మీ ఆఫీసు వాళ్ళు పనిచేయకపోయినా జీతం యిస్తారులా వుంది. అందుకే యిలా కాలేజీ చుట్టూ తిరుగుతున్నావ్" వెటకారంగా అంది.

"పని చేయాలనుకుంటే ఆఫీసుకి వెళ్ళక్కర్లేదు. ఎక్కడి నుంచైనా వర్క్ చేయచ్చు. టెక్నాలజీ యిచ్చిన సౌలభ్యం. ముందు నువ్వు బైక్ ఎక్కు" తొందరపెట్టాడు. "నో..వే! నీకు ఆ సౌలభ్యం వుందేమో. నేను మాత్రం క్లాస్ అటెండ్ కావాలి. నాకు కుదరదు."

"నువ్వు రాను అంటే నీ మనసు మార్చుకునే దాకా వెంటబడి విసిగిస్తూనే ఉంటాను. దాని బదులు ఒక్క టెన్‌మినిట్స్ నాతోబాటు వస్తే ఏ సమస్యా ఉండదు. ఆలోచించుకో" అన్నాడు హెల్మెట్ పెట్టుకుంటూ.

సుమ ఒక్క సెకను ఆలోచించి బైక్ ఎక్కింది.

రెస్టారెంట్‌లో కార్నర్ టేబుల్ దగ్గర ఎదురెదురుగా కూర్చుని వున్నారు సుమ, మోహిత్‌లు.

"ఇదే రెస్టారెంట్‌కి చిన్నప్పుడు నేను మామయ్యా అదే మీ నాన్నతోబాటు వచ్చేవాడిని ఐస్‌క్రీం తినడానికి. బహుశా, అప్పటికి నువ్వు పుట్టివుండవు" మోహిత్ చెబుతూ సుమ మొహంలోకి చూశాడు.

సుమ ఐస్‌క్రీం బౌల్‌లోకి చూస్తూ అందులో స్పూన్‌ని గుండ్రంగా తిప్పుతూ ఉంది.

"ఇంకా చెప్పు.. మా నాన్న గురించి. ఆయన మంచివాడా? ఆయనకి నేనంటే యిష్టమేనా? అప్పట్లో మా చిన్న ఫ్యామిలీ ఎలా వుండేది? నీకు తెలిసినది. నువ్వు విన్నది చెప్పు!" మనసులో తొలుస్తున్న ప్రశ్నలన్నింటినీ అతని ముందు కుమ్మరించింది.

అతను ముందుకు వంగి సుమ చేతిని పట్టుకున్నాడు.

"సుమా! నిన్ను డిస్టర్బ్ చేయాలని యివన్నీ చెప్పడం లేదు. మామయ్య మీద నాకున్న ప్రేమకొద్దీ ఆయన్ను గుర్తుచేసుకుంటున్నానంతే!

నీకు సంబంధించినంతవరకు ఆయన, నీ సర్టిఫికెట్స్‌లో ఫాదర్ కాలమ్ వరకే పరిమితం. ఎందుకంటే మీ అమ్మ నిన్ను ఆయనకి చాలా దూరంగా చేసుకుని వెళ్ళింది.

కానీ, మా విషయంలో అలాకాదు. మామయ్య మాకు ఆర్థికంగా చాలా సాయంచేశారు. మా ఫ్యామిలీ నిలబడడానికి ఆయనే కారణం. అందుకే, ఆయన్ని మేము రోజూ గుర్తుచేసుకుంటూ ఉంటాం. ముఖ్యంగా, ఆయన చెల్లెలిగా మా అమ్మ. మీ నాన్నని తలుచుకుని క్షణం ఉండదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఆ మామయ్య కూతురిగా నువ్వు మాకు కావాలి. మళ్ళీ నిన్ను మాలో కలుపుకోవాలనే మా యింట్లో అందరి ఆశ.

బహుశా మామయ్యే బ్రతికి వుంటే సంతోషంగా ఒప్పుకునేవారనుకుంటాను.

కానీ, యిప్పుడు నువ్వు ప్రసాదరావు కూతురివి. అది నీ ఛాయిస్‌కాదు. మీ అమ్మ ఛాయిస్.

నువ్వు కావాలనుకుంటే, మామయ్య కూతురుగా తిరిగి మాలో ఒకరుగా మా యింట్లో తిరగొచ్చు. బాగా ఆలోచించుకో. అన్నింటినీ మించి నువ్వంటే నాకు యిష్టం. బాగా ఆలోచించుకుని నేనంటే యిష్టమైతే 'యస్' అని చెప్పు"

"ప్లీజ్.. మోహిత్ ఇంక మాట్లాడకు" అతని మాటల్ని మధ్యలోనే తుంచేసింది." నువ్వు ఈ టాపిక్ మీద మాట్లాడాలనుకున్నావని తెలిస్తే నేనసలు నీతోబాటూ వచ్చేదాన్నేకాదు. ఇప్పటికే నాకు ఒక క్లాసు వేస్టయ్యింది. నేను వెళ్ళాలి" అంటూ బ్యాగ్ తీసుకుని లేచి నుంచుంది.

ఆమె రెస్టారెంట్ దాటి బైటికి వెళ్ళబోతుండగా, "సుమా ప్లీజ్ ఒక్కమాట" అంటూ ఆమె వెనకాలే వెళ్ళాడతను.

"నీ డెసిషన్ ఏదైనా నువ్వు మన ఫ్యామిలీలో అందరితో ఎప్పటిలాగే కలిసి వుంటావు కదూ!" వేడుకుంటున్నట్టే అన్నాడు. "అలాగే.." చెప్పి వెళ్ళిపోయింది.

"మోహిత్... మోహిత్" వరండాలోనుంచి కేక పెట్టింది రవళి. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే హడావుడిగా బైటికి వచ్చాడతను.

"క్యాటరింగ్ వాళ్ళు వచ్చారు. సత్రం అడ్రస్ తెలియదుట వాళ్ళకి. డ్రైవర్ అడ్రస్ చెప్పు" చెప్పేసి లోపలికి వెళ్ళిపోయింది.

క్యాటరింగ్ వ్యాన్‌లో నుంచి తలకి టోపీ పెట్టుకున్న వ్యక్తి కిందకి దిగాడు "చెప్పండి..సాబ్" అంటూ

మోహిత్ అతనికి దారి వివరిస్తూ వుండగానే రోడ్డుకి కాస్త అవతలగా ఒక ఆటో వచ్చి ఆగింది. అందులోనుంచి సుమ కిందకి దిగింది. కాలేజీ నుంచి నేరుగా అటే వస్తున్న గుర్తుగా ఆమె భుజానికి బ్యాక్‌పాక్ వేళ్ళాడుతూ వుంది.

ఇంటి ముందర క్యాటరింగ్ వ్యాన్, తెలియని ఒకరిద్దరు కొత్త మొహాలు హడావుడిగా అటూ యిటూ తిరగడం చూసి సందర్భం ఏమిటో అర్థంకాక ఆశ్చర్యపడుతూ గేటు వైపుకి నడిచింది. "థాంక్యూ! నేను ఫోన్ చేస్తే, నువ్వు రావేమో అనుకున్నాను" ఆమె దగ్గరకు వస్తూ అన్నాడు మోహిత్.

సుమ తిరిగి జవాబు చెప్పబోయేలోపే రాజేశ్వరి అక్కడికి వచ్చింది.

ఆమె మొహం చూస్తే అప్పటిదాకా ఏడ్చినట్టుగా వుంది. కనురెప్పలు వాచిపోయి చెంపలు ఎర్రగా అయ్యాయి.

సుమని చూస్తూనే ఆమెకి మరింతగా, దుఃఖం పొంగుకొచ్చింది.

"వచ్చావా తల్లీ! నాకు తెలుసు.. నువ్వు వస్తావని. ఎంతైనా నువ్వు ఆ తండ్రికి బిడ్డవి. నువ్వు వస్తేనే మీ నాన్న ఆత్మకు శాంతి" అంటూ ఘొల్లుమని ఏడ్చింది.

సుమకి ఆవిడన్న మాటలు అర్థంకాలేదు.

"ఇవాళ, మామయ్య చనిపోయినరోజు" మెల్లగా చెప్పాడు మోహిత్.

"ఇన్నేళ్ళకిగానూ నువ్వు వచ్చావు తల్లీ. మొదట్లో ఎన్నిసార్లు మీ అమ్మకి ఫోన్లు చేసినా రాలేదు. ఈ యింటి గడప మళ్ళా తొక్కనని తెగేసి చెప్పింది. మీ అమ్మ తెంచుకోగలిగినా నేనెలా నా అన్నని మరిచిపోగలను? మేం తింటున్నది వాడి సొమ్ము" రాజేశ్వరి చెబుతూనే వుంది.

"వదినా! చిన్నపిల్ల ముందు ఆ మాటలెందుకు?" అప్పుడే అక్కడికి వచ్చిన లలితాంబ వారించింది.

"సుమా! ఈ రోజు సత్రంలో పేదవాళ్ళకి భోజనాలు పెడుతున్నాం. నువ్వూ వస్తావుగా" అడిగింది రవళి.

"సరే"నన్నట్టు తలవూపింది సుమ. ఆమె యింకా అయోమయస్థితిలోనే వుంది.

అరగంటలో అందరూ తెములుచ్చుకుని, సత్రానికి వెళ్ళడానికి తయారయ్యారు. సుమకూడా వాళ్ళతో బాటు బయల్దేరి వెళ్ళింది.

మోహిత్, అతనితో బాటూ అతని స్నేహితులు యిద్దరు ముగ్గురు వడ్డనలో సాయం చేశారు. రామకృష్ణారావుతో పరిచయం వున్నవాళ్ళు, యిరుగుపొరుగున వున్న ఆయన స్నేహితులు నలుగురైదుగురు వచ్చి రాజేశ్వరినీ సుమని పలకరించి వెళ్ళారు.

పద్దెనిమిదేళ్ళ తర్వాత తిరిగి రామకృష్ణారావు కూతురిగా గుర్తింపబడడం సుమకి విచిత్రంగా అనిపించింది.

తల్లి ఏ కారణాల వల్లైనా మళ్ళీ పెళ్ళి చేసుకుని వుండవచ్చు. కానీ, వీళ్ళందరి మధ్య నాకంటూ ఒక ఐడెంటిటీ లేకుండా ఎందుకు చేసింది? అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకడం లేదు సుమకి.

"ఏంటమ్మా! ఒంటరిగా నిలబడి ఆలోచిస్తున్నావు?" రాజేశ్వరి సుమ నిలుచున్న చోటికి వచ్చింది.

"ఏం లేదత్తయ్యా!" అంది మనసులో భావాల్ని బైటపడనీయకుండా జాగ్రత్తపడుతూ.

"పిచ్చితల్లీ నేనేదో బాధలో శాంతించింది ఆమె నవ్వు, నడక, మాట, మన్నన అన్నింట్లో "నావాళ్ళు" అనిపించే భావన. బాధ, సంతోషం రెండింట్లో దగ్గరితనం" అనుకుంటూ తలతిప్పి చూసింది.

దూరంగా మోహిత్ వంటపాత్రలు సర్దుతూ కనిపించాడు.

"ఐ బిలాంగ్ హియర్" అతడినే చూస్తూ అనుకుంది.

సుమ యింటికి వచ్చేసరికి వసుంధర, ఆదిత్య హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఆదిత్య ఏదో జోక్ చేయడంతో వసుంధర పగలబడి నవ్వుతూ వుంది. సుమ తల్లివైపొకసారి పరిశీలనగా చూసింది.

తెల్లగా, గుండ్రంగా వున్న మొహం, హుందాగా వుండే నేతచీరకట్టు, భారీ పర్సనాలిటీ కాకపోవడంతో అసలు వయసుకన్నా చిన్నగా కనిపిస్తూ వుంది.

"రా సుమా! నీ కోసమే ఎదురుచూస్తున్నాం. ఇవాళ చాలా మంచి శుభవార్త విన్నాను. ఆదిత్యకి చాలా పెద్ద కాంట్రాక్ట్ వచ్చింది. మనమందరం ఈ పూట డిన్నర్‌కి బైటికి వెళ్తున్నాం. నువ్వు కూడా త్వరగా రెడీ అయిరా!" అంది వసుంధర కూతురితో సంతోషంగా.

"నాకు మూడ్ లేదు" చిరాగ్గా అంది సుమ.

"పిచ్చిగా ప్రవర్తించకు. ఆదిత్య నీకోసం ఎన్ని చేస్తుంటాడు? అతని ఒక్క సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకోలేవా నువ్వు" అంది వసుంధర కోపంగా.

సుమకి పూలదండ వేసిన తండ్రిఫోటో, ఏడుస్తూ వునన్ మేనత్త మొహం ఒక్కసారి కళ్ళముందు కదిలాయి.

తల్లి మాటల్ని లెక్కచేయనట్టుగా, "ఐ డోంట్ కేర్" అని చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"దీనికి రానురానూ బుద్ధిలేకుండా పోతుంది. అందుకే అంతగా నెత్తినెక్కించుకోవద్దని చెబుతుంటాను" అంటూ కోపంగా లేచి నిల్చుంది వసుంధర.

"అమ్మా! సుమ మూడ్ బావున్నట్టులేదు. కాస్సేపు ఒంటరిగా వదిలేయండి" ఆదిత్య వారించాడు.

"నువ్వు. ఒక్క నిముషం ఉండు" అంటూ అతని మాటలు వినిపించుకోకుండా సుమ గదిలోకి వచ్చింది ఆమె.

"ఏంటి నీ పద్ధతి? ఆదిత్య ఏమనుకుంటాడు? నీకు అవసరం అయితే, ఆదీని అర్ధరాత్రిళ్ళు బజార్లకి తిప్పుతుంటావు. నిన్ను రోజూ డ్రాప్ చేయాలి.. పిక్ చేయాలి. నీ అలకలు తీర్చాలి నీ కోసం డబ్బు ఖర్చుపెట్టాలి. వాడి జీవితం అంతా నీకోసం కేటాయించాలి. కానీ, నువ్వు మాత్రం వాడిని పట్టించుకోకు. అతని సంతోషం, బాధ నీకు అనవసరం" అరిచింది కోపంగా.

"అవును.. అవసరం. ఎందుకంటే ఆదిత్య, సుధీర్ వీళ్ళంతా నీకు అవసరం కాబట్టి. వాళ్ళే నీకు కావాలి. నా బాధ నీకు పట్టదు. ఆదిత్య కోసం మంచి పార్టీ మూడ్‌లో ఉన్నట్టున్నావు కదా! ఇవాళ మా నాన్న చనిపోయిన రోజన్న విషయం నీకు గుర్తుందా? " ఏడుస్తూ జీరబోయిన గొంతుతో అడిగింది.

సుమ మాటలకి వసుంధర హతాశురాలైంది. జవాబివ్వడానికి నోటమాటరాలేదు. గతం నిప్పుల సెగలా మారి మాడ్చివేసినట్టు అయిపోయిందామె మొహం.

ఏడుస్తూ వున్న సుమవైపు అభావంగా చూసి, తలతిప్పుకుని బైటికి నడిచింది.

"ఏమైందమ్మా!" వసుంధర మొహం చూసి, ఆదుర్దాగా అడిగాడు ఆదిత్య,

అతని పలకరింపుకి ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

"ఏమీ లేదు" అని చెప్పి, గబగబా వెళ్ళిపోయిందక్కడ నుంచి.

"సుమా! నువ్వు ఈ టైంలో ఫోన్ చేశావేంటి?" అవతలి పక్క గొంతులో ఆశ్చర్యం.

"నీతో మాట్లాడాలనిపించి చేశాను. ఏం చేయకూడదా?" మనసులో ఉదాసీనతనంతా నిట్టూర్పు రూపంలో బైటికి తెస్తూ అంది.

"అదేమీ లేదు. ఎప్పుడూ నేను నీ వెంట పడుతూ వుంటాను కదా! ఈసారి రివర్స్‌లో నువ్వు నాకు ఫోన్ చేశావేంటా అని. అదీ రాత్రి పదకొండు గంటలకి.. హౌ రొమాంటిక్" అన్నాడు నవ్వుతూ.

"........."

అవతలివైపు నుంచి రెండు నిముషాలు మౌనం.

"హలో సుమా కోపం వచ్చిందా? ఒకవేళ నేను ఎక్కువగా మాట్లాడాననుకుంటే అయామ్ సారీ" ఆదుర్దాగా అన్నాడతను.

"నో మోహిత్! నేనే యిన్నిరోజులూ నిన్ను అర్థం చేసుకోలేకపోయాను. చాలాసార్లు యిన్సల్టింగ్‌గా మాట్లాడాను కూడా! నేనే నీకు 'సారీ' చెప్పాలి. "

"యస్...స్.స్" ఆనందంతో చిన్నగా కేకపెట్టాడు అతను.

"అంటే నేనంటే నేను యిష్టమన్నట్టేగా" ఉత్సాహంగా అడిగాడు.

"ఊ....ం.."

"సుమా!" మృదువుగా పలికాడతను "నువ్వంటే నాకెంత యిష్టమో నేను మాటల్లో చెప్పలేను. ఎప్పుడూ నీ గురించే ఆలోచనలు. నా మనసు నామాట వినడంలేదు. ఎందుకంటే అది నీది అయిపోయింది. ఇక నుంచి దానిమీద పూర్తి అధికారాలు నీవే. దాన్ని ప్రేమిస్తావో, బాధపెడతావో లేకపోతే ముక్కలు కింద నరికేసి కాకులకీ, గద్దలకీ వేస్తావో నీ యిష్టం. దాన్ని నీ పాదాల దగ్గర పడేశాను" సీరియస్‌గా చెబుతున్నట్టు నటించి, చివర్లో నవ్వేశాడు.

"బావున్నాయి. నీ ఫేజీ, సినిమా డైలాగులు" సుమ కూడా నవ్వింది.

"నీకో విషయం చెప్పనా? నిన్ను మొదటిసారి కలిసినప్పుడే అనుకున్నాను. మనిద్దరం దగ్గరయ్యేరోజు వస్తుందని. స్వచ్ఛమైన మనసుతో తీవ్రంగా కోరుకుంటే అది ఖచ్చితంగా జరిగి తీరుతుంది."

"హలో! నేను అలాంటి ప్రామిస్‌లేమీ చేయలేదు. నువ్వు అప్పుడే మరీ దూరం వెళ్ళిపోకు."

"సారీ! నేనిందాకే చెప్పానుగా. ఒక్కసారి మనసిచ్చేస్తే దానిమీద మనకి అధికారాలు పోతాయని. ఇప్పుడు నీ మనసుని నేను ప్రేమిస్తానో, పూజిస్తానో నా యిష్టం. నువ్వు జస్ట్ చూస్తూ ఉండంతే."

"మోహిత్" ఆలోచిస్తున్నట్టుగా పలికింది. "నేను చాలా కన్ఫ్యూజ్డ్‌గా వున్నాను"

ఆమె మాటల్ని పూర్తిచేయనివ్వలేదతను.

"నీ సందేహాలన్నీ త్వరలోనే తీరిపోతాయి. రేపొద్దున్న ఆరుగంటలకల్లా మీ యింటిదగ్గర వున్న జాగింగ్ ట్రాక్స్ దగ్గరికి వచ్చెయి!" చెప్పాడు.

సుమ ఒక నిముషం కంగారుపడింది. "మోహిత్.. ప్లీజ్ నేను రాలేను"

"అయితే, నేను యిప్పుడే బయల్దేరి మీ యింటి దగ్గరకి వస్తాను. రాత్రంతా మీ గేటు ముందు జాగారం చేస్తాను. నువ్వు 'సరే' అనేదాకా దేన్నీ లెక్కచేయను. నీకు తెలుసుగా నేనెంత మొండివాడినో" బెదిరిస్తూ అన్నాడు.

సుమ ఒక నిర్ణయానికి వచ్చినట్టు రెండు పెదవులూ వత్తిపెట్టింది. "అలాగే వస్తాను" అంది ఒప్పుకున్నట్టుగా.

"అయితే రేపు ఉదయం కలుద్దాం. అందాకా బై" అంటూ ఫోన్ కట్ చేయబోయాడు.

"మోహిత్!" కంగారుగా పిలిచింది సుమ.

అతను ఒక్క క్షణం ఆగాడు.

"థాంక్యూ నీతో మాట్లాడక ముందు నా మనసు ఒకలావుంది. నీతో మాట్లాడాక చాలా సంతోషంగా ఉంది. థాంక్యూ వెరీమచ్" ఆమె గొంతులో నిజాయితీ ఉట్టిపడింది.

"వసుంధరా! ఇవాళ అమ్మాయి కనిపించలేదు. క్లాసుకి కూడా వెళ్ళలేదని డ్రైవర్ చెప్పాడు ఏమైంది?" బెడ్రూంలోకి వస్తూనే భార్యని అడిగాడు ప్రసాదరావు.

"సుధీర్ వాళ్ళ తిరుగుప్రయాణం హడావుడిలో నేనూ పట్టించుకోలేదు. వంట్లో బాగోలేనట్టుంది. గదిలోనే వుంది" భర్త మొహంలోకి చూడకుండా తలదించుకుని చెప్పింది.

"అలాగా చూసి వస్తానుండు" అంటూ నిలుచున్న చోటినుంచే వెనక్కి తిరిగాడాయన.

వసుంధర మంచం మీద కూర్చున్నదల్లా ఒక్క ఉదుటున లేచి ఆయన చేయి పట్టుకుని ఆపింది.

"అంత కంగారుపడాల్సినదేమీ లేదులెండి. తలనొప్పిగా ఉందని చెప్పింది. నేను టాబ్లెట్ యిచ్చాను. పడుకుని ఉంటుంది. రేపు మాట్లాడొచ్చులెండి" అంది కంగారుగా.

ప్రసాదరావు వసుంధర మొహంలోకి సూటిగా చూశాడు.

"నీకేమైంది? ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి. ఊరికే ఆయాసపడుతున్నావు?" కనుబొమలు ముడుస్తూ అడిగాడు.

"ఈ మధ్య ఎందుకో నీరసంగా వుంటుంది. అందుకే, కాస్త పని ఎక్కువైనా ఆయాసపడుతున్నాను.."

"రేపు ఆదిత్యకి చెబుతాను. ఒకసారి డాక్టరు దగ్గరికి వెళ్ళిరా!"

"అలాగే" అని, అక్కడే నిలబడ్డ భార్యని చూసి,

"ఇంకేమన్నా మాట్లాడాలా?" అడిగాడు పక్కనే వున్న కుర్చీలో కూర్చుంటూ.

"ఏవండీ! సుమని మనం వాళ్ళ నాన్నగారి బంధువుల దగ్గరికి వెళ్ళనిచ్చి తప్పుచేశావేమో అనిపిస్తుంది" లోపల వున్న దుఃఖాన్ని బైటికి రానీయకుండా విశ్వప్రయత్నం చేస్తూ అంది.

"ఏం జరిగింది?"

"సుమ ఈ యింట్లో పిల్లలు పెరగాలని, తండ్రి వేరన్న విషయం దాని పసిమనసుపై ప్రభావం చూపకూడదని, నేను చాలా జాగ్రత్తపడ్డాను. అందుకే, నా గతాన్ని పూర్తిగా, నా జీవితంలో నుంచి, మనసులో నుంచి తీసేశాను.

ఎప్పుడైతే సుమ తన తండ్రి తరఫు చుట్టాల గురించి తెలుసుకుందో అప్పటినుంచి అక్కడికి వెళుతున్నట్టుంది. వాళ్ళు దానికి ఏం నూరిపోస్తున్నారో అని నాకు భయంగా వుంది.

ఇవాళ అది అడిగిన ప్రశ్నలకి నేను జవాబు చెప్పలేకపోయాను. ఒక్కసారి ఆ యింట్లో వాళ్ళ చరిత్ర అంతా చెప్పి కడిగేయాలన్నంత కోపం వచ్చింది" కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అంది.

"వసూ! నేను యిదివరకు చెప్పినమాటే, యిప్పుడూ చెబుతున్నాను. తల్లిదండ్రులుగా మనం పిల్లల్ని ప్రేమించాలి. ఆ ప్రేమే వాళ్ళకి మనమీద నమ్మకాన్ని యిస్తుంది. అంతేకానీ, మన చేసే పనులకు సంజాయిషీలు యివ్వకూడదు.

అన్నీ నోటితో చెప్పేవి వుండవు. కొన్ని మనసుతో తెలుసుకునేవి కూడా ఉంటాయి. మనసులో వ్యతిరేకత వున్నప్పుడు, నువ్వు చెప్పేదంతా నిజం అని నమ్ముతుందనుకుంటున్నావా? సుమ వయసుకి ఎమోషనల్‌గా వుండడం సహజం.

నువ్వే కాస్త సహనం చూపించు.

అనవసరమైన విషయాల్ని ఎక్కువగా చర్చించి, అమ్మాయి మనసు పాడుచేయకు. అమ్మాయికి రెండు నెలల్లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ ఉన్నాయి. ఆ ప్రిపరేషన్‌లో ఉండాలి. సుమ జీవితానికో గోల్ వుంది.

ఇలాంటి విషయాలన్నీ బలమైన ఆశయం ముందు గాలిమబ్బుల్లా తేలిపోతాయి. నువ్వు అనవసరంగా దిగులుపడకు. సమయం గడిచేకొద్దీ అన్నీ సర్దుకుంటాయి" ఓదార్చాడాయన.

**"అమ్మాయి మీద** మీకు ఉన్నంత నమ్మకం నాకు లేదండీ" అంది వసుంధర బేలగా.

"పోనీ నామీద నమ్మకం ఉంచు. సరేనా?" అంటూ భుజం తట్టి లేచి వెళ్ళి, మంచం మీద వాలాడు.

వసుంధర భారంగా నిట్టూర్చింది. కూతురి మాటల్లో కనిపించిన తీవ్రత, తిరస్కారం గుర్తొస్తూనే, గుండె కలుక్కుమంది.

"నిజంగా, సుమకి అంత మాత్రం విచక్షణ వుందా?" ఆమెకి నమ్మకం కుదరలేదు.

ప్రసాదరావు నిద్రలోకి జారుకున్న గుర్తుగా సన్నగా గురక శబ్దం వినిపిస్తూ ఉంది.

ఆలోచనల వేడికి, నిద్రపట్టక పోవడంతో, లేచి నెమ్మదిగా హాల్లోకి నడిచింది వసుంధర.

అక్కడ డిమ్‌లైట్ వెలుతురులో ఎవరో తిరుగుతున్నట్టు అనిపించింది. నాలుగడుగులు వేస్తూనే, మసక వెలుతురులో మొహం కనిపించింది.

"ఆదిత్యా! నువ్వు యింకా నిద్రపోలేదా?" అడిగింది ఆశ్చర్యంగా. అప్పటికే పన్నెండు గంటలు దాటినట్టు చూపిస్తూ వుంది గోడగడియారం.

ఆదిత్య యిబ్బందిగా తలదించుకున్నాడు.

వసుంధర సుమ గదిలో యింకా లైటు వెలుగుతూ ఉండడం చూసింది.

"సుమ యింకా మేలుకుని ఉందని, నువ్వు యిక్కడ కాపలా కాస్తున్నావా?" సూటిగా అడిగింది.

"సుమ యివాళ ఎందుకో చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉంది. చదువుకుంటూ మేలుకుని వుంటే ఫర్వాలేదు, కానీ ఆందోళనతో నిద్రపోవడం లేదనుకుంటా" నసుగుతూ చెప్పాడు.

"అయితే.. ఆ మహారాణి ప్రశాంతంగా నిద్రపోయేవరకు నీకు నిద్ర పట్టదంటావు" అంది నిట్టూరుస్తూ.

"....."

వసుంధర నీరసంగా నవ్వింది.

"సుమ చాలా అదృష్టవంతురాలు ఆదీ! ఇంతగా ప్రేమించే మనుషులు దొరకడం పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం. కానీ నీకు తెలుసా! ఎంత గొప్ప వరమైనా, దాన్ని గుర్తించి గౌరవించే బుద్ధి కలగకపోతే ఉపయోగంలేదు. చాలా లేటయ్యింది యిప్పటికే. నువ్వు వెళ్ళి పడుకో" చెప్పింది భుజం తడుతూ.

ఆదిత్య ఆవిడ మాటని తీసివేయలేక, తప్పనిసరై వెనక్కి తిరిగాడు.

అతను మేడ దిగివెళ్ళేటప్పుడు కూడా రెండుసార్లు వెనక్కి తిరిగి సుమ గదివైపుకి చూడడం వసుంధర గమనించింది.

"భగవంతుడా! ఎటువైపుకి నడిపిస్తున్నావో నువ్వు" అనుకుంటూ, మనసులో ప్రార్థించింది.

అప్పుడప్పుడే పొగమంచు సూర్యకిరణాలకి ఆవిరైపోతూ ఉంది. ఆకుపచ్చని పొదరింటిలోకి, ఆకాశంలోని నక్షత్రాలు దిగివచ్చినట్టు చిన్న చిన్న నీటి ముత్యాలు మిలమిలా మెరిసిపోతున్నాయి. అందమైన ఆ ఉదయాన్ని ఆస్వాదిస్తూ జాగింగ్ ట్రాక్‌పై పరిగెడుతూ ఉంది సుమ. వేగంగా పరిగెత్తడం వల్లనో, ఎదురుగా రయ్యిన వీస్తున్న చల్లగాలి వల్లనో ఎర్రగా కందిపోయి వున్నాయి ఆమె బుగ్గలు.

కాసేపు పరుగెత్తి అలిసిపోయి ఆగిపోయింది సుమ. ఆయాసాన్ని అదుపు చేసుకోవడానికి, ముందుకి వంగి, మోకాళ్ళ మీద చేతులు ఉంచింది.

అప్పటిదాకా, ఆమె పరుగుకు లయబద్ధంగా ఊగుతూ వున్న ఆమె పోనీటైల్ నేను కూడా నీరసపడిపోయానంటూ భుజం మీదకి వాలిపోయింది.

అలుపు తీర్చుకుని, ఒకసారి బరువుగా గాలిపీల్చి తలపైకెత్తిందామె.

మరుక్షణంలోనే, ఆమె కంటిముందు అందంగా విరబుసిన ఎర్రని గులాబీలు ప్రత్యక్షమయ్యాయి.

ఆ పైన నవ్వుతూ మోహిత్ మొహం కనిపించింది.

అతను, ఆమె వేసుకున్న నీలం రంగు జాగింగ్ సూట్‌ని, నల్లని పట్టుకుచ్చులా భుజం మీద పరుచుకున్న ఆమె జుట్టుని ఆశ్చర్యంతో మెరిసిపోతున్న ఆమె కళ్ళని తనివితీరా చూస్తున్నాడు.

"మోహిత్!" ఆశ్చర్యంగా పలికిందామె.

"ఐ లవ్ యూ!" ఆమె కళ్ళలోకి చూస్తూ చెప్పాడతను.

సుమకి ముందురోజు రాత్రి యిద్దరి మధ్యా జరిగిన సంభాషణ గుర్తుకి వచ్చింది. అతని ముందు తన మనసుని బైటపెట్టానన్న విషయం స్ఫురిస్తూనే కనురెప్పలు సిగ్గుతో బరువెక్కాయి.

అతని ప్రేమని స్వీకరిస్తున్నట్టుగా పూలగుత్తిని చేతిలోకి తీసుకుంది.

"పొద్దున్నే జాగింగ్ ట్రాక్ దగ్గరికి రమ్మంది యిందుకేనా?" అంది నవ్వుతూ.

"ఇందుకేనా?" అని అంత తేలిగ్గా తీసేయకు. నాకైతే రాత్రంతా నిద్రపట్టలేదు. వీలైతే నిన్నరాత్రే తోటరాముడిలా గోడదూకి వచ్చి నిన్ను కలుసుకోవాలనిపించింది."

"ఓ..గాడ్ దిసీజ్ టూ మచ్" నవ్విందామె.

"అంతే మరి మామూలుగా, సాదాసీదాగా ప్రేమిస్తే అందులో మజా ఏమంటుంది? ప్రేమంటే ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్టుగా ఉండాలి. కంప్లీట్‌గా మనసుని అరెస్ట్ చేసినట్టుగా ఉండాలి. నీకు నేను తప్ప యింక ఏమీ కనిపించకూడదు. వినిపించకూడదు" అన్నాడు ఆమెకి చాలా సన్నిహితంగా వస్తూ.

"మోహిత్ ఇప్పుడు నాన్న వాకింగ్‌కి యిటే వస్తారు" అంది భయపడుతున్నట్టుగా ఒక అడుగు వెనక్కి వేస్తూ.

"అయితే ఏంటి? ఆయనేమన్నా నీ కన్నతండ్రా? అంతలా అధికారం చూపించడానికి" అన్నాడు చిరాగ్గా.

"నాన్నని మాత్రం ఏమీ అనకు. ఆయన చాలా మంచివారు"

"సరే..సరే.. ఇంతకీ యిప్పుడేమంటావు?" ఆమె తెల్లటి చేతుల్ని గట్టిగా పట్టుకుంటూ అన్నాడు.

"రెండు నెలల్లో నాకు ఎగ్జామ్స్ ఉన్నాయి. ప్రిపేర్ అవ్వాలి. ఐ నీడ్ టు గో" అంది అతని చేతుల నుంచి విడిపించుకుంటూ.

"సుమా!"

అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా, "వస్తాను.. బై" అని చెప్పి పరుగున వెళ్ళిపోయింది.

"మనం ఫోన్ మాట్లాడడం మొదలుపెట్టి గంటన్నర దాటింది తెలుసా?" రాత్రి తొమ్మిదిగంటలప్పుడు లాన్‌లో పచార్లు చేస్తూ మోహిత్‌తో మాట్లాడుతూ వుంది సుమ.

ఇంతలో, పక్కగా అడుగులు సవ్వడి వినబడడంతో తలతిప్పి చూసింది ఆదిత్య అటువైపే వస్తూ కనిపించాడు.

"ఆదిత్య వస్తున్నాడు. నేను తర్వాత మాట్లాడతాను" అంటూ ఫోన్ కట్ చేసింది. అర నిముషంలోపలే సుమ ఫోన్ మళ్ళీ రింగయ్యింది.

"ఆ ఆదిత్య ఎవరని నువ్వు భయపడాలి? ఆ యింట్లో నువ్వు ఎవరికీ ఒదిగి వుండాల్సిన అవసరంలేదు. నువ్వు 'ఊ' అనాలేగానీ, ఈ క్షణమే నిన్ను తీసుకుని వచ్చేస్తాను" మోహిత్ కోపంగా అన్నాడు.

"ఓ గాడ్! నేనెవరికీ భయపడి ఫోన్ కట్ చేయడం లేదు. నేను చదువుకోవాలి అందుకే పెట్టేశాను. సరేనా! బిలీవ్‌మీ! బై.." అంటూ తిరిగి కాల్ కట్ చేసింది.

"ఈ మధ్య ఫోన్‌కాల్స్‌తో చాలా బిజీగా ఉంటున్నట్టున్నావు." అంటూ దగ్గరకు వచ్చాడు ఆదిత్య.

"అదేం లేదు ఆదీ! ఫ్రెండ్ స్టడీ మెటీరియల్ గురించి అడుగుతుంటే చెబుతున్నానంతే" అంది కప్పిపుచ్చుకుంటూ.

"నువ్వు చెప్పకపోయినా నాకు తెలుస్తూనే ఉంది. ఈ మధ ఎక్కువగా యింట్లో ఉండడం లేదు నువ్వు. ఎవ్వరితోనూ మాట్లాడడం లేదు. నువ్వు స్టడీ రూంలోకి కూడా రాకపోతుంటే మామయ్య, నీ గదిలోనే కూర్చుని శ్రద్ధగా చదువుకుంటున్నావనుకుంటున్నారు.

నీకోసం స్పెషల్‌గా ట్యూటర్స్‌ని యింటికి పిలిపించి, పాఠాలు చెప్పిస్తున్నారు. నువ్వు ఆ క్లాసులు ఎగ్గొట్టి తిరుగుతున్నావని తెలియదు మామయ్యకి.

నీకు ఎగ్జామ్స్ వున్నాయన్న సంగతైనా గుర్తుందా?" మందలిస్తూ అడిగాడు ఆదిత్య.

"సారీ.. బావా! యివన్నీ నాన్నతో చెప్పకు. నేను మేకప్ చేయడానికి ట్రై చేస్తాను" నిజాయితీగా చెప్పింది.

"సరే! ఇకనుంచైనా శ్రద్ధగా ప్రిపేరవ్వు. నీకు తెలుసా! ఈ యింట్లో సుధీర్, నువ్వు, నేనూ ముగ్గురం కలిసి పెరిగాం. అయినా మామయ్య మా యిద్దరిని ఎప్పుడూ సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేరవమని ప్రోత్సహించలేదు.

దానికి, ఆయన నిన్ను మాత్రమే ఎన్నుకున్నారు.

అంటే మాలో లేని ప్రత్యేక లక్షణం ఏదో నీలో ఉందని గుర్తించారు. మామయ్య అంచనా ఎప్పుడూ తప్పుకాదని నమ్ముతున్నాను. అది గుర్తుంచుకుని బుద్ధిగా చదువు" అన్నాడు లాలనగా భుజం తడుతూ.

సుమ ఆదిత్య వైపు సూటిగా చూసింది.

తెల్లని లాల్చీ, పైజమాలో చిరునవ్వు నవ్వుతూ ఉన్నాడు. అతని మనసులోని నిర్మలత్వం, ఆ నవ్వులో స్పష్టంగా కనిపిస్తూ ఉంది. "జీవితంలో ఎలాంటి కంప్లైంట్స్ లేవు కోరికలు లేవు. దేన్నీ తీవ్రంగా తీసుకోడు. తెల్లకాగితంలాంటి మనిషి అతని దగ్గర అబద్ధం చెబుతున్నందుకు సిగ్గుపడింది సుమ.

"ఆదీ! నువ్వు ఎవర్నైనా ప్రేమించావా?" అడిగింది అతన్ని.

సుమ నుండి ఊహించని ప్రశ్న రావడంతో ఒక్క క్షణం కంగారు పడ్డాడు ఆదిత్య.

"ఎందుకలా అడిగావు?" అన్నాడు ఆశ్చర్యపడుతూ.

"నన్నే యింత బాగా చూసుకుంటావు. ఇక నువ్వు ప్రేమించిన అమ్మాయిని అయితే ఇంకెంత బాగా చూసుకుంటావో కదా అని అడిగాను. ఒకవేళ అలాంటిదేమన్నా వుంటే అందరికన్నా ముందు నాకే చెప్పాలి" అంది నవ్వుతూ.

"ఇంతవరకు నేనే ఆమెకి చెప్పలేదు. నీకులాగే తనకీ ఎగ్జామ్స్ ఉన్నాయి. ఈ సమయంలో ఆమె ఫోకస్ చెడగొట్టడం నాకు యిష్టంలేదు. సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నాను"

"అంటే ఎవరో ఉన్నారన్నది కన్‌ఫర్మ్ అయినట్టే. ఏమో అనుకున్నాను. నువ్వు పైకి కనిపించినంత అమాయకుడివేం కాదు.. కానీ, ఒక విషయంలో మాత్రం మెచ్చుకుని ఆ అమ్మాయితో బాటు, ఆమె ఆశల్నీ, ఆశయాల్నీ, గౌరవిస్తున్నావు చూడూ.. యూ ఆర్ యింపాజిబుల్" అంది మెచ్చుకుంటున్నట్టుగా.

"ఇలాంటి కబుర్లన్నీ కట్టిపెట్టి ముందు చదువుకో. వెళ్ళు" ఆదిత్య కోపం నటిస్తూ అంటుంటే అల్లరిగా నవ్వుతూ అక్కడ నుంచి పరిగెత్తింది సుమ.

"ఎవరు గావాలె.. బిడ్డా?" ఎదురుగా నిలబడ్డ యువకుడిని చూస్తూ అడిగాడు రామయ్య.

"సుమ వుందా?" నిర్లక్ష్యంగా అడిగాడు అతను.

"సుమమ్మ దోస్తులా? కూర్చుని పిలుస్తను" అంటూ డ్రాయింగ్ రూంలో అతన్ని కూర్చోబెట్టి, సుమకి కబురందించడం కోసం లోపలికి వెళ్ళాడు రామయ్య.

అప్పుడే న్యూస్‌పేపర్ కోసం గదిలోకి వచ్చింది వసుంధర.

"నమస్తే అత్తయ్యా!" అంటూ ఆమెని చూస్తూనే లేచి నిలబడ్డాడు మోహిత్. పరిచయం లేని మొహం, అలవాటులేని పిలుపు ఎవరైవుంటారా? అని, ఆశ్చర్యంగా చూసింది వసుంధర.

"నేను సుమ మేనత్త కొడుకుని. స్వంత మేనత్త కొడుకుని" 'స్వంత' అనే పదాన్ని ఒత్తిపలుకుతూ అన్నాడు.

వెంటనే వసుంధర మొహం మాడిపోయింది.

"రాజేశ్వరి కొడుకువా? సుమతో ఏం పని నీకు?" అడిగింది కరుగ్గా.

"సుమనే అడగండి. నాకంటే ఫ్రీగా, ఓపెన్‌గా తనే మీతో చెప్పగలదు" అన్నాడతను తొణక్కుండా.

"హాయ్ మోహిత్" హుషారుగా పలకరిస్తూ లోపలికి వచ్చింది సుమ. పింక్ కలర్ చుడీదార్‌లో, అతి శ్రద్ధగా అలంకరించుకున్న కూతుర్ని ఎగాదిగా చూసింది వసుంధర.

"పద వెళదాం" అన్నాడతను సుమని చూస్తూనే. "సుమా! ఒక్క నిముషం నీతో మాట్లాడాలి" గట్టిగా చెప్పింది వసుంధర.

"మోహిత్ నువ్వు బైట వెయిట్ చేస్తూ ఉండు" చెప్పి, సుమ తల్లి వైపుకి తిరిగింది.

"నువ్వేం చేస్తున్నావో తెలుస్తుందా? ఆ అబ్బాయిని యింటిదాకా తీసుకురావాల్సిన పనేంటి?" కోపంగా అడిగింది కూతుర్ని.

"అమ్మా మోహిత్ నన్ను కలవడానికి వచ్చాడు. యిందులో యిష్యూ చేయాల్సిందేముంది?" అంది సుమ తేలిగ్గా కొట్టిపారేస్తూ.

"నీ కోసమే అయినా, ఈ యింటికి రాకూడదు. నా మొదటి భర్త తాలూకు బంధువుల్ని ఈ యింటికి ఆహ్వానించేంత పెద్ద మనసు నాకు లేదు. ఈ సమాజంలో ఆడవాళ్ళకి, "నాకు రెండు పెళ్ళిళ్ళు అయ్యాయి. అని చెప్పి ధైర్యంగా తలెత్తుకు తిరిగే రోజులు రాలేదు" తెలుసుకో.

గతాన్ని సమాధి చేసి ప్రశాంతంగా బతుకుతున్నాం. దీన్ని యిలాగే సాగనివ్వు. దయచేసి, మీ నాన్నగారి పరువు తీయకు. అసలు ఆయన అతి మంచితనంతో నిన్ను ఆ యింటికి పంపి చాలా పెద్ద పొరబాటు చేశారు. దానికి ఒప్పుకోవడం నేను చేసిన యింకో పొరపాటు.

ఇదే ఆఖరు సారి చెబుతున్నాను. యింకెప్పుడూ ఆ యింటి మనుషులు, యిక్కడ కనిపించకూడదు. అర్థమైందా?" ఆవేశంగా చెప్పింది.

"మోహిత్ చెప్పేది చాలా నిజం. నాన్న నన్ను ఎంత ప్రేమించినా యిది నా యిల్లు ఎప్పటికీ కాలేదు. నాకోసం, నా వాళ్ళు యిక్కడికి రాకూడదు.

ఎందుకంటే, నా ఉనికే రెండుగా చీలిపోయి ఉంది. రెండు ప్రపంచాల్లో బతుకుతూ ఉన్నట్టుండి నాకు కానీ, ఏదీ నాకోసం కాదు. నేనెంత మర్చిపోదామని ప్రయత్నించినా, ఎవరో ఒకరు, ఏదో ఒక పాయింట్ దగ్గర ఆ విషయం గుర్తుచేస్తూ వుంటారు నాకు" ఉక్రోషంగా అంటూనే సుమ కళ్ళ వెంట నీళ్ళు జలజలా రాలాయి.

సుమ ఆవేదన చూసి వసుంధరకి కూడా ఏడుపొచ్చింది. ఉన్నట్టుండి ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి.

సుమ ఒక్క అంగలో తల్లి దగ్గరకు వచ్చింది.

"అమ్మా! అయామ్ సారీ ఈ డిస్కషన్ యింతటితో ఆపేద్దాం. మోహిత్ మళ్ళీ ఈ యింటికి రాడు సరేనా!" తల్లి చేతులు పట్టుకుని చెప్పింది.

"అయితే అతనితో స్నేహం మానుకోగలవా?" నెమ్మదిగా అడిగింది వసుంధర.

"ప్లీజ్ అమ్మా! ఈ విషయాలన్నీ తర్వాత మాట్లాడుకుందాం. మోహిత్ ఎదురుచూస్తూ వుంటాడు... వస్తాను" చెప్పేసి వెళ్ళిపోయింది. కూతురి గురించి ఆలోచించిన కొద్దీ వసుంధర గుండె దడ ఎక్కువైంది.

''రెండు ప్రపంచాల్లో బతుకుతున్నట్టు వుంది. కానీ ఏదీ నా కోసం కాదు'' కూతురు అన్న వాక్యం మళ్ళీ మళ్ళీ చెవుల్లో మోగుతూ వుంది.

సుమని ఈ కన్‌ఫ్యూజన్‌లోకి నెట్టింది నేనేనా?

బిడ్డ భవిష్యత్తు కోసం నిలదొక్కుకోవాలనే ప్రయత్నంలో పెళ్ళిచేసుకుని ఊబిలో దిగబడిపోయానా?

సుమదసలే నిలకడలేని వయసు 'భగవంతుడా!' అనుకుంటూ సోఫాలో కూలబడిద్కి.

❦❦❦

రెస్టారెంట్‌లో ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు మోహిత్, సుమ. ''వన్ బనానా స్మూతీ.., వన్ స్ట్రా బెర్రీ మిల్క్‌షేక్'' ఆర్డర్ చెప్పి సుమ వైపుకి చూశాడు మోహిత్.

''ఫోన్ చేస్తుంటే తీయడం లేదేంటి?'' దబాయింపుగా అడిగాడు.

''అందుకేనా, దురుసుగా యింట్లోకి దూసుకు వచ్చావు? అడిగింది కోపంగా.

''నాకసలే విసుగు, చికాకు ఎక్కువ. ఆ సంగతి నీకూ తెలుసు. గంటలు, గంటలు వెయిట్ చేయడాలూ ఎప్పుడో నువువ్ ఫోన్ చేస్తావని ఎదురుచూడడాలూ నా వల్ల కాదు'' అన్నాడు విసుగ్గా.

సుమ హఠాత్తుగా సీరియస్‌గా అయిపోయింది.

''నీకు తెలియదు మోహిత్. ఇవాళ నువ్వు యింటికి రావడం అమ్మకి అస్సలు నచ్చలేదు. చాలా అప్‌సెట్ అయ్యింది. ''టేబుల్ మీద చేతులు పెట్టి, ముందుకి వంగుతూ చెప్పింది.

''ప్రేమించుకున్న వాళ్ళందరి ప్రాబ్లమ్స్ యిలాంటివే'' అన్నాడతను నిర్లక్ష్యంగా కుర్చీలో వెనక్కి వాలుతూ.

''చూడూ.! మా యింట్లో అందరూ చాలా ఓపెన్ మైండెడ్‌గా ఉంటారు. ప్రేమ పెళ్ళికి వ్యతిరేకులేం కాదు. కానీ మన విషయం వేరు. అమ్మ ఎప్పటికీ ఒప్పుకోదు.''

''నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నా 'మా యింట్లో వాళ్ళు' అంటావెందుకు? ఎవరువాళ్ళు? నీకేం కారు నీకున్న ఒకే ఒక్క రిలేషన్ మీ అమ్మ. ఆమె కోసం వాళ్ళందరి మధ్యలో బతకాల్సిన అవసరం నీకు లేదు. నీకోసం నేనవర్నీ లెక్కచెయ్యను మీ అమ్మతో సహా. ఆవిడవల్ల మీ నాన్న ఎంత బాధపడ్డారో చిన్న వయసులోనే ఎలా ప్రాణాలు పోగొట్టుకున్నారో మా అమ్మ ఎప్పుడూ చెబుతూ వుంటుంది'' అన్నాడు కోపంగా.

ఇంతలో వెయిటర్ రావడంతో మాట్లాడడం ఆపాడు మోహిత్. అతను పొడవాటి గాజుగ్లాసులతో తెచ్చిన డ్రింక్స్‌ని ఒక్కొక్కటిగా బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు.

సుమ ఆలోచిస్తున్నట్టుగా గాజుగ్లాసుని ముందుకీ, వెనక్కీ కదుపుతూ కూర్చుంది.

''మోహిత్‌తో స్నేహం మానుకోగలవా?'' అన్న తల్లిమాటలు గుర్తొచ్చాయి.

''నాలుగురోజుల్లో నాకు సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ వున్నాయి. అప్పటిదాకా మనం ఈ విషయాలు పక్కన పెడదాం. ఎగ్జామ్స్ అవుతూనే, నేనే నీకు ఫోన్ చేస్తాను. అప్పటివరకు నువ్వు నాకు ఫోన్ చేయడం, నాకోసం యింటికి రావడంలాంటి పనులు చేయకు. ప్లీజ్'' బతిమాలినట్టే చెప్పింది.

''సరే నీ యిష్టం కాబట్టి ఒప్పుకుంటున్నాను. ఎవరికీ భయపడి మాత్రం కాదు. అయితే ఒక కండిషన్..''

''ఏంటి?'' సుమ అడిగింది కంగారుగా.

"నువ్వు యిప్పుడు నాతో మా యింటికి రావాలి"

"అలాగే" తలూపింది సంతోషంగా.

"ఇంకొక్క దోసె.. సుమకి" వంటగదిలోకి వినబడేట్టు కేకపెట్టాడు మోహిత్.

సుమ చిరుకోపంతో అతనివైపు చూసింది.

అతను అదేం పట్టించుకోనట్టు ఆమె ప్లేట్‌లో చేయి పెట్టాడు.

"ఏయ్! ముందు నా ప్లేట్‌లో దోసని వదిలేయ్. నువ్వు నా దోసలన్నీ మింగేస్తుంటే నేను బకాసురుడి సిస్టర్‌లా.. అత్తయ్య నడిగి పది దోసలు వేయించుకున్నాను" అంటూ టప్ మని అతని చేతిమీద కొట్టింది సుమ.

"అబ్బా.. రాక్షసీ" అంటూ చేయి విదిలించాడు.

"ఉండు.. నీ పని చెబుతాను" అంటూ ఆమె నెత్తిమీద కొట్టబోయినట్టు నటించి, చటుక్కున ఎడం చేత్తో ఆమె బుగ్గగిల్లాడు. సుమ అతని చేతిని తోసేస్తూ, పకపకా నవ్వింది.

"అప్పుడే అయిపోలేదు" చిలిపిగా అంటూ ఆమె మొహం మీదకి వంగాడు.

"షటప్..మోహిత్" నవ్వుతూ అతని మొహాన్ని చేత్తో వెనక్కితోసేసింది.

"సుమా! యిటురా" మందలింపుగా స్వరం వినిపించడంతో యిద్దరి నవ్వులూ ఆగిపోయాయి.

ఎదురుగా లలితాంబ నిలబడివుంది.

సుమ మౌనంగా లేచి, ఆమెతో బాటు పక్కగదిలోకి వెళ్ళింది.

"ను వ్వు తరచుగా యిక్కడికి వస్తున్నట్టు మీ అమ్మకి తెలుసా?" నిలదీస్తూ అడిగింది.

సుమ జవాబివ్వలేకపోయింది.

"ఇక్కడ మేము నీకు ఎంత దగ్గరి చుట్టాలమైనా, మీ అమ్మకంటే ఎక్కువ కాదు. నీ గురించి ఆవిడ కంటే ఎక్కువ ఆలోచించేవాళ్ళు ఎవరూ ఉండరు.

ఆమెకి చెప్పకుండా నువ్వు యిక్కడికి రానక్కర్లేదు. నిన్ను చుడాలనుకున్నప్పుడు మేమే నీకు కబురు పెడతాం. ఎందుకు చెబుతున్నానో అర్థం అయ్యిందా?" అంది సూటిగా చూస్తూ. సుమ మౌనంగా తలాడించింది.

ఆమె అటు వెళ్ళిపోగానే, మోహిత్ లోపలికి వచ్చాడు.

వాడిపోయి వున్న సుమ మొహం చూసి "చూస్తూ వుంటే నీకో క్లాసు పడ్డట్టు వుందే" అన్నాడు నవ్వుతూ.

"మోహిత్ మనిద్దరం పెళ్ళి చేసుకోవడం మీ యింట్లో అందరికీ యిష్టం అని చెప్పావు కానీ, పిన్ని ఎందుకలా మాట్లాడింది" అంది అనుమానంగా.

"పెళ్ళి చేసుకుంటే యిష్టమన్నాను కానీ, పెళ్ళికి ముందే చనువుగా వుంటే ఒప్పుకుంటారని చెప్పలేదు. రొటీన్‌గా, పెద్దవాళ్ళకి వుండే చాదస్తమేలే! పద నిన్ను మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు భుజం మీద చేయివేస్తూ.

"అయివుండొచ్చు" అతని మాటలకు సమాధానపడ్డట్టుగా తలవూపింది సుమ.

సుమ పరీక్షలు అయ్యేంత వరకు యింట్లో అందరికీ టైం టేబుల్ యిచ్చేశారు ప్రసాదరావుగారు.

"అమ్మాయికి ఎటువంటి యిబ్బంది ఉండకూడదు. ఇంట్లో ఎటువంటి డిస్టబెన్స్ వుండడానికి వీల్లేదు" అందరినీ హెచ్చరించాడు.

"సుమని ఎగ్జామ్స్‌కి డ్రాప్ చేయడం, పిక్ చేసుకోవడం నీ బాధ్యత. అవసరం అయితే రెండు రోజులు ఆఫీసుకి సెలవు పెట్టు" ఆదిత్యకి చెప్పాడు.

సుమ పరీక్షలు వున్న వారం గడిచిపోయింది.

**"సుమ రిజల్ట్స్ వచ్చేది** ఈ రోజే " అంటూ పొద్దున్నే హడావుడి ప్రారంభించాడు ప్రసాదరావు.

"రామయ్యా! డ్రైవర్‌కి చెప్పి పదికిలోలు స్వీట్స్ తెప్పించు" చెప్పి బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

కాఫీ కప్పులున్న ట్రే పట్టుకుని వంటగదిలో నుంచి వసుంధర వచ్చింది. ఆమెతో బాటు సుమ కూడా వచ్చి టేబుల్ దగ్గర కూర్చుంది.

"మెయిన్స్ రాయడానికి మంచి ప్రిపరేషన్ వుండాలి సుమా! నీకు ఆంత్రోపాలజీ చెప్పడానికి మోహన్ అంకుల్‌ని మన ఇంటికే రమ్మంటాను. మేం సివిల్స్ రాసేటప్పుడు వాడు ఆంత్రోపాలజీలో బెస్ట్‌గా వుండేవాడు. మెయిన్స్ అయిపోయాక యింటర్వ్యూ గురించి ఆలోచిద్దాం" కూతురితో అన్నాడు.

"ముందు రిజల్ట్స్ చూసుకున్న తర్వాత మాట్లాడొచ్చులెండి. అయినా మీకు కూతురి మీద అంత గుడ్డినమ్మకం పనికిరాదు. ఈ మధ్య దానికి చదువు కంటే వేరే వ్యాపకాలు బాగా ఎక్కువైనాయి" అంటూ కూతురివైపు చురుక్కుమనేట్టు చూసింది వసుంధర.

"సుమ ఖచ్చితంగా ఐయ్యేయస్ అయి తీరుతుంది. ఇది ఆఫ్టరాల్ ప్రిలిమ్స్ టెస్ట్" అన్నాడు ప్రసాదరావు కూతురి భుజం తడుతూ.

"మామయ్య మళ్ళీ సుమని పొగుడుతున్నారా?" ఆదిత్య కూడా రెడీ అయివచ్చి కూర్చున్నాడు.

"పొగడడం కాదు. నెత్తినెక్కించుకోవడం. రిజల్ట్స్ రాకముందే మీ మామయ్య సుమ నెగ్గినట్టే ఊహించేసుకుంటున్నారు." ఆదిత్యకి టిఫిన్ ప్లేట్ అందిస్తూ చెప్పింది వసుంధర.

"ఓ.. పదింటికి నెట్‌లో రిలీజ్ అవుతాయి కదా రిజల్ట్స్" సుమని అడిగాడు ఆదిత్య.

"అవును" చెప్పిందామె.

బ్రేక్‌ఫాస్ట్ పూర్తి అవుతూనే, లాప్‌టాప్ ముందర కూర్చున్నాడు ఆదిత్య. అతని వెనకాలే ముగ్గురూ నిలబడి, అతను ఒక్కొక్క నెంబరే టైప్ చేస్తుంటే, ఆదుర్దాగా చూస్తూ వున్నారు.

"సారీ! రాలేదు.."

ఆదిత్య ఆయన సంతృప్తి కోసం మళ్ళీ ట్రై చేసి చూపించాడు. ఒక్కసారిగా దిగాలు పడిపోయాడాయన. కళ్ళజోడు తీసి నుదుటిని అరచేత్తో రుద్దుకుంటూ సోఫాలో కూలబడిపోయాడు. రెండు నిముషాలపాటు ఎవరికీ మాట్లాడేందుకు ధైర్యం చాలలేదు. సుమకి తన ఫెయిల్యూర్ కంటే, తండ్రిని నిరుత్సాహపరిచినందుకు ఎక్కువ బాధ కలిగింది.

"నాన్నా! సారీ నాదే పొరబాటు. బహుశా, నేను ఈ పరీక్షలని యింకా సీరియస్‌గా తీసుకోవాల్సిందేమో! ఇంకోసారి యిలా జరగదు. పూర్తి శ్రద్ధ పెట్టి చదువుతాను. ప్రామిస్" మోకాళ్ళ మీద కూర్చుని తండ్రి చేతులు పట్టుకుంటూ చెప్పింది సుమ.

ప్రసాదరావు అలాగేనన్నట్టు తలవూపాడు.

"ఈ పూట అంతా, సమయం తీసుకుని ఎక్కడ పొరబాట్లు జరిగాయో బాగా ఆలోచించు. వాటిని సరిచేసుకునే ప్రయత్నం చేయి. రేపట్నుంచి మళ్ళీ ప్రిపరేషన్ మొదలు పెడదాం" అన్నాడు.

"అలాగే నాన్నా" సుమ బరువుగా నిట్టూర్చింది.

"ఈ పూటకి అమ్మాయిని వంటరిగా వదిలేయండి." అన్నాడు ప్రసాదరావు వసుంధర, ఆదిత్యలను వుద్దేశించి.

సుమ మౌనంగా వెనక్కి తిరిగింది.

తల్లి, ఆదిత్య సూటిగా చూస్తున్న చూపులు మనసులో గుచ్చుకునట్టు అనిపించాయి ఆమెకి. నీ నిర్లక్ష్యానికి కారణమైన నిజం మాకు తెలుసని చెబుతున్నట్టున్నాయి వాళ్ళ కళ్ళు.

తండ్రిని మోసం చేస్తున్నందుకు ఒక పక్క బాధ, మరోపక్క తనకే నచ్చని ద్వంద్వ ప్రవృత్తి.

వాళ్ళతో చూపులు కలపలేక తలవంచుకుని గబగబా తన గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

"మళ్ళీ నీ పరీక్షలు యింటర్వ్యూలు అయ్యేసరికి ఏ ఏడాదో రెండేళ్ళో అవుతుంది. అప్పటిదాకా నేను ఆగలేను" ఫోన్‌లో మోహిత్ గొంతు వినిపిస్తూ వుంది.

"మోహిత్.. అర్థం చేసుకో నేను నాన్నకి ప్రామిస్ చేశాను. నాన్న నా మీద పెట్టిన శ్రమ, ఖర్చు.. ఇన్నాళ్ళు నేను చదివిన చదువు అన్నీ వృథా అయిపోతాయి" బతిమాలుతూ అంది.

"పెళ్ళయితే నువ్వు సివిల్స్‌కి ప్రిపేర్ అవకూడదని రూల్ ఎక్కడా లేదు. నువ్వు తర్వాతైనా ఎగ్జామ్స్ రాయొచ్చు. బాగా ఆలోచించుకో. నీ ఆన్సర్ పాజిటివ్‌గా లేకపోతే నువ్వు నన్ను దూరం పెట్టడానికే ఈ వంక చెబుతున్నట్టు నేను అర్థం చేసుకుంటాను. ఆ తర్వాత నా దారి నాది. నీ దారి నీది" కోపంగా అన్నాడు.

"అంటే బెదిరిస్తున్నావా?" పదునుగా అడిగింది.

"లేదు ప్రేమించుకున్నాక యిలా సంవత్సరాల తరబడి పెళ్ళి కోసం ఎదురుచూడడం కరెక్టు కాదంటున్నాను."

"...."

"ప్లీజ్ సుమా! నువ్వు దూరంగా వుంటే నేను వుండలేను. మాటిమాటికీ యిలా ఎగ్జామ్స్, ప్రిపరేషన్స్ వంకతో నిన్ను చూడకుండా వుండాలంటే అస్సలు కుదరదు" అతని స్వరం మెత్తబడింది.

"నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వు మోహిత్"

"ఓ.కే టైం తీసుకుని నీ నిర్ణయం చెప్పు బై.." ఫోన్ కట్ అయింది.

సుమ చేతిలోని ఫోన్‌ని బెడ్ మీద విసిరికొట్టింది.

మోహిత్ అన్న మాటలు తిరిగి నెమరువేసుకుంది. "నా దారి నాది నీ దారి నీది" అని ఎంత సులువుగా చెప్పాడు?

మోహిత్ లేకుండా వుండగలనా?"

యిద్దరి మధ్యా సంతోషంగా గడిచిపోయిన క్షణాలేవీ అతనికి లెక్కలేదా?

రోజూ రాత్రి రెండు గంటల వరకు ఫోన్‌లో తీపి కబుర్లు చెబుతూ వుంటాడు. ఎదురుగా వుంటే ఏదో వంకతో చేయి తగిలిస్తూ చిలిపిగా కళ్ళతో మాట్లాడేవాడు.

అన్నింటికన్నా ముఖ్యంగా అతనితో పంచుకున్న వెచ్చటి తొలిముద్దు వయసు తాలూకు అల్లర్లు అన్నీ వరుసగా గుర్తొచ్చాయి.

"మోహిత్‌తో బ్రేకప్" అనుకోగానే మనసు కొండలోయల్లోకి జారిపడ్డట్టు అనిపించింది.

"నో హి ఈజ్ మై ఫస్ట్ లవ్. అతనికి దూరంగా వుండలేను"

సుమ ఆలోచనల్లో మునిగితేలుతూ వుండగానే వసుంధర తలుపు తీసుకుని గదిలోకి వచ్చింది.

"మధ్యాహ్నం భోజనం చేయలేదు. కనీసం ఈ పాలన్నా తాగు" అంటూ పాలగ్లాసు టేబుల్ మీద పెట్టింది.

సుమ పలకలేదు.

"సుమా! నీకే చెబుతున్నాను" పిలిచింది వసుంధర.

"ఒకసారి పరీక్షపోతే జీవితమే వృధా అయినట్టు బాధపడకు. నువ్వు దిగులుగా వున్నావనే యివాళ కాలేజీకి సెలవుపెట్టి యింట్లోనే వున్నాను. నాన్నగారు పనిమీద వరంగల్ వెళ్ళారు. ఆయన తిరిగి వచ్చేసరికి నీ మూడ్ బాగుచేసుకో. నిన్నిలా చూస్తే ఆయన బాధపడతారు. " తలమీద చేయి వేస్తూ ఆప్యాయంగా అంది.

సుమ ఒక నిముషం ఆలోచించింది. "అమ్మా! నీతో ఒక విషయం మాట్లాడాలి" అంది తల్లి చేయిపట్టుకుని మంచం మీద కూర్చోబెడుతూ.

"చెప్పు" అంది వసుంధర సూటిగా చూస్తూ.

"నేనూ, మోహిత్ పెళ్ళి చేసుకుందాం అనుకుంటున్నాము" ధైర్యం చేసి చెప్పింది.

వసుంధర మొహంలో రంగులు మారాయి. "మోహిత్ అంటే మొన్న వచ్చిన రాజేశ్వరి కొడుకేనా?" అడిగింది పదునుగా.

తల్లి రియాక్షన్ ముందే ఊహించిన సుమ భయపడలేదు. "అవును" చెప్పింది తొణక్కుండా.

"ఓహో! నువ్వు పరీక్ష పోయిందని, మీ నాన్న డిసప్పాయింట్ అయ్యారని దిగులు పడుతున్నావనుకున్నాను. కారణం యిదన్నమాట. నిష్ఠూరంగా అంది.

"నాకు బాధగా లేదని ఎవరన్నారు? కాకపోతే నా జీవితంలో యింకొక ముఖ్యమైన నిర్ణయం కూడా తీసుకోవాలనుకుంటున్నాను" మొండిగా అంది.

"చూడు సుమా నువ్వు చాలా కన్ఫ్యూజన్‌లో వున్నావు. ఒక్కసారి ఈ యింట్లో నువ్వు ఎంత సంతోషంగా వుండేదానివో గుర్తు తెచ్చుకో. సరదాగా, నవ్వుతూ తుళ్ళుతూ నీ ప్రపంచం అంతా మేమే అన్నట్టు వుండేదానివి. ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావు? అవసరంలేని గతాన్ని మర్చిపోయి నీ మనసులోని అపోహల్ని, అనుమానాల్ని తుడిచెయ్యి. నిజంగా నిన్ను ప్రేమించే వాళ్ళని గుర్తించి గౌరవించడం నేర్చుకో" ఆవేశంగా అంది వసుంధర.

"చిన్నప్పుడు నాకు ఏమీ తెలియదు కాబట్టి, సంతోషంగా వుండేదాన్ని. అయినా యిప్పుడు విషయం నేను నా వాళ్ళని కావాలనుకుంటున్నానా? వద్దా? అని కాదు. నేనూ, మోహిత్ ప్రేమించుకుంటున్నాం అంతవరకే" కటువుగా చెప్పింది.

"కానీ, రెండూ వేర్వేరు విషయాలు కాదు. నువ్వు, మీ నాన్నగారు, ఆయన కుటుంబం మీరే నాకు ముఖ్యం. నీ మంచి కూడా యిందులోనే వుంది. నేను గతంలోకి వెళ్ళి మీ నాన్నగారిని సుధీర్ ముందు అతని భార్య ముందు ఎగతాళి పడేలా చేయలేదు. అసలు రాజేశ్వరి ఆవిడ కుటుంబం ఎలాంటిదో నీకు తెలుసా? వాళ్ళ వల్లే మూడేళ్ళు కూడా నిండని నిన్ను, తీసుకుని రోడ్డున పడాల్సి వచ్చింది ఇదే ఆఖరుసారి చెబుతున్నాను. ఇంకెప్పుడూ అతని పేరు నా దగ్గర ఎత్తకు" వసుంధర కోపం తగ్గలేదు.

"నేను మాత్రం అతన్నే పెళ్ళిచేసుకుని తీరతాను. నువ్వు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా" ధైర్యంగా ఎదిరించింది.

"సుమా!" గట్టిగా అరిచింది వసుంధర. "నేను ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్‌ని నమ్మను. కానీ నీ మూర్ఖత్వం వల్ల యివాళ మాట్లాడాల్సి వస్తుంది. నువ్వు ఆ అబ్బాయిని పెళ్ళి చేసుకుంటే, నేను చచ్చినంత ఒట్టే" ఆవేశంగా చెప్పి, తలుపు ధడాల్న వేసి వెళ్ళిపోయింది.

"సుమా నేను ఆదిత్యని" ఎంత తట్టినా సుమ తలుపు తీయకపోవడంతో పేరు చెప్పి పిలిచాడు.

సుమ విసురుగా వచ్చి తలుపు తీసింది. "ఏం కావాలి?" అంది చిరాకుపడుతూ.

ఆదిత్య కళ్ళు పెద్దవి చేసి ఆమె మొహంలోకి చూస్తూ నిల్చున్నాడు.

"ఏంటలా చూస్తున్నావ్? మధ్యాహ్నం అమ్మ వచ్చి తిట్టివెళ్ళింది. ఇప్పుడు నువ్వా అరిచి వెళదామని వచ్చావా?" అంది కోపంగా.

"భలేదానివే నేను నిన్నెందుకు తిడతాను? అన్నీ నువ్వే మనసులో ఊహించేసుకోవడం మానెయ్. ఎంత పరిక్ష పోతే మాత్రం కళ్ళు ఉబ్బిపోయేలా ఏడ్వాలా? ముందర్జంటుగా మొహం కడుక్కుని లాన్‌లోకి రా" చెప్పి వెళ్ళిపోయాడు.

సుమ వాష్ రూంలోకి వెళ్ళింది. నిజంగానే, జుట్టంతా రేగిపోయి, కళ్ళు బాదంకాయల్లా వాచిపోయి కనిపించాయి అద్దంలో. చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని ఫ్రెష్ అయి మేడదిగి లాన్‌లోకి నడిచింది.

మాలతీ తీగలు అల్లించిన పందిరి కింద నిలబడి కనిపించాడు ఆదిత్య. ఆకుల సందుల్లో నుంచి నీరెండ అతని నుదుటిమీద పడి మెరుస్తూ వుంది.

"ఆఫీసు నుంచి వచ్చాక తన గదికి కూడా వెళ్ళినట్టులేడు. యింకా ఫార్మల్ దుస్తుల్లోనే వున్నాడు" అనుకుంటూ అతనున్న వైపుకి నడిచింది.

బల్లమీద పెట్టిన కవర్‌లో నుంచి పేపర్‌ప్లేట్స్‌ని తీసి సర్దుతూ, సుమ అడుగుల చప్పుడుకి తలయెత్తి చూశాడు ఆదిత్య.

"ఊ..! ఇప్పుడు మా సుమలాగా అనిపిస్తున్నావు" అన్నాడు. తేలికబడ్డట్టున్న ఆమె మొహంలోకి పరీక్షగా చూస్తూ. సుమ దృష్టి కవర్‌లో వున్న పదార్థాలపై పడింది. వాటిని చూస్తూనే "హాయ్! పానీ పూరీ" అని అరిచింది ఉత్సాహంగా.

"ఇవాళ గ్యారంటీగా నువ్వు అప్‌సెట్ అయి వుంటావని ఊహించి నీ మూడ్ సరిచేద్దామని తెచ్చాను. మామయ్య యింట్లో వుంటే యిలాంటివి దొంగతనంగా తినాలి. యివాళ ఎలాగూ వరంగల్ వెళ్ళారు కాబట్టి దర్జాగా బైట కూర్చుని తినే అవకాశం దొరికింది." కవర్‌లో నుంచి ఒక్కొక్కటే బైటికి తీస్తూ అన్నాడు.

"నాన్నకి ఈ పానీపూరీ నీళ్ళు మంచివి కాదేమో జబ్బు చేస్తుందేమో అని భయం" అంది సుమ నవ్వుతూ.

"నీకో మాట చెప్పనా!?" అన్నాడతను ఉన్నట్టుండి, సీరియస్‌గా.

"ఏమిటి?" తలయెత్తి చూసిందామె.

"ఈ సివిల్ సర్వీసెస్ పరీక్షలు మామయ్య ఆశ. నీ ఆశయం. నాకు వాటితో ఏ సంబంధం లేదు. మొన్నామధ్య నువ్వు చదువుకోకుండా, ఎక్కువగా ఫోన్‌లో టైం వేస్టు చేస్తున్నావని మందలించాను. కానీ నువ్వే పరిక్ష పోయిందని దిగులుపడి ఏడుస్తూ వుంటే నీ మీద అరుస్తానని ఎలా అనుకున్నావు?"

"ఓహ్! నువ్వు యిందాక నేను మాట్లాడిన దాన్ని గురించే ఆలోచిస్తున్నావా యింకా? సారీ ఆదీ! నేనేదో చిరాకులో అన్నాను" అంది నొచ్చుకుంటూ.

"ఇట్స్ ఓ.కే క్షమించేశాను" అన్నాడతను నవ్వుతూ. నవ్వుతూ వుంటే మరింత అందంగా కనిపించాడు ఆదిత్య. మనసులోని సాదాతనం, స్వచ్ఛత అతని మొహంలో స్పష్టంగా కనిపిస్తూ వుంది.

"ఆదీ! నువ్వెప్పుడూ ఒకేలా నెమ్మదిగా ఎలా వుండగలవు?" ఆశ్చర్యపడుతూ అడిగింది.

"ఏమో తెలియదు. నన్ను పుట్టించిన దేవుడిని అడగాలీ ప్రశ్న. ముందు పానీపూరీ తిను" అన్నాడు మళ్ళీ నవ్వేస్తూ.

"నీకు గుర్తుందా? చిన్నప్పుడు ఒకసారి నాకోసం పానీపూరీలు తెస్తూ సైకిలు మీద నుంచి కిందపడి దెబ్బలు తగిలించుకున్నావు?" గుర్తు చేసింది సుమ.

"అవును. ఆ రోజు సన్నగా వానపడుతూ వుంది" నువ్వు పానీపూరీ అప్పటికప్పుడే తినాలని మొండిపట్టు పట్టావు"

"నిజమే చాలా పిచ్చిగా ప్రవర్తించానని అనిపిస్తుంది. యిప్పుడు ఆలోచిస్తే"

"నీకు తెలుసా? ఆ వానలో పానీపూరీలు తడవకుండా తీసుకురావడం నాకో పెద్ద ఛాలెంజ్. వాటిని రెండు కవర్లలో చుట్టి బాక్సులో పెట్టుకుని జాగ్రత్తగా వచ్చాను. సైకిలు మీద నుంచి కిందపడ్డప్పుడు నాకు దెబ్బలు తగులుతాయని ఆలోచించలేదు. ఆ పూరీలు ఎక్కడ పగిలిపోతాయో, నువ్వెక్కడ మూతి ముడుచుకుని కూర్చుంటావో అనే నా ఆరాటమంతా" చెబుతున్నప్పుడు అతని గొంతులో ఆర్ద్రత.

ఇద్దరూ కాసేపు చిన్ననాటి కబుర్లలోకి వెళ్ళిపోయారు. సాయంకాలపు చల్లగాలి అల్లరిగా వాళ్ళని తాకుతూ ఆ ముచ్చట్లు వింటూ వుంది.

ఆకుపచ్చని లాన్‌లో మాలతీపూల పందిరి కింద సరదాగా నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుకుంటున్న యిద్దరినీ మేడమీద నుంచి చూసింది వసుంధర.

తేటబడ్డ మనసుతో హాయిగా కబుర్లు చెబుతూ వున్న సుమ, ఆమెకి తోడుగా వున్న గువ్వల జంటలు కనిపించారామె కళ్ళకి.

ఆదివారం ఉదయం స్టడీ రూంలో కూర్చుని రాసుకుంటున్నాడు ప్రసాదరావు.

"సాబ్! మిమ్మల్ని కలవనీకి ఎవరో వచ్చిను" రామయ్య వచ్చి చెప్పాడు.

"ఎవరు? పేరు అడగలేదా?" తలయెత్తకుండానే అడిగాడాయన.

"వచ్చినోళ్ళలో ఆడోళ్ళు కూడా ఉన్నరు సాబ్" తలకు కట్టిన తువ్వాలును తడుముకుంటూ మొహమాటంగా చెప్పాడు.

"పద వస్తున్నాను" చేతిలోని రైటింగ్ పాడ్‌ని పక్కకి పెట్టి డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు.

ఆయన వస్తుంటే ఓ యువకుడు, యాభైలకు పై బడ్డ ఒకావిడ లేచి నిలబడ్డారు.

"నా పేరు రాజేశ్వరి. సుమకి మేనత్తని" ప్రసాదరావుకి చేతులు జోడించిందామె.

"మీరు వచ్చిన పనేంటి?" గంభీరంగా అడిగాడు.

సుమ గుమ్మం వెనకాల నిలబడి ఆదుర్దాగా వాళ్ళ మాటలు వింటూ వుంది. మేనత్త, మోహిత్ యింటికి వచ్చినప్పట్నుంచి ఆమె గుండె వేగంగా కొట్టుకుంటూ వుంది.

"వీడు మా అబ్బాయి మోహిత్" అంటూ మోహిత్ వైపుకి చేయి చూపించింది రాజేశ్వరి. "సుమని మా అబ్బాయికి చేసుకుందామని అడగడానికి వచ్చాను" రాజేశ్వరి మాటలు పూర్తికాకుండా కాలేదు. ప్రసాదరావు కోపంగా లేచి నిలబడ్డాడు.

"ఏ ధైర్యంతో నా యింటికొచ్చి ఈ మాట మాట్లాడుతున్నారు? మీరేంటో మీరేం చేశారో మాకు తెలుసు. ఎప్పుడూ మర్చిపోలేదు. పెద్దవాళ్ళుగా పిల్లల ముందు గౌరవం పోగొట్టుకోకూడదనే సుమని మీ యింటికి పంపాను. అంత మాత్రానికే అతిగా ఆశకి పోయి సంబంధం కలుపుకోవాలని చూడకండి. ఇక దయచేయొచ్చు."

కోపాన్ని అదుపు చేసుకునే ప్రయత్నం చేస్తూ అన్నాడాయన.

"నేను చెప్పాను కదమ్మా! ఈయనకి బోడి పెద్దరికం యివ్వాల్సిన పనిలేదని? అయినా నా మాట వినకుండా యిక్కడికి తీసుకొచ్చావు" అంటూ ఒక్క ఉదుటున లేచాడు మోహిత్.

"ఆగు మోహిత్" రాజేశ్వరి అతని జబ్బపట్టుకుని ఆపే ప్రయత్నం చేస్తూ అంది.

"ఈయన సుమ ఏమవుతుందని పెత్తనం చలాయిస్తున్నాడు? నిజంగా కన్నపిల్లలే మాట వినకపోతే తల్లిదండ్రులు వాళ్ళ యిష్టాలకి ఒప్పుకుంటున్నారు. ఏమీలేని చోట ఈయనకి మాత్రం ఎందుకట. బోడిపెత్తనం?" పూనకం వచ్చినవాడిలా అరుస్తూ ఉన్నాడు.

మోహిత్ వాలకం చూసి సుమ గుండె దడదడలాడింది. వసుంధర, రామయ్య ఈ కేకలు విని పరిగెత్తుకుని వచ్చారు. ప్రసాదరావుగారితో యింతవరకు అలా మాట్లాడినవాళ్ళని వాళ్ళు చూడలేదు.

"ఇలాంటివాళ్ళతో నేను మాట్లాడను" ప్రసాదరావు కళ్ళు కోపంతో ఎర్రగా మారాయి. "ముందు మంచీ మర్యాద నేర్పండి మీవాడికి. తర్వాత పెళ్ళి చేద్దురు" అంటూ కోపంగా రాజేశ్వరి వైపు చూసి అక్కడ నుంచి కదిలాడు.

"మీకంటే ఎక్కువే తెలుసు మర్యాద. ఇంటికి వచ్చిన వాళ్ళతో ఎలా మాట్లాడాలో ముందు మీరు తెలుసుకోండి" వెనకనుంచి మోహిత్ అరుస్తూనే వున్నా ఆయన పట్టించుకోలేదు.

"మోహీ యింక ఆపు. ఆవేశం తగ్గించు" కొడుకు భుజాల్ని పట్టి కుదుపుతూ అదుపుచేసే ప్రయత్నం చేసింది రాజేశ్వరి.

ఊహించనట్టుగా జరిగిన తతంగం అంతా చూస్తూ కొయ్యబారినట్టు నిలబడిపోయింది వసుంధర.

రాజేశ్వరి, ఆమె ఒకరినొకరు కళ్ళతో చూసుకోవడమే తప్ప పలకరించుకునే ప్రయత్నాలు చేయలేదు.

"సాబ్.. అంత గుస్స జేయడం మొదటిసారి చూస్తున్న. సాబ్ అంత గనం చెప్పినంగ గూడ జూసుడేంది? నడునై బైటికి" రామయ్య మర్యాదగా చెప్పాడు రాజేశ్వరిని ఉద్దేశించి.

కోపంతో బుసలు కొడుతున్న కొడుకుని లాక్కుని, బైటికి నడిచింది రాజేశ్వరి. యిద్దరూ కాంపౌండ్ గేటుని సమీపిస్తూ వుండగా వెనకాలే పరిగెత్తుకుంటూ వచ్చింది సుమ.

"మోహిత్ ఏమైంది నీకు? ఎందుకలా ఓవర్ రియాక్ట్ అయ్యావు? ఇప్పుడు పరిస్థితి మరీ దారుణంగా అయిపోయింది. నాన్నతో అలా మాట్లాడడం కరెక్ట్ కాదు. నీ కోపాన్ని కంట్రోలు చేసుకోవాల్సింది" ఆదుర్దాపడుతూ అంది.

"మీ నాన్న మమ్మల్ని అవమానించింది మాత్రం బావుందా నీకు? అయినా నీ వెంటబడి నేనే తప్పు చేశాను.. పదమ్మా" అన్నాడు మోహిత్ కోపంగా తల్లి చేయిపట్టి లాగుతూ మోహిత్‌కి కోపం, చిరాకు ఎక్కువ అని తెలుసు. కానీ, తనని యింత నిర్లక్ష్యం చేయడం చూసి అవాక్కయ్యింది సుమ.

"ఇవాళ వీడికేమయ్యిందో నాకూ అర్థంకావడంలేదు. ఇక్కడ యింకొక డ్రామా జరగకముందే నువ్వు లోపలికి వెళ్ళమ్మా!" రాజేశ్వరి సుమకి చెప్పి కొడుకుతో బాటు బైటికి నడిచింది.

"**ఎండకి మండి** చచ్చిపోతున్నాను. కాస్త ఫ్రిజ్జులో నుంచి చల్లటి నీళ్ళు పట్టుకురావే రవళి" పైట కొంగుతో చెమటని తుడుచుకుంటూ సోఫాలో కూలబడింది రాజేశ్వరి.

"ఇంతకీ వెళ్ళిన పని ఏమైంది?" వాటర్ బాటిల్ తెచ్చి చేతికిస్తూ ఆసక్తిగా అడిగింది.

"తిన్నగా అయ్యేపనిని తగలేసుకొచ్చాడు నీ తమ్ముడు. అక్కడ ప్రసాదరావుగారి మీద ఒంటికాలితో లేచాడు. ఇంక ఈ పెళ్ళి అయినట్టే" అంది నిష్ఠూరంగా.

"ఈ పెళ్ళి ఖచ్చితంగా జరిగి తీరుతుంది. ఓ నాలుగురోజులపాటు సుమ ఫోన్ చేస్తే ఎవ్వరూ సరిగ్గా మాట్లాడొద్దు. నేను కోపంగా వున్నానని చెప్పండి. గింగిరాలు తిరుగుతూ వచ్చి పెళ్ళి చేసుకొమ్మని కాళ్ళావేళ్ళా పడుతుంది" సెల్‌ఫోన్‌తో వీడియో గేమ్ ఆడుతూ నిర్లక్ష్యంగా చెప్పాడు మోహిత్.

"ఒరేయ్! ఎంతైనా సుమ మేనమామ కూతురు. పెళ్ళయ్యాకన్నా తిక్కవేషాలు పడకుండా తిన్నగా వుండు.. అన్నట్టు నీ పాతసీతాకోక చిలుక ఇందాక వచ్చింది యింటికి. ఏదో సర్ది చెప్పి పంపించేశాను. అయినా యిలాంటి బృందానికి యింటి అడ్రస్ యివ్వద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు?" విసుక్కుంది రవళి.

రవళి అన్న మాటలు వింటూనే మోహిత్ ఎలర్ట్ అయ్యాడు. "నేనెందుకు యింటి అడ్రస్ యిస్తాను? ఎలా కనుక్కుందో వట్టి జిడ్డు. వదలడంలేదు. నేను చూసుకుంటాలే దాని సంగతి." అంటూ హడావుడిగా ఫోన్ డయల్ చేస్తూ బైటకి వెళ్ళాడు.

"ఏవండీ! మీతో ఒక విషయం మాట్లాడాలి" కాఫీ కప్పుతో ప్రసాదరావు దగ్గరికి వచ్చింది వసుంధర.

"ఒక విషయం అంటూ చాలానే మాట్లాడుతూ వుంటావుగా. ఏమిటో చెప్పు" నవ్వుతూ కాఫీ కప్పు అందుకున్నాడు.

"సుమకి పెళ్ళి సంబంధం చూస్తే బావుంటుందనుకుంటున్నాను" పక్కనే కుర్చీలో కూర్చుంటూ మెల్లగా చెప్పింది.

"పొద్దున్న మతిలేనివాళ్ళని యిద్దర్ని చూసేసరికి నీ మైండు కూడా పాడైపోయినట్టుంది సుమ ఐ.ఏ.యస్ ఆఫీసర్ అయ్యేదాకా పెళ్ళిమాట మర్చిపో" కోపగిస్తూ అన్నాడు.

"మీరు మరోలా అనుకోకండి. మన అమ్మాయి ఏ మాత్రం చనువు యివ్వకుండానే వాళ్ళు యింటిదాకా సంబంధం అడగడానికి వచ్చి వుంటారంటారా? అందుకే బాగా ఆలోచించాను. ఆదిత్యకి, సుమకి నిశ్చితార్థం చేస్తే బావుంటుంది అనిపిస్తుంది" వసుంధర మనసులోని మాట బైటపెట్టింది.

"ఆదిత్యతోనా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆదిత్యకీ సుమ అంటే యిష్టమే. మీరన్నట్టు పెళ్ళి సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్ అయ్యాకే జరిపిద్దాం. ఆదిత్య మంచివాడు. సుమకి అన్ని విధాలా సహకరిస్తాడు. పొద్దున్న వాళ్ళు యింటికి రావడం చూస్తే నాకు చాలా భయం వేసింది. అందుకే, ఆదిత్యతో సుమకి ఎంగేజ్‌మెంట్ జరిపించేస్తే దాని ఆలోచనలు కూడా ఒక గాటన కట్టేసినట్టు అవుతుంది. బైటవాళ్ళ వత్తిడి కూడా మనమీద వుండదు. ఏమంటారు?"

ప్రసాదరావు ఒక్కనిమిషం ఆలోచించాడు.

"నువ్వు చెప్పింది బాగానే వుంది. కానీ అమ్మాయి ఒప్పుకోకపోతే మాత్రం నేను ఎవ్వరిమాటా వినను సరేనా?" ఖచ్చితంగా చెప్పాడు.

"నేను సుమతో మాట్లాడి, మీకు చెబుతాను" గుండెలమీద భారం దించుకున్నట్టుగా నిట్టూర్చింది వసుంధర.

రాత్రి తొమ్మిదిగంటలప్పుడు ఒంటరిగా సిటవుట్ ముందున్న మెట్లమీద కూర్చుని వుంది సుమ.

"మోహిత్ సెల్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయడం లేదు."

మనసులో అనుకుంటున్నట్టు ఆందోళనతో పైకే అంది.

కాస్సేపటి క్రితం తల్లి మాటలు గుర్తొచ్చాయి. "నీకు ఆదిత్య సంబంధం యిష్టంలేక పోయినా, మోహిత్‌తో మాత్రం నీ పెళ్ళి జరగదు. మీ నాన్న, వాళ్ళు యింటికి వచ్చినప్పుడు ఎలా రియాక్ట్ అయ్యారో చూశావుగా. నాకు ముందు నుంచే యిష్టం లేదు మోహిత్ అంటే. ఇంక నీకు నీకు ఆదిత్యనా లేక మోహిత్ తప్ప యింకెవరైనానా? అన్న ఛాయిస్ మాత్రమే మిగిలివుంది" తిరుగులేదన్నట్టుగా వసుంధర. చెప్పిన మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

సుమ కంగారుపడుతూ, మోహిత్ నెంబర్‌కి మరోసారి డయల్ చేసింది. అవతలి నుంచి ఎటువంటి స్పందన రాకపోవటంతో వుస్సూరుమంటూ ఫోన్ కట్ చేసింది.

సుమకి ఏం చేయాలో పాలుపోలేదు. చీకట్లో కూర్చుని యధాలాపంగా చుట్టూ వున్న మొక్కల్ని, పొదల్ని చూస్తూ వుంది.

గార్డెన్ లాంప్‌ల నుంచి సన్నమి వెలుతురు పడ్డచోట మొక్కలు లేత ఆకుపచ్చ రంగులో మెరుస్తూ వుంటే, వాటి నీడని మోస్తున్న, అదే మొక్కకిందభాగంలోని ఆకులు అంధకారంలో చిక్కుకున్నట్టున్నాయి.

ఆగి..ఆగి.. వీస్తున్న గాలికి మొక్కలు కదులుతున్నప్పుడల్లా వాటి నీడలు కూడా పిల్లదెయ్యాల్లా వూగుతూ భయంకరంగా వున్నాయి.

ఇంతలో చీకటిని ఛేదిస్తున్నట్టు ఆదిత్య గదిలో లైటు వెలిగింది. సుమ మనసులో ఒక ఆలోచన మెరిసింది. ఒక నిర్ణయానికి వచ్చినదానిలా లేచి గబగబా అతని గదివైపుకి నడిచింది.

తలుపు తట్టడానికి చెయ్యి ఎత్తబోతుండగానే తలుపు తెరుచుకుంది.

"వాటే కో ఇన్సిడెన్స్" ఎదురుగా నిలబడి నవ్వుతూ అన్నాడు ఆదిత్య.

"ఆదీ! నేను నీతో మాట్లాడాలి" అంది సుమ కంగారుగా.

"నేనూ నీతో మాట్లాడాలి. బాల్కనీలో కూర్చుందాం రా" అంటూ గదికి అవతలి పక్క వున్న తలుపు తెరిచాడు.

"మనిద్దరికీ ఎంగేజ్‌మెంట్ అన్న వార్త తెలిసిందా నీకు?" అడిగింది అతని వెనకాలే నడుస్తూ.

"తెలిసింది. ఎంత సంతోషంగా అనిపించిందంటే మాటల్లో చెప్పలేను. నీతో చాలా మాట్లాడాలి. ఇవాళ అవకాశం దొరికింది" పిట్టగోడకి ఆనుకుని సుమ వైపు చూస్తూ అన్నాడు.

ఆనందంతో అతని కళ్ళు మెరుస్తూ వుండడం గమనించి, సుమ మొహంలో రంగులు మారాయి.

"నువ్వు ఎవర్నైనా ప్రేమించావా? అని అడిగావు గుర్తుందా? నిన్నే ప్రేమించాను సుమా. ఎప్పటినుంచో నాకే తెలియదు. బహుశా అది ప్రేమ అని కూడా తెలియనప్పటి వయసు నుంచి అనుకుంటాను.

నాకు. అమ్మా, నాన్నా, చెల్లి తమ్ముడు ఎవరూ లేరు. నాకు ఊహ తెలిసి నేను ఒంటరిని అని గ్రహించే వయసులో నువ్వు ఈ యింట్లో అడుగుపెట్టావు.

ఆదీ.. అంటూ నా తోడు కోసం నువ్వు వెతుక్కుంటుంటే చాలా సంతోషంగా అనిపించేది. నువ్వు ప్రతి విషయం నాతో షేర్ చేసుకుంటూవుంటే నీ సంతోషం, దుఃఖం నవ్వులు, అలకలు కోపం, బాధ అన్నీ నావే అనిపిస్తూ వుంటాయి.

నువ్వు చిన్నప్పుడు 'పెన్సిలు కావాలి బావా' అని అడిగితే దాన్ని నీకిస్తున్నప్పుడు చాలా గర్వంగా ఫీలయ్యేవాడిని.

'ఈ లెక్క రావడం లేదు చెప్పు' అని అంటే, నీ కోసం నేర్చుకుని చెప్పేవాడిని.

నీకేదైనా తెచ్చి యిస్తే నాకు సంతోషంగా వుండేది.

నీవల్లే నాకు నేను గొప్పగా అనిపించేవాడిని. నాకు గార్డెనింగ్ హాబీ ఎలా అలవాటైందో తెలుసా? 'సుమ' అంటే అర్థం 'పూవు' అని తెలిసినప్పటి నుంచి.

సాధారణంగా ఎవరైనా యిష్టమైన వాళ్ళకి ఒక పువ్వే. బొకేనో యిస్తారు. నేను నీకోసం ఏకంగా పూలతోటనే పెంచాను.

ఇవన్నీ నీకు ఎప్పటికప్పుడు చెప్పాలి. అని నా మనసు తహ తహలాడేది. కానీ నీ ఫోకస్ పూర్తిగా వేరు. నిన్ను డిస్టర్బ్ చేయకూడదనే ఇన్నాళ్ళూ ఆగాను.

ఇప్పుడు మన పెళ్ళి గురించి అనుకుంటున్నారు కాబట్టి నీకు చెబుతున్నాను.

నీ ఎగ్జామ్స్‌కి, ప్రిపరేషన్‌కి నేను అడ్డురాను. నా వైపు నుంచి నీకు ఎలాంటి డిస్టబెన్స్ వుండదు. ఇంకోసారి ఇలాంటి మాటలు కూడా మాట్లాడను.

కానీ నువ్వు ఒక్క ప్రశ్నకి మాత్రం సమాధానం చెప్పాలి. నేనంటే నీకు యిష్టమేనా?"

చివర్లో అతనడిగిన ప్రశ్నకి సుమ గుండెల్లో రాయిపడ్డట్టయ్యింది.

"దేవుడా! ఉన్న ఒక్క ఆశకూడా పోయింది. నేనంటే యిష్టమని ఎంత ఆర్తిగా చెప్పాడు. వెంటనే, కుండబద్దలు కొట్టినట్టు ఎలా మనసు విరిచేయడం?" సుమకి పాలుపోలేదు.

"ఆదీ! నువ్వంటే నాకు యిష్టమే. కానీ అది.." అంటూ చెప్పబోతుండగానే.

"సుమా! ఎక్కడున్నావు? సీమ ఫోన్ చేసింది?" అంటూ వసుంధర గొంతు వినిపించింది.

ఆ మాట వింటూనే ప్రాణం లేచివచ్చినట్టయ్యింది సుమకి.

"యిప్పుడే వస్తాను..ఆదీ!" అంటూ తప్పించుకుని వచ్చేసింది.

"అరగంటలో మీ వీధి చివర వున్న 'బరిస్తా' కాఫీ షాప్‌కి రా!" మోహిత్ నుంచి మూడురోజుల తర్వాత వచ్చిన మెసేజ్‌ని చూసి సుమకి కోపం, సంతోషం రెండూ ఒకేసారి కలిగాయి సీమని కలవడానికి వెళుతున్నానని తల్లికి చెప్పి బైటపడింది.

కాఫీ షాప్‌లో అడుగుపెట్టేటప్పటికే ఎంట్రన్స్ పక్కనే వున్న టేబుల్ దగ్గర ఎదురుచూస్తూ కనిపించాడు మోహిత్. అప్పటికే, అతను ఆర్డర్ చేసిన కాఫీ కూడా టేబుల్ మీద సిద్ధంగా వుంది.

"ఇన్నిరోజులు మొహం చాటేశావు. ఇప్పుడు సడెన్‌గా గుర్తొచ్చానా?" అతన్ని చూస్తూనే కోపం ఎగదన్నుకుని వచ్చింది సుమకి.

"అయితే ఏంటి? యిప్పుడు వెళ్ళిపొమ్మంటావా?" విరాగ్గా అన్నాడు. సుమ మాట్లాడకుండా అతని ఎదురుగా కూర్చుంది.

"చూడు. నువ్వెంత టెన్షన్‌లో వున్నావో.. నేను అంతే వర్రీ అవుతున్నాను. నాకూ కొంచెం బ్రేక్ కావాలనిపించింది అర్థం చేసుకో" మోహిత్ అనడంతో సుమ మెత్తబడింది.

"ఆదిత్యతో ఎంగేజ్‌మెంట్ చెయ్యాలనుకుంటున్నారు మా యింట్లో. ఆ న్యూస్ వచ్చినప్పటినుంచి అతన్ని తప్పించుకుని తిరగలేక అవస్థపడుతున్నాను. రెండు రోజుల నుంచి నాన్నగారి స్టడీ రూంలోకి కూడా వెళ్ళడం లేదు.

నీకు విషయం చెబుదామని ట్రై చేస్తే నువ్వు ఫోన్ తీయడం లేదు. నీకోసం యింటికి వెళితే కూడా దొరకలేదు. ఏం చేయాలో తోచక నా బుర్ర వేడెక్కిపోతూ వుంది. నీతో ఎప్పుడెప్పుడు ఈ విషయం చర్చిద్దామా అని ఎదురుచూస్తూ వున్నాను'' అంతా వివరంగా చెప్పింది.

''నువ్వు మీ యింట్లో వాళ్ళని నొప్పించకుండా ఈ సమస్యకి పరిష్కారం వెతకాలని చూస్తే అది వీలుపడదు. ఎవరి కోసం నీ ప్రేమను రిస్కులో పెడుతున్నావో, నేనెంత చెప్పినా నీకు అర్థం కానప్పుడు ఈ సమస్యకి నేను మాత్రం ఏం పరిష్కారం చూపిస్తాను? అయినా నేను నిన్ను యిక్కడికి పిలిచింది. యిది ఇవ్వడానికి'' అంటూ ఒక డైరీని సుమ చేతిలో వుంచాడు.

''ఏమిటిది?'' అయోమయంగా చూస్తూ అడిగింది సుమ.

''ఇది చనిపోయిన నీ కన్నతండ్రి. చివరి రోజుల్లో రాసిన డైరీ. ఒకసారి చదువు. ఇది చదివాక కూడా మీ అమ్మ మాటే నీకు ముఖ్యం అనుకుంటే, నాకు ఎప్పుడూ ఫోన్ చేయకు. ఒకవేళ నీ నిర్ణయం మార్చుకుంటే నువ్వు ఎప్పుడు ఫోన్ చేసినా నిన్ను మా యింటికి తీసుకెళ్ళడానికి నేను రెడీగా వుంటాను'' అంటూ లేచాడు.

సుమ చేతిలో ఉన్న డైరీని, వెళ్ళిపోతున్న మోహిత్‌ని చూసి భారంగా నిట్టూర్చింది.

''సుమా! లత వర్క్‌శారీ మీద బ్లౌజ్ కుట్టి తెచ్చింది. ఒకసారి ట్రై చేసి చూడు'' వసుంధర బట్టల కవరు చేతిలో పట్టుకుని సుమ గదిలోకి వచ్చింది.

గదిలో, మంచం మీద సూట్‌కేస్ పెట్టి హడావుడిగా బట్టలు సర్దుకుంటూ వున్న కూతుర్ని చూసి, వసుంధర కనుబొమలు మండిపడ్డాయి.''ఇప్పుడు బట్టలు సర్దాల్సిన పనేంటి? ఎక్కడికి ప్రయాణం?'' అడిగింది కంగారుపడుతూ.

''భయపడకు. నేనేం చెప్పకుండా పారిపోవడమో, ఉత్తరం రాసిపెట్టి దొంగలా మొహం చాటేయడమో చేయడం లేదు. కాస్సేపట్లో మోహిత్ వస్తున్నాడు. నేను అతనితో వెళుతున్నాను'' తల ఎత్తకుండానే, తన పని తాను చేసుకుపోతూ, నిర్లక్ష్యంగా అంది.

''సుమా!'' గట్టిగా అరిచింది వసుంధర. ''నేను ఎంత చెప్పినా తలకెక్కడం లేదా? నా మీద నీకు నమ్మకం లేకపోయినా, మీ నాన్నగారి మీద నమ్మకం వుంది కదా!

ఆయనే మోహిత్‌ని కాదన్నారంటే కారణం ఏమైవుంటుందో ఒక్క నిముషం ఆలోచించు.

ఆదిత్య గురించి ఆలోచించు.

నువ్వు ఒప్పుకుంటేనే ఈ నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేశాము. ఇప్పుడు హఠాత్తుగా యిలా చేయడానికి నీ మనసెలా ఒప్పుతుంది? ఆదిత్య ఎంత బాధపడతాడో ఆలోచించావా?

మేమంతా నలుగుర్లో నవ్వులపాలు అవుతామన్న ఇంగితం నీకు లేదా?'' అంటూ ఆవేశంగా మంచం మీద సూట్‌కేస్‌ని లాగి కిందపడేసింది.

''ఈ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ యింక ఆపు. ఇన్నాళ్ళూ నిన్నూ, నాన్నని నా ప్రపంచం అనుకున్నాను.

మీరు మోహిత్‌తో ఎందుకు పెళ్ళి వద్దంటున్నారో నాకు ఈ రోజే తెలిసింది.

నేను ఆ యింటికి వెళితే, మీరు సమాధి చేసిన నిజాలన్నీ నాకు తెలుస్తాయని మీ భయం. నువ్వు చెప్పినట్టు నా కన్నతండ్రి జబ్బు చేసి చనిపోలేదు. ఆత్మహత్య చేసుకున్నారు. అదీ నీ వల్ల.

నీ గురించి, ప్రసాదరావు గురించి నిజాలు తెలుసుకుని మా నాన్న బాధ తట్టుకోలేకపోయాడూ. ఆత్మహత్య చేసుకున్నాడు.

నువ్వు నీ గురించి నీ జీవితం గురించే ఆలోచించుకున్నావు. నా లైఫ్‌ని కన్ఫ్యూజన్‌లోకి నెట్టి పారేశావు.

ఇక నా జీవితంలో నిర్ణయాలు తీసుకునే అధికారం నీకు లేదు''

వసుంధర సుమ మాటలు వింటూనే కొయ్యబారిపోయింది.

''మీ అమ్మతో అలాగేనా మాట్లాడేది? అసలేం జరిగిందో నీకు తెలియదు'' గుమ్మంలోనుంచి ప్రసాదరావు గొంతు ఖంగుమంది. వసుంధర వెనక్కి తిరిగి చూసింది.

ప్రసాదరావు పక్కనే ఆదిత్య కూడా నిలబడి వున్నాడు.

నమ్మశక్యం కానిదేదో చూస్తున్నట్టుగా వుందతని మొహం.

సుమ ఎవరి మాటలూ వినిపించుకోలేదు. కిందపడ్డ సూట్‌కేసుని తీసుకుని ముందుకు వచ్చింది.

''నేను చెప్పేది విను'' ప్రసాదరావు సుమని ఆపాడు. జీవితకాలం పాటు పోగు చేసిన నిధిని పోగొట్టుకున్నవాడిలా వుంది ఆయన మొహం.

''మీరు ఆపకండి. మన ప్రేమ మీద, పెంపకం మీద దానికి గౌరవం లేనప్పుడు మనం సంజాయిషీలు యిచ్చుకుని ఉపయోగం లేదు. జీవితాంతం మీరు నాకు అండగా నిలబడ్డారు. నాకళ్ళముందు అది మీ పరువును తీసేస్తుంటే నేను చూడలేను. దాన్ని వెళ్ళనివ్వండి'' ప్రసాదరావుని వెనక్కి లాగింది వసుంధర.

సుమ సూట్‌కేస్ తీసుకుని మేడదిగి రావడం, అక్కడ మోహిత్ ఆమె కోసం ఎదురుచూస్తూ వుండడం. అతని బైక్ మీద ఎక్కి వెళ్ళిపోవడం అంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఏం జరుగుతుందో కూడా అర్థం కానట్టు స్థంభించిపోయారు ప్రసాదరావు, వసుంధర, ఆదిత్యలు.

ఎవరి బాధ ఎక్కువో, ఎవరినెవరు ఓదార్చాలో తెలియని పరిస్థితి.

వసుంధరకి వున్నట్టుండి ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. రెండు నిముషాల్లో కళ్ళు తేలేసి, దబ్బున కిందపడిపోయింది. ముందుగా ఆదిత్య షాక్ నుంచి తేరుకుని, ముందుకు దూకి వసుంధరని పట్టుకున్నాడు.

కాస్సేపటికే అంబులెన్స్ వచ్చి ఆమెని హాస్పిటల్‌కి మోసుకుపోయింది.

రిజిస్ట్రరాఫీసులో పెళ్ళి చేసుకుని నేరుగా యింటికి వచ్చారు సుమ, మోహిత్‌లు.

వాళ్ళిద్దరినీ గుమ్మం ముందు నిలబెట్టి ఎర్రనీళ్ళు దిష్టితీసింది రవళి.

మోహిత్ సుమ చేతిని పట్టుకున్నాడు. ''ఇవాళ్టి నుంచి నువ్వు ప్రసాదరావు కూతుర్నని మర్చిపోవాలి. మా యింట్లో, మాలో ఒకరుగా కలిసిపోవాలి'' ఆమె మొహంలోకి చూస్తూ చెప్పాడు మోహిత్.

''అవునమ్మాయ్ మా యింట్లో ఒక్క ఏ.సి మాత్రమే వుంది. కార్లు, నౌకర్లు, చౌకర్లు లేరు. అన్నీ సర్దుకోవాలి.

అన్నట్టు ఇంకో ముఖ్యమైన విషయం. ఈ రోజు నుంచి నేను నీ మేనత్తనే కాదు. అత్తగారిని కూడా. ఆ విషయం గుర్తుంచుకో'' హాస్యంగా అంది రాజేశ్వరి.

ఇద్దరూ లోపలికి అడుగుపెట్టబోతుండగా 'ఆగండి' అరిచింది రవళి. ''పెళ్ళి ఎలాగూ శాస్త్రోక్తంగా చేసుకోలేదు. కనీసం, అచ్చట్లు, ముచ్చట్లు అన్నా జరపనివ్వండి. ముందు యిద్దరూ పేర్లు చెప్పి లోపలికి రండి''

కాస్సేపు రవళి యిద్దర్నీ ఆటపట్టించి మోహిత్ దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసింది.

ఆ తర్వాత సుమ బియ్యం గ్లాసుని కాలితో తన్ని లోపలికి అడుగుపెట్టాలనీ ఏవేవో తతంగాలు, హాస్యాలూ సాగిస్తూ అరగంటపాటు గుమ్మంలోనే నిలబెట్టారు.

వాళ్ళు చేస్తున్న వేడుకలకి సుమకి సంతోషం, చిరాకులాంటివేమీ కలగలేదు. మైండంతా బ్లాంక్‌గా అయిపోయినట్టుంది.

రిమోట్‌తో ఆపరేట్ చేస్తున్న బొమ్మలాగా యాంత్రికంగా వాళ్ళు చెప్పినట్టు చేస్తూ వుంది.

హాస్పిటల్ కారిడార్‌లో గోడకి చేరగిలబడి నిలుచున్నాడు ఆదిత్య. సర్వం కోల్పోయినవాడిలా దైన్యంగా వుంది అతని మొహం దుఃఖాన్ని బైటకి కనబడనీయకుండా ధైర్యం అంచుల్లో నిలబడ్డట్టు వున్నాయతని కళ్ళు.

"ఆదిత్యా!" ప్రసాదరావు భుజం మీద చేయివేసి పిలిచాడు.

"చెప్పండి మామయ్యా" వెంటనే అటెన్షన్‌లోకి వచ్చాడతను.

"రేపు ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ అయినట్టు, ముఖ్యమైన వాళ్ళకి ఫోన్ చేసి చెప్పు. అలాగే, ఫంక్షన్ హాల్ దగ్గరకి వచ్చినవాళ్ళకి ఇన్ఫర్మేషన్ యివ్వడానికి మనుషుల్ని ఏర్పాటు చేయడం కానీ, నోటీస్ బోర్డులాంటిది కానీ పెట్టించే పని చూడు" అంటూ యధాలాపంగా ఆదిత్య మొహంలోకి చూశాడు.

అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినవాడిలా "వద్దులే నాకా నెంబర్లు యివ్వు. నేనే ఫోన్ చేసి చెప్తాను. క్రైసిస్ టైంలో పనిచేసిన సివిల్ సర్వెంట్‌లానే ఆలోచిస్తుంటానెప్పుడూ. నీ గురించి ఆలోచించలేదు. నీ ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ అయ్యిందని నువ్వే ఎలా చెప్పుకోగలవు? తప్పు చేసింది నా బిడ్డ కాబట్టి నాకు తప్పదు"

బరువుగా తలాడిస్తూ అన్నాడాయన.

ఇంతలో, వసుంధరని పరీక్ష చేసిన డాక్టరు బైటికి వచ్చాడు. ఆయనతో మాట్లాడడానికి ఇద్దరూ రూంలోకి వెళ్ళారు.

"స్ట్రెస్ ఎక్కువగా తీసుకోవడంవల్ల నెర్వస్ బ్రేక్ డౌన్ అయ్యింది. నెమ్మదిగా కోలుకుంటారు. ఆవిడ ఎక్కువ వత్తిడి తీసుకోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. అందులోనూ ఈవిడ హార్ట్ పేషెంట్ కూడా కాబట్టి ఎక్కువ శ్రద్ధ అవసరం."

ఆ మాట వింటూనే, ప్రసాదరావు, ఆదిత్య డాక్టరు వైపు ఆశ్చర్యంగా చూశారు.

"స్ట్రేంజ్ మీకు ఆవిడ హార్ట్‌పేషెంట్ అన్న సంగతి తెలియదని అర్ధమవుతూ వుంది. వసుంధర మేడమ్ ఆరునెలల క్రిందట చెకప్‌కి వచ్చినప్పుడు నేనే టెస్ట్‌లు చేయించాను.

ఆవిడ హార్ట్‌లో వాల్వ్స్ బ్లాక్ అయివున్నాయి. మూడు నెలలు మెడిసన్స్ వాడాక సర్జరీ ప్లాన్ చేయాలని రికమెండ్ చేశాను. బట్... ఆవిడ మళ్ళీ రాలేదు.

ఎనీహౌ.. ఆవిడ్ని చాలా జాగ్రత్తగా చూసుకోండి. మళ్ళీ ఫాలో అప్ యిస్తాను" అంటూ వసుంధర రిపోర్ట్స్ తాలూకు ఫైల్‌ని అందించాడు.

"ఇంత పెద్ద విషయం వసుంధర నా దగ్గర ఎందుకు దాచింది?" ప్రసాదరావు కళ్ళలో సన్నటి నీటిపొర కమ్మేసింది తుఫాను తాకిడి నుంచి కోలుకోకముందే ఉప్పెన వచ్చి ముంచేసినట్టుగా వుంది ఆయన పరిస్థితి.

"అమ్మ సంగతి నాకు బాగా తెలుసు. సుమకి పరీక్షలనీ, ఈ విషయం తెలిస్తే డిస్టర్బ్ అవుతుందని దాచిపెట్టి వుంటుంది. కానీ ప్రేమ విలువ తెలియని వాళ్ళని ప్రాణంగా చూసుకోవడం కూడా తప్పే. అమ్మ అలా చేసివుండకూడదు" కోపంగా అన్నాడు ఆదిత్య. అతని కళ్ళలో మొదటిసారిగా సుమ మీద ద్వేషంలాంటిది కనిపించింది.

"సుమా డార్లింగ్ ఏంటలా డీలా పడిపోయి వున్నావు?" రెండు భుజాల మీద చేతులు వేస్తూ మంచం మీద కూర్చున్నాడు మోహిత్.

"నేను తప్పు చేశానా? అని ఆలోచిస్తున్నాను" అంది విచారంగా. ఆమె మనిషి అక్కడ వున్నా మనసు మాత్రం అక్కడ లేనట్టుగా వుంది.

"అంటే ఈ పెళ్ళి చేసుకున్నందుకు బాధపడుతున్నావా?" కోపంగా అడిగాడతను.

"అదికాదు. నేను తొందరపడి అమ్మని చాలా మాటలు అన్నాను. కొన్ని విషయాలు మనసులో వున్నప్పుడు మంటలా రగిలిస్తూ వుంటాయి. అది కాస్తా ఉక్రోషంగా బైటపడ్డ తర్వాత అంతా మారిపోతుంది. మన మనసులో మంట చల్లారిపోయినట్టు వుంటుంది. కానీ, దాని స్థానంలో ఎదుటివాళ్ళని బాధపెట్టామన్న దిగులు తొలిచేస్తూ వుంటుంది.

చిన్నప్పుడు తాడుతో టగ్ ఆఫ్ వార్ ఆట ఆడేవాళ్ళం. అందులో అవతలి జట్టు వాళ్ళు ఓడిపోయి చేతులెత్తేస్తే మనం గెలిచినా కూడా కిందపడిపోతాం.

నేను అనుకున్నది సాధించాను. కానీ, దెబ్బకూడా నాకే తగిలిన ఫీలింగ్. ఎందుకో తెలియడంలేదు" బాధగా అంది.

"అయితే యిప్పుడేం చేయమంటావు? నన్ను? అందర్నీ ఎదిరించి పెళ్ళి చేసుకుంటే యిలానే వుంటుంది. పోయేకొద్దీ అదే అలవాటైపోతుంది" అన్నాడు మంచం మీద వెనక్కి వాలుతూ.

"నేను అమ్మతో పరుషంగా మాట్లాడాను. అంత గొడవ జరిగినప్పుడు కనీసం వెంటనే, నీతో వచ్చేయకుండా వుండాల్సింది.

అనడమైతే అన్నాను కానీ, నాన్నగారి మొహంలోకి సూటిగా చూడలేకపోయాను.

ఆదిత్య అతనికి ఈ విషయాలతో అస్సలు సంబంధం లేదు. అలాంటిది అతని దగ్గర నిజం దాచి మోసం చేశాను" కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అంది.

**"సుమా! నీ కంతగా** దిగులుగా వుంటే మీ అమ్మని యిక్కడికి వచ్చి వెళ్ళమను. నాకేం ప్రాబ్లం లేదు. కానీ నువ్వు మాత్రం ఆ యింటికి వెళ్ళడానికి వీల్లేదు. నువ్వు చిన్నగా యింటిపనుల్లో యింట్రస్ట్ పెంచుకో. నెమ్మదిగా మనసు కుదుటపడుతుంది. ఇక, అనవసరమైన ఆలోచనలు కట్టిపెట్టి లైట్ ఆపేయ్" అంటూ చేయిపట్టి మీదకి లాక్కున్నాడు.

సుమకి ఒక నిముషం తను ఎటువంటి పరిస్థితిలో వుందో అర్థంకాలేదు.

"పెళ్ళి తర్వాత మోహిత్‌తో జీవితం ఇలాగా వూహించుకుంది?" మనసు ఆక్రోశించింది.

ఆ తర్వాత ఆమెకు అట్టే ఆలోచించడానికి అవకాశం దొరకలేదు.

"అమ్మా!" తలుపు తట్టి లోపలికి వచ్చాడు ఆదిత్య.

"త్వరగా లేచి ఈ జ్యూస్ తాగేస్తే నేను బి.పి చెక్ చేస్తాను" అంటూ వసుంధర మంచం దగ్గరికి వచ్చాడు.

వసుంధర నెమ్మదిగా లేచి, దిండుకి చేరగిలబడి కూర్చుంది.

"డాక్టర్లు ఏవేవో చెబుతూ వుంటారు. నువ్వు అన్నీ తు.చ తప్పకుండా పాటించాలంటావు" అంది నీరసంగా నవ్వుతూ.

"నాకవన్నీ తెలియవు. నువ్వు త్వరగా కోలుకుని, లేచి తిరిగేదాకా నాకు మనశ్శాంతిగా వుండదు" అన్నాడు జ్యూస్ గ్లాసు అందిస్తూ.

"ఒక్క నిముషం.. యిలా కూర్చోగలవా?"

వసుంధర అడుగుతూనే, ఆదిత్య మంచం పక్కకి స్టూలు లాక్కుని కూర్చున్నాడు.

"అయామ్ సారీ ఆదీ! నేను చాలా పెద్ద పొరపాటు చేశాను సుమ చేసిన పనికి నాకే సిగ్గుగా వుంది"

"అమ్మా.. ప్లీజ్" వారిస్తున్నట్టుగా అన్నాడు.

"నన్ను చెప్పనీ. నీ విషయంలో నేను నేరస్తురాలిని. మోహిత్ గురించి నాకు ముందే తెలుసు. అయినా నీకు చెప్పలేదు. నేను తప్పు చేశాను. నా కూతురి భవిష్యత్తు బావుండాలన్న స్వార్థంతో నీ దగ్గర నిజం దాచాను. నువ్వు నన్ను కన్నతల్లిలా చూశావు కానీ నేను నా కన్నబిడ్డకు నీకు తేడా చూపించాను. నన్ను క్షమిస్తావు కదూ" కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"అనవసరంగా ఆలోచించి నీ ఆరోగ్యం పాడుచేసుకోకమ్మా! నేను నువ్వనుకున్నట్టుగా అనుకోవడం లేదు. ప్లీజ్ రిలాక్స్" ఆవిడ చేతిని తాకుతూ అన్నాడు.

"అయితే నేను చేసిన తప్పుని దిద్దుకునే ప్రయత్నం చేస్తాను. నీకు వెంటనే ఒక సంబంధం చూస్తాను. పెళ్ళి చేసుకుంటావా?" ఆశగా అడిగింది.

ఆదిత్య మాట్లాడలేదు.

"ఇంకా సుమను గురించే ఆలోచిస్తున్నావా?"

"సుమ వెళ్ళిపోయిందన్న విషయం మనసు యింకా యాక్సెప్ట్ చేయడం లేదమ్మా! ఆఫీసు నుంచి యింటికి వస్తుంటే, నాకు తెలియకుండానే ఇవాళ సుమ నా చేత పరుగులు పెట్టించడానికి ఏ ప్రోగ్రాంతో రెడిగా వుందో" అని ఆలోచిస్తున్నాను.

ఇన్నాళ్ళూ నేనే ప్రపంచం అన్నట్టుగా నా చుట్టూ తిరిగింది. వెళ్ళిపోయేటప్పుడు ఒక్కమాట కూడా నాతో మాట్లాడలేదు.

'సారీ' అని చెప్పక్కర్లేదు. కనీసం ఒక్కసారి నా వైపు తిరిగి చూసినా నేనెంత బాధపడేవాడిని కాను.

'తన యిబ్బందులూ - యిష్టాలూ వేరు' అని సర్దిచెప్పుకునే ప్రయత్నం చేసేవాడిని.

కానీ కాళ్ళకి అంటిన యిసకని విదిలించినట్టుగా కనీసం ఒక మనిషిలా కూడా గుర్తించకుండా వెళ్ళిపోయింది." దుఃఖాన్ని అదుపుచేసుకుంటూ అన్నాడు.

"దానికి అదృష్టం లేదు. నువ్వెందుకు బాధపడడం? నీకోసం నేను ఒక మంచి అమ్మాయిని చూస్తాను" సీలింగ్ వైపుకి చూస్తూ తనలో తాను మాట్లాడుతున్నట్టు అంది.

"ముందు నువ్వు కోలుకో అమ్మా! తర్వాత ఆలోచిద్దాం"

"నువ్వు 'సరే' అంటే, అదే నాకు వెయ్యి ఏనుగుల బలం. త్వరగా కోలుకుంటాను. నాకు నీ జవాబు కావాలి" అభ్యర్థించినట్టే అడిగింది.

"అలాగే!" అన్నాడు ఆదిత్య ఆమె చేతిలో చేయి వేస్తూ.

"ఇంకొక్క విషయం అడగాలి నిన్ను" సందేహిస్తూ అంది.

"ఆ రోజు సుమ మాట్లాడిన మాటలన్నీ నువ్వూ విన్నావు. నేనూ, మీ మామయ్య స్వార్థపరులమని నువ్వు నమ్ముతున్నావా? ఒక మనిషిని మానసికంగా చంపేసి, ఆత్మహత్యకి ప్రేరేపించేంత దుర్మార్గం మాలో వుందా?" వసుంధర కళ్ళు తడి అయ్యాయి.

"అమ్మా! ప్లీజ్! మళ్ళీ ఎప్పుడూ యిలాంటి మాటలు మాట్లాడొద్దు. అసలు సుమ అంత నీచంగా ఎలా ఆలోచించగలిగిందో నాకు యిప్పటికీ అర్థం కావడంలేదు. ఆ ఒక్క క్షణంలో యిన్నేళ్ళ అభిమానాన్నంతా పోగొట్టుకుంది. నేను మిమ్మల్ని చూస్తూ మీ చేతుల్లో యిక్కడే పెరిగాను. నేను ఆ మాటలన్నీ ఎలా నమ్ముతాననుకున్నావు?" ఆవేదనగా అన్నాడు.

"థాంక్యూ ఆదీ" ఆదిత్య తలమీద చేయివేస్తూ తృప్తిగా నిట్టూర్చింది వసుంధర.

"పొద్దున్నే లేచావా? ఇంకా నేను తలుపు తట్టి లేపాల్సి వస్తుందేమో అనుకున్నాను." స్నానం చేసి తయారై గదిలో నుంచి వస్తున్న సుమతో అంది రాజేశ్వరి.

"త్వరగానే మెలుకువ వచ్చిందత్తయ్యా"

"ఇవాళ పనిమనిషి రాలేదు కాస్త నువ్వే అందరికీ టిఫిన్ చేసి పెట్టు" ఆర్డరేసింది.

"నేనా?" ఆశ్చర్యంగా అడిగింది.

"మరీ బొత్తిగా వంటరాదా? కనీసం ఉప్మా అన్నా కలియబెట్టలేవా?"

"నాన్న నన్ను ఎప్పుడూ వంటింట్లోకి వెళ్ళనిచ్చేవారు కాదు. వంటలు - వార్పులు చేయడానికి వేరేవాళ్ళు వున్నారు. నువ్వు సాధించాల్సింది చాలా వుంది. అంటుండేవాళ్ళు" అంది సుమ పాత విషయాలు గుర్తుతెచ్చుకుంటూ.

"అలాంటివన్నీ అక్కడ చెల్లాయి కానీ, యిక్కడ కుదరదు. ఉప్మా చేయడం కూడా రాకపోతే ఫ్రిజ్జులో కోడిగుడ్లు వున్నాయి. వాటితో ఆమ్లెట్ వేసి, బ్రెడ్డు వేడి చేసి పట్టుకురా! ఈ కాలం పిల్లలందరూ అదేదో యూ ట్యూబ్ అంటారుగా. అందులో చూసి అన్నీ చేసేస్తున్నారు. నువ్వూ అలాగే చెయ్యి" సలహా పారేసింది.

"అలాగే అత్తయ్యా" సుమ తలాడించింది. కొద్దిరోజుల క్రితందాకా ప్రేమగా వున్న మేనత్త హఠాత్తుగ అలా ఎందుకు మారిపోయిందో ఆమెకి అర్థంకాలేదు.

"కొత్త పెళ్ళికూతురని అస్సలు ఆలోచించకు అమ్మా! అలవాటైన పిల్లే. అస్సలు మొహమాటపడకుండా అన్ని పనులు చేయించుకో" ఎప్పుడు వచ్చాడో వెనకాల నుంచి మోహిత్ ఎగతాళిగా అన్నాడు.

"నిన్నూ" రాజేశ్వరి చూడకుండా కొట్టబోయింది సుమ.

"ఆ...!....ఆ కోడలు చేయకపోతే యింకెవరు చేస్తారు? ఇన్నాళ్ళూ అంటే శని, ఆదివారాలు చుట్టపు చూపుగా యింటికి వచ్చేది. అప్పుడు రవళి కూడా వస్తుంది కాబట్టి వంట చేసి పెట్టేది. నా వల్ల ఏమి అవుతుంది? పని వచ్చినా, రాకపోయినా నేర్చుకుని చేసి తీరాల్సిందే" చెప్పి టి.వి పెట్టుకుని సోఫాలో కూర్చుండిపోయింది రాజేశ్వరి.

"కంగారుపడకు. మీ యింటికి వెళ్ళినప్పుడు మి నాన్న బాగా అవమానించారుగా. దాని తాలూకు రియాక్షన్ యిది. అమ్మ కోపం తగ్గేదాకా నాలుగురోజులు ఓపిక పట్టు" ధైర్యం చెప్పాడు మోహిత్.

సుమ వంటగదిలోకి వెళ్ళింది.

కోడిగుడ్లని పగలగొట్టడం చాతకాలేదు. డ్రస్ మీద అంతా మరకలు పడిపోయాయి.

రెండు ఆమ్లెట్లు చేస్తే అందులో ఒకటి బాగా మాడిపోయింది. గంటసేపు కష్టపడి చేసి ప్లేట్లలో సర్ది తీసుకుని వెళ్ళింది.

ఉప్పు, కారం వీడియోలో చూపించిన కొలత ప్రకారమే వేశాను. మేనత్త వున్న మూడ్‌కి ఖచ్చితంగా వంక పెట్టడమో, తిట్టడమో చేస్తుంది అనుకుంటూనే వెళ్ళింది.

"ఇది బ్రెడ్ టోస్టా? ఆమ్లెట్ విచిత్రమైన వాసన వస్తుంది ఎగ్స్‌తోనే చేశావా?" మోహిత్ ఆటపట్టించాడు.

"నోరు ముసుకుని తినరా. రోజూ చేస్తూ వుంటే, నాలుగు రోజులకి వంట చేయడం ఆటోమేటిగ్గా వచ్చేస్తుంది" అంటూ రాజేశ్వరి రుచి తెలియనట్టుగా, మిషనులో వేసి గింజల్ని ఆడించినట్టు ఒక్కొక్క ముక్కే నమిలి మింగేసింది.

సుమకి కొంచెం కూడా సహించలేదు. పుట్టింట్లో తినడానికి ఎన్ని నకరాలు పోయేదో గుర్తు తెచ్చుకుంటూ, బలవంతంగా నోట్లో పెట్టుకుంది.

"హలో ఆదీ!" అవతలి పక్క ఫోన్ తీసినట్టు అనిపించగానే పలకరించింది సుమ.

"అమ్మకీ, నాన్నకీ ఫోన్ చేయడానికి ధైర్యం చాల్లేదు. అందుకే యిందాకట్నుంచీ నీకు ఫోన్ చేస్తున్నాను. అమ్మా, నాన్నా ఎలా వున్నారు?" ఆత్రంగా అడిగింది.

"చూడు సుమా! ఇలా మాటిమాటికీ నాకు ఫోన్ చేయొద్దని చెప్పడానికి మాత్రమే నీ ఫోన్ లిఫ్ట్ చేశాను. అసలు నీ గురించి నువ్వేమనుకుంటున్నావు? అందరి మనసుల మీద దెబ్బకొట్టిపోయావు. కనీసం కోలుకోవడానికన్నా టైం యివ్వు. దయచేసి యింకెప్పుడూ యింట్లో ఎవ్వరికీ ఫోన్ చెయ్యకు" అరిచి ఫోన్ కట్ చేశాడు.

ఆదిత్య మాటలకి అవమానంతో సగం చచ్చినట్టనిపించిందామెకి. తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు ఆమె చెంపల మీదుగా కిందకి జారాయి.

"రెండు రోజుల నుంచి గమనిస్తూ వున్నాను. బాగా దిగులుగా కనిపిస్తున్నావు" లలితాంబ ఎప్పుడు వచ్చిందో సుమ భుజం మీద చేయి వేస్తూ వాత్సల్యంగా అంది.

ఆవిడది ఎక్కువగా మాట్లాడే స్వభావంకాదు. సుమ యింటికి వచ్చిన రెండురోజులకి యిదే మొదటిసారి ఆమె పలకరించడం.

"ఏం లేదు పిన్నీ!" కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ గాభరాగా అంది.

"నువ్వు చెప్పకపోయినా నాకు అర్థం అవుతుంది. సహజంగానే, పెళ్ళయ్యాక ఆడవాళ్ళకి పుట్టింటి గురించి దిగులు వుంటుంది. అందులోనూ నీ పెళ్ళి అనుకోనివిధంగా జరిగింది. బాధగానే వుంటుంది. నా మాట విని, ఒక్కసారి వెళ్ళి మీ అమ్మని చూసిరా! ఈ గొడవలు, కోపతాపాలూ ఏవీ మనుషుల మధ్య బంధాలకంటే ఎక్కువ కాదు."

"పిన్నీ ఒక్కటడుగుతాను చెబుతావా?" మొహమాటంగా అంది.

"మనకి దగ్గరవాళ్ళు చేసిన పనికి చాలాకోపం, బాధ వున్నా మనమెందుకు వాళ్ళని పూర్తిగా ద్వేషించలేము? ఒకసారి వాళ్ళని మనం 'అక్కర్లేదు' అని వదిలేసుకున్నా మన మనసు ఎందుకు అటువైపే లాగుతూ వుంటుంది?"

"చెప్పానుగా ఒక్కోసారి మనలో వున్న ద్వేషం, ప్రేమని జయించడానికి సరిపోదు. నువ్వు వెళ్ళి మీ అమ్మని చూసి వచ్చావంటే అన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి."

"నా కన్నతండ్రి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన యిద్దరం.. నా తల్లి పెంచిన తండ్రి. నాకు వాళ్ళ మీద ఎంత ప్రేమ వున్నా ఆ నిజం ఎలా మారిపోతుంది?" మనసులోనే అనుకుని భారంగా నిట్టూర్చింది.

"ఏంటి? వంటింట్లో నిలబడి మీ యిద్దరు ఏం మాట్లాడుకుంటున్నారు?" సీరియస్‌గా కనిపిస్తున్న వాళ్ళిద్దరి మొహాల్నీ మార్చి చూస్తూ అనుమానంగా అడిగింది. అప్పుడే అక్కడికి వచ్చిన రాజేశ్వరి.

ఎవరూ జవాబు చెప్పలేదు.

పొయ్యిమీద పాలు పొంగిపోతుండడం చూసి, గబుక్కున స్టవ్ కట్టేసింది సుమ. అప్పటికే చాలావరకు పాలు నేలపాలయ్యాయి.

''కొరియర్''

పొద్దున పదకొండింటికి, కాలింగ్ బెల్ సౌండు విని గబగబా వచ్చి తలుపు తీసింది సుమ.

గుమ్మం ముందర నాలుగు పెద్ద పెద్ద అట్టపెట్టెలు దించి, సుమ చేత సంతకం చేయించుకుని వెళ్ళిపోయాడు కొరియర్ తెచ్చిన వ్యక్తి.

ఆ బాక్సుల్ని లోపలికి తెచ్చి ఒక్కొక్కటిగా ఓపెన్ చేసింది సుమ. వాటి నిండా తన బట్టలు, పుస్తకాలు వున్నాయి.

తన సామానంతా యిక్కడికి రవాణా చేశారని అర్థమైంది సుమకి.

పుస్తకాలు వుంచిన బాక్సులో నుంచి ఒక్కొక్కటే బైటికి తీస్తుంటే ప్రసాదరావు గుర్తొచ్చాడు. ఐయ్యేయస్ ప్రిపరేషన్ కోసం ఎక్కడెక్కడి నుంచో తెప్పించిన ఖరీదైన పుస్తకాలు అవి. కొన్ని ఆదిత్య చేత తెప్పించినవి.

రోజూ సాయంకాలాలు, తండ్రితో బాటు స్టడీరూములో కూర్చుని, పుస్తకాల గురించి చర్చించుకోవడం గుర్తొచ్చి సుమ కళ్ళు చెమ్మగిల్లాయి.

వెంటనే, సెల్‌ఫోన్ తీసి కాల్ చేసింది. ''రామూ కాకా! నేను సుమని మాట్లాడుతున్నాను. అమ్మా, నాన్నా ఎలా వున్నారు?'' అడిగింది ఆత్రంగా.

''ఎలా వుంటరు బిడ్డా! నువ్వెళ్ళిన సంది ఈ యింట్లో చప్పుడులే. అమ్మగారు సాబూ మాట్లాడుడే బంద్ చేసిను. ప్రతిదినం, నీ గదిలోకెల్లి జరంతసేపు కూర్చుని వస్తరు. లోపట లోపటే బాగా దిగాలు పడ్డిను బిడ్డా! మొన్నటి దినం అమ్మకి సుస్తీ అయ్యింది. ఆస్పత్రికి తోలుకెల్లిను. ఇప్పుడు జరంత హుషారు వుండె ఆదిత్యబాబు అమ్మని పసిబిడ్డని జూసినట్టే చూసుకున్రు. ఇంతకీ నువ్వెలా వున్నావు బిడ్డా? అక్కడ నీకంతా మంచిగ ఉండెనా?'' వివరాలన్నీ చెప్పి, ఆప్యాయంగా పలకరించాడు రామయ్య.

''నేను బాగానే వున్నాను కాకా! అమ్మకేమయ్యింది?'' ఆత్రంగా అడిగింది.

''జరంత మైకం వచ్చింది బిడ్డా! ఆస్పత్రిలో రెండు దినాలు వుండి వచ్చిను. ఇప్పుడు బాగానే వుండె నువ్వేం బేజారుగాకు''

''అలాగే కాకా! నేనెప్పుడన్నా నీ సెల్‌కి ఫోన్ చేస్తూ వుంటాను. ఇంట్లో వాళ్ళ క్షేమం చెబుతూ వుంటావు కదా!'' ఎంత అదుపు చేసుకోవాలని ప్రయత్నించినా బాధతో సుమ కంఠం వణికింది.

''ఇంటికి ఫోన్ చేస్తున్నావా?'' ఉన్నట్టుండి మోహిత్ గొంతు వినబడడంతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

''అమ్మకి ఒంట్లో బాగోలేదుట'' మెల్లగా చెప్పింది.

''చూసి రావాలని వుందా?''

''.....''

''నువ్వు వెళితే ఆవిడ ఆరోగ్యం యింకా పాడైపోతుందేమో'' వెటకారంగా అన్నాడు.

''మోహిత్ ప్లీజ్! నీకేం సంబంధం లేనట్టు మాట్లాడకు'' బాధగా అంది.

''నేను ఏం చేస్తున్నానో, ఏం మాట్లాడుతున్నానో నాకు క్లారిటీ వుంది. నీకు నిజాలు తెలియాలని మీ నాన్న డైరీ యిచ్చాను. అంతేకానీ, మీ వాళ్ళతో గొడవపెట్టుకుని రమ్మన్నానా? నీ పరిస్థితికి నాది కాదు రెస్పాన్సిబిలిటీ'' కోపంగా అన్నాడు.

''నన్నొక్కదాన్నే బ్లేమ్ చేయకు మోహిత్. ఇందులో నీ ప్రమేయం కూడా వుంది'' సుమ కూడా గట్టిగానే చెప్పింది.

"కానీ, ఛాయిస్ నువ్వు చేశావు. నిర్ణయం తీసుకునే అధికారం నీ చేతుల్లోనే పెట్టాను నేను. కోరి చేసినప్పుడు దాన్ని ఫలితం కూడా అనుభవించాలి. ముందు ఆ ఏడుపులు ఆపి ఈ వాతావరణానికి అలవాటు పడు." విసుక్కున్నాడు.

మోహిత్ మాటలు కొరడా దెబ్బల్లా తాకాయి ఆమెని. ఎర్రబడ్డ కళ్ళలో నుంచి కన్నీళ్ళు బైటికి రాకుండా ఆపే ప్రయత్నం చేస్తూ బాల్కనీ వైపుకి తలతిప్పి చూసింది.

ఆకాశం విశాలంగా వున్నా అక్కడ నుంచి రెండు అపార్టుమెంట్ల మధ్యలో చాలా యిరుగ్గా కనిపించింది.

"ఆదిత్యా! నీతో కొంచెం మాట్లాడాలి" చేతిలో కవరు పట్టుకుని వచ్చి సోఫాలో కూర్చుంది వసుంధర.

"ఈ అమ్మాయిని చూడు. పేరు దీప్తి. నా కొలీగ్ ప్రగతి కూతురు. బి.టెక్ చేసింది. నీకు నచ్చితే సంబంధం మాట్లాడతాను" అంటూ కవరులో నుంచి ఫోటోని బైటకి తీసింది.

"అమ్మా! ముందు నీ సర్జరీ అయ్యాకే. ఇవన్నీ అని చెప్పాను కదా" అన్నాడు ఆదిత్య సున్నితంగా ఆమె చేతిని వెనక్కి తోసేస్తూ.

"సర్జరీ రిస్క్ తీసుకోకముందే నీ పెళ్ళి చూడాలని వుంది ఆదిత్యా! ఒకవేళ నాకేదైనా జరిగితే నీ పెళ్ళి చూడలేదన్న కొరత నాకు ఉండకూడదు. మీ మామయ్యకి ఈ సంబంధం నచ్చింది. నువ్వు కూడా చూసి, ఓ.కే అంటే, మిగతా విషయాలు మాట్లాడతాను" ఆమె అడిగిన తీరుకి కాదనలేకపోయాడు ఆదిత్య. తప్పనిసరై ఫోటోని చేతిలోకి తీసుకుని, వెంటనే తిరిగి యిచ్చేశాడు. అతను ఫోటో వంక సరిగా చూశాడా లేదా? అన్న అనుమానం వచ్చింది వసుంధరకి.

"నాకు అమ్మాయి నచ్చింది" చెప్పేసి లాప్‌టాప్ బ్యాగుని తీసుకుని బైటికి వెళ్ళిపోయాడు.

"ఏరా! మీ ఆవిడ యింకా నిద్రలేవలేదా? బారెడు పొద్దెక్కినా నా మొహాన టిఫిన్ కూడా కొట్టలేదు" రాజేశ్వరి కొడుకుని పిలిచి అడుగుతూ వుంది.

వరండాలో కూర్చుని చదువుకుంటున్నా సుమ మేనత్త మాటలు వింది. గత కొద్దిరోజులుగా సుమని ఈసడించడానికి ఆమె ఏ మాత్రం జంకడం లేదు.

సుమ ఆవిడ మాటల్ని పట్టించుకోనట్టు తిరిగి పుస్తకంలో తలదూర్చింది.

"ఇక్కడ తీరిగ్గా కూర్చున్నావా? టిఫిన్ కోసం అమ్మ హైరానా పడుతుంది చూడు" మోహిత్ సుమని చూసి చెప్పాడు.

మోహిత్! నాకు యింకో ఎనిమిదినెలల్లో ఎగ్జామ్స్ వున్నాయి. కోచింగ్ సెంటర్‌కి ఎలాగూ వెళ్ళడం లేదు. ఇంట్లో అన్నా చదువుకోనీ. ఈ రెండు పేజీలు ఫినిష్ చేసి వచ్చేస్తాను" అంది పేజీ నెంబర్లు చూసుకుంటూ.

"ఆ యింటి కథలన్నీ యిక్కడికి మోసుకురావద్దని చెప్పానా? నువ్వు కలెక్టర్ అయ్యి దేశాన్ని ఉద్ధరించక్కర్లేదు. నీకు సరిపోయే జాబ్ ఏదన్నా చూసుకో" చిరాగ్గా చెప్పాడు.

సుమకి అతని మాటలకి ఛరున కోపం వచ్చింది. కానీ అతనితో వాదించడం వల్ల ఉపయోగం లేదని కొద్దిరోజుల్లోనే అర్థమవడంతో ఎదురు మాట్లాడలేదు.

విసుగ్గా మొహం చిట్లించి పుస్తకం మూసేసి లేచింది.

మోహిత్ ఆమె దారికి అడ్డంగా నిలబడ్డాడు.

"కోపంలో నువ్వు భలే వుంటావు" అన్నాడు ఆమెను కవ్విస్తూ.

సుమ అతన్ని పట్టించుకోకుండా లోపలికి వెళ్ళబోతున్నదల్లా ఠక్కున ఆగింది.

"మోహిత్ నాకు కొంచెం డబ్బు కావాలి. నా పర్సనల్ ఖర్చులకి" అడిగిందతన్ని.

"టిఫిన్ కూడా పెట్టకుండా యిక్కడే నిలబెట్టి వసూలు చేస్తావా?" ఆమె బుగ్గ గిల్లుతూ నవ్వాడు.

"ఈ తిక్క మనిషికి ఎప్పుడు ఏ మూడ్ వుంటుందో అర్థంకాదు" విసుగుపడుతూ అతని చేతిని విదిలించుకుని లోపలికి నడిచింది.

టైం తొమ్మిదిగంటలవుతూనే వంటగదిలో పని పక్కకి పడేసి మోహిత్ కోసం గదిలోకి వచ్చింది సుమ.

అతను ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతూ కనిపించాడు.

"మోహిత్ వారం నుంచి నిన్ను డబ్బులు అడుగుతున్నాను. నా సెల్‌లో డేటాప్లాన్‌కి డబ్బులు కట్టాలి. కొన్ని పుస్తకాలు కొనాలి. నా చెప్పులు తెగిపోయాయి. కొత్తవి కొనుక్కోవాలి" అసహనంతోబాటూ కోపం కూడా ధ్వనించింది సుమ గొంతులో.

"నా దగ్గర యిప్పుడు క్యాష్ లేదు" అద్దం ముందు నిలబడి తలదువ్వుకుంటూ, నిర్లక్ష్యంగా అన్నాడు మోహిత్.

"పోనీ నీ క్రెడిట్ కార్డు యివ్వు" అంటూ చొరవగా డ్రెస్సింగ్ టేబుల్ మీద వున్న అతని వాలెట్‌ని అందుకోబోయింది.

అతను ఊహించని విధంగా, చటుక్కున ముందుకి వంగి ఒక చేత్తో వాలెట్‌ని అందుకుని, ఇంకో చేత్తో సుమని వెనక్కి తోశాడు.

అనుకోని చర్యకి, సుమ వెనక్కివాలి పడబోయి గట్టిగా నిలదొక్కుకుంది.

"వాటీజ్ దిస్?" అరిచింది కోపంగా.

"నువ్వు తెచ్చే ఫ్లవర్‌బొకేలు, గిఫ్టులు, మూవీటికెట్స్ నాకు అక్కర్లేదు. నా అవసరాలకి డబ్బు అడుగుతున్నాను. నాకోసం ఆ మాత్రం చేయలేవా?" గట్టిగా నిలదీసింది.

"ఏంటమ్మాయ్! వాడి మీద కేకలు వేస్తున్నావు?" అంటూ రాజేశ్వరి మధ్యలో వచ్చింది.

"పొద్దున వెళ్ళిన దగ్గర్నుంచి కాకిలా అరిచి, అరిచి ఆ పిల్లలతో విసిగిపోయి వస్తాడు. వాళ్ళిచ్చే పదివేల రూపాయల్లో నీకోసం వేలకి వేలు ఎలా యిస్తాడనుకున్నావు?" కోడలి మీద ఒంటికాలితో లేచింది.

మోహిత్ తల్లివైపు చూసి తలపట్టుకున్నాడు.

"ఆగు! పిల్లలతో విసిగిపోవడం ఏంటి? నువ్వు పనిచేసేది టి.సి.ఎస్‌లో కాదా?" సుమ నిలదీసింది మోహిత్. ఆమెకి యింకా రాజేశ్వరి మాటలు నమ్మశక్యంగా అనిపించలేదు.

"నీకలా చెప్పాడా?" అంటూ వెనకాలే రవళి వచ్చింది." వాడు పనిచేసేది 'సి' లాంగ్వేజ్ నేర్పించే కంప్యూటర్ సెంటర్‌లో ఏం రా! ఈ విషయంలో కూడా బిల్డప్ యిచ్చావా?" అంది చాలా మాములుగా.

ఇక తను మాట్లాడేది ఏమీలేనట్టుగా క్రాఫు దువ్వుకోవడం పూర్తిచేసి, బైక్ కీస్ తీసుకుని బైటికి నడవబోయాడు మోహిత్.

"ఆగు ప్రతి విషయాన్నీ అలా పట్టించుకోనట్టు వదిలేస్తే సరిపోదు. నువ్వు టి.సిఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఎంప్లాయినని ఎందుకు అబద్ధం చెప్పావు?" అంది సుమ అతని దారికి అడ్డంగా నిలబడుతూ.

"సాఫ్టువేర్ ఎంప్లాయిని కాదు అనగానే అంత చీప్ అయిపోయానా? అడ్డంలే దారికి" విదిలించి కొట్టాడు అతను.

"మోహిత్! ఇక్కడ సమస్య నువ్వే జాబ్ చేస్తున్నావని కాదు. నాకు అబద్ధం ఎందుకు చెప్పావు? అని" మొండిగా గుమ్మానికి అడ్డంపడి గట్టిగా అరిచింది.

"అబద్ధం చెప్పానని ఎందుకలా నోరు చించుకుంటావు? నీ లైఫే ఓ పెద్ద అబద్ధం. మీ అమ్మ మీ నాన్న యిన్నిరోజులూ నీకు చెప్పినవన్నీ అబద్ధాలూ కట్టుకథలే. నేను చెబితే వచ్చిందా తప్పు? పెద్ద నన్ను నిలదీయడానికి వచ్చింది" అని ఈసడించి, ఆమెని పక్కకి తోసి వెళ్ళిపోయాడు.

సుమకి నోటమాట రాలేదు. "అబద్ధాల మీద కట్టిన భవంతిలోనా కాపురం వుండడానికి వచ్చాను?" అనుకుంటూ అతను వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయింది.

**"అత్తయ్యా! సూపర్** మార్కెట్ దాకా వెళ్ళి వస్తాను. సరుకులు తేవాలి" రాజేశ్వరి ముందు నిలబడింది సుమ.

"త్వరగా తిరిగి రావాలి! మధ్యాహ్నానికి వంట కూడా చేయలేదింకా" చెప్పి ఐదువందల నోటు చేతిలో పెట్టింది రాజేశ్వరి.

మేడమెట్లు దిగి కిందకి వస్తుంటే లలితాంబ కనిపించింది. ఆమె కళ్ళలో తన పట్ల విచిత్రమైన ఫీలింగ్‌ని చదవగలిగింది. మాట్లాడే ప్రయత్నం చేయకుండా గబగబా గేటు తీసుకుని వీధిలోకి నడిచింది.

ఇరుగు పొరుగు వాళ్ళు కూడా విచిత్రంగా చూస్తున్నట్టనిపించింది. అది సానుభూతో జాలో వెటకారమో సరిగా అర్థం కాలేదు. ఇరుగూ పొరుగుకి వినిపించేలా మోహిత్‌తో గొడవపడ్డందుకు తనని తానే తిట్టుకుంటూ ముందుకు నడిచింది.

"హాయ్ సుమా! నువ్వేనా మూడు నెలల్లో ఎంత మారిపోయావు? సీమ పార్కులో సుమని చూస్తూనే ఎదురొచ్చి కావలించుకుంది.

"ఏంటి సంచిలో సరుకులా? నువ్వు బజారుకెళ్ళి సామాన్లు తేవడం ఎప్పుడు నేర్చుకున్నావేంటి?

ఇంతకీ ఇంటికి పిలవకుండా పార్కుకి ఎందుకు రమ్మన్నావు? నీ మారీడ్‌లైఫ్ ఎలా వుంది? హనీమూన్‌కి ఎక్కడికెళ్ళారు? కళ్ళకింద డార్క్ సర్కిల్స్ వచ్చాయి. జుట్టు ఎర్రగా అయిపోయిందేంటి?" అంటూ ఆగకుండా ప్రశ్నల వర్షం కురిపించింది సీమ.

"నువ్వలా వూపిరాడకుండా అడిగితే ఎలా? అన్నీ వివరంగా చెబుతాను. నేనడిగిన డబ్బులు తెచ్చావా? ముందు ఆ సంగతి చెప్పు" అంది బెంచి మీద కూర్చుంటూ.

సీమ వెంటనే, హాండ్‌బాగ్‌లో నుంచి పదివేలు తీసి సుమ చేతిలో పెట్టింది.

"థాంక్యూ వీలైనంత త్వరలో యిచ్చేస్తాను."

"నువ్వు మరీ ఫార్మల్‌గా మాట్లాడావంటే చంపేస్తాను. ముందే విషయం చెప్పు. నీకు యిక్కడ ఏ ప్రాబ్లం లేదు కదా! నీ మొహం, నీ వాలకం చూస్తే నాకు అనుమానంగా వుంది" సుమ మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ అడిగింది.

"నేను బాగానే వున్నాను గానీ అమ్మా, నాన్నా ఎలా వున్నారు? అమ్మకి ఒంట్లో బాగాలేదని విన్నాను. హార్ట్ సర్జరీ ఎప్పుడు అనుకుంటున్నారో ఏమైనా తెలిసిందా?" అడిగేటప్పుడు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"డోంట్ వర్రీ. ఆంటీ యిప్పుడు కోలుకున్నారు. సర్జరీ సంగతి మాత్రం నాకు తెలియదు. ఆదిత్య చెప్పలేదా?"

"ఊహూ! ఆదిత్య యిప్పుడు నాతో మాట్లాడడం లేదు" సుమ తలవంచుకుని చెప్పింది.

"ఓ.. అయామ్ సారీ! హార్ట్ బ్రేక్ అయ్యిందిగా. ఆ మాత్రం కోపం వుంటుంది. కొద్దిరోజులు ఓపిక పట్టు. చిన్నగా ఆంటీ, ఆంకుల్ కూడా దిగివస్తారు. ఎన్ని సినిమాల్లో చూడలేదు?

అన్నట్టు ఆదిత్య ఎంగేజ్‌మెంట్ అయ్యింది. మనతోపాటు హెచ్.పి.ఎస్‌లో చదివిందే దీప్తి పుట్టి గయ్యాళి గంప అనుకునేవాళ్ళం. దానితో అయ్యింది మీ బావ నిశ్చితార్థం.

చాలా సింపుల్‌గా చేశారని విన్నాను. ఒకసారి గ్రాండ్‌గా ప్లాన్ చేశాక కాన్సిల్ అయ్యిందిగా పాపం" అని సరదాగా నవ్వబోతూ సుమ మొహం చూసి సీరియస్‌గా అయిపోయింది.

"అయామ్ సారీ" అంది వెంటనే, సుమ చేతులు పట్టుకుంటూ.

"ఫర్వాలేదు ఇలా అన్నా ఆదిత్యని నవ్వులపాలు చేశానో తెలుసుకోనీ" అంది పొడిగా.

"నిజం చెప్పమంటావా. ఆదిత్యనీ, నిన్నూ చూసినప్పుడు నాకు చాలా జెలస్‌గా అనిపించేది. నీకు ఎంతమంచి కజిన్ వున్నాడు అనుకునేదాన్ని. మీ ఇద్దరి మధ్యా రిలేషన్ హార్ట్‌బ్రేక్స్, ఫైట్స్‌కి అతీతం అనుకున్నాను. కానీ, యిద్దరూ కనీసం మాట్లాడుకోవడం కూడా లేదంటే ప్చ్.." అంది బాధగా.

"ఆదిత్య మాత్రం మనిషి కాదా? గాలిపటం తెగిపోయిన దారాన్ని వదిలేయక ఏం చేస్తారు ఎవరైనా?" అంది సుమ నిట్టూరుస్తూ.

"పెళ్ళైయిన మూణ్ణాళ్లకే వేదాంతం వచ్చేసిందే" అని నవ్వింది సీమ "అన్నట్టు యింకో ముఖ్యమైన విషయం చెప్పడం మరిచిపోయాను. మొన్న ఒక ఫ్రెండ్‌ని పికప్ చేసుకోవడానికి, మీ అమ్మగారు పనిచేసే కాలేజ్‌కి వెళ్ళాను. అక్కడ నీ హజ్బెండ్ కనిపించాడు. ఆంటీతో మాట్లాడడానికి వచ్చాడు"

"నువ్వు చెబుతున్నది నిజమేనా?" సుమ అడిగింది అనుమానంగా.

"హండ్రెడ్ పర్సంట్. నేనసలే క్యూరియస్ మంకీనని తెలుసుగా నీకు. మోహిత్‌ని ఫాలో చేశాను. మీ అమ్మతో మాట్లాడడానికే వచ్చాడు."

అది వింటూనే, సుమ మొహంలో రంగులు మారాయి.

"కంగారు పడకు. గొడవలాంటిదేమో జరగలేదు. ఆంటీ రూంలో నుంచి బైటికి వచ్చేటప్పుడు మోహిత్ మొహం కళకళలాడుతూ వుంది. త్వరలోనే అన్నీ మామూలుగా అయిపోతాయి చూస్తూ వుండు" అంది భుజం తడుతూ.

సుమ ఆలోచనతో పడింది.

"థాంక్యూ ఫర్ ద హెల్ప్.. సీమా"

స్నేహితురాలి చేయందుకుని చెప్పి వెంటనే అక్కడనుంచి కదిలింది.

సుమ రాత్రి వంటింట్లో పని ముగించుకుని బెడ్రూంలోకి వచ్చేసరికి మంచం మీద వాలిపోయి కనిపించాడు మోహిత్.

ఆమె మెల్లగా అతని పక్కకి వచ్చి కూర్చుంది. "మోహిత్ నీతో కొంచెం మాట్లాడాలి" మీద చేయి వేస్తూ మెల్లగా చెప్పింది.

"పొద్దున మాట్లాడింది చాల్లేదా?" ఆమె వంక చూడకుండానే అన్నాడతను.

"అయామ్ సారీ! నాకు తెలుసు నువ్వు నన్ను వదులుకోవడం యిష్టంలేక నాకోసమే అబద్ధం చెప్పి వుంటావు .

కానీ మనిద్దరి మధ్య హానెస్ట్ రిలేషన్ వుండాలని అనుకున్నాను. అందుకే పొద్దున చాలా కోపం వచ్చింది. నిజంగా నువ్వెలాంటి ఉద్యోగం చేసినా, నాకు ప్రాబ్లం లేదు. మన పెళ్ళైనప్పటి నుంచీ నువ్వు చిరాగ్గా వుండడానికి కారణం యిదేనని నాకు ఈరోజే అర్థమైంది.

డోంట్ వర్రీ నేనూ జాబ్ చేస్తాను. మనిద్దరం కలిసి ఫైనాన్షియల్ ప్లానింగ్ చేసుకుందాం. మన జీవితాన్ని మనమే కావలసినట్టు మార్చుకుందాం. కానీ ఒక విషయం ఇంకెప్పుడూ మనిద్దరి మధ్య ఎటువంటి ఈగోలు రహస్యాలూ వుండకూడదు సరేనా!" అంది అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"సరే! నువ్వు చెప్పినట్టే చేద్దాం" సుమ చెంపలు నిమురుతూ అన్నాడతను.

ఆ మాటతో సుమకి గుండెల మీద భారం దిగిపోయినట్టు అనిపించింది. ఈ మూడునెలల్లో అనుభవించిన బాధ అంతా దించేసుకుని, హాయిగా ఊపిరి పీల్చుకుంది.

"ఇంకో విషయం అడగాలి నువ్వు అమ్మని కలిశావా?" మోహిత్ భుజం పట్టి కుదుపుతూ అడిగింది ఆతృతగా.

వెంటనే అతని మొహం సీరియస్‌గా అయిపోయింది.

"నీ జ్ఞానోపదేశాలూ, ఉపన్యాసాలూ యింకా అయిపోలేదన్నమాట. కాస్త రేపటికి కూడా మిగుల్చుకో" కోపంగా విసుక్కుని పక్కకి తిరిగి పడుకున్నాడు.

అతనికి హఠాత్తుగా కోపం రావడానికి కారణమేమిటో సుమకి అర్థంకాలేదు. అతనితో వాదించడానికి ఓపికలేక మౌనంగా మంచం మీద వాలిపోయింది.

నిద్రమధ్య హఠాత్తుగా మెలుకువ వచ్చింది సుమకి. ఉన్నట్టుండి గొంతు ఎండిపోయినట్టనిపించడంతో మంచినీళ్ళ గ్లాసు కోసం పక్కకి తిరిగింది.

టేబుల్ మీద గ్లాసు కనిపించలేదు. పక్కన మోహిత్ కూడా లేడు. మంచినీళ్ళు తాగడం కోసం లేచి వంటింటివైపుకి నడుస్తూ వుండగా రాజేశ్వరి గదిలో నుంచి సన్నగా మాటలు వినిపిస్తూ వున్నాయి.

మోహిత్ గొంతు కూడా వినిపించడంతో తెలియకుండానే చెవి ఒగ్గి వినే ప్రయత్నం చేసింది సుమ.

"వాళ్ళ అమ్మ దగ్గరికి నేనెళ్ళినట్లు ఎవరు చెప్పారు దానికి?" నిలదీస్తున్నాడు మోహిత్.

"నిజంగా నేను చెప్పలేదురా బాబూ! నా మాట నమ్ము" మొత్తుకుంటుంది రాజేశ్వరి.

"అబద్ధాలాడకు. ఈ విషయం నీకూ, నాకూ తప్ప ఇంకెవరికీ తెలియదు. ఆఖరికి రవళికి కూడా. నువ్వు చెప్పలేదంటే నేను నమ్ముతానా?"

"ఒకవేళ వాళ్ళమ్మే చెప్పిందేమో? ఎన్నిరోజులని వసుంధర మాత్రం కూతురితో మాట్లాడకుండా వుంటుంది?"

సుమకి వాళ్ళు తనగురించే మాట్లాడుకుంటున్నారని అర్థమైంది. కానీ అంత రాత్రిపూట రహస్యంగా మాట్లాడుకోవాల్సిన అవసరం ఏమిటో అంతు చిక్కలేదు.

"ఈ విషయం ఎటు తిరిగి ఎటు వస్తుందో నాకు అర్థంకావడంలేదు" మోహిత్ అంటున్నాడు. "వాళ్ళమ్మ ప్రావిడెంట్ ఫండ్ ముప్పైలక్షలు తీసుకున్నానని తెలిస్తే గొడవ చేస్తుందేమో మళ్ళీ కేసులూ అవీ, యివీ అంటే గొడవైపోతుంది" అన్నాడు.

"ఎందుకురా అంత భయం? వాళ్ళు మాత్రం కూతురికి కట్నం యిచ్చారా? భారీగా పెళ్ళి చేశారా? ఆ మాత్రం ముట్ట చెపితే ఏం కరిగిపోరు" లెఖ్ఖలేనట్టు మాట్లాడింది రాజేశ్వరి.

"అసలీ పెంటంతా అనవసరంగా నువ్వే నా నెత్తిన రుద్దావు. హాయిగా ఆ సుజీని లైన్లో పెట్టినా సరిపోయేది. దానికి యూ.ఎస్ సిటిజన్ షిప్ వుంది. నీ మేనగోడలని దీన్ని అంటగట్టకపోతే ఈ పాటికి అమెరికాలో సెటిలైపోయి వుండేవాడిని" చిరాగ్గా అన్నాడు.

"సర్లే మనం వుంటున్న యిల్లు చచ్చిపోయిన వాళ్ళ నాన్నపేరు మీదవుంది. రేపు ఈ యింటి కోసం దావా వేస్తే రోడ్డున పడతాం. ఆ వసుంధర పిల్లలతోబాటు, డబ్బు కూడా నీ చేతుల్లో పోసింది. నా మేనగోడల్ని చేసుకుని బాగానే లాభపడ్డావు. ఆ సుజీ ..గుజీ ఏం ఉద్ధరిస్తుందో నాకు తెలుసులే! అసలు నువ్వు సరిగ్గా చదువుకుని చచ్చుంటే నాకీపాట్లు తప్పేవి.

నా మాట విని, తొందరగా సుమ కడుపున ఓ బిడ్డ పడేట్టు చూడు. అప్పుడిక ఎటూ కదలకుండా పడివుంటుంది."

"ఏ కాలంలో వున్నావు నువ్వు? అది ఐయ్యేయస్ అవ్వాలని తెగ చదివేస్తుంది. అప్పటిదాకా పిల్లల్ని ఛస్తే కనదు. ఎందుకైనా మంచిది. ఈ యింటి సంగతి దానికి తెలియనీకు. ఒకవేళ ఏదైనా తేడావస్తే వాళ్ళమ్మ యిచ్చిన ముప్పై లక్షలే మనకి దక్కేది."

"సర్లే..రా! నేనెందుకు చెబుతాను?"

"రవళికి చెప్పినా నిన్ను చంపేస్తాను. వాటా యివ్వమని అది నన్ను పీక్కు తింటుంది."

ఆ సంభాషణంతా గదిబైట నిలుచుని వింటున్న సుమకి గుండె బద్దలైనట్టనిపించింది.

"ఎంత మోసం? తేనె పూసిన మాటలతో అందంగా ఎంత మోసం చేశారు? మోహిత్ తన కోసం ఒకసారి రాత్రంతా యింటి బైట జాగారం చేయడం డాషింగ్‌గా నీకోసం దేనికైనా సిద్ధం అన్నట్టు వుండడం పొద్దున్నే 'గుడ్‌మార్నింగ్' మెసేజ్‌లు తీయటి కబుర్లు రాత్రిపూట వలపులు కురిపించే మాటలు, పూలబొకేలు గిఫ్ట్‌లు డిన్నర్‌లూ "అన్నీ ఒక్కసారి కళ్ళముందు రీలులా తిరిగాయి.

చాలా సులభంగా దీన్ని ఫూల్‌ని చేయగలిగానని లోలోపల నవ్వుకుంటూ వుండి వుంటాడు కాబోలు. లేకపోతే యిప్పుడు నేను విన్నదంతా అబద్ధమా? నిద్రలో కలగంటున్నానా? ఒక్క నిముషం మతిపోయినట్టనిపించింది. గదిలో అడుగుల చప్పుడు దగ్గరగా వస్తున్నట్టు అనిపించడంతో గబుక్కున బెడ్రూంలోకి వచ్చి మంచం మీద పడుకుంది.

"తీయటి వలవేసి నమ్మించి కొండమీద నుంచి లోయలోకి తోసేశాడన్నమాట. గుండె భగభగమండుతుంది. ఆ గుండె మంటని చల్లార్చడానికి కనీసం కళ్ళలోనుంచి కూడా నీళ్ళు రాలేదు. ఇదంతా మోసపోయినందుకు బాధా?

తన అజ్ఞానానికి తనమీదే కోపమా? ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా తెలియని పరిస్థితిలో వుంది ఆమె.

"కోడలు పిల్లా.. లేమ్మా! లేచి కాస్త కాఫీ పెట్టు" మేనత్త గొంతు ఖంగుమంది.

సుమ మంచం మీద నుంచి లేచింది. రోజూలాగా ఆమె ప్రవర్తన బాధ కలిగించలేదు.

"నా పుట్టింటివాళ్ళు అవమానించినందుకు ఆవిడ బాధపడుతూ వుందనీ అది నామీద కసిగా మారిందనీ యిన్నాళ్ళూ అనవసరంగా మధనపడ్డాను" అనుకుంటూ బాత్రూం వైపుకి నడిచింది.

వాష్‌బేసిన్‌లో కుళాయి తిప్పి చల్లటి నీటిని ముఖం మీద పోసుకుంది.

ఎదురుగా అద్దంలో ప్రతిబింబం అభావంగా కనిపించింది. ఎప్పుడూ కళ్ళలో మినుకు మినుకుమంటూ కనిపించే ఆశలేదు. వాస్తవం తెలిసిన తర్వాత మనసు కోపం, బాధ పశ్చాత్తాపం అన్నింటినీ దాటి యాక్సెప్టెన్స్‌లోకి వచ్చి ఆగినట్లైంది.

తల్లి, తండ్రి, ఆదిత్య గుర్తుకు వచ్చారు.

"ప్రేమించిన వాళ్ళని బాధపెట్టినందుకు నాకు ఈ శిక్ష" అనుకుంటూ బైటికి వచ్చింది.

మోహిత్ టిఫిన్ తిని యిన్‌స్టిట్యూట్‌కి వెళ్ళిపోయాడు. సుమ ముందురోజు డబ్బులు అడిగినట్టు అతనికి పట్టలేదు. ఆమె కూడా గుర్తుచేయడానికి ప్రయత్నించలేదు.

అతను వెళ్ళిపోగానే, పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది. రెండు పేజీలు తిప్పిందో లేదో సెల్‌ఫోన్ మోగింది. స్క్రీన్ మీద ‘నాన్న‘ అన్న అక్షరాలు చూడగానే, ఆమె గుండె వేగంగా కొట్టుకుంది.

"అమ్మా! సుమా" ఫోన్ ఎత్తుతూనే, అవతలి పక్క ప్రసాదరావు - గొంతు గడ్డకట్టుకుపోయిన మనసుని వెచ్చగా తాకుతూ ఆప్యాయంగా! అప్పటిదాకా నిశ్శబ్దం చాటున దాక్కుని కన్నీళ్ళు కట్టలు తెంచుకుని బైటికి వచ్చాయి.

"నాన్నా! నన్ను క్షమించండి. మోహిత్ మాటల్ని నమ్మి నేను మోసపోయాను మిమ్మల్ని అవమానించాను" చెప్పాలనుకున్న మాటలన్నీ మనసులో మెదులుతున్నాయి కానీ, గొంతు మాత్రం పెగల్లేదు.

"నాన్నా! మీరెలా వున్నారు?" అడిగింది వణికే గొంతుతో.

"సుమా.. నువ్వు అర్జంటుగా అపోలో హాస్పిటల్‌కి రావాలమ్మా! అమ్మకి ఒంట్లో బాగోలేదు"

"అమ్మకేమైంది నాన్నా?" ఆదుర్దాగా అడిగింది.

"అదంతా వచ్చాక చెబుతాను. అమ్మ నిన్ను చూడాలంటుంది రా తల్లీ"

ఫోన్ పెట్టేస్తూనే ఆదరాబాదరాగా బయల్దేరి హాస్పిటల్‌కి చేరుకుంది సుమ.

"అమ్మా" తల్లిని చూస్తూనే సుమ బావురుమంది. వసుంధర మాట్లాడలేని పరిస్థితిలో వుంది. ముక్కులకి మాస్క్‌లు, గొట్టాలు తగిలించి వున్నాయి.

"రెండురోజుల్లో సర్జరీ చేయించుకోవాలనుకుంది. ఇంతలోనే, అనుకోకుండా స్ట్రోక్ వచ్చింది" ప్రసాదరావు చెప్పాడు.

సుమ తల్లికి దగ్గరగా వెళ్ళింది.

కళ్ళతోనే ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్టుంది వసుంధర.

"నేను నీవనుకున్నంత స్వార్థపరురాలిని కాను. నీ కన్నతండ్రి మరణం వెనుక నేను లేను" అనా

తల్లీ కూతుళ్ళ మధ్య అంతరాన్ని సృష్టించిన ఆ రహస్యాలు శాశ్వతంగా సమాధి అయిపోయాయి.

"అమ్మా! అయామ్ సారీ! నేను తప్పు చేశాను. నా మీద కోపగించుకోవద్దు. ప్లీజ్ ఇంకెప్పుడూ నీ మాటకి ఎదురు చెప్పనమ్మా! నువ్వు త్వరగా మామూలుగా అయిపో. తల్లి మీదకి వంగి చిన్నపిల్లలా ఏడ్చింది సుమ.

ఆమె మాటలు వసుంధరకి అర్థమయ్యాయో లేదో కూడా తెలియడం లేదు.

అప్పటికే ఆవిడ కళ్ళు మూతలు పడిపోతున్నాయి. నెమ్మదిగా చేయిపైకెత్తి సుమ చేతుల్నీ, చెంపల్నీ ఆప్యాయంగా స్పృశించింది.

"అమ్మా! అమ్మా!" సుమ ఏడుస్తూ పిలుస్తూనే వుంది.

"ఒక్కసారి మీరంతా బైటికి వెళ్ళండి" అప్పుడే హడావుడిగా డాక్టరుతో బాటు లోపలికి వచ్చిన నర్సు చెప్పింది.

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ తండ్రితో బాటు బైటికి వచ్చింది సుమ. అప్పుడు చూసింది ఆదిత్యని.

కారిడార్‌లో చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు.

ఆందోళనతో ఎర్రబారివున్నాయి అతని కళ్ళు.

సుమ పైకి ఎంత ఏడ్చిందో అతను అంతకు రెండు రెట్లు లోలోపలే కుమిలిపోతున్నట్టు అనిపించింది అతని మొహం చూస్తే. దాదాపు గంట గడిచిపోయింది. డాక్టరు "వసుంధర యిక లేదన్న పిడుగులాంటి వార్త చెప్పి వెళ్ళాడు.

ప్రసాదరావు యింట్లో వసుంధర అంత్యక్రియలకి ఏర్పాట్లు జరిగిపోయాయి. మోహిత్, రాజేశ్వరి, లలితాంబ కూడా వచ్చి చూసి వెళ్ళారు. సుధీర్‌కి వార్త చేరింది కానీ, రావడానికి రెండు రోజులు పడుతుందని చెప్పడంతో, అతని కోసం ఎదురు చూడలేదు. వసుంధర శవాన్ని తీసుకువెళ్ళిపోయారు. ఆమె ప్రస్థానం ఈలోకంలో ముగిసిపోయింది. చివరిచూపు కోసం వచ్చిన స్నేహితులు, పరిచయస్థులు వెళ్ళిపోయారు. ఏడ్పులు, మాటలు ఏవీ వినిపించడంలేదు. అంత పెద్ద యింట్లో ముగ్గురే మనుష్యులు మిగిలారు.

భరించలేనంత నిశ్శబ్దం యింట్లో మనసుల్లో కూడా స్మశానానికి ప్రాణం లేని శరీరాన్ని తీసుకువెళ్ళారో ప్రాణం వున్న మనుషులు తిరిగే యిల్లే శ్మశానంగా మారిందో తెలియనట్టుగా వుంది.

"ఈ సాయంకాలం ఎలా గడుస్తుందో" అనుకుంటూ గోడకు ఆనుకుని మోకాళ్ళమీద తలపెట్టి ఏడుస్తూ కూర్చుంది సుమ.

"సుమా!" మోహిత్ గొంతు వినిపించింది.

"పద! యింటికి వెళదాం" పిలిచాడతను.

అప్పటిదాకా సుమ తల్లికోసం ఏడుస్తూ వుంది. ఆ క్షణం మాత్రం మనసులో తండ్రి మెదిలాడు.

"ఇంత భయంకరమైన ఒంటరితనంలో నాన్నని ఎలా వదిలి వెళ్ళడం?"

"నాన్నా! ఒక్క వుదుటున వెళ్ళి ప్రసాదరావుని కౌగిలించుకుని ఏడ్చింది"

"నువ్వు వెళ్ళొద్దు యిక్కడే వుండమ్మా!" అన్న ఒక్కమాట ఆయన నోటినుంచి వినాలని తహ తహలాడింది ఆమె మనసు.

"అతను పిలుస్తున్నా వెళ్ళకపోతే బావుండదు. వెళ్ళమ్మా! నన్ను చూడాలనిపించినప్పుడల్లా వస్తూ వుండు" కూతురి తల నిమురుతూ అన్నాడు.

తల్లి ఆవు నుంచి దూరంగా లాక్కెళుతున్న లేగదూడ చూసినట్టు మాటిమాటికీ తండ్రినే చూస్తూ తడికళ్ళతో బైటికి నడిచింది సుమ.

"ఎవరికి పొద్దున్నే ఫోన్ చేస్తున్నావు?" కళ్ళు తెరుస్తూనే, సెల్‌ఫోన్‌తో కనిపించిన సుమని అడిగాడు మోహిత్.

"నాన్నకి నిన్న ఆ యింట్లో నాన్నని ఒంటరిగా వదిలి వచ్చినప్పట్నుంచి మనసు మనసులో లేదు"

సుమ మాటలు యింకా పూర్తికాకముందే, ఆమె చేతిలో నుంచి సెల్‌ఫోన్ లాగేసుకున్నాడు మోహిత్.

"మీ అమ్మ చనిపోయాక, ఆ యింట్లో నీకెవ్వరూ లేరు. నిన్ను అబద్ధంలో వుంచి పెంచిన తండ్రి. నిన్ను పెళ్ళిచేసుకోవాలనుకున్న బావ. సిగ్గులేకుండా ఎలా ఫోన్ చేస్తావు? ఇక నుంచి నువ్వు అక్కడికి వెళ్ళకూడదు. ఫోన్ చేయకూడదు"

ఎందుకు వెళ్ళకూడదు? ఆయన నన్ను అల్లారు ముద్దుగా పెంచాడు. ఏం నువ్వు అబద్ధాలు చెప్పలేదా? నువ్వు మోసం చేయలేదా? నీ మాటలు నమ్మి నేను మోసపోయాను. మా అమ్మని నానా మాటలు అన్నాను. ఆ దిగులుతోనే మా అమ్మ చనిపోయింది.

నా మీద కోపంతోనే వెళ్ళిపోయింది.

నాకు క్షమించమని అడగడానికి అవకాశం యివ్వకుండానే వెళ్ళిపోయింది. నేను మా అమ్మని దూరం చేసుకున్నాను. నువ్వే దానికి కారణం నువ్వే నువ్వే"

హిస్టీరిక్‌గా అరుస్తూ రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"చచ్చినవాళ్ళు చచ్చారు. నా ప్రాణం మీదకి వచ్చింది. వెధవగోలు" అంటూ టేబుల్ మీదున్న మంచినీళ్ళ గ్లాసుని ధన్‌మని విసిరిగొట్టాడు.

"ఏంట్రా? ఏంటి గొడవ?" రాజేశ్వరి గదిలోకి తొంగి చూసింది.

"ఇది పొద్దున్నే ఏడుస్తూ కూర్చుంది" విదిలించుకుంటూ బైటికి వెళ్ళాడు.

"పోన్లేరా! వాళ్ళమ్మ పోయిందిగా" రాజేశ్వరి సానుభూతి వాక్యాలు. ఎగతాళిగా అనిపించాయి సుమకి.

వెంటనే మేడదిగి లలితాంబ దగ్గరికి వెళ్ళింది.

"సుమా! ఒంట్లో బానే వుందా?" సుమని చూస్తూనే కంగారుగా అడిగింది లలితాంబ.

"పిన్నీ! కాస్సేపు యిక్కడ కూర్చోవచ్చా?"

ఆమె వాలకం చూస్తూనే విషయం అర్థమైంది లలితాంబకి.

"రామ్మా!" తీసుకెళ్ళి మంచం మీద కూర్చోబెట్టింది.

"పిన్నీ! కాస్సేపు అమ్మని గుర్తుచేసుకుని, ఎవర్నైనా కావలించుకుని ఏడవాలని వుంది. ఈ యింట్లో నువ్వు తప్ప నాకెవ్వరూ కనిపించలేదు" సుమ మాటలకి లలితాంబ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"దిగులుపడకమ్మా! మీ అమ్మ చాలా మంచిది. ఎక్కడున్నా నీకు తోడుగానే వుంటుంది" అంది ఓదారుస్తూ.

"కానీ మోహిత్ వాళ్ళమ్మ మా అమ్మ మంచిదికాదు. మా నాన్నని వదిలేసింది. ఆయన చావుకి కారణం మా అమ్మే" అంటుంటారు. మొదట్లో నిజమని నమ్మాను. కానీ నిజాల్ని తెలుసుకోవడం కంటే అర్థం చేసుకోవడం అవసరం. ఆ విషయం నాకు చాలా ఆలస్యంగా అర్థమైంది. ఇప్పుడు నాకు అమ్మలేదు"

***

"**నిజాలు తెలుసుకోవడం** నీ కాపరానికి మంచిది కాదు. అందుకనే ఇన్నాళ్ళూ నేను చెప్పలేదు. కానీ మీ అమ్మ ఎంత మంచిదో, ఎంత ఓపికమంతురాలో నీకు తెలియాలని చెబుతున్నాను.

మీ అమ్మ వయసులో ఉన్నప్పుడు చాలా అందంగా వుండేది. మీ అమ్మమ్మకి ఒక్కతే కూతురు. అప్పటికి మీ తాతయ్య చనిపోయారు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుండటంతో డిగ్రీ యింకో ఏడాదిలో పూర్తవుతుందనగానే మీ నాన్నకిచ్చి పెళ్ళిచేశారు. మీ నాన్న ఆల్కాహాలిక్. దానికి తోడు అనుమానం. దాంతో మీ అమ్మని చదువు పూర్తి చేయనివ్వలేదు. వాకిట్లో నిలబడ్డా, కూరలకోసం, పాలకోసం గడపదాటి వచ్చినా మీ అమ్మని తిట్టిపోసేవాడు. ఉమ్మడి కుటుంబంలో ఆ అవమానాలన్నింటినీ ఓపిగ్గా భరిస్తూ వుండేది. భర్త తేలిగ్గా చూస్తే యింట్లో మిగిలినవాళ్ళందరికీ చులకనే.

వెనక్కి తిరిగి పుట్టింటికి వెళ్ళడానికి మీ అమ్మమ్మ పరిస్థితి బాగోలేదు. దానితోడు 'పెళ్ళంటే ఏడు జన్మల బంధం' 'మనం చేసుకున్న పుణ్యం కొద్దీ మనకి భర్త దొరుకుతాడు' ఇలాంటి కథలూ, పురాణాలూ బాగా నూరిపోస్తారుగా మనవాళ్ళు. మీ అమ్మమ్మ కూడా అలాగే చేసేది. చట్టాలు కూడా యిప్పుడు వున్నంత బలంగా అప్పుడు లేవు.

నీకు ఏణ్ణర్థం వున్నప్పుడు మీ నాన్నకి ఉద్యోగం పోయింది. ఆఫీసు అవర్స్‌లో తాగి రావడం, చీటికి మాటికీ ఆఫీసులోవాళ్ళతో పేచీలు పెట్టుకోవడం చేస్తుండడంతో రెండు మూడుసార్లు వార్నింగులు యిచ్చి, పనిలోనుంచి తీసేశారు. అప్పుడు మీ నాన్న విపరీతంగా తాగడం మొదలుబెట్టాడు. డిప్రెషన్‌లోకి కూడా వెళ్ళాడు. మీ అమ్మ మీద అనుమానం పెరిగిపోయింది. కొట్టడం, హింసించడం చేసేవాడు. నేను చెబితే నువ్వు బాధపడతావుగానీ, ఒక రకంగా సైకోలాగా వుండేవాడు. ఒకరోజు బెడ్రూం తలుపులు మూసేసి మీ అమ్మని చితకబాదడం మొదలుపెట్టాడు.

నువ్వు బాగా గుక్కపట్టి ఏడుస్తున్నావు. లోపలనుంచి, కేకలు అరుపులు మీ అమ్మ ఏడుపు వినిపిస్తూ వున్నాయి. నేనూ మీ బాబాయి మీ మేనత్త అందరం పరుగెత్తి తలుపులు తీయడానికి ప్రయత్నించాము. కాస్సేపటికి, నిన్ను ఎత్తుకుని మీ అమ్మే తలుపులు తీసుకుని బైటికి వచ్చింది. ఆమె భుజం మీద పగిలిన బ్రాందీ సీసా దిగబడిపోయి వుంది. భుజం మీద నుంచి రక్తం కారుతూనే వుంది. ఆమె చంకలో వున్న నువ్వు కూడా సగానికి పైగా మీ అమ్మ నెత్తుటితో తడిసిపోయి వున్నావు.

ఆ రోజు మీ అమ్మ భుజం మీద గుచ్చుకున్న గాజుసీసాని నేనే బైటికి లాగాను. మడుగు కట్టిన రక్తం ఆ వాసన నాకు నాలుగు రోజులపాటు గుర్తొస్తూనే వున్నాయి.

"ఇంక ఈ యింట్లో వుండడం నాకేకాదు. నా బిడ్డకు కూడా మంచిదికాదు. నాకేమన్నా జరిగితే యిలాంటి తండ్రి చేతిలో నా బిడ్డను వదల్లేను" అని చెప్పి మీ ఈ యిల్లు వదిలిపెట్టి వెళ్ళిపోయింది.

డిగ్రీ పూర్తిచేసుకుంటూ, ఎలాగో మీ అమ్మమ్మ దగ్గరే వుండిపోయింది. కూతురి ప్రాణాల మీదకి వచ్చేసరికి మీ అమ్మమ్మ కూడా ఒప్పుకోక తప్పలేదు. అసలే అనుమానం మనిషి అయిన మీ నాన్నకి మీ మేనత్త లేనిపోనివి కల్పించి చెప్పేది. మీ అమ్మకి వేరే వాళ్ళతో సంబంధం వుందని, అందుకే అంత ధీమాగా వదిలిపెట్టి వెళ్ళిపోయిందని నూరిపోసింది.

దాంతో ఆయన మానసిక పరిస్థితి యింకా దిగజారిపోయింది. ఉద్యోగం లేదు. తాగుడు. సైకియాట్రిస్ట్ దగ్గరకి రమ్మంటే వచ్చేవాడు కాదు. మీ అమ్మ తనని వదిలివెళ్ళడం అవమానంగా ఆమెని ఆపలేకపోవడం తన చాతకానితనంగా తీసుకుని రగిలిపోయేవాడు. దాంతో సూసైడ్ టెండెన్సీ బాగా పెరిగిపోయింది.

ఒకరోజు పగిలిన విస్కీ బాటిల్‌తో మణికట్టు దగ్గర కోసుకున్నాడు. మేం చూసేసరికే బాగా ఆలస్యం అయిపోయింది. అప్పటికే చాలా రక్తం పోయి చనిపోయాడు. "

"అంటే ఆ డైరీలో రాసిందంతా?"

"మతిస్థిమితం లేనప్పుడు మీ మేనత్త వాగుడుని నమ్మి గదిలో కూర్చుని రాసిన రాతలు."

"అయితే ఫ్యామిలీ ఫోటోల్లో కనిపిస్తున్న వాళ్ళిద్దరి నవ్వులు, అన్యోన్యత అబద్ధమేనా?"

లలితాంబ నిర్వేదంగా నవ్వింది.

"కెమేరా ముందు కనిపించిన ఒక్క క్షణంతో నువ్వు మనుషుల్నీ, జీవితాల్నీ ఎలా అంచనా వేయగలవు? అమ్మకి మంచివాడుగా కనిపించే కొడుకు, భార్యకు మంచి భర్త అవుతాడని నమ్మకం లేదు. మనిషిలో వుండే రకరకాల రూపాలు ఎప్పుడు , ఎవరి దగ్గర ఎలా బైటపడతాయో ఎవ్వరం చెప్పలేము. ఇరుగూ, పొరుగూకి మీ బాబాయికీ మీ మేనత్తకీ సంబంధించినంత వరకు మీ నాన్న చాలా మంచివాడు. ఎందుకంటే ఆయన డబ్బు సాయం చేస్తూ వుండేవాడు కాబట్టి. మీ అమ్మ వెళ్ళిపోయాక, మీ మేనత్త అదే అదనుగా మీ నాన్న పేరుతో బాంకులో వున్న డబ్బుకి తన పేరు నామినేషన్‌గా పెట్టించింది.

మీ అమ్మ దురదృష్టం మీ అమ్మమ్మ కూడా ఆ ఏడాదే చనిపోయింది. ఇంకో గత్యంతరం లేక మీ అమ్మ ఈ యింటికే తిరిగి రావాల్సి వచ్చింది. ఆ రోజు నుంచి, మీ అమ్మ కష్టాలు మళ్ళీ మొదలయ్యాయి. "నా అన్న చనిపోవడానికి కారణం నువ్వే" అంటూ మీ మేనత్త రాచిరంపాన పెట్టేది.

మొదట మీ నాన్నతో విసుగుపుట్టిన క్షణంలాగే ఇంకో బ్రేక్ డౌన్ పాయింట్ వచ్చింది మీ అమ్మకి. నీకు మలేరియా జ్వరం వచ్చింది. జ్వరానికి ఎర్రగా కందిపోయి, చలితో వణుకుతూ వున్నావు. డాక్టరుకైతే చూపించారు. కానీ ఒక రాత్రిపూట వున్నట్టుండి హై

టెంపరేచర్ వచ్చింది. అప్పుడు నేను మా పుట్టింట్లో వున్నాను. ఆ రాత్రి నిన్ను హాస్పిటల్‌కి తీసుకువెళ్ళడానికి ఎవ్వరూ ముందుకు రాలేదని చెప్పింది మీ అమ్మ. బిడ్డని సంరక్షించుకోలేకపోవడమే ఒక తల్లికి అన్నింటికన్నా పెద్ద నిస్సహాయత.

న్యాయంగా, ఆమెకి చెందాల్సిన డబ్బు తీసుకుని, ఆమె యింట్లోనే వుంటూ అంత దైన్యంగా బతికేలా చేశారు ఈ యింట్లోవాళ్ళు. ఆ తర్వాత మీ అమ్మ యిక్కడ వుండలేదు. చిన్న ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోయింది.

బహుశా మళ్ళీ ఈ గడప తొక్కనని ఒట్టు పెట్టుకుని వుంటుంది. కొన్నాళ్ళకి ఫ్యామిలీ ఫ్రెండ్, సివిల్ సర్వెంట్ అయిన ప్రసాదరావుగారితో పెళ్ళైందని తెలిసింది మాకు. అప్పుడు కూడా మీ మేనత్త చాలా గొడవ చేసింది. ఆమె నోటి దురుసు చూపిస్తే మీ అమ్మ ఈ యింటిమీద తన హక్కు కోసం రాదని ఆమె ఆలోచన.

నిన్ను మొదట ఈ యింట్లో చూసినప్పుడు నేను చాలా సంతోషించాను. దేవుడు మీ అమ్మకి ఒక మంచి జీవితాన్ని యిచ్చాడనుకున్నాను. మోహిత్‌కీ, నీకూ చనువు పెరుగుతుందని గమనించినప్పుడు కూడా మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటారని అస్సలు ఊహించలేదు. మీ అమ్మ పడనీయదు అని గట్టిగా నమ్మాను. చివరి నిముషం దాకా పెళ్ళి సంగతి నాకు తెలియనీయకుండా జాగ్రత్తపడ్డాడు మోహిత్. లేకపోతే వారించేదాన్ని.

నాపరిస్థితి కూడా చాలా విచిత్రమైనది. మేం చేసిన తప్పులకి ఓ రకంగా బాధలు పడుతున్నాం. దేవుడు మాకు పిల్లల్ని యివ్వలేదు. నాకు నీడ కూడా ఈ యిల్లే.

మీ అమ్మకి వున్నంత ధైర్యం నాకు లేదు. అందుకే గొంతెత్తే సాహసం కూడా చేయలేదు.

కానీ నువ్వు యిప్పుడివన్నీ తెలుసుకుని ఏం చేస్తావు? ఇవన్నీ మర్చిపోతేనే ఈ యింట్లో కాపురం చేయగలవు. ఈ దేశంలో నూటికి ఎనభై శాతం పైన ఆడవాళ్ళు తమ చుట్టూ జరిగేవి తెలియనట్టే కళ్ళు మూసుకుని కాపురాలు చేస్తూంటారు" చెప్పి నిట్టూర్చింది.

"నేనెంత తెలివితక్కువదాన్ని పిన్నీ ఎవరో కూడా గుర్తులేని కన్న తండ్రిని గురించి గొప్ప ఊహా చిత్రం గీసేసుకున్నాను. ఆ ఊహల్ని నమ్మి అమ్మని దూరం చేసుకున్నాను" అంది కళ్ళనీళ్ళు తిప్పుకుంటూ.

"ఇందులో నీ తప్పు కూడా లేదు సుమా! పిల్లలు కన్నవాళ్ళ గురించి గొప్పగానే వూహించుకుంటారు. అన్ని గొప్ప లక్షణాల్ని తల్లిదండ్రుల్లో చూడాలనుకుంటారు. కానీ నిజాలు తారుమారు అయినప్పుడు వాటిని జీర్ణించుకోవడానికి చాలా పరిణితి వుండాలి. బహుశా, అందుకే, మీ అమ్మ, నీ కన్న తండ్రిని గురించిన వాస్తవాల్ని చెప్పలేదు. నిన్ను బాధపెట్టకూడదని అలా చేసి వుంటుంది."

సుమ తిరిగి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టుగా లలితాంబ చేయిపట్టుకుని ఆమె మీద తలవాల్చింది.

ఉదయం తొమ్మిదిన్నర ప్రాంతంలో తండ్రిని చూడటానికి వెళ్ళింది సుమ.

"కాకా! నాన్న ఎక్కడ వున్నారు?" ఇంట్లోకి అడుగుపెడుతూనే అడిగింది.

"అయ్యగారు ఇంకా నిద్రలేవలేదమ్మా"

"ఏ తెల్లవారు ఝామునో పడుకుని వుంటారు. ఈలోపు నేను బ్రేక్‌ఫాస్ట్ తయారు చేస్తాను" అంటూ నేరుగా వంటగదిలోకి వెళ్ళింది.

"నువ్వెప్పుడు గిట్ల వంట రూం వైపుకి రాలేదుగ బిడ్డా! నువ్వెల్లు నే జేస్తలే" అన్నాడు రామయ్య అభిమానంగా.

"ఆ సుమ యిప్పుడు చాలా మారిపోయింది కాకా! అన్ని పనులు నేర్చుకున్నాను" అంటూ ఫ్రిజ్‌లో నుంచి యిడ్లీ పిండి బైటికి తీసింది.

అరగంటలో యిడ్లీలు చట్నీ రెడీ చేసి కాఫీ కలిపి డైనింగ్ టేబుల్ మీద సర్దుతుండగా ఆదిత్య వచ్చాడు. అతని మొహం బాగా వాడిపోయి వుంది. అప్పటికి వసుంధర చనిపోయి మూడు వారాలపైనే అయ్యింది. అయినా, అతను బాధ నుంచి ఇంక కోలుకున్నట్టు లేదు.

"ఆదీ కాఫీ తీసుకో" జార్‌లో నుంచి కాఫీని కప్పులోకి ఒంపుతూ చెప్పింది.

ఆదిత్య సుమ వైపు కోపంగా చూశాడు. "కాకా! ఆవిడకి చెప్పు. నాకు ఎవ్వరి ఉపకారాలూ అక్కర్లేదు. నా సంగతి నేను చూసుకోగలను" చెప్పాడు సుమకి అర్థమయ్యేలా.

రెండు నిముషాల తర్వాత జ్యూస్ గ్లాసుతో తనగదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

"అమ్మగారు చచ్చిపోయినప్పటి నుంచి, బాబు గిట్ల చిరాకు పడ్తనే బిడ్డా! నువ్వు మనసుకెల్లి తీస్కోకు." రామయ్య సుమతో అన్నాడు.

"పర్లేదు కాకా! ఆది నా మీద కోప్పడవచ్చు. అమ్మకి నాకంటే ఆదినే ఎక్కువ చేరిక. అతని బాధ నేను అర్థం చేసుకోగలను" చెప్పి నిట్టూర్చింది.

"నాన్నా! ఇదిగో మీ బి.పి టాబ్లెట్" ప్రసాదరావు డైనింగ్ టేబుల్ దగ్గర్నుంచి లేవకముందే తెచ్చి యిచ్చింది సుమ.

"నీకు యిక్కడికి రావడానికి యిబ్బంది లేదు కదమ్మా?" అడిగాడు కూతురివైపు చూస్తూ.

"...."

"నాకూ కొద్దికొద్దిగా నీ పరిస్థితి అర్థం అవుతూనే వుంది తల్లీ. నేను పొరబాటు చేశాను. మీ అమ్మ, ఆదిత్య మాటలు పట్టించుకోకుండా నువ్వెలా వున్నావో అని విచారించి వుండాల్సింది."

"ఇంత జరిగాక కూడా ఈ మాట ఎలా అనగలుగుతున్నారు నాన్నా?" సుమ తండ్రి వంక చూస్తూ అంది.

"పసిపిల్లలు మనమాట వినకుండా, మట్టిలో ఆడారని, బురదని కడకుండా వదిలేయం కదమ్మా. నీకేదన్నా యిబ్బంది వుంటే నాతో చెప్పు"

"నాకే ప్రాబ్లం లేదు. మీరు నా గురించి దిగులు పెట్టుకోవద్దు. మీ ఆరోగ్యం బాగా చూసుకోండి. అది చాలు నాకు" అంది నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"నీ సివిల్స్ ప్రిపరేషన్ ఎలా సాగుతుంది? నువ్వు కంటిన్యూ చేస్తున్నావు కదా?" అడిగాడు.

"మానలేదు నాన్నా! మీకు ప్రామిస్ చేశాను ఎలా మర్చిపోతాను?" అంది తండ్రి చేతి మీద చేయి వేస్తూ. పైకి అలా అన్నదే కానీ ఇంట్లో పరిస్థితి గుర్తుకు వచ్చి మనసు అదోలా అయ్యింది.

"ఏం తల్లీ వచ్చావా? మీ నాన్నని చూశాక మమ్మల్ని మర్చిపోయావనే అనుకున్నాను" సుమ గుమ్మంలోకి అడుగుపెడుతూనే అంది రాజేశ్వరి.

సుమ ఆవిడ మాటలకి జవాబివ్వలేదు.

"ఇంకా వాడు రాలేదు కాబట్టి సరిపోయింది. నువ్వు పుట్టింటికి వెళ్ళావని తెలిస్తే నిప్పులు తొక్కిన కోతిలా ఎగురుతాడు. త్వరగా తెమిలి వంటపని చూడు" ఆర్డరేసింది.

సుమ కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చి కూరలు తరగడానికి కూర్చుంది.

రాజేశ్వరి సుమతో ఇంకా మాట్లాడాల్సింది వుందన్నట్టుగా వెనకాలే వచ్చింది.

"నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నాననుకోకు. మొగుడూ పెళ్ళాల మధ్య తరచూ కీచులాటలు మంచివికాదు. అందుకే నువ్వు పుట్టింటికి వెళ్ళిన విషయం వాడి దగ్గర దాస్తున్నాను. నువ్వు కనిపెట్టావో లేదో వాడికి తరచూ సుజీ అనే అమ్మాయి ఫోన్ చేస్తూ వుంటుంది. గంటలు గంటలు ఫోన్లో మాట్లాడుతూ వుంటున్నాడు" ఆపి సుమ మొహంలోకి చూసింది.

సుమ ఎటువంటి భావాలు కనబరచలేదు. మాట్లాడకుండా తన పని చేసుకుపోతూనే వుంది.

"నా మాట విని ఎప్పుడూ ఆ పుస్తకాలు పట్టుకుని కూర్చోకుండా, కాస్త మొగుడ్ని కూడా పట్టించుకో. త్వరగా ఒక బిడ్డను కనగ కన్నావంటే ఇక వాడు ఎక్కడికీ పోడు" ఉచితంగా సలహా పారేసింది కోడలికి

"అప్పుడు మా అమ్మలాగా బిడ్డతో సహా రోడ్డున పడాలి కాబోలు" అనబోయి తమాయించుకుంది సుమ.

"మోహిత్ నాకు నీ ఏటియమ్ కార్డు కావాలి" మోహిత్ టిఫెన్ తింటుండగా అడిగింది సుమ.

"నాకు ఇనిస్టిట్యూట్‌కి టైమవుతుంది" అంటూ లేచాడు అతను.

"నా డబ్బు నాకివ్వాలన్నా నొప్పిగా వుందా? మా అమ్మ యిచ్చిన ముప్పైలక్షలు అప్పుడే ఖర్చయిపోయాయా?" ఒక్కొక్క పదాన్నే ఒత్తి పలుకుతూ కోపంగా అడిగింది.

"నేనేం మీ అమ్మ డబ్బు తీసుకునేంత గతిలేక లేను. మాటలు జాగ్రత్తగా రానీయ్" అన్నాడు ఆవేశంగా.

"అవును. చాలా పౌరుషవంతుడివి నువ్వు" ఎగతాళిగా నవ్వింది.

"మాట పడవు అభిమానం చాలా ఎక్కువ. యిలాంటి బిల్డప్పే యిచ్చావు నాకు. కానీ చేయి చాచి అడుక్కుని కూడా పౌరుషం చూపించడం నీకు మాత్రమే తెలుసు. "

"ఇంకా ఎన్నాళ్ళని నన్ను మోసం చేస్తావు?" గట్టిగా అరిచింది.

ఆమె మాటలు పూర్తి అయ్యీ అవకముందే ఆమె చెంపచెళ్ళుమనిపించాడతను.

వెంటనే సుమ చేయికూడా లేచింది.

"నన్నే కొడతావా? కోపంతో బుసలు కొట్టాడు నీకు ఒక్క రూపాయి కూడా యివ్వను. ఏం చేస్తావో చేసుకో" అంటూ ఆమె జుట్టు పట్టుకుని, బలంగా వీపు మీద గుద్ది వెనక్కి తోశాడు. 'ధబ్...' మంటూ కిందపడిపోయింది సుమ.

వెంటనే, రాజేశ్వరి పరిగెత్తుకుంటూ వచ్చి సుమని పైకి లేపింది.

"ఏంరా నీ పిచ్చికోపం? ఒళ్ళు తెలియకుండా ప్రవర్తిస్తున్నావు అమ్మాయికి దెబ్బలు తగిలితే" అంటూ కొడుకుని మందలించి సుమ గదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టింది.

మోహిత్ ఇంకా కోపం దిగనట్టుగా హాల్లో అటూ యిటూ తిరుగుతూనే వున్నాడు.

"నీకేమైనా బుద్ధుందా? ఆ పిల్ల పోలీసులకి ఫోన్ చేస్తే ఏం చేద్దామని? కాస్త ఒళ్ళు దగ్గరుంచుకో. ఇప్పుడు వాళ్ళ నాన్నకూడా ఆ అమ్మాయి పక్కనే వున్నాడు జాగ్రత్త" మేనత్త కొడుకుని హెచ్చరించడం వినిపిస్తూనే వుంది సుమకి.

ఇంకో ఐదు నిముషాలకి మోహిత్ వెళ్ళిపోయినట్టుగా అడుగుల చప్పుడు వినిపించింది.

"అబ్బా" చేయి తగలగానే నుదుటి మీద నెప్పిపుట్టింది. జుట్టు పట్టిలాగిన చోట మెడ నరాలు సలపరంగా వున్నాయి.

ఒక్క క్షణం కూడా ఆ యింట్లో ఉండబుద్ధి కాలేదు. ప్రసాదరావు కూతురిలాగా, రాజేశ్వరి మేనకోడలులాగా, ఒక చదువుకున్న, సంస్కారంగల అమ్మాయిలాగా కూడా కాదు. భూమి మీద పుట్టిన ఒక మాములు మనిషికన్నా హీనంగా చూడబడ్డట్టు అనిపించింది.

మనసులో రేగిన అశాంతి ఆమెను స్థిరంగా కూర్చోనివ్వలేదు. ఉన్నపళంగా లేచి యింటి నుంచి బైటికి నడిచింది. మొహం మీద రక్తపు మరకలతో, రేగిన జుట్టుతో అలాగే నడుచుకుంటూ యింటికి దగ్గరలో వున్న పార్కులోకి వచ్చింది. నాలుగడుగులు వేసి కనిపించిన చెట్టుకింద మోకాళ్ళ చుట్టూ చేతులు వేసుకుని చతికిలబడింది. మనసంతా మొద్దుబారిపోయినట్టు ఏ ఆలోచనలూ లేవు. క్షణాలూ, నిమిషాలూ, గంటలూ ఎలా గడిచిపోయాయో తెలియదు. మధ్యాహ్నం, సాయంత్రం వచ్చాయి వెళ్ళిపోయాయి. చూస్తూ వుండగానే వెలుతురు మసకబారింది. పక్షులు తిరిగి చెట్లమీదకి చేరుకున్నాయి. వాకింగ్‌లకి వచ్చినవాళ్ళు తిరిగి యిళ్ళదారి పట్టారు.

"నేను ఎటు వెళ్ళాలి?" అప్పటికి సుమ మెదడు ఆలోచించడం మొదలుపెట్టింది.

"నాన్న! ఎటువంటి పరిస్థితిలో అయినా అండగా నిలబడతాడు. కానీ సుధీర్, స్నేహల ముందు నా గురించి ఓడిపోతాడు. ఇప్పటికి నా వల్ల పడ్డ అవమానాలు చాలు. మళ్ళీ యిలాంటి పరిస్థితుల్లో వెళ్ళి గౌరవం పోగొట్టుకోలేను. నా కాళ్ళ కింద నేలని నేనే వెతుక్కోవాలి"

ఆలోచించుకుని పైకి లేచింది. పైపైన జుట్టు సవరించుకుని, రోడ్డు దాటింది. కొంత దూరం నడిచాక, 'టి.ఆర్ జ్యూవెలర్స్" అన్న బోర్డు చూసి షాప్‌లోకి వెళ్ళింది. మెడలో మంగళ సూత్రం, చేతికున్న గాజులు తీసి తూకానికి యిచ్చింది. వాడిపోయినట్టున్న సుమ మొహం, వాలకం చూసి షాపతను అనుమానపడ్డట్టు చూశాడు.

"త్వరగా లెక్కచూసి యివ్వండి" అంది అసహనంగా.

సుమ వట్టి చేతులతో వుండడం చూసి, షాపతనే డబ్బు పెట్టుకోవడానికి ఒక పర్సు దానితోబాటు చిన్న షాపింగ్ బ్యాగ్ కూడా యిచ్చాడు.

"థాంక్యూ" అని చెప్పి షాపు మెట్లు దిగుతూనే వానమీద గాలి బరువుగా తాకింది. ఆకాశంలో చుక్కలు కనిపించకుండా మబ్బులు కమ్మేశాయి. వాతావరణం ఉన్నట్టుండి చల్లబడిపోయింది. వానచుక్కలు ఒక్కొక్కటిగా నేలమీద రాలుతున్నాయి.

సుమ గబగబా మెయిన్ రోడ్ దాటి పక్క సందులోకి తిరిగింది. వాన చినుకుల స్థాయి నుంచి ఎదిగి జల్లుగా మారింది. తడిసి, కాళ్ళకి అడ్డం పడుతున్న కుర్తాని చేత్తో సరిచేసుకుంటూ ఇంటికి వెళ్ళేదారిలో కుడిపక్క సందులోకి తిరిగింది. నాలుగడుగులు వేసిందో లేదో వెనకాల నుంచి ఒక బైక్ వచ్చి స్పీడ్‌గా మలుపు తిరిగింది. సుమ పక్కకి తప్పుకోబోతుండగానే బైక్ వెనకాల కూర్చున్న మనిషి సుమ చేతిలోని సంచిని లాగేయడం, బైక్ స్పీడ్‌గా వెళ్ళిపోవడం రెప్పపాటులో జరిగిపోయాయి. మొత్తం నలభైవేలు ఎగ్జామ్స్‌కి ఫీజు, బుక్స్ సీమకి యివ్వాల్సిన డబ్బు, బటన్స్ వూడిపోయిన హేండ్ బాగ్. అవసరాలన్నీ వరుసగా కళ్ళముందు కదిలాయి.

"బ్లడీ రాస్కెల్ " సుమ కోపంతో వగరుస్తూ, చీకట్లోనే చేతికందిన రాయి తీసుకుని వెంటపడే ప్రయత్నం చేసింది.

పొద్దుటి నుంచీ అనుభవించిన నీరసంతో పరిగెత్తలేకపోయింది. పదడుగులు వేయగానే కాలికి రాయి తగిలి తూలి పక్కనే వున్న బురదగుంటలో పడిపోయింది.

"అమ్మా..!" నొప్పితో బాధతో పెద్దగా అరిచింది. కిందపడ్డ తర్వాత బురదలో నుంచి లేవాలనిపించలేదు. మనసు ముక్కలైనట్టు కుప్పకూలిపోయింది.

ఈదురుగాలి, హోరువాన, తడిసిన మట్టి ఆ క్షణం ఆప్తమిత్రుల్లా అనిపించాయి. తన బాధని వాటితో పంచుకున్నట్టుగా బురద మట్టిని, వాన ధారల్నీ గుండెలకి హత్తుకుని తల్లిని గుర్తుతెచ్చుకుంటూ పొగిలి పొగిలి ఏడ్చింది. ఆమె బాధకి పంచభూతాలూ స్పందించినట్టు అయ్యిందా క్షణం. ఆమె కంటినీటిని తనలో లీనం చేసుకుంటున్నట్టు వాన మరింత హెచ్చింది.

"ఈ పిల్ల ఎక్కడికి పోయిందో ఏమైపోయిందో? ఇంత రాత్రయ్యింది. సెల్ కూడా వదిలేసిపోయింది" కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతూ ఆందోళనగా అంది రాజేశ్వరి.

"ఊరికే కొడుకూ, కోడలు మధ్య గొడవలు పెట్టకు అనేది అందుకే. ఆ పిల్ల ఏ అఘాయిత్యం అన్నా చేసుకుందో లేకపోతే నేరుగా పోలీస్ స్టేషన్‌కే వెళ్ళిందో ఎవరికి తెలుసు?" సోఫాలో కూర్చుని పిల్లాడ్ని ఒళ్ళో పడుకోబెట్టుకుంటూ అంది రవళి.

"నేనేం చేయలేదే తల్లీ. నీ తమ్ముడు ఒట్టి మూర్ఖుడు. ఈ మధ్య మళ్ళీ ఆ సుజీని తగులుకున్నాడు. నా పాటికి నేను కోడలు యింటికి రాలేదని టెన్షన్ పడుతూనే వున్నాను. వాడిపాటికి వాడు బ్యాగు సర్దుకుని బెంగుళూరు వెళ్ళిపోయాడు."

"అంటే ఈ ఉద్యోగానికి కూడా నామాలు పెట్టాడా?"

"వాడికిప్పుడు ఉద్యోగం చేయాల్సిన పనేంటి? చేతిలో డబ్బు.." అనబోయి మాటలు మింగేసింది.

"నేనిప్పుడే చెబుతున్నా! ఆ సుజీ చాలా ఫాస్ట్ దాన్ని పట్టుకుంటే నీ గతి అధోగతే. ఆ పిల్ల నిన్ను తన్ని తరిమేస్తుంది. ఎలాగైనా సుమ ఈ యింట్లో నిలబడితే నీకూ, నాకూ మంచిది తెలుసుకో" తల్లికి సలహా యిచ్చింది రవళి.

"ముందు ఆ పిల్లని యింటికి రానీ. నాకు టెన్షన్‌గా వుంది. ఏదన్నా జరిగితే లేనిపోని పోలీసుల గొడవ. వాళ్ళ నాన్న ఆత్మహత్య చేసుకున్నప్పుడు పోలీసుల్ని మేనేజ్ చేయలేక చచ్చాం. ఇప్పుడు ఒంటరిదాన్ని అయ్యాను. ఏం చేయగలను? పోనీ వాళ్ళ నాన్న దగ్గరికేమన్నా వెళ్ళిందంటావా? వెతుకుదామన్నా హోరు వాన." రాజేశ్వరి అంటూండగానే తలుపు చప్పుడైంది.

"పోలీసులు కాకూడదు దేవుడా" అని దణ్ణాలు పెట్టుకుంటూ వెళ్ళి తలుపు తీసింది రాజేశ్వరి.

తలుపు గడియ తీస్తూనే గాలికి 'ధన్'మని తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయి. ఈదురుగాలికి వానజల్లు ఈడ్చికొట్టింది.

ఎదురుగా ముద్దగా తడిసి బురద అంటుకున్న బట్టలతో కమిలిపోయిన మొహంతో నిలబడివుంది సుమ.

ఆమె జుట్టులోనుంచి, బట్టల్లోనుంచి నీళ్ళు ధారలుగా కారుతున్నాయి. ఆ కళ్ళలో ఒక విధమైన మొండితనం, నిర్వేదం స్పష్టంగా కనిపిస్తూ వున్నాయి.

ఆ కళ్ళలో ఒక విధమైన మొండితనం, నిర్వేదం స్పష్టంగా కనిపిస్తూ వున్నాయి.

సుమ వాలకం చూసి రాజేశ్వరి గుండెలు దడదడమన్నాయి. కోడల్ని ప్రశ్నించడానికి ధైర్యం చాల్లేదు.

"రామ్మా! లోపలికి రా!" అంటూ చేయిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది.

రవళి వెంటనే లేచి స్నానం చేయించి, తల తుడిచి మార్చుకోవడానికి బట్టలుయిచ్చింది.

తల బాగా ఆరబెట్టి వేడిపాలతోబాటు, క్రోసిన్ టాబ్లెట్ కూడా యిచ్చి వెచ్చగా పడుకోబెట్టారు.

"హమ్మా.. ఇంత సేవలు యిప్పటివరకూ నేనెవరికీ చేయలేదు. చచ్చిపోయిన మీ నాన్న కూడా నా చేత చేయించుకోలేదు" హాల్లోకి వచ్చి సోఫాలో కాళ్ళు పైకి పెట్టుకుంటూ ఆయాసపడింది రాజేశ్వరి.

"ఆ అమ్మాయి ఎంతైనా నీ అన్న కూతురు. తల్లి చచ్చిపోయి నిండా నెలరోజులు కాలేదు. చిన్నపిల్ల మనసు చెదిరిపోయి వుంటుంది. మరీ ఏడిపిస్తే మనకే తిరిగి కొడుతుంది. కాస్త నీ కొడుకు దారికి వచ్చేదాకా ఆ పిల్లని జాగ్రత్తగా చూసుకో" హితబోధ చేసింది రవళి.

"నిజమేనే" తలాడించింది రాజేశ్వరి. "ఇందాక ఆపిల్లని చూసి గుండె ఆగి, చచ్చినంత పనైందనుకో. దెయ్యం పట్టిన దానిలా భీతిలేకుండా మొండిగా నిలబడివుంది" ఆ దృశ్యాన్ని గుర్తుచేసుకుని, భయంగా కళ్ళు మూసుకుంది.

ప్రొద్దున నిద్రలేచేసరికి, కాస్త తేలిగ్గా అనిపించింది సుమకి. ముందురోజు జరిగినదంతా ఒక కలలాగా ఏదో సినిమాలో చూసినట్టుగా అనిపించింది. దాన్ని తిరిగి గుర్తుచేసుకోదలచుకోలేదు ఆమె.

నెమ్మదిగా లేచి తయారై వచ్చేసరికి, రాజేశ్వరి టిఫెన్ సిద్ధం చేసి వుంచింది.

"ఎక్కడికి వెళ్ళాలని రెడీ అయ్యావు? నీ కసలే ఒంట్లో బాలేదు. కాస్త తిని రెస్టు తీసుకో" అంది సుమని ఎగాదిగా చూస్తూ.

సుమ మాట్లాడకుండా టిఫిన్ తినడం పూర్తిచేసి, హాండ్ బ్యాగ్ తగిలించుకుంది.

"సాయంత్రానికల్లా యింటికి వస్తాను కంగారు పడకండి" మేనత్తకి చెప్పింది వెళ్ళబోతూ.

రాజేశ్వరి ఏదో అనబోయినదల్లా ఆగి సుమ వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయింది.

"ఇన్ని రోజుల తర్వాత నువ్వు మా యింటికి రావడం, సర్ప్రైజింగ్‌గా వుంది" అంటూ "అర్రెర్రె ఏంటా దెబ్బలు మొహం మీద?" సుమని చూస్తూనే అడిగింది సీమ.

"గుమ్మానికి కొట్టుకున్నాను. అంకుల్ యింట్లోలేరా?" అడిగింది లోపలికి అడుగుపెడుతూనే.

"ఓహో అంటే నీ జాబ్‌కి డాడీ రికమెండేషన్ కోసం వచ్చావు కానీ నాకోసం కాదన్నమాట" అంది మూతి విరుస్తూ.

"అలాంటిదేమీ లేదు. రెండు కలిసి వస్తాయని వచ్చాను. మోహిత్ బెంగుళూర్ వెళ్ళాడు. నాకు రోజంతా యింట్లో తోచడంలేదు. ఈ జాబ్ వస్తే నాకు బావుంటుంది. నైన్ టు నైన్ సాఫ్ట్‌వేర్ జాబ్స్ చేయదల్చుకోలేదు. సివిల్స్‌కి ప్రిపేరవలేను. లైబ్రరీలో అయితే, హాయిగా నిశ్శబ్ధంగా వుంటుంది. పని తక్కువ. నాకూ చదువుకోవడానికి ఈజీగా వుంటుంది. ఎటువంటి పరిస్థితిలోనూ ఈ జాబ్‌ని వదులుకోవాలని లేదు నాకు."

"సారీ డాడీ వూళ్ళో లేరు" చెప్పింది సీమ. "కానీ, నువ్వేం కంగారు పడకు. ఈ కాంట్రాక్ట్ ఉద్యోగం ఖచ్చితంగా నీకే ఏదో అంటారు చూడూ..

"ఆ నిశ్శబ్ధ నీరవం"

"ఆకులు కదిలినా, చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్ధం"

"ఒంటరితనాన్ని గుర్తుచేసి, నిలువునా కాల్చివేసే వాతావరణం" ఇలా అంటుంటారే అది భరించలేక. చాలామంది ఆ జాబ్ వదిలి పారిపోతూ వుంటారట. డాడీ మొత్తుకుంటారెప్పుడూ. నువ్వేమో ఎగురుకుంటూ, చేస్తానంటున్నావ్. ఇక నీకు ఈ ఉద్యోగం వచ్చినట్టే అనుకో. నాదీ గ్యారంటీ" అంది భరోసాగా భుజం తడుతూ. మధ్యాహ్నం లంచ్ సీమ వాళ్ళింట్లోనే చేసింది సుమ.

తిరిగి యింటికి వెళ్ళబోయేటప్పుడు "ఐ యామ్ సారీ సీమా! నీ డబ్బు తిరిగి యివ్వడానికి నాకు కాస్త టైం కావాలి" అంది స్నేహితురాలి చేతిని ముట్టుకుంటూ.

"నో ఫార్మాలిటీస్. నీ దగ్గర వున్నప్పుడే యివ్వు. నువ్వూ మీ నాన్నగారూ దగ్గరయ్యారు. అయామ్ సో హాపీ. త్వరలోనే ఆదిత్య కూడా నార్మల్ అవుతాడు. నీ ప్రాబ్లమ్స్ అన్నీ తీరిపోతాయి" అంది నమ్మకంగా.

ప్రసాదరావుగారి యింటి కాంపౌండ్ వాల్ దాటి లోపలికి అడుగుపెట్టింది సుమ. చాలా రోజుల తర్వాత స్థిమితంగా యింటిని, యింటి ముందున్న గార్డెన్‌ని పరికించి చూసింది. మేడమీద ప్రసాదరావు స్టడీరూం కిటికీ అక్కడికి కనిపిస్తూ వుంది. ఆ గదిలో సాయంత్రాలు పుస్తకాలు చదువుతూ తండ్రితో చర్చించడం, వసుంధర కాలేజీ నుంచి వచ్చేదాకా అక్కడే కిటికీ దగ్గర కూర్చుని ఎదురు చూడడం గుర్తొచ్చాయి.

"ఆదిత్య ఎప్పుడూ ఏదో పని చేస్తూ ఈ గార్డెన్‌లోనే తిరుగుతూ వున్నట్టుండేది" అనుకుంటూ పూలమొక్కల వైపు చూసింది. గార్డెన్‌కి యిదివరకు ఉన్న కళలేదు.

వానలకి మొక్కల మధ్యలో కలుపు బాగా పెరిగిపోయి వుంది. పాదులు సరిగ్గా లేక వానలకి నీళ్ళు నిలబడి చాలావరకు మొక్కలు ఎర్రబారిపోయి వున్నాయి.

"కాకా! మాలి రావడంలేదా? తోటంతా యిలా వుంది?" అటుగా వస్తున్న రామయ్యని అడిగింది.

"ఆదిత్య బాబు సరిగా జూస్తలేడు బిడ్డా! దానితోని మాలిగూడ సరిగ్గా వస్తలే. వచ్చినా మంచిగ జేసుడు లే" చెప్పాడు రామయ్య.

"కాకా! రేపు సాయంత్రం నేను యిదే టైంకి యిక్కడికి వస్తాను. మాలిని ఒకసారి నాకు కనిపించమని చెప్పు. ఏమేమి పనులు చేయాలో చెప్పి వెళతాను" చెప్పి లోపలికి నడిచింది.

"నాన్నా! ఈ మధ్య మీరు రాసిన వ్యాసాలు వుంటే యివ్వండి. టైప్ చేసి పెడతాను" వస్తూనే స్టడీరూంలో టేబుల్ మీద పుస్తకాల్ని సర్దుతూ తండ్రితో అంది.

"నువ్వెప్పుడో ఒకసారి వస్తావు. ఈ పనులన్నీ నీకు ఎందుకమ్మా?"

"ఇవి పనులు ఎప్పటినుంచి అయ్యాయి? టైపు కొట్టినట్టూ వుంటుంది. కొత్త విషయాలు నేర్చుకున్నట్టూ వుంటుంది అనేవారు మర్చిపోయారా?" అంటూ తండ్రి వైపుకి తిరిగింది.

"సుమా మొహం మీద ఆ దెబ్బలేమిటి? ఏం జరిగింది?" అడిగాడాయన సుమ మొహం చూస్తూనే, కంగారుగా!

"అబ్బా! నిన్న వానకి వరండాలో జారిపడ్డాను నాన్నా! ఇప్పటివరకు కనిపించిన అందరూ అడిగారు. చెప్పి చెప్పి విసుగొచ్చింది" అంది నవ్వేస్తూ.

"నీకొక మాట చెబుదామని మర్చిపోయానమ్మా! నీ బాంక్ ఎకౌంట్ క్రెడిట్ కార్డ్స్ ఏటియమ్ కార్డ్స్ మనింట్లోనే వుండిపోయాయి. నీకేమైనా అవసరాలు వుంటాయి. తీసుకెళ్ళి వాడుకో. డబ్బుకి యిబ్బంది పడకమ్మా" వాత్సల్యంగా అన్నాడాయన.

ఆయన చెబుతూ వుండగానే సుమ కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. రెండురోజుల క్రితం డబ్బుకోసం పడ్డపాట్లు కళ్ళముందు కనిపించాయి. పట్టుదల, అభిమానం, తండ్రి ప్రేమ ముందు చిత్తుగా ఓడిపోయినట్టు అనిపించింది.

"అలాగే నాన్నా!" తడిగొంతుతో చెప్పింది.

"మీకు యింకో విషయం చెప్పాలి. నేను యూనివర్శిటీ లైబ్రరీలో జాబ్ కోసం ప్రయత్నిస్తున్నాను ఖచ్చితంగా దొరుకుతుందనే నమ్మకంగా వుంది. ఒకవేళ, జాబ్ వస్తే ఇక మీదట ఆదివారాలు మాత్రమే యిక్కడికి రాగలను" వివరంగా చెప్పింది.

"డబ్బు కోసమే అయితే నువ్వా జాబ్ చేయక్కర్లేదు. నీ ప్రిపేరషన్ దెబ్బ తినకుండా చూసుకో" హెచ్చరించాడు.

"ప్రిపరేషన్‌కి ఎటువంటి యిబ్బంది వుండదు నాన్నా! నా మాట నమ్మండి. జీవితంలో నా అంతట నేను ట్రై చేసి చూద్దామనుకుంటున్నాను. నన్నూ లైఫ్‌ని తెలుసుకోనీయండి."

"సరేనమ్మా! నీ యిష్టం. కానీ, నీకు ఎటువంటి యిబ్బంది వచ్చినా నాకు చెప్పాలి" అంటూ సుమ భుజం తట్టాడు.

"మామయ్యా రాజ్ అంకుల్ ఫోన్ చేశారు. రేపు మిమ్మల్ని వచ్చి కలుస్తారట" అంటూ గదిలోకి వచ్చి సుమని చూసి ఠక్కున ఆగిపోయాడు.

"రా..రా! నీతో మాట్లాడాలనుకుంటున్నాను. నువ్వే వచ్చావు. సుమ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచాలి. బ్యాంక్ వాళ్ళతో మాట్లాడు. ఇంకా ఎకౌంట్‌లో మనీ ఎంతుందో చెక్ చేసి, అవసరమైతే నా ఎకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయి" చెప్పాడు.

"అలాగే మామయ్యా" అంటూ తలాడించాడు. అనుకోకుండా సుమ వైపుకి చూశాడతను.

ఒక్క క్షణంపాటు యిద్దరి చూపులూ కలుసుకున్నాయి.

"నీకింకా వేరే పనులేమన్నా వున్నాయా" ప్రసాదరావు ఆదిత్యని అడుగుతూ వుండగానే.

"హాయ్! నువ్విక్కడ వున్నావా?" అంటూ ఒక అమ్మాయి వచ్చి ఆదిత్య పక్కన నిలబడింది.

"నమస్తే అంకుల్" ప్రసాదరావుకి చెప్పి

"మీరు." అంటూ సుమని చూసి ఆగిపోయింది.

"తనే సుమ మామయ్య కూతురు" మిగిలిన పరిచయం పూర్తిచేశాడు ఆదిత్య.

"ఈ అమ్మాయి దీప్తి. మీ అమ్మ కొలీగ్ కూతురు. ఆదిత్యకి కాబోయే భార్య. మీ అమ్మ పట్టుబట్టి చేయించింది వీళ్ళిద్దరి ఎంగేజ్‌మెంట్" ప్రసాదరావు కూతురికి పూర్తి వివరం యిచ్చాడు.

సుమ అప్పుడు సరిగ్గా చూసింది దీప్తిని. స్టన్నింగ్ బ్యూటీ కాకపోయినా, చూడడానికి అందంగానే వుంది.

ఆమె వేసుకున్న చుడీదార్, ఆమె అభిరుచికి తగినట్టుగా ప్రత్యేకంగా కనిపించింది.

"ఫియాన్సీని యింప్రెస్ చేయడానికి కాబోలు కొంచెం ఎక్కువగా తయారై వచ్చింది" అనుకుని చిన్నగా నవ్వుకుంది సుమ.

"కూర్చోండి కాఫీ తెస్తాను" అని లేవబోతుంటే, వారించింది దీప్తి.

"సారీ! వుయ్ హావ్ ప్లాన్స్" అని సుమతో చెప్పి

"మనం వెళదామా?" అంది ఆదిత్య భుజం మీద చేయివేస్తూ.

"వెళ్ళొస్తాను మామయ్యా! డిన్నర్‌కి నాకోసం ఎదురు చూడకండి" చెప్పి దీప్తితో బాటు కిందకి వెళ్ళాడు ఆదిత్య.

వాళ్ళు వెళ్ళిన ఐదు నిముషాలకి, సుమ కూడా మేడదిగి, ఆదిత్య గదిలోకి వచ్చింది.

అతని అలమరలో మాగ్‌జైన్స్ కోసం చూస్తూ, పక్కనే కనిపించిన బాక్స్‌ని తెరిచి చూసింది.

అందులో ఇంకో పెట్టెలాంటిది కనిపించింది. దాంట్లో డైమండ్ పొదిగిన వుంగరం వున్న బాక్స్. ఇంకా కొన్ని కార్డ్స్ ఉన్నాయి.

సుమ వాటిల్లో నుంచి ఒక పసుపు పచ్చని కార్డుని తీసి చూసింది. అందులో 'టు. ఆదీ' అని వంకర టింకరగా రాసి వున్న అక్షరాలు, పక్కన ఒక పువ్వు బొమ్మ వేసివుంది. అది ఒకటే తరగతిలో ఆదిత్య పుట్టినరోజుకి యిచ్చిన గ్రీటింగ్ కార్డు. ప్రతిసంవత్సరం సుమ యిచ్చిన గ్రీటింగ్ కార్డులన్నీ జాగ్రత్తగా భద్రపరిచి వున్నాయందులో. వాటి అడుగున ఎంగేజ్‌మెంట్ కోసం కొన్న పట్టుచీర కనిపించింది. ఆదిత్య దీప్తికి యివ్వకుండా దాచి వుంచిన చీరని, వుంగరాన్ని చూసి, సుమ మనసు బాధతో మూలిగింది.

"అయామ్ సారీ బావా! నిన్ను చాలా బాధపెట్టాను" మునివేళ్ళతో చీర అంచుల్ని తాకుతూ మనసులోనే అనుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్నట్టుగా అలికిడి అవడంతో, సుమ గబుక్కున ఆ పెట్టెను లోపలికి తీసి లేచి నిలబడింది.

ధన్ మని తలుపుని తోసుకుంటూ ఆదిత్య లోపలికి వచ్చాడు.

"నువ్వా యిక్కడేం చేస్తున్నావు?" కనుబొమలు ముడుస్తూ కోపంగా అడిగాడు ఆమెని చూస్తూనే.

"గార్డెనింగ్ మ్యాగజైన్స్ కోసం వచ్చాను. నువ్వు పట్టించుకోకపోయినా, నేను వదిలేయదల్చుకోలేదు" అంది తొణక్కుండా.

"ఇప్పుడు హఠాత్తుగా మా అందరిమీదా అంత ప్రేమ పుట్టుకొచ్చిందన్నమాట. ఎందుకు? మళ్ళీ నమ్మించి మోసం చేయడానికా?"

"ఆదీ ప్లీజ్. అలా అనకు. అయామ్ వెరీ సారీ" అంటూ రెండడుగులు ముందుకు వేసింది. "జరిగింది మర్చిపోయి మనం యిదివరకటిలా వుండలేమా? చిన్నతనం నుంచి కలిసి పెరిగాం. మన మధ్య ఏ రిలేషనూ లేదా?" ఆవేదనగా అంది.

"మనిద్దరి మధ్య వున్న ఒకే ఒక్క రిలేషన్ మామయ్య. ఆయన కోసమే నేను నిన్ను భరిస్తున్నాను అంతే" తీవ్రంగా అన్నాడు.

"నిజంగా నామీద అంత కోపం పెంచుకున్నావా ఆదీ! ఇవాళ ఉదయం నుంచీ నా మోహం చూసిన ప్రతి ఒక్కరూ ఈ దెబ్బలు ఎలా తగిలాయి? అని అడిగినవాళ్ళే.అందరికీ నేను అబద్ధం చెప్పాను. నాన్నతో సహా. నీకు మాత్రం నిజం చెప్పాలనిపించింది. కానీ, నువ్వు అడగలేదు. ఎనీ హౌ ! కంగ్రాట్స్. దీప్తీ, నువ్వూ మేడ్‌ఫర్ ఈచ్ అదర్‌లా ఉన్నారు. "

ఇంతలో తలుపు చప్పుడైంది.

"హే! ఆదీ ఇక్కడున్నావా నువ్వు?" అని నవ్వుతూ లోపలికి వచ్చింది దీప్తి.

ఇద్దరి మొహాలు సీరియస్‌గా వుండడంతో "ఈజ్ ఎవ్రిథింగ్ ఓ.కె?" అని అడిగింది ఆదిత్య వైపుకి తిరిగి.

"సెల్ ఫోన్ కోసం వచ్చాను" అంటూ ఛార్జింగ్‌లో వున్న సెల్‌ఫోన్‌ని తీసుకుని బైటికి నడిచాడు ఆదిత్య.

వారం తర్వాత నుంచి సుమ ఉద్యోగజీవితం ప్రారంభమైంది మోహిత్ బెంగుళూరు వెళ్ళిన దగ్గర్నుంచి తిరిగి యింటికి రాలేదు. మధ్యలో రెండుసార్లు సుమకి ఫోన్ చేసినా సుమ మాట్లాడలేదు.

రాజేశ్వరి మాత్రం అప్పుడప్పుడూ కొడుకుతో మాట్లాడడం, ఇంటి ఖర్చులకి డబ్బు పంపమని గొడవపడడం సుమ గమనిస్తూనే వుంది. కానీ తెలియనట్టే ఊరుకుంది.

చూస్తూ వుండగానే, నెలరోజులు గడిచిపోయాయి.

ఆ రోజు ఆదివారం.

ఉదయం తొమ్మిది గంటలకల్లా తండ్రి యింటికి వచ్చింది సుమ. వస్తూనే, నర్సరీ నుంచి తెప్పించిన కొత్త పూలమొక్కలను ఎటువైపు నాటాలో మాలికి వివరించి లోపలికి వచ్చింది.

ప్రసాదరావు గదిలోకి వెళ్ళి రెండు చిన్న చిన్న ప్లాస్టిక్ బాక్సులతో బైటికి వచ్చింది.

వాటి మీద "సండే, మండే" అని వారంలోని ఏడురోజులు పేర్లు రాసి వున్న అరలు వున్నాయి.

ఒక్కొక్కదానిలో వారం పాటు ప్రసాదరావు వేసుకోవలసిన మందుల్ని పెట్టి, రామయ్యని పిలిచింది.

"కాకా! రోజూ నువ్వు పనిలోకి వస్తూనే ముందీ మందుల పెట్టెని చూడాలి. ఏరోజు నాన్న మందులు వేసుకోకపోతే ఆ రోజు వెంటనే నాకు ఫోన్ చేసి చెప్పు. మళ్ళీ వచ్చే ఆదివారం యిలానే మందులు సర్ది యిచ్చి వెళతాను సరేనా?" చెప్పింది సుమ.

"అలాగే బిడ్డా!" తలూపాడు రామయ్య.



కౌముది

"ఇవాళ నాకు జీతం వచ్చింది కాకా! ఇది వుంచు. నీ మనవరాలికి ఏదన్నా కొనివ్వు" అంటూ కొన్ని వందలనోట్లు రామయ్య చేతిలో పెట్టింది.

"సంతోషం బిడ్డా! నువ్వు లేకుంటే యింట్లో గిట్ల సందడే లేదు. నీ కోసం ఆదివారమెప్పుడొస్తదా అని జూస్తంట. పైకి కనబడతలేగానీ సాబ్ గూడ బేజారుంటడు."

"అదేంటి కాకా బావ ఆఫీసు నుంచి ఆలస్యంగా యింటికి వస్తున్నాడా?" అడిగింది సుమ కనుబొమలు ముడుస్తూ.

"ఎప్పుడొస్తే ఏందిలే తల్లీ వస్తానే ఆయమ్మ బైటికి తీస్కొల్లిపోతది లేకున్నా బాబు గదిలోనే కూర్చుంటడు" చెప్పాడు రామయ్యా

"అవునా?" ఆలోచిస్తున్నట్టుగా అంది సుమ.

మేడమీద బాల్కనీలో నుంచి కిందకి చూస్తూ నిల్చున్నాడు ఆదిత్య. వానలకి మొక్కలన్నీ పచ్చగా నవనవలాడుతూ వున్నాయి.

గత నెలరోజులుగా సుమ గార్డెన్ మీద చూపించిన శ్రద్ధ కొట్టొచ్చినట్టుగా కనిపిస్తూ వుంది.

సుమ కొత్తగా చేసిన మార్పుల్ని ఆసక్తిగా పరికిస్తూ ఉన్నాడతను. ఇంతలో కాంపౌండ్ గేటు తీసుకుని లోపలికి వస్తూ కనిపించాడు ప్రసాదరావు. ఆయన పక్కనే చేయి పట్టుకుని నడుస్తూ సుమ. ఇద్దరూ వాకింగ్ నుంచి తిరిగి వస్తూ మాట్లాడుకుంటూ నవ్వుతూ వున్నారు.

చాలాకాలం తర్వాత మేనమామ మొహంలో సంతోషాన్ని చూశాడు ఆదిత్య.

ఆ ఆనందానికి కారణం సుమ అని అర్ధమైందతనికి.

తెలియకుండానే, అతని చూపులు ఆమె మీదకి మళ్ళాయి. నీరెండలో ఆమె బుగ్గలు అద్దాల్లా మెరుస్తున్నాయి. నవ్వుతో ఆమె ముఖం మరింత వెలిగిపోతున్నట్టుగా కనిపించింది.

ఇంతలో ఉన్నట్టుండి వానాకాలపు మబ్బులు ఆకాశాన్ని బూడిదరంగుతో కప్పేశాయి. అవి ఆ ఆకుపచ్చని తోటనిపై నుంచి ఆసక్తిగా చూస్తున్నట్టు మరింత కిందకి వచ్చాయి. వాటి రెండింటి మధ్య చిక్కుబడిపోయిన సూర్యకాంతి హఠాత్తుగా సింధూర వర్ణంలోకి మారిపోయింది.

మూడు రంగుల్లో అందమైన ప్రకృతి దృశ్యం అద్భుతంగా ఆవిష్కరించబడింది. ఆ చిత్రంలో చక్కగా అమరిపోయినట్టున్న సుమనీ, ప్రసాదరావునే చూస్తూ ఒక్క క్షణం మైమరిచిపోయాడు ఆదిత్య.

"ఓహ్! ఆదీ నువ్వు యిక్కడ వున్నావా?" వెనుక నుంచి ఒక్క ఉదుటున వచ్చి, ఆదిత్య భుజాల మీద చేతులు వేసింది దీప్తి.

అతను హఠాత్తుగా ఊహాలోకం నుంచి వాస్తవంలోకి తూలిపడ్డాడు.

"కమాన్.. ఐ హేవ్ ఎ సర్‌ప్రైజ్ ఫర్ యూ" అంది ఉత్సాహంగా. తప్పనిసరై. ఆమె వెంట నడిచాడు ఆదిత్య.

**టీతోబాటు** వేడి వేడి పకోడీలు ట్రేలో పెట్టుకుని టేబుల్ దగ్గరికి వచ్చింది సుమ.

"వావ్! ఉల్లిపాయ పకోడీలు ఎనీథింగ్ స్పెషల్?" అడిగింది దీప్తి హుషారుగా.

"ఇవాళ ఆదివారం ప్లస్ అందరం యింట్లోనే వున్నాం కదా అని. అంతే" టీ కప్పులు ఒక్కొక్కరికే అందిస్తూ చెప్పింది.

"నాన్నా! దీప్తి, ఆదిల పెళ్ళి త్వరగా చేసేయండి. దీప్తి యింట్లో మీకు తోడుగా వుంటుంది. మంచి హుషారు, ఎనర్జీ వున్న అమ్మాయి. మీకు బోలెడంత కాలక్షేపం. వీళ్ళిద్దరికీ గనక త్వరగా పిల్లలు పుట్టారంటే యిక యిల్లంతా సందడే సందడి. బోరన్నమాటే వుండదు" అంది సుమ ప్రసాదరావు వైపుకి తిరిగి.

"చూశావా! నేను సర్‌ప్రైజ్ బ్రేస్‌లెట్ యిచ్చిన వేళావిశేషం" అని ముసిముసిగా నవ్వుతూ ఓరకంట ఆదిత్య వైపుకి చూసింది దీప్తి.

ఆదిత్య మొహం సీరియస్‌గా మారిపోయింది.

"అయిపోయిందా నీ వుపన్యాసం?" అంటూ దిగ్గున లేచాడతను.

"నా వ్యవహారాల్లో కలుగజేసుకోవద్దని ముందే హెచ్చరించాను నిన్ను" సుమవైపుకి చూస్తూ కోపంగా అన్నాడు.

అందరి ముందూ జరిగిన అవమానాన్ని దిగమింగుకునే ప్రయత్నం చేసింది సుమ. మొహంలో బాధని కప్పిపుచ్చుకుంటూ బింకంగా దీప్తి వైపుకి చూసింది.

ఆమె మొహం చమురులేని దీపంలా కాంతివిహీనంగా అయిపోయింది.

"డోంట్ వర్రీ దీప్తీ! ఆదిత్య కోపం నా మీద. నేను మీ విషయాల్లో కల్పించుకోవడం బహుశా, అతినికి యిష్టం లేనట్టుంది. నువ్వు అనవసరంగా ఆలోచించకు" దీప్తి భుజం మీద చేయివేస్తూ అంది సుమ.

సుమ మాటలకి బలవంతాన నవ్వు తెచ్చుకుని, తల ఊపింది దీప్తి.

"మీ అమ్మ సంవత్సరీకాలు పూర్తి అయ్యేదాకా పెళ్ళి చేసుకోనని నాకు ముందే చెప్పాడు. బహుశా నువ్వు పెళ్ళి గురించి మాట్లాడడం ఆదికి నచ్చలేదనుకుంటా. కానీ దానికే యింత విపరీతంగా ప్రవర్తించడం నాకూ, విచిత్రంగానే వుంది" కూతురితో అన్నాడు ప్రసాదరావు.

సుమ పైకి ఏమీ మాట్లాడలేదు కానీ అసలు విషయం మాకు తెలుసన్నట్టుగా జవాబు చెప్పాయి ఆమె కళ్ళు.

ఉదయాన్నే యింట్లో పనులు ముగించుకుని, ఉద్యోగానికి వెళ్ళడానికి తయారవుతూ వుంది సుమ.

"అమ్మాయ్ నీతో కొంచెం మాట్లాడాలి" అంటూ రాజేశ్వరి సుమ గదిలోకి వచ్చింది.

"మోహిత్ యిల్లు వదిలి నెలలు గడిచిపోతున్నాయి. ఇంట్లో పెళ్ళాన్ని ఒంటరిగా వదిలేసి ఏ మగాడైనా అన్నాళ్ళు బైట ఎలా తిరగగలడు? మీ యిద్దరి మధ్యా గొడవ కోపతాపాల స్థాయిని దాటి పంతాల దాకా పోయింది. అందుకే వాడు యిల్లు పట్టకుండా తిరుగుతున్నాడు. నా మాట విని నువ్వు ఒకసారి వాడికి ఫోన్ చేసి, ప్రేమగా మాట్లాడు. ఎందుకు రాడో చూస్తాను."

"మా మధ్య జరిగిన గొడవకే మీ అబ్బాయి అలిగి బెంగుళూరు వెళ్ళలేదు. చేతిలో వున్న ముప్పై లక్షలు జాలీగా ఖర్చు చేసుకోవడానికీ జల్సాగా తిరగడానికీ వెళ్ళాడు. అలాంటప్పుడు నేనేదో తప్పు చేసినట్టు ఎందుకు బతిమాలాలి?" సూటిగా అడిగింది సుమ.

"సరే! పోనీ ఆ సుజీ కోసమే వాడు యిల్లొదిలి వెళ్ళాడనుకో. కానీ నువ్వు వాడికి భార్యవి. ఆడదానిగా నీకు కాపురాన్ని కాపాడుకోవాలన్న ఆరాటం ఉండొద్దు." సాగదీస్తూ అంది.

సుమ మేనత్త వైపు చూసి, విరక్తిగా నవ్వింది.

"నాకేమీ అలాంటి భ్రమలు లేవు. ఒక అబద్ధాన్ని నమ్మి, నా ఫ్యూచర్‌నీ, ఫ్యామిలీని వదులుకున్నాను. ఇంకా అదే అబద్ధాన్ని నమ్మి జీవితాన్ని నాశనం చేసుకునేంత ధైర్యం నాకు లేదు. నేను మనసు ముక్కలై యింట్లోంచి వెళ్ళిపోయిన రోజు. కనీసం ఎక్కడికెళ్ళానో,

ఏమైపోయానో అన్న కంగారు లేకుండా, హాయిగా బెంగుళూరు వెళ్ళిన మనిషిని గురించి నేనెందుకు ఆరాటపడాలి?'' ఎదురు ప్రశ్నించింది.

రాజేశ్వరి మారు మాట్లాడకుండా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. సుమ ఊహించినట్టుగా కోపంతో అరవకపోవడం ఆమెని ఆలోచనలో పడేసింది.

రెండు రోజుల నుంచి పాలవాడు, కరెంటు వాళ్ళు, బిల్స్‌కోసం తిరిగి వెళుతున్నారు. డబ్బుకి యిబ్బంది అయివుండొచ్చు. బహుశా మోహిత్ డబ్బు పంపకపోవడమో, కాంటాక్ట్‌లో లేకుండా వుండడమో. అత్తగారి ఆదుర్దాని కారణం అయివుండొచ్చు అనుకుంది.

లైబ్రరీ నుంచి యింటికి తిరిగి వచ్చేటప్పుడు కూడా ఈ విషయమే ఆలోచిస్తూ వుంది సుమ.

''ఇన్ని నెలలుగా మోహిత్ లేకుండా వుండడం అలవాటై పోయింది. ఒకవేళ నిజంగా అతను తిరిగి వస్తే అతను చేసిన మోసం తెలిసీ, తల్లిని బాధపెట్టి దూరం చేసుకున్నానన్న దిగులుని మర్చిపోయి. ఎప్పటిలా మామూలుగా వుండగలనా?''

మనసులోనే ప్రశ్నలకి సమాధానాలను వెతుక్కునే ప్రయత్నం చేసింది.

ఆమె ఆలోచనల్ని భగ్నం చేస్తూ రోడ్డు మీద వెనకాల నుంచి గట్టిగా హారన్ సౌండు వినిపించింది.

ఒక్కసారిగా ఉలిక్కిపడి, తడబడుతూ, పక్కనే వున్న ఫుట్‌పాత్ వైపుకి అడుగులు వేస్తుండగా, ఇంకొక బైక్ రయ్యిన దూసుకు వచ్చింది.

సుమ గ్రహించి తప్పుకునేలోపలే, బైక్ నడిపే వ్యక్తి సకాలంలో బ్రేక్ వేయడం ఫ్రంట్‌వీల్ దాదాపుగా ఆమె కాలికి తగిలినట్టు వచ్చి ఆగడం... ఆమె ముందుకు పడిపోవడం అన్నీ రెప్పపాటులో జరిగిపోయాయి.

సుమ మోచేతులు వెళ్ళి ఫుట్‌పాత్ అంచుకు కొట్టుకున్నాయి. చేతిలో పుస్తకాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆమె లేచేలోపే వెనక నుంచి హారన్ల రొద పెరిగిపోయింది.

ఫుట్‌పాత్ మీద నడుస్తున్న మనుష్యులు ఏదో విచిత్రాన్ని చూసినట్టుగా కిందపడ్డ సుమని చూస్తూ వెళుతున్నారు. సుమ పుస్తకాలు ఏరుకుని మోకాలి మీద చేయిపెట్టి లేచేలోగా గబుక్కున చేయిపట్టి పైకి లాగారెవ్వరో.

ఆ ఊపుకి అనుకోకుండా ఆ వ్యక్తి ఛాతీ మీదకి వాలిపోయింది. ఆధారం కోసం అతని చేతిని గట్టిగా పట్టుకుని, తల ఎత్తుతూనే, ''ఆదీ నువ్వా!'' అడిగింది ఆశ్చర్యంగా.

''రోజూ యిలా సిటీ బస్సులో పడి, రోడ్లమీద ఎదురు దెబ్బలు తింటూ ఉద్యోగం చేస్తున్నావన్నమాట'' అడిగాడు కోపంగా.

''దేశంలో కొన్ని కోట్లమంది బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. రోడ్లమీద నడుస్తున్నారు. చాలా కొద్దిశాతం మంది మాత్రమే కార్లలో తిరిగేది'' అంది రోషంగా.

''ఇందాక నువ్వు చేసిన సర్కస్‌ఫీట్లు నేను చూడలేదనుకోకు పద. నిన్ను డ్రాప్ చేస్తాను'' అన్నాడు అధార్టీగా.

సుమ అతనిబాటు వచ్చి కారులో కూర్చుంది.

''కిందపడితే పడ్డానుకానీ నువ్వు నాతో మాట్లాడావు. అయామ్ హ్యాపీ'' అంది నవ్వుతూ.

ఆదిత్య సుమ వంక సీరియస్‌గా చూసి డ్రైవింగ్ స్టార్ట్ చేశాడు.

''ఆదీ! అయామ్ సారీ నాన్న ఒంటరితనం చూడలేకే నిన్ను త్వరగా పెళ్ళి చేసుకోమన్నాను. నీకు కోపం తెప్పించాలని కాదు'' మెల్లగా చెప్పింది.

"అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి? దీప్తి రాగనే పాతసినిమా హీరోయిన్లా మీ నాన్నకి సేవలు చేస్తుందనా?" వెటకారంగా అన్నాడు.

"సేవలు చేయనక్కరలేదు. కనీసం యింట్లో మనిషి తోడుగా వుంటుందని" సణుగుతూ అంది.

"యూ.నో...వ్వాట్! అన్నీ నీకే తెలుసనుకోవడం మానేయ్ ముందు" అన్నాడు చిరాగ్గా.

ఆ తర్వాత సుమ మాట్లాడలేదు.

కారు తిన్నగా వచ్చి యింటిముందర ఆగింది.

సుమ డోర్ తీసి దిగబోతుండాగా ఆదిత్య పిలిచాడు.

"సుమా! మోహిత్, నువ్వూ హ్యాపీగానే వున్నారా? అతను నిన్నేమీ యిబ్బంది పెట్టడు కదా! నా ప్రశ్నకి నిజాయితీగా జవాబివ్వు" సూటిగా అడిగాడామెని.

ఆ ప్రశ్న వింటూనే సుమ మొహం పాలిపోయింది. "ఎందుకలా అడిగావు? అంది బింకంగా.

"నేనేకాదు నీ వాలకం చూసిన వాళ్ళెవరైనా అలాగే అనుమానిస్తారు. ఎలా చిక్కి సగమయ్యావో చూసుకో. కళ్ళలో కాంతిలేదు. ఎప్పుడూ అలవాటు లేనిది రెండు బస్సులు మారి ఉద్యోగానికి వెళుతుంటే కనీసం పట్టించుకోడా మోహిత్?" అన్నాడు ఆవేశంగా.

"ఆదీ ప్లీజ్ నీకేమైనా అనుమానాలుంటే, అవి నీ దగ్గరే వుంచుకో. దయచేసి నాన్నకు చెప్పకు. అమ్మ పోయిన దిగుల్లో నుంచి యిప్పుడిప్పుడే బైటపడుతున్నాం. నువ్వు కొత్తగా లేనిపోనివి కల్పించకు" అనేసి కారుదిగి వెళ్ళిపోయింది.

సుమ మెట్లు ఎక్కి పైకి వచ్చేసరికి రాజేశ్వరి సోఫాలో పెడమొహం పెట్టుకుని కూర్చుని వుంది.

సుమ నేరుగా మేనత్త దగ్గరికి వెళ్ళింది.

"ఈ డబ్బులు యింటి అవసరాలకోసం వుంచండి. మీ కొడుకు వచ్చేవరకు నేను డబ్బు యిస్తాను. ఇదేదో నా కుటుంబం నా బాధ్యత అని మాత్రం చేయట్లేదు. నా కారణాలు వేరే వున్నాయి" చెప్పి, హాండ్‌బాగ్‌లో నుంచి ఐదువందల నోట్ల బొత్తిని ఆవిడ చేతుల్లోపెట్టి లోపలికి వెళ్ళిపోయింది.

రాజేశ్వరి వెంటనే కాగితాల మడతలు తీసి డబ్బులెక్కపెట్టుకుంది. ఇద్దరి మధ్యా మాటలు లేకుండానే ఒప్పందం కుదిరిపోయినట్టు, ఆవిడ చేతుల్లో నోట్ల కాగితాలు నలిగిపోయాయి.

సుమ ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ అయిపోయాయి. పాసయిందన్న విషయం తెలుసుకుంటూనే హడావుడిగా తండ్రి దగ్గరకు బయల్దేరి వెళ్ళింది సుమ.

అప్పటికే స్వీట్ బాక్స్ ముందు పెట్టుకుని కూర్చుని కనిపించారు ప్రసాదరావు, ఆదిత్య.

"మేము నీకన్నా ముందే రిజల్ట్స్ గురించి తెలుసుకున్నాం" ఆమెని చూస్తూనే నవ్వుతూ చెప్పాడు ఆదిత్య. ప్రసాదరావు లేచి వచ్చి ఆనందంగా కూతుర్ని దగ్గరికి తీసుకున్నాడు. "ఇక మీదటే మరింత శ్రద్ధగా ప్రిపేరవ్వాలి. అర్థమైందా?" ప్రేమగా కూతురి తలమీద చేయివేస్తూ అన్నాడాయన.

"అలాగే నాన్నా" తలవూపింది సుమ.

"కంగ్రాట్స్ ఈసారి మేం యిండియాకి వచ్చేసరికి లాల్‌బత్తీ కారులో, గన్‌మేన్‌లతో కనిపిస్తావన్నమాట." పరిచయం వున్న గొంతువినిపించడంతో తలతిప్పి చూసింది సుమ.

"అన్నయ్యా ఎప్పుడొచ్చావు?" సుధీర్ చూసి ఆశ్చర్యంగా అడిగింది.

"తెల్లవారుఝామున మూడింటికి దిగాను. అయామ్ సారీ. పిన్ని పోయినప్పుడు రావడం కుదరలేదు"

"ఫర్వాలేదు. ఐయామ్ ఓ.కె" చెప్పింది నిజాయితీగా. సుధీర్ అంతమాత్రం మంచితనంతో మాట్లాడడమే సుమకి వింతగా అనిపించింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఆదిత్యనీ, సుధీర్‌నీ, సుమనీ స్టడీరూంలో సమావేశపరిచాడు ప్రసాదరావు.

"నేను పెద్దవాడినయ్యాను. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ముఖ్యంగా ఈ వయసులో. అందుకే ఆస్తినంతటినీ మీ ముగ్గురికీ నేను ఎలా యివ్వదలచుకున్నానో ఆ ప్రకారం వీలునామా రాసి రిజిస్టర్ చేయించాను. ఇవిగోండి మీ ముగ్గురికీ కాపీలు" అంటూ ఒక్కొక్క కాపీనీ తీసి ముగ్గురికీ అందించాడు.

"నాకు తోచినంతవరకూ ముగ్గురికీ న్యాయం చేశాననే అనుకుంటున్నాను. ఆదిత్యకి వాళ్ళ అమ్మ తాలూకు ఆస్తివాటా, సుధీర్‌కి వంశపారంపర్యంగా నాకు వచ్చినది పోగా నా స్వార్జితం అయిన ఆస్తిలో నాకు తోచిన విధంగా, సుమకి, సుధీర్‌కీ యిచ్చాను" చెప్పాడాయన.

అప్పటికే, కాగితాలు చూసుకున్న సుధీర్ ఛరున తలయెత్తి చూశాడు.

కొడుకు వాలకం పసిగట్టాడు ప్రసాదరావు.

"ఇందులో ఎవరికీ ఎటువంటి అభ్యంతరం వుండడానికి వీల్లేదు. సుమకి నేను రాసి యిచ్చినది నా స్వార్జిత ఆస్తి" వాదోపవాదాలకి తావులేదన్నట్టుగా తేల్చిచెప్పాడు ప్రసాదరావు.

తండ్రి గట్టిగా మాట్లాడటంతో మారుమాట మాట్లాడకుండా కోపంగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుధీర్.

సుమ గదిలోనుంచి బయటికి వస్తూనే ఆదిత్య కారిడార్‌లో ఆమెని ఆపాడు.

"సుమా! ఇప్పుడు నీకు ఈ ఆస్తిలో వాటా అవసరమా? నీకు ప్రాపర్టీలో షేర్ యివ్వడంవల్ల సుధీర్‌కీ, మామయ్యకీ మధ్య దూరం పెరుగుతుంది. నీకూ సెక్యూరిటీ కావాలి. నేనర్థం చేసుకోగలను. కావాలంటే, నా ఆస్తిలో కొంత నీ పేరున రాసిస్తాను. నువ్వు వెళ్ళి మామయ్యకి ఈ విషయం నచ్చచెప్పు"

సుమ ఆదిత్య కేసి ఎగాదిగా చూసింది.

"నాకు పెళ్ళయిన ఈ కొద్దికాలంలోనే డబ్బు విలువ బాగా తెలిసింది ఆదీ. నాకు నూటికి నూరుపాళ్ళు ఆస్తిలో వాటా కావలసిందే అది నా హక్కు.. అది నా హక్కు కాదు అంటే, నాన్న నా స్వంతమనిషి కానట్టే. నాన్నని పరాయివ్యక్తిగా నేను చూడను. చూడలేను. సుధీర్ మనసు పెద్దది చేసుకోకపోతే అది నా తప్పు కాదు. పోతే నీ ఆస్తి నాకెందుకు? నాకు హక్కు వున్నచోట నేను ధైర్యంగా తీసుకుంటాను. నువ్వేమీ త్యాగరాజులా నీ ఆస్తంతా ధారపోయనక్కర్లేదు" అంది కోపంగా.

"సుమా నీకు తెలియదు. సుధీర్ నీ గురించి ఏం మాట్లాడతాడో" ఆదిత్య సర్దిచెప్పబోయాడు.

"నాకన్నీ తెలుసు. తండ్రి పరువు తీసి లేచిపోయింది. ఇప్పుడు ఆస్తిలో వాటా కోసం పాకులాడుతుంది. వగైరా వగైరా! అంతేగా ఐ డోంట్ కేర్" అంది మొండిగా.

"నువ్వు చాలా మారిపోయావు" సుమ మొహంలోకి చూస్తూ అన్నాడు ఆదిత్య.

"అవును నిజంగానే మారిపోయాను. పెళ్ళి నన్ను చాలా మార్చేసింది" చెప్పి గబగబా మెట్లుదిగి కిందకి వెళ్ళిపోయింది.

ఆరు గంటలైనా కాకముందే కాలింగ్ బెల్ అదేపనిగా మోగుతూ వుండడంతో చిరాకుపడుతూ లేచింది సుమ.

"మోహితూ వచ్చావా?" అంటూ గ్రిల్స్ తాళం తీస్తూవున్న రాజేశ్వరిని చూసింది సుమ. ఆవిడ సంతోషం పట్టలేకుండా వుంది. బెంగుళూరు నీళ్ళకి, తేటబడి ఖరీదైన బట్టల్లో మెరిసిపోతూ వున్న కొడుకుని చూసి ఆమె మొహం చాటంతయ్యింది.

సుమకి అతన్ని చూడగానే గుండెల్లో భగ్గుమంది. అతను లోపలికి వచ్చేదాకా అయినా ఆగకుండా, గిరుక్కున వెనక్కి తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయింది.

వస్తూనే భుజాన వున్న బ్యాగుని కిందపడేసి, సోఫాలో రెండుకాళ్ళూ కిందకి జార్చి కూర్చున్నాడు.

"సుమ ఏం చేస్తుంది?" అడిగాడు తల్లిని.

రాజేశ్వరి నిట్టూరుస్తూ మూతి మూడువంకర్లు తిప్పింది.

"నువ్వు రాగానే ఆవిడగార్ని తలచుకుంటున్నావు. కానీ, దానికి మాత్రం నీమీద రవ్వంతైనా ప్రేమలేదు. ఒక్కసారి నీకు ఫోన్ చేసి మాట్లాడమని చెబితే నన్ను నిలబెట్టి ఎన్ని మాటలు అడిగిందనుకున్నావ్" అంది చేతులు తిప్పుతూ.

మోహిత్ ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోనట్టు తేలిగ్గా నవ్వేశాడు. "వెళ్ళేముందు మా యిద్దరికీ గొడవయ్యింది కదా! అలిగివుంటుంది. కాస్త బెట్టు చేస్తుందిలే" రెండు చేతుల్ని పెట్టుకుని ఒళ్ళువిరుస్తూ అన్నాడు.

"ఏమోరా నాయనా! నువ్వు లేనన్ని రోజులు నీ పెళ్ళాన్ని ఈ యింట్లో ఆపగలిగాను. ఇక నువ్వొచ్చావు నీదే భారం" చెబుతూనే, రాజేశ్వరి వేడిగా యిడ్లీలు నేతితో తడిసి ముద్ద అయిన కారప్పొడి వున్న ప్లేటును తెచ్చి కొడుకు చేతికి అందించింది. ఇడ్లీలు తింటూ మోహిత్ సుమ గదివైపు చూస్తూ వున్నాడు.

రాజేశ్వరి తనపాటికి తాను మాట్లాడుతూనే వుంది.

"నీ మాట వస్తేనే రవళి తిట్టిపోస్తూ వుంది. అది చెప్పేదీ నిజమే. ఇన్నాళ్ళూ ఎలా తిరిగినా చెల్లింది. యిప్పుడు నీకు పెళ్ళయ్యింది. ఎంతైనా సుమ నా మేనకోడలు. ఆ ప్రసాదరావుని చూసి, మొదట్లో కాస్త భయపడ్డాను కానీ, సుమ నెమ్మదస్తురాలు. నీకే మూర్ఖపు కోపం. నీకు తెలుసా యిప్పుడు ఆయన సుమని మళ్ళీ చేరదీశాడు. నువ్వు తెలివితక్కువ పనులు కట్టిపెట్టి సరిగ్గా నడుచుకున్నావంటే ఆయన దగ్గర్నుంచి ఎంతో కొంత ఆస్తిలాగొచ్చు" నెమ్మదిగా కొడుక్కి హితబోధ చేసింది.

"సర్లే ముందు కాఫీ యివ్వు" ప్లేటు ఖాళీ చేసి టీపాయ్ మీదకి తోస్తూ చిరాగ్గా అన్నాడు.

"ఆ చిరాకే తగ్గించుకోమని చెప్పేది. ఇంతకీ ఆ సీతాకోకచిలుక వుందా? ఎగిరిపోయిందా?" అడిగింది వ్యంగ్యంగా.

"దాని సంగతి నా దగ్గర ఎత్తకు" కోపంగా అన్నాడు మోహిత్.

"ఏదో చెడినట్టుంది. అందుకే, గోడక్కొట్టిన బంతిలా తిరిగొచ్చాడు" సణుక్కుంటూ వంటగదిలోకి వెళ్ళింది రాజేశ్వరి.

మోహిత్ నేరుగా సుమ వున్న గదిలోకి వచ్చాడు. సుమ అప్పటికే స్నానం చేసి వచ్చి అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటూ వుంది.

అద్దంలో మోహిత్‌ని చూసి పట్టించుకోనట్టే తన పని తాను చేసుకుపోతూ వుంది.

"హాయ్ డార్లింగ్ యూ ఆర్ లుకింగ్ అమేజింగ్" అతను సుమ దగ్గరగా వచ్చి భుజం మీద చేయివేశాడు.

సుమ అతని చేతిని పక్కకి తోసేసింది.

"ఓ.కే నువ్వు అలిగావు అర్థమైంది."

"అయామ్ సారీ! నేను తప్పు చేశానని ఒప్పుకుంటున్నాను. ప్రామిస్. యింకోసారి యిలా జరగదు" అంటూ ఆమె భుజాలు పట్టుకుని తనవైపుకి తిప్పుకున్నాడు.

"మనిద్దరం గడిపిన హ్యాపీనైట్స్ అప్పుడే మరిచిపోయావా? ఎంతైనా నేను నీ భర్తని. ఒక్క సెకండ్ ఛాన్స్ యివ్వలేవా? మనిద్దరం ప్రయత్నిస్తే తిరిగి ఆ హ్యాపీడేస్‌ని మనం సొంతం చేసుకోవచ్చు" మెల్లని స్వరంతో అంటూ ముందుకి వంగి ఆమె పెదవులపై ముద్దుపెట్టుకోబోయాడు.

సుమ ప్రతిఘటించలేదు. సహకరించనూ లేదు. ఆ శరీరం తనది కాదన్నట్టుగా రెప్పలు కిందకి వాల్చి బొమ్మలా నిలబడి వుంది. మోహిత్ ఒక క్షణం సుమ మొహంలోకి పరీక్షగా చూసి చప్పున ఆమెని వదిలేశాడు.

"ఒక గ్లాసు నీళ్ళు తెచ్చిస్తావా?" అడిగాడు షర్టు కాలర్ సరిచేసుకుంటూ.

సుమ వంటగదిలోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి యిచ్చింది. మోహిత గ్లాసులో బాటూ, ఆమె చేతివేళ్ళను కూడా గట్టిగా పట్టుకున్నాడు.

"ఇదివరకు మాటకి మాట సమాధానం చెప్పేదానివి. ఇప్పుడు వున్నట్టుండి బుద్ధిమంతురాలివైపోయావేంటి?" సుమ కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"అరనిముషంతో పని అయిపోతుందనుకుంటే నీతో అయిదు నిమిషాలు వాదించడం అనవసరమని తెలుసుకున్నాను" అంది అతని పట్టు విడిపించుకుంటూ.

"సాయంత్రం డిన్నర్‌కి బైటికి వెళదాం. మన ఫేవరెట్ రెస్టారెంట్‌కి బహుశా మర్చిపోయి వుండవులే" అన్నాడు కొంటెగా! సుమ అతని మాటలు విననట్టే తలవంచుకుని హేండ్‌బాగ్ సర్దుకుంటూ వుంది.

"ఓహో యిప్పుడు కొత్తగా ఉద్యోగం ఒకటి మొదలుపెట్టావు కదూ. ఎంత వస్తుందేమిటి జీతం?" మోహిత్ వెటకారంగా మాట్లాడుతూనే వున్నాడు. సుమ బ్యాగ్ తగిలించుకుని వెళ్ళిపోయింది.

రాత్రి పదిగంటలప్పుడు బెడ్రూమ్‌లోకి వచ్చాడు మోహిత్. సుమ స్టడీ టేబుల్ దగ్గర కూర్చుని చదువుకుంటూ వుంది.

"చదివింది చాలు. ఇక పుస్తకం మూసెయ్" అంటూ టేబుల్ లైట్ ఆపేయబోయాడు.

సుమ తక్కున అతని చేతిని పట్టుకుని ఆపింది.

"చదువాపి రమ్మంటున్నానా?" కోపంగా సుమవైపు చూస్తూ అన్నాడు.

ఆమె పట్టించుకోనట్టు పుస్తకంలో తలదూర్చింది. ఆమె తిరస్కారధోరణి అతనిలో అహాన్ని రెచ్చగొట్టింది.

"ఉదయం నుంచి చూస్తున్నాను. నేనంటే లెక్కలేనట్టూ ప్రవర్తిస్తున్నావు ఎందుకే నీకంత ఆటిట్యూడ్?" ఆమె భుజం మీద చేతిని గుచ్చి పెడుతూ అన్నాడు.

"మోహిత్! ఇప్పుడు నీతో వాదన పెట్టుకోలేను. నేను చదువుకోవాలి వెళ్ళు" అతని చేతిని తొలగించడానికి పెనుగులాడుతూ అంది.

"ఇదంతా పొరపాట్న కలెక్టర్ అయిపోతావన్న పొగరుతోనా? లేకపోతే వీడు వెళ్ళిపోయాడు కదా అని ఆదిత్యగాడితో కుమ్మక్కయ్యావన్న ధైర్యంతోనా?"

**"షటప్" అతని** మాటలు పూర్తికాకముందే గట్టిగా అరిచింది సుమ. "వెళ్ళి నీ పని నువ్వు చూసుకో" అంది కోపంగా.

"ఎందుకే అరుస్తున్నావు? నాకు ఏమీ తెలీదనుకుంటున్నావేమో! నువ్వు తరచుగా వాడికోసం వెళ్ళడంలేదా? చీటికీ మాటికీ ఫోన్లు చేయడంలేదా? మొగుడికి ఫోన్ చేయాలంటే మాత్రం ఆత్మాభిమానం అడ్డువచ్చింది పాపం" అంటూ ఆమెని వెనక్కి విరిచి గట్టిగా జుట్టుపట్టుకున్నాడు.

నెప్పికి బాధతో సుమ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అక్కడ నీ వాళ్ళు ఎవరున్నారే వాళ్ళంతా మీ నాన్న చావుకి కారణమైన వాళ్ళని మర్చిపోయావా?"

సుమకి అతని మాటలతో మనసులో మండుతున్న మంట మరింత రేగింది. ఎక్కడలేని శక్తిని తెచ్చుకుని అతని చేతిని తప్పించి విసిరికొట్టింది.

"మా వాళ్ళ పేర్లు కూడా నీ నోటితో పలికితే చంపేస్తాను. నా బలహీనతని, ఫీలింగ్‌ని  వాడుకోవాలని చూసింది నువ్వు. ఎన్ని అబద్ధాలు చెప్పావు? మోసానికి ప్రేమ అనే పూతని పూశావు. నా కన్నతండ్రి ఎలా చనిపోయాడో నేను చూడలేదు కానీ నా తల్లిని చంపింది మాత్రం నువ్వే. ఆమె చనిపోయే ముందు శాంతి లేకుండా చేశావు. జీవితాంతం నేను గిల్ట్‌తో చచ్చిపోయేట్టు చేశావు" పిచ్చిపట్టినదానిలా అరిచింది.

"ఏంటే వాగుతున్నావ్? నిజంగా అయ్యేయస్ ఆఫీసరు అవుతావనేనా నీ ధైర్యం?" అంటూ సుమ పుస్తకాల్ని తీసుకుని అందిన చోట పేజీలను చింపి పోగులు వేశాడు.

గంటల తరబడి ప్రిపేర్ చేసిన నోట్సు అరుదైన పుస్తకాలు అవి. సుమ చూస్తూ ఉండలేకపోయింది. శివంగిలా ముందుకు దూకి అతన్ని దూరంగా తోసింది. అతనూ కలియబడ్డాడు.

ఇంతలో, "ఓర్నాయనో" అని అరుస్తూ రాజేశ్వరి పరుగున వచ్చింది.

జరిగేది అర్థమై కొడుకుని వెనక్కిలాగే లోపలే అతను సుమ చెంపమీద బలంగా ఈడ్చి కొట్టి, మోకాలితో డొక్కలో పొడిచాడు.

"అబ్బా!" లోపల నరాలన్నీ మెలితిరిగి పోయినట్టుగా బాధ.. పెద్దగా మూలుగుతూ గోడకి చేరగిలబడింది.

"ఒరేయ్! నీకు ఒకసారి చెబితే అర్థం కాదా?" గట్టిగా అరిచి కొడుకుని పక్కకి లాగింది రాజేశ్వరి.

"తల్లీ! మా కాలంలో మొగుడు కోపం వచ్చి రెండు దెబ్బలేస్తే ఓర్చుకుని పడుండేవాళ్ళం. తెలియకపోతే తెలుసుకో. నీలా మాటకి మాట చెప్పి రెచ్చగొడితే యిలానే ఉంటుంది." సుమ వైపు నిరసనగా చూసి, మోహిత్‌ని వెనుక నుంచి గుమ్మం వైపుకి తోసింది.

"ఉండు ఒక్క పని వుంది" అంటూ రయ్యిన వెనక్కి తిరిగాడు మోహిత్. టేబుల్ మీద వున్న సుమ సెల్‌ఫోన్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

"నువ్వు ఈ గదిలోనే పడివుండు. ఇకమీదట నా పర్మిషన్ లేకుండా యింట్లోంచి అడుగు ఎలా బైటికి వేస్తావో చూస్తాను" చెప్పి గది బయటనుంచి లాక్ చేశాడు.

సుమ రెండు చేతులతో డొక్క పట్టుకుని నేలమీద వాలిపోయింది.

మోహిత్ ఒంటిమీద దెబ్బకొట్టేదాకా ఆగకుండా మనసు మీద దెబ్బ కొట్టాడని తెలిసిన వెంటనే వెళ్ళిపోయివుండాల్సిందా? తప్పు చేశానా?

సుమ మనసులో ప్రశ్నలు.

కానీ, మెదడు సమాధానాలు ఆలోచించే పరిస్థితిలో లేదు. కళ్ళు మూతలు పడిపోతూ వుంటే, మగతగా పక్కకి వాలి పడుకుంది.

"సుమా.. సుమా!" కలలో పరిచయమైన గొంతుక వినిపిస్తున్నట్టు అనిపించింది.

కళ్ళు తెరవడానికి ప్రయత్నిస్తుంటే సాధ్యపడడంలేదు. రెప్పలు బరువుగా వున్నాయి.

"నేను చూడలేకపోతున్నాను. నాకు కళ్ళు కనిపించడంలేదు. చీకటిగా వుంది" అరవడానికి ప్రయత్నం చేసింది. కానీ, మాట గొంతు దాటి బైటికి రావడం లేదు.

"సుమా.. సుమా.." ఈసారి వినిపించిన గొంతుని గుర్తుపట్టిందామె.

"నాన్నా... నాన్నా.. కానీ, నాన్న యిక్కడికి ఎలా వచ్చాడు?" అనుకుంటూనే మెల్లగా కళ్ళు తెరిచింది.

ఎదురుగా మోకాళ్ళ మీద వంగి సుమ చెంపలు తడుతూ కనిపించాడు ప్రసాదరావు.

అప్పటికి వాస్తవంలోకి వచ్చింది సుమ.

"నిజంగానే నాన్న యిక్కడికి వచ్చారు" అనుకుంది. వెనకాల కాస్త దూరంలో ఆదిత్య కూడా నిలబడి కనిపించాడు.

"లే వెళదాం" చేయి పట్టుకుని లేపాడాయన.

"నాకోసం నాన్న ఈ యింటికి వచ్చారన్నమాట. ఆయన బాధపడకూడదని యిన్నాళ్ళుగా నేను దాచిన విషయం తెలిసిపోయిందన్నమాట" ఆలోచిస్తుండగానే సుమ చేయిపట్టుకుని గదిలోంచి బైటికి తీసుకువచ్చాడు ప్రసాదరావు

అక్కడ మోహిత్, రాజేశ్వరి కనిపించారు సుమకి. వాళ్ళకి కాస్త దూరంలో యిద్దరు పోలీసులు కూడా వుండడం చూసి ఆశ్చర్యపోయింది.

"నా పరువుతో ఆడుకుంటావు కదూ. నీ అంతు చూస్తాను" సుమని చూస్తూనే ఒంటికాలు మీద లేచాడు మోహిత్.

"నువ్వు వుండరా బాబూ" నెత్తి బాదుకుంటూ రాజేశ్వరి కొడుకుని వెనక్కి లాగింది.

వాళ్ళ మాటలేవీ వినబడనట్టే ముగ్గురూ కిందకి దిగి వెళ్ళారు.

"నేను ముందు నుంచీ అనుమానిస్తూనే వున్నాను. ఏదో తేడాగా వుందని. మా దగ్గర నిజం దాచిపెట్టి దెబ్బలు తింటూ సతీసావిత్రి అనిపించుకోవాలనా నీ ఉద్దేశ్యం? సమయానికి లలితాంబగారు మాకు ఫోన్ చేసి చెప్పబట్టి విషయం తెలిసింది" ఇంటికి వస్తూనే సుమని గట్టిగా అరిచాడు ఆదిత్య.

ప్రసాదరావు ఉలుకు పలుకూ లేకుండా వున్నాడు. లోలోపలే ఎంతో బాధపడుతున్నట్టుగా వుంది ఆయన మొహం.

"నాన్నా!" సుమ తండ్రి దగ్గరకు వచ్చింది.

"అయామ్ సారీ! మీ దగ్గర దాచిపెట్టాలని కాదు. మిమ్మల్ని బాధపెట్టకూడదని" వాక్యం పూర్తి చేయకముందే సుమ కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

"నాదే తప్పు నాన్నా! " వెక్కుతూ ప్రసాదరావుని కౌగిలించుకుంది.

"నాకు తెలుసమ్మా. ఇక నీకే దిగులూ లేదు. హాయిగా నిద్రపో. ఏం చేయాలో రేపొద్దున ఆలోచిద్దాం" అంటూ కూతురి భుజం తట్టాడు ప్రసాదరావు.

"టక్ ....టక్" తలుపు తట్టిన చప్పుడైంది.

"రావచ్చు" అంది సుమ మెల్లగా, మంచం మీద కూర్చుని వెనక్కి జరుగుతూ.

"ఆదిత్య మంచినీళ్ళ గ్లాసు పట్టుకుని లోపలికి వచ్చాడు.

"ఈ పెయిన్ కిల్లర్ వేసుకుని, మంచినీళ్ళు తాగు" అంటూ ఎదురుగా వచ్చి కూర్చున్నాడు.

"బావా! ఇప్పుడు నిన్ను చూస్తుంటే అచ్చం మంకుపట్టు పట్టిన చిన్నపిల్లాడిలా వున్నావు" అంది సుమ నవ్వుతూ.

"ఊరికే వెకిలిగా నవ్వకు. నీమీద నాకు చాలా కోపంగా వుంది. నీ మొండితనంతో పక్కవాళ్ళని ఎంత బాధపెడుతున్నావో నీకు తెలియదు" కోపంగా అన్నాడు.

"నిజంగా అంత కోపం వచ్చిందా నీకు?" మళ్ళీ నవ్వింది.

"నీకు ఎగతాళిగా వున్నట్టుంది. నన్ను మామయ్య ఆపబట్టి కానీ లేకపోతే వాళ్ళని అక్కడే ముక్కలుగా నరికేయాలన్నంత కోపం వచ్చింది. ఎలా అయిపోయావో చూడు" అంటూ సుమ చెంపని మృదువుగా తాకాడు. ఆమె తెల్లని బుగ్గల మీద ఎర్రటి చేతివేళ్ళ ముద్రలు చూసి అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఇంకెప్పుడూ నీకు ఎలాంటి యిబ్బంది వచ్చినా నా దగ్గర దాచనని ఒట్టు వెయ్యి" చిన్నపిల్లాడిలా చేతిని ముందుకు చాచాడు.

అతని ప్రేమలో నిజాయితీ ఆమె మనసుని సూటిగా తాకింది. కళ్ళల్లో పొంగుతున్న నీటిని అదుపు చేసుకునే ప్రయత్నం చేస్తూ అతని చేతిలో చేయి వేసింది.

"నీకు తెలియదు సుమా. నిన్నాస్థితిలో చూసినప్పుడు నా గుండెని కత్తితో కోసినట్టు అనిపించింది. ఎవరైనా మా సుమని అంత దారుణంగా ట్రీట్ చేయగలరా అని" అతను మాటలు పూర్తిచేయలేకపోయాడు.

గబుక్కున ముందుకు వంగి, ఆమె మెడచుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు.

నలిగిపోతున్న మనసులోని భావాలన్నీ ఆ స్పర్శతో తెలియచెప్పాలని ప్రయత్నిస్తున్నాడతను ఆమె కళ్ళలో నీళ్ళు చూసి సంయమనం కోల్పోయినట్టు వుంది అతని పరిస్థితి.

మనసుల మధ్య భావాలు ఉన్నతమైన స్థితికి చేరాక, వాటిని వర్ణించడానికి ఏ పదాలూ దొరకవు.

ప్రేమ, స్నేహం , అనుబంధం. దాని పేరేమిటో తెలియదు కానీ దాని ముందు విచక్షణ ఓడిపోయినట్టనిపించింది సుమకి.

వెంటనే ఆమె చేతులు కూడా అతన్ని పొదవిపట్టుకున్నాయి. ఇద్దరూ మనసులతో సంభాషించుకున్నట్టుంది ఆ క్షణం.

ఒకరి కన్నీళ్ళు మరొకరి చెంపల్ని వెచ్చగా తాకాయి. ఆ తడిలో క్షణాలు కరిగిపోయే కొద్దీ మనసులకి ప్రశాంతత దొరికినట్టైంది. ఇద్దరి మనసులు తేలికబడ్డాయి.

గుండెల్లో బాధనీ, బరువునీ పంచుకున్నట్టనిపించగానే, ఆదిత్య మెల్లగా ఆమె చెంపల్ని చేతులతో తుడిచాడు.

దగ్గరుండి టాబ్లెట్ మింగించి, ఆమె నుదుటిని ముద్దాడి వెళ్ళిపోయాడు.

"ఇద్దరూ సీరియస్‌గా చర్చించుకుంటున్నారు. ఏంటి సంగతి?" బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర తండ్రిని, ఆదిత్యని చూసి అడిగింది సుమ.

ప్రశాంతమైన నిద్ర తర్వాత ఆమె మొహం తేటబడింది.

"నిన్ను పెట్టిన టార్చర్‌కి వాళ్ళమీద ఏ కేసులు పెట్టొచ్చో చర్చిస్తున్నాం" ఆదిత్య అన్నాడు.

"ఏమీ అక్కర్లేదు" సుమ వచ్చి టేబుల్ దగ్గర కూర్చుంటూ అంది.

ప్రసాదరావు, ఆదిత్య ఆశ్చర్యంగా ఆమె వైపుకి చూశారు.

"మనం కేసు పెడతాం. కానీ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ రాయకముందే మోహిత్ దగ్గరికి వెళ్ళి యిన్ఫర్మేషన్ యిచ్చి డబ్బు తీసుకోరని గ్యారంటీ లేదు. నాకు తెలుసు. ఎడ్మినిస్ట్రేషన్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ నేనీ మాట అనడం కరెక్ట్ కాదు. కానీ, వాస్తవ పరిస్థితుల్ని కాదనడానికి వీలులేదు.

ఒకవైపు పరువు ఎంత ఎక్కువ తూగితే బేరం కూడా అంత లాభసాటిగా వుంటుంది. మోహిత్ అతని కుటుంబం మీడియాకి ఎక్కి రచ్చచేస్తారు. ఇలాంటి వివాదాలకి చాలా ఛానెల్సు రెడీగా వుంటాయి. ముఖ్యంగా మాజీ అయ్యేయస్ ప్రసాదరావుగారి కుమార్తె అన్న టైటిల్ చాలా బావుంటుంది వాళ్ళకి.

అయినా, కోర్టుల్లో పోలీస్ స్టేషన్లలో ఒంటిమీద దెబ్బలు, సాక్ష్యాలు కావాలి. మానసికంగా పడ్డ క్షోభ ఎవరికి కనిపిస్తుంది? ఎలా నిరూపిస్తాం? మనసుని చంపినవాళ్ళకి సమాజంలో శిక్షలేదు. అయినా నేనిప్పుడు నా మెయిన్స్ ఎగ్జామ్స్‌కి ప్రిపేరవ్వాలి. నా లక్ష్యం అదే నా ఏకాగ్రతని చెడగొట్టే ఎటువంటి నిర్ణయాలకీ నేను సిద్ధంగ లేను" చెప్పి "ఏమంటారు నాన్నా?" అంటూ తండ్రి వైపు చూసింది.

"గుడ్ డెసిషన్. నీకున్న ఎనర్జీ అంతా నీ లక్ష్యం వైపే వుండాలి" ఒప్పుకున్నాడాయన.

"ఇంకో విషయం నాన్నా! నేను యింక జాబ్ మానేద్దామనుకుంటున్నాను. ఇన్నాళ్ళూ ఆ యింట్లో చదువుకునేందుకు మంచి వాతావరణం లేక, ఆ ఉద్యోగం చేయాలనుకున్నాను. ఇప్పుడా అవసరం లేదు. ఇక నుంచీ మీరే నాకు పాఠాలు చెప్పాలి" చెప్పింది.

"అలాగేనమ్మా" తలాడించాడు ప్రసాదరావు.

"సాబ్! మిమ్మల్ని కలవనీకి ఎవరో వచ్చిండ్రు" కాకా వచ్చి చెప్పడంతో ప్రసాదరావు అక్కడ నుంచి లేచి వెళ్ళాడు.

"నువ్వు చేస్తుంది కరెక్ట్ కాదేమో సుమా! అతనితో చట్టపరంగా సంబంధం యింకా కంటిన్యూ చేయడం ముందు ముందు ప్రాబ్లమ్స్‌కి దారితీస్తుందేమో?" అనుమానం బైటపెట్టాడు ఆదిత్య.

"నేను ఇప్పుడంత ఆలోచించే పరిస్థితిలో లేను ఆదీ. డైవోర్స్ కోసం కోర్టు చుట్టూ తిరగడం యిప్పుడు నావల్ల కాదు. ఏది అవసరమో అంతవరకే ఆలోచిస్తున్నాను."

సుమ మాట్లాడుతూ వుండగానే దీప్తి వచ్చింది.

"హాయ్! యిక్కడున్నావా? నీకోసం నీ రూంలో చూసి వస్తున్నాను. సండే మార్నింగ్ నువ్వు ఫ్రీగా వుంటావని మార్నింగ్ షోకి టికెట్స్ బుక్ చేశాను" గలగలా మాట్లాడుతూ సుమ వైపుకి తిరిగింది.

"అయ్యయ్యో! మీరూ యిక్కడే వున్నారని తెలియదు నాకు. యింకో టికెట్ సంపాదించడానికి ట్రై చేస్తాను" అంటూ హడావుడిగా హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి సెల్‌ఫోన్‌ని బైటికి తీసింది.

"నో!.. నో" వారించింది సుమ. "నాకు సినిమా మీద యింట్రస్ట్ లేదు. మీరు వెళ్ళండి" చెప్పింది దీప్తితో.

"నువ్వు కార్లో వెయిట్ చేస్తూ వుండు. నేను వస్తాను" ఆదిత్య అనడంతో దీప్తి బైటికి నడిచింది.

"ఆదీ దీప్తిని చూస్తే నీకు జాలివేయడం లేదూ? ఎందుకలా ఆ అమ్మాయిని బాధపెడతావు? పాపం ఆ అమ్మాయిది ఎప్పుడూ ఒకటే డైలాగు 'నువ్విక్కడున్నావా అని' ఎక్కువగా తప్పించుకుని తిరుగుతున్నావు కదూ" నిలదీస్తున్నట్టుగా అడిగింది.

ఆదిత్య పకపకా నవ్వాడు "ఇంకా నయం నిజానికి నన్ను చూస్తే జాలేస్తుంది అంటావనుకున్నాను" అన్నాడు తేలిగ్గా కొట్టిపారేస్తూ.

అతని జవాబుని తేలిగ్గా తీసుకోలేదు సుమ.

"ఆదీ! నీకో విషయం చెప్పాలి" అంది సీరియస్‌గా.

అతను లేవబోతున్నవాడల్లా తిరిగి కుర్చీలో కూర్చున్నాడు. "నిన్న రాత్రి మన మధ్య జరిగింది ఏదైనా కానీ దానికి ఫ్యూచర్ లేదు. అది తప్పనీ ఒప్పనీ నేను అనడంలేదు. కానీ దానివల్ల నీ రిలేషన్స్ పాడవకూడదని చెపుతున్నాను. ఇప్పటికే ఒకసారి నిన్ను కన్ఫ్యూజన్‌లో పెట్టి మోసం చేశాను. అందుకే నా వైపు నుంచి క్లారిటీ యివ్వాలని చెబుతున్నాను" సూటిగా చెప్పడానికి యిబ్బంది పడుతున్నట్టు మధ్య మధ్య చేతివేళ్ళని చూసుకుంటూ చెప్పింది.

ఆమె చెప్పింది ఆసాంతం విని స్థబ్దుగా వున్నాడతను. అతని మొహంలో ఎటువంటి భావాలూ కనిపించలేదు.

ఇంతలో "ఆదీ" అంటూ దీప్తి కేక వినిపించింది. "వెళ్ళొస్తాను" అంటూ పొడిగా చెప్పి లేచి వెళ్ళిపోయాడతను.

పుట్టింటికి వచ్చిన తర్వాత సుమ టైం టేబుల్‌తోబాటూ జీవితం కూడా మారిపోయింది.

చాలా రోజుల తర్వాత ప్రసాదరావు స్టడీ రూంలో పూలవాసనలు గుప్పుమన్నాయి.

రోజూ ఉదయాన్నే కాఫీ కప్పుతోబాటు అందుబాటులో వున్న అన్ని వార్తాపత్రికల్నీ తిరగేయడం, రామూకాకాతో కలిసి సరదాగా వంట చేయడం, తండ్రితో బాటు ఈవినింగ్ వాక్‌లు, పరీక్షల కోసం ఆయనతో పాఠాలు చెప్పించుకోవడం సుమకి కోల్పోయిన తన పాతజీవితం తిరిగి వచ్చినట్టైంది.

ఇప్పుడు ఆమె ముందున్న ఏకైక లక్ష్యం సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో నెగ్గి అడ్మినిస్ట్రేషన్‌లోకి రావడమే.

ఇన్నాళ్ళూ ఆయ్యేయస్ ఆఫీసర్ అయితే తండ్రి కోరిక తీర్చినట్టే అనుకుంటూ వుండేది. కానీ ఒకసారి జీవితంలో దెబ్బతిని లేచాక చాలా విషయాలు అర్థమయ్యాయి. డబ్బూ, అధికారం యివి రెండు మాత్రమే సమాజాన్ని నడిపించే బలమైన సాధనాలు. మంచితనం, మానవత్వం అనే భాషలు కొంతమందికి మాత్రమే అర్థమవుతాయి. చెడ్డవారి దగ్గర బలం వున్నప్పుడు మంచివాళ్ళ దగ్గర కూడా వాటిని ఎదుర్కోవడానికి అధికారం వుండాల్సిందే సమాజం, మనిషి జీవితం రెండూ ఒకేలా వుంటాయి. మనిషి జీవితంలో కష్టం సుఖంలాగే సమాజంలో మంచీ, చెడూ ఎప్పుడూ వుంటాయి. వాటి మధ్య ఎప్పుడూ ఓ సంఘర్షణ.

ఆ సంఘర్షణ నిరంతరంగా సాగుతూ వుండాలి. లేకపోతే, బాలెన్స్‌ని కోల్పోతాం. ఆ బాలెన్స్‌ని నిలబెట్టే బాధ్యతని అందుకునే అవకాశం రావడం నిజంగా ఓ అదృష్టం.

తండ్రి అయ్యేయస్ ఆఫీసర్ని చేయాలనుకున్న ఆశయం వెనకాల ఆయనకి వున్న భావాలు పూర్తిగా అవగాహనలోకి వచ్చాక సుమకి సివిల్ సర్వీసెస్‌ని సాధించాలన్న పట్టుదలతో బాటూ తండ్రి మీద గౌరవం కూడా పెరిగింది.

"హలో! కొంచెం ఆ చేతిలో పారని పక్కన పడేసి, ఈ జ్యూస్ తాగు" మాటలు వినిపించడంతో మొక్కలకి పాదులు చేస్తున్న ఆదిత్య తలతిప్పి చూశాడు.

అలసటకి నుదుటి నిండా అల్లుకున్న స్వేదబిందువులు, సూర్యకిరణాలు పడి ఒక్క క్షణం తళుక్కుమన్నాయి.

జ్యూస్ గ్లాసుతో నించుని వున్న సుమని చూస్తూనే చేతిలోని పనిముట్టుని పక్కన పడేసి పైకి లేచాడు.

"ఇలాగే తాగలా?" అన్నాడు మట్టి చేతులని చూపిస్తూ.

"పర్లేదు చేతులకంటుకున్న మట్టిని గ్లాసులో పడకుండా తాగితే చాలు" అంది చేతిలో వున్న ఆరెంజ్ జ్యూస్ గ్లాసుని అందిస్తూ.

ఆదిత్య ఒకసారి చుట్టూ చూసి, "ఇప్పుడు నిజంగా సూర్యుడు పడమరలోనే అస్తమిస్తున్నాడు కదా! నువ్వు జ్యూస్ తెచ్చావంటే ఏదొకటి తలకిందులవ్వాలే" అన్నాడు ఆమెని ఆటపట్టిస్తూ.

"అవునవును" తమాషాగా తల ఆడిస్తూ చెప్పింది సుమ. "చాలా రోజుల తర్వాత నువ్వు యిదివరకటిలా గార్డెనింగ్ చేస్తున్నావు. అదే విశేషం. ఇంకా నువ్వు రెండు గంటల నుంచి మంచినీళ్ళకోసం కూడా లేవలేదు" అంది అతని మొహంలోకి చూస్తూ.

అతను చిన్నగా నవ్వి జ్యూస్ తాగబోతుండగా "ఒక్క నిముషం" అంటూ ఆపింది సుమ.

అతని కనుబొమల మీదుగా అల్లుకున్న చెమటని తుడవడానికన్నట్టుగా నేప్‌కిన్‌ని పట్టుకుని వున్న చేతిని పైకెత్తింది.

క్షణంలో సగంసేపులోపే అతని కళ్ళు తళుక్కున మెరిశాయి. ఇన్ని సంవత్సరాలుగా ఆమె కోసం అతను పడ్డ తపన ఆ క్షణంలో ఆమె కళ్ళలో చూశాడతను.

ప్రపంచాన్నే మరిచిపోయిన ఆమె వంకే చూస్తూ వుండిపోయాడు. అంతలోనే ఏదో అర్ధమైనట్టు ఎత్తిన ఆమె చెయ్యి తక్కున ఆగిపోయేది.

"ముందు చెమటని తుడుచుకుని తర్వాత తాగు" గబగబా చెప్పేసి నేప్‌కిన్‌ని అతని మట్టిచేతుల్లోనే పెట్టేసి వెళ్ళిపోయిందామె.

అతను అంతలోనే ఆశాసౌధం కూలిపోయినట్టు ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిలుచున్నాడు.

"హమ్మయ్య ఇవాళ వెతుక్కోకుండానే దొరికావు" దీప్తి కారు దిగుతూనే ఆదిత్యని చూసి అంది.

ఆమె కారు ఎప్పుడు పార్కింగ్ ప్లేస్‌లోకి వచ్చిందో ఎప్పుడు ఆగిందో అతనికి స్పృహ లేదు.

హుషారుగా వచ్చి ఆదిత్య చేతిని పట్టుకోబోతూ "ఈ...క్క్...క్!" అని అరిచింది.

"మట్టి కొట్టుకుపోయిన చేతులూ, షార్ట్స్ అచ్చం ప్రొఫెషనల్ గార్డెనర్‌లా వున్నావు. మాలి వున్నాడుగా! ఇవన్నీ నువ్వే చేయలా? అయినా ఎప్పుడు లేనిది గార్డెనింగ్ హాబీ కొత్తగా వచ్చిందే" అంది చిరాగ్గా.

"దీసీజ్ మీ. నీకు ఆలస్యంగా తెలిసిందంతే. నేను ఎప్పుడు యిలాగే వుంటాను" అంటూ జ్యూస్ గ్లాసుని ఖాళీ చేసి, తిరిగి పారని చేతిలోకి తీసుకున్నాడు.

దీప్తి విసుగ్గా తల తిప్పుకుంది. ఆమె దృష్టి అప్పుడే యింట్లోకి వెళుతున్న సుమ పైన పడింది.

ఆమెను చూస్తూనే దీప్తి కనుబొమలు ముడిపడ్డాయి.

"ఆదీ సుమ అత్తగారింటికి వెళ్ళదా? యిక్కడే వుంటుందా?" అనుమానంగా అడిగింది.

"సుమకి సివిల్స్ ఎగ్జామ్స్ వున్నాయి. మామయ్య దగ్గరుండి చదివిస్తున్నారు. యిక్కడే వుండి చదువుకుంటుంది నీకేమన్నా అభ్యంతరమా?" తల యెత్తకుండానే చిరాగ్గా సమాధానం యిచ్చాడు.

అతని నిర్లక్ష్యం, ఆమెకి కోపాన్ని తెప్పించింది.

"నువ్వు చెప్పకపోయినా నాకు మీ యిద్దరి గురించి తెలుసు వసుంధర ఆంటీ మీ యిద్దరి ఎంగేజ్‌మెంట్ కాన్సిల్ అయిన సంగతి మా అమ్మకి ముందే చెప్పింది. ఆ తర్వాతే మనకి నిశ్చితార్థం జరిగింది. మీ యిద్దరికీ ఒక గతం వుంది కాబట్టే నేను ప్రశ్న అడిగాను. నా యిన్‌సెక్యూరిటీస్‌కి నువ్వు జవాబు చెప్పి తీరాలి" అంది కోపంగా.

"అయితే యిప్పుడేమంటావు? ఇది సుమ తండ్రి యిల్లు. నాకంటే ఈ యింటి మీద తనకే ఎక్కువ హక్కువుంది. అర్ధమైందా? ఆమెకి యిష్టం వచ్చినన్నాళ్ళు వుంటుంది. ఇక ఈ విషయం నాతో ఎప్పుడూ మాట్లాడకు" అన్నాడు ఆవేశంగా.

దీప్తి ఒక నిముషం మౌనంగా నిలబడింది. "సరేలే నీకు బాగా కోపం వచ్చినట్టుంది. అనవసరంగా మూడ్ పాడు చేసుకోకు. డిన్నర్ ప్లాన్ అప్‌సెట్ అవుతుంది" అంది అతని మెడచుట్టూ చేతులు వేస్తూ.

"చూడు దీప్తీ అయామ్ సారీ టూ సే కానీ, యిలా నువ్వు రెండురోజులకొకసారి ఏదొక ప్లాన్‌తో వస్తే ప్రతిసారీ నాకు వీలు కుదరదు. నాకు యిలాంటివన్నీ యింట్రెస్ట్ లేకపోయినా నిన్ను చిన్నబుచ్చకూడదని ఒప్పుకుంటాను. కానీ నేను పూర్తిగా నువ్వు చేసే ప్లానింగ్ నడుచుకోవాలంటే కుదరదు. ఇంకొక్క విషయం ఒకసారి నేను కుదరదు అని చెప్పాక కూడా నేరుగా యింటికి రావద్దు ప్లీజ్"

"అలాగా" అంది దీప్తి కోపంగా. "యిక నీతో నేరుగా మా పేరెంట్స్ మాట్లాడతారు. అప్పుడు ఎలా తప్పించుకుంటావో అదీ చూస్తాను" అంటూ మూతి బిగించుకుని, హైహీల్సుతో ధనాధనా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది.

సుమ ఎదురుచూస్తున్న పరీక్షలు రానే వచ్చాయి. ఎగ్జామ్స్‌కి వెళ్ళబోయే ముందు ప్రసాదరావు కూతుర్ని దగ్గరకు పిలిచాడు. "నువ్వు కాబోయే అయ్యేయస్ ఆఫీసర్‌వి అనుకుని వెళ్ళి పరిక్షలు రాయి. ఆ కాన్ఫిడెన్స్‌తోనే వెళ్ళు" చెప్పి భుజం తట్టాడు.

సుమ పరీక్షలు అయిపోయాయి.

ఇంటర్వ్యూకి సెలెక్ట్ అయ్యిందో లేదో తెలియడానికి యింకా వ్యవధి వుంది.

ఈలోపే యింటర్వ్యూలో అడిగే ప్రశ్నల తాలూకు ప్రిపరేషన్ మొదలుపెట్టాడు ప్రసాదరావు.

ఒక ఆదివారం మధ్యాహ్నం....

సీమ వచ్చింది.

"ఇదిగో నా వెడ్డింగ్ కార్డు. నేను ముందే ఫ్రెండ్సందరికీ పంచేస్తున్నాను. తర్వాత అమ్మావాళ్ళు ఫార్మల్‌గా వచ్చి అంకుల్‌ని పిలుస్తారు" అంటూ పసుపు పెట్టిన బంగారు రంగు కవర్‌ని సుమ చేతిలో పెట్టింది.

ఆ కార్డుని చూస్తూనే సుమకి తల్లి నిశ్చితార్థం కోసం అలాంటి కార్డునే సెలెక్ట్ చేయడం గుర్తొచ్చింది. తల్లి జ్ఞాపకాలు మనసుని ముంచెత్తడంతో పరధ్యానంగా కార్డు అంచుల్ని చూపుడు వేలితో తాకుతూ అలాగే నిలబడిపోయిందొక క్షణం.

"అయామ్ సారీ" సుమ చేతిని పట్టుకుంది సీమ.

"నీ మారేజ్ గుర్తొచ్చినట్టుంది" అంది నొచ్చుకుంటున్నట్టుగా.

సుమ నీరసంగా నవ్వింది. "అలాంటిదేమీ లేదు. ఒకవేళ నేను యింటర్వ్యూకి సెలెక్ట్ అయితే యింటర్వ్యూ డేట్స్ నీ పెళ్ళికి అడ్డం రావు కదా. అని ఆలోచిస్తున్నానంతే" మాట తప్పించింది.

"అలా అనకు. పైన తథాస్తు దేవతలుంటారని మా అమ్మ చెప్పింది" అని నాలిక్కరుచుకుని.

"పర్లేదు. అనొచ్చు. ఎందుకంటే, నా పెళ్ళికి రాకపోయినా నీకు యింటర్వ్యూకి కాల్ వచ్చినట్టేగా" అంది తలమీద మొట్టికాయ వేసుకుంటూ.

సీమ యాక్షను చూసి సుమకి నవ్వొచ్చింది.

"ఫ్రెండ్సిద్దరూ చేరి ఏం మాట్లాడుకుంటున్నారు?" వాళ్ళ నవ్వులు విని, లోపలికి వచ్చిన ఆదిత్య యిద్దరివంకా చూసి అడిగాడు.

"నా పెళ్ళికి సుమని పిలవడానికి వచ్చాను. మిమ్మల్ని మాత్రం పిలవను. ఎందుకంటే, ముందు మీరు కదా! పెళ్ళి చేసుకోవాల్సింది? దాన్ని వాయిద వేసి, నా మారేజ్‌లో బ్యాచిలర్‌లా వచ్చి ఫోజు కొడతానంటే అస్సలు కుదరదు" అంది సీమ అల్లరిగా నవ్వుతూ.

"అవును. దీప్తి పేరెంట్స్ మొన్ననే ఫోన్ చేశారు. పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకుందామని. అయ్యగారు మళ్ళీ వాయిదా వేశారు. ఇంకోసారి గనక యిలాగే చేస్తే వాళ్ళే మీ సంబంధం మాకొద్దు 'థాంక్యూ' అంటారు" ఆదిత్యవైపుకి చూస్తూ కోపంగా అంది సుమ.

ఆదిత్య జవాబు చెప్పకుండా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

"అతను హర్టయినట్టున్నాడు. మరీ పర్సనల్ విషయాలు మాట్లాడినట్టున్నావు" సుమ జబ్బగిల్లి చెవిలో గొణిగింది సీమ.

"ఇంకా.. నాన్న ఈ యింట్లో ఎన్నాళ్ళని ఒంటరిగా వుంటారు? ఆదిత్య పగలంతా ఆఫీసులో వుంటాడు. నేను ఎంతకాలం యిక్కడ వుంటానో నాకే తెలియదు. ఈలోగా ఆదిత్య సెటిలైతే నాకూ నాన్న గురించిన దిగులు వుండదు."

"నాకు మాత్రం అలా అనిపించడంలేదు" అంది సీమ వెంటనే.

"ఇంకెలా అనిపిస్తుంది?" అడిగింది బింకంగా.

"నేను నీకు చిన్నప్పటి నుంచి ఫ్రెండుని. నీ అలవాట్లు అన్నీ నాకు బాగా తెలుసు. నిన్ను యిబ్బంది పెట్టే విషయం ఏదైనా వుంటే, దాన్నుంచి త్వరగా బైటపడాలని ప్రయత్నించే అలవాటు నీది. కాలేజీలో నీకు టెన్షన్ కలిగించే ప్రెజెంటేషన్ వుంటే.. కావాలని ముందు నీ పేరే యిచ్చేదానివి. ఎందుకంటే దాన్ని ఎంత త్వరగా ముగించేస్తే అంత త్వరగా టెన్షన్ నుంచి రిలీవ్ అవ్వొచ్చని. ఆదీ పెళ్ళి విషయంలో కూడా నువ్వు ఆలోచిస్తున్నావని నాకు అనిపిస్తుంది. అతన్ని కోల్పోతున్నానన్న బాధని త్వరగా యాక్సెప్ట్ చేయాలని చూస్తున్నావు కదూ"

సుమ కళ్ళతోనే అవునన్నట్టు పలికింది.

"నా ఉద్దేశ్యం ప్రకారం అతనికి నీమీద ఫీలింగ్స్ యింకా అలానే వున్నట్టున్నాయి. అందుకే దీప్తితో పెళ్ళిని వాయిదా వేస్తున్నాడనిపిస్తుంది. మళ్ళీ మీ యిద్దరూ ఒకటైతే బావుంటుంది" అంది ఆశగా.

"ప్లీజ్...సీమా!" వారిస్తున్నట్టుగా అంది సుమ.

"నీకు తెలియదు. నేనెంత దారుణంగా ఆదిత్య మనసుని ముక్కలు చేశానో. అతను ఎంత డీప్‌గా నన్ను ప్రేమిస్తున్నాడో తెలిసి కూడా ఫీలింగ్స్‌ని లెక్కపెట్టలేదు నేను. ఆశలు కల్పించి నిశ్చితార్థం ముందురోజు 'నువ్వు నాకు అక్కర్లేదు' అన్నట్టు వెళ్ళిపోయాను. గాజుకుండీని పగలగొట్టినంత తేలిగ్గా, మా యిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని ముక్కలు చేశాను. కనీసం నేను మోహిత్ గురించి ముందుగా అతనికి చెప్పినా పరిస్థితి మెరుగ్గా వుండేదేమో?

అసలు ఆదీకి కోపం రావడమన్నది నాకు తెలియదు. అర్ధరాత్రి లేపి నేను ఏది కావాలని అడిగినా విసుగు పడకుండా నవ్వుతూ తెచ్చిచ్చేవాడు.

అలాంటిది నేను ఈ యింటికి మొదటిసారి వచ్చినప్పుడు నా మీద కోపం తెచ్చుకుని చాలా రోజులు మాట్లాడలేదు. నిజానికి అది కోపం కూడా కాదు. నా వల్ల కలిగిన డిసప్పాయింట్‌మెంట్. తిరస్కారం వల్ల కలిగిన బాధ. కోపం కంటే భయంకరమైన ఫీలింగ్ అది.

నేను లైఫ్‌లో దెబ్బతిన్నాక యిప్పుడు స్వార్థం కోసం ఆదిత్యని నేను కోరుకోలేను ఒకవేళ మోహిత్‌తో నా జీవితం గనక బావుండి వుంటే ఆదిత్య ఫీలింగ్స్‌ని గురించిన బాధ నాకు వుంటుందా? ఇది స్వార్థం కాక మరేంటి చెప్పు? అందుకే అంత చీప్‌గా ఆలోచించి నా దృష్టిలో నేను దిగజారిపోదల్చుకోలేదు. ఆదిత్య గనుక అలా ఆలోచిస్తే ఆ క్షణమే నాకు చచ్చిపోవాలనిపిస్తుంది" అంది జీరపోయిన గొంతుతో.

"అంటే దీనర్థం నువ్వు ఆదిత్యని ప్రేమిస్తున్నావనే కదూ" సీమ అడిగింది.

"ప్లీజ్ యింతకు మించి యింకొక్క మాటకూడా మాట్లాడొద్దు" అప్పటికే సుమ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"ఆదీ డిజర్వ్ బెస్ట్. అదీగాక, మా అమ్మ చివరిగా దీప్తికి, ఆదిత్యకీ పెళ్ళి జరగాలని కోరుకుంది" కష్టం మీద గొంతు పెగుల్చుకుని చెప్పింది సుమ.

"ఇట్స్. ఓ.కే" స్నేహితురాలి బాధను పంచుకుంటూ దగ్గరకి తీసుకుంది సీమ.

సుమ సివిల్ సర్వీసెస్ యింటర్వ్యూకి సెలక్టయినట్టు తెలిసింది. ఆ రోజు ప్రసాదరావు ఆనందం అంతా యింతా కాదు.

"నీ గోల్‌కి ఒక్క అడుగు దూరంలో వున్నావు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలకి నీకు తెలిసిన విషయాల్ని నీ కోణంలో ప్రెజెంట్ చెయ్యి. నీ ఆలోచన, అవగాహన నీ మాటల్లో సూటిగా, స్పష్టంగా కనిపించాలి" ఫ్లైట్ ఎక్కబోయే ముందు కూతురి భుజం తట్టి విష్ చేశాడు ప్రసాదరావు.

ఢిల్లీలో జరిగిన యింటర్వ్యూలో అన్ని విభాగాలకూ సంబంధించిన ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు యిచ్చి ఐదవరాంక్ సాధించింది సుమ.

టాప్ ఫైవ్‌లో నిలబడడమే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి, ఆ సంవత్సరం ఐయ్యేయస్ విభాగంలో పోస్టింగ్ సాధించిన ఏకైక మహిళగా నిలిచింది.

ఆ వార్త తెలిసినరోజు ప్రసాదరావు ఆనందం అంతా యింతా కాదు. "ఇంటర్వ్యూ పానెల్ యింకా ఏమేమి ప్రశ్నలు అడిగారు?" స్టడీ రూంలో కూతుర్ని ఎదురుగా కూర్చోబెట్టుకుని అడిగాడాయన.

"మనిషికి నిత్యావసరాలతోబాటు జీవితం సాఫీగా సాగాలంటే వుండవలసిన ముఖ్యలక్షణం ఏమిటి? అని అడిగారు. నేను 'నిజాన్ని గుర్తించగలగడం' అని చెప్పాను. ఎందుకంటే ప్రతి మనిషికీ పైకి కనిపించే మొహం వెనకాల ఒక నిజం వుంటుంది. దగాకోర్లు, మోసగాళ్ళు కూడా అమాయకమైన మొహాల వెనకాల దాక్కుని తిరుగుతూ వుంటారు సొసైటీలో. జీవితం సాఫీగా సాగాలంటే అలాంటివారిని గుర్తించగలిగే సామర్థ్యం వుండాలి. ఇక ఉన్నతస్థానాల్లో వున్నవారికైతే ఈ సామర్థ్యం తప్పనిసరిగా వుండాలి. ఎందుకంటే వారు తీసుకునే ప్రతిచర్య చాలామంది జీవితాల్ని ప్రభావితం చేస్తుంది. అలాంటివారు యింకా జాగ్రత్తగా వుండాలి" అని చెప్పాను.

"వెరీ గుడ్." కళ్ళజోడు తడుముకుంటూ ఆనందంగా అన్నాడు ప్రసాదరావు.

వాళ్ళ సంభాషణ అంతా అక్కడే కూర్చుని వింటున్న ఆదిత్య "ఇవాళ మామయ్య అచ్చం నీలాగా, నువ్వు మామయ్యలాగా కనిపిస్తున్నారు నా కళ్ళకి" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

ఇంతలో అమెరికా నుంచి సుధీర్ ఫోన్ చేశాడు.

"సుధీర్ మన సుమకి ఐయ్యేయస్ పోస్టింగ్ వచ్చింది. అంతేకాదు 5వ ర్యాంక్ సాధించింది అమ్మాయిల్లో మన రెండు తెలుగు స్టేట్స్‌లో ఐయ్యేయస్‌కి సెలక్టయ్యింది సుమ ఒక్కతే" చిన్నపిల్లాడిలా ఆనందంగా చెప్పుకుపోతున్నాడాయన.

సుధీర్, స్నేహ కూడా సుమని విష్ చేశారు.

ఆ రోజంతా యింట్లో అందరి ఫోన్లూ మోగుతూనే వున్నాయి. కొద్దిపాటి పరిచయం వున్నవాళ్ళు కూడా సుమని అభినందించడానికి కాల్స్ చేస్తూనే వున్నారు. లోకల్ ఛానల్సు, పత్రికలు సుమ యింటర్వ్యూ తీసుకున్నాయి. ప్రసాదరావుగారి హడావుడి

అయితే వర్ణించడానికి అలవికాకుండా వుంది. ఆయన స్నేహితులు, రిటైర్డ్ ఫ్రెండ్సందరితో యిల్లు పండుగ వాతావరణాన్ని తలపిస్తూ వుంది.

చాలాకాలం తర్వాత స్నేహితుల మధ్య కూర్చుని ఆనందంగా కబుర్లు చెబుతూ వున్నాడు ప్రసాదరావు.

సంతోషంతో వెలిగిపోతున్న ఆయన మొహాన్ని దూరంగా నిలబడి చూస్తూ వుంది సుమ.

"చూశావా మామయ్య నిన్ను చూసి ఎంత గర్వపడుతున్నారో. నోరు తెరిచి చెప్పడంలేదు కానీ మొహం మాత్రం మతాబులా వెలిగిపోతూ వుంది" ఆదిత్య పక్కనే వున్న గుమ్మానికి ఆనుకుని నిలబడుతూ సుమతో అన్నాడు.

"దేశంలో నేనొక్కదాన్నే ఐయ్యేయస్ సాధించలేదు. అది మరీ అంత గొప్ప విషయం కాదు ఆదీ. కానీ నేను సాధించినదానికి నాన్న అంత వేల్యూ యిచ్చారు. అదీ గొప్ప విషయం. నిజంగా యివాళ అమ్మ వుండి వుంటే నాన్న మొహంలో సంతోషం చూసిన్ అయినా, నన్ను క్షమించేదేమో కదా!" సుమ కళ్ళు చెమ్మగిల్లాయి.

"సుమా నువ్విలా 'అమ్మ'ని గుర్తు చేసుకుని బాధపడుతూవుంటే నా మనసు గడ్డకట్టుకుపోతున్నట్టుంటుంది. ఐ ఫీల్ టెర్రిబుల్" ఆమె చేతిని పట్టుకుంటూ అన్నాడు.

"ఒకమాట అడుగుతాను నిజం చెప్తావా ఆదీ. చిన్నప్పట్నుంచీ నేను సుధీర్ అన్నయ్యతో చాలా రూడ్‌గా ప్రవర్తించేదాన్ని కదా! యిప్పుడు నేననుకుంటున్నట్టుగానే సుధీర్ కూడా వాళ్ళమ్మని గుర్తుచేసుకుని బాధపడేవాడేమో? నేను నాన్నని యాక్సెప్ట్ చేసినట్టుగా మా అమ్మని తల్లిగా స్వీకరించలేకపోయివుండొచ్చు.

అమ్మ ఎప్పుడూ చెబుతూ వుండేది. అన్నయ్య విషయంలో సర్దుకొమ్మని. కానీ నేను పట్టుబట్టేదాన్ని. నేను అన్నింటికీ ఒకటే త్రాసు వాడాను. నా వల్ల నాన్నకీ, అన్నయ్యకీ దూరం పెరిగిపోయింది. తప్పంతా నాదే అనిపిస్తుంది ఆలోచిస్తే. నిజమే కదూ?"

"ఇవాళ నీకేదో అయ్యింది. సంతోషంగా వున్న సమయంలో లేనిపోనివి ఆలోచిస్తూ కూర్చున్నావు. ఇప్పుడంటే నీకు బాగా తెలివి ముదిరిపోయింది కానీ, చిన్నప్పుడు నీకు మాత్రం ఏం తెలుసు? ఇక సుధీర్ సంగతంటావా తన బుర్ర యిప్పటికీ చాలా ఏరియాల్లో ఎదగనట్టే అనిపిస్తుంది నాకు" అన్నాడు నవ్వేస్తూ.

"అందుకే నిన్ను 'అందరివాడు' అంటారు. ఎక్కడి మాటలు అక్కడ చెబుతావు" అంది సుమ కూడా అతనితోబాటు నవ్వుతూ.

ఆదిత్య నవ్వుతూవున్న ఆమె మొహంలోకి క్షణం సేపు అలాగే చూస్తూ వుండిపోయాడు.

"నీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి బైటికి వస్తావా?" అడిగాడామెని.

సుమ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది. ప్రసాదరావు ఫ్రెండ్స్‌తో కబుర్లతో బిజీగా వున్నాడు.

"పద" అంటూ అతనితోబాటు నడిచింది సుమ.

ఇద్దరూ తరచుగా కూర్చుని మాట్లాడుకునే మెట్లమీదకి చేరారు.

"నీ ఫ్యూచర్ గురించి ఏమాలోచించావు?" సుమని చూస్తూ సీరియస్‌గా అడిగాడు.

"నాకేంటి ఆదీ. ఎంతో అద్భుతం సాధించినట్టు అందరూ తెగ పొగిడేస్తున్నారు. కావాలంటే యింకోసారి లోపలికి వెళ్ళి విను."

ఆదిత్య సుమవైపు చిరుకోపంతో చూశాడు.

"ఓ.కే ... సారీ నువ్వు అడిగేది మోహిత్ గురించేనని అర్థమైంది. కానీ యిందులో కొత్తగా ఆలోచించేందుకు ఏమీలేదు" అంది నిరాసక్తంగా.

"గడిచిపోయిన జీవితాన్ని వదిలేసి, కొత్తగా లైఫ్ స్టార్ట్ చెయ్యి. నువ్వు ఒప్పుకుంటే డైవోర్స్ కేస్ వేయడానికి లాయర్‌ని పిలిపించి మాట్లాడతాను. ఒకవేళ నువ్వు మనసు మార్చుకుంటే.. ఐ మీన్.. నీకు యింకా అతని మీద ఏవైనా ఫీలింగ్స్ వుంటే.." అని ఆపాడు.

"ఉంటే?" కనుబొమ్మలు పైకెత్తి అడిగింది సుమ.

"అతనితో కలిసి వుండమని సలహా యిస్తావా? నాకు కొత్తగా వచ్చిన ఉద్యోగం ద్వారా అధికారం వస్తుంది కాబట్టి మొగుణ్ణి కంట్రోల్‌లో వుంచడానికి ఆ అధికారాన్ని ఉపయోగించాలా? నాకూ వాళ్ళకీ రక్తసంబంధం వుంది కానీ, నేను వాళ్ళలా దిగజారిపోయి మాత్రం లేను" బాధపడుతూ అంది.

"అయామ్ సారీ సుమా! నీ గురించి తెలియక కాదు. ఇది జీవితంలో పెద్ద నిర్ణయం కాబట్టి అన్ని రకాలుగా ఆలోచించి డెసిషన్ తీసుకోవాలన్నట్టుగా అడిగానంతే" వివరణ యిచ్చాడు.

"అసలు నా గురించి నువ్వేమనుకుంటున్నావు? నేను తప్పులు చేసుండొచ్చు కానీ, బుద్ధిలేని దాన్ని మాత్రం కాదు" కోపంగా అంది సుమ.

ఆదిత్య మాట్లాడలేదు. ఇద్దరి మధ్యా కాలం మౌనంగా నడిచింది. అయిదునిమిషాల తర్వాత సుమే మాట్లాడింది.

"ఇంతకీ పెళ్ళెప్పుడు చేసుకుంటున్నావు?" అంటూ.

"నీ సంగతి చెప్పు. నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోవా?" తిరిగి ప్రశ్నించాడు.

"నా లైఫ్ అంటే ఎగతాళిగా వుంది కదూ నీకు. నన్ను ఒకరు వెక్కిరించక్కర్లేదు. నా జీవితాన్ని నవ్వులపాలు చేసుకున్నానని నాకు బాగా తెలుసు" నిష్ఠూరం, బాధ రెండూ ధ్వనించాయి ఆమె మాటల్లో.

మళ్ళీ యిద్దరూ మౌనాన్ని ఆశ్రయించారు.

"నీ పెళ్ళి గురించి మాట్లాడి నిన్ను అప్‌సెట్ చేసినట్టున్నాను" కాస్సేపాగి అన్నాడతను.

"నీ తప్పేమీ లేదు. ఒకవేళ నువ్వు నా మంచికోరే సలహా యిచ్చినా నాకు ఎగతాళిగానే అనిపిస్తుంది. ఎందుకంటేఁ ప్రస్తుతం పెళ్ళి విషయంలో నా మానసిక స్థితి అలావుంది. నా సంగతి వదిలెయ్. నీ పెళ్ళి గురించి మాట్లాడు" సుమ మళ్ళీ మొదటికి వచ్చింది.

"నీ పరిస్థితికీ నా పరిస్థితికీ పెద్ద తేడా ఏమీలేదు" పొడిగా చెప్పి కూర్చున్నచోటినుంచీ లేచి వెళ్ళిపోయాడతను.

"ఆదీ నువ్వు ఆఫీసుకేగా వెళుతున్నావు. నన్ను దారిలో డ్రాప్ చేయగలవా?" మేడమెట్లు దిగుతూ, ఆదిత్యని చూసి అడిగింది సుమ.

"ఎక్కడికెళ్ళాలి?"

"దారిలో చెబుతాను పద" అంది హడావిడిగా చెప్పులు వేసుకుంటూ.

"సరే పద. మళ్ళీ ఈ అవకాశం నాకు ఎప్పటికి వస్తుందో త్వరలో మేడమ్‌గారికి గవర్నమెంటు వారి కారు, సేవకులు వస్తారుగా" నవ్వుతూ అన్నాడు ఆదిత్య.

కారు ఎక్కి కూర్చున్నాక ఆదిత్య డ్రైవింగ్ చేస్తూనే నవ్వుకుంటూ వుండడం చూసింది సుమ.

"ఎందుకలా నవ్వుతున్నావు? అడిగింది అనుమానంగా.

"నువ్వు డ్రైవింగ్ నేర్చుకుంటున్నప్పటి విషయం గుర్తొచ్చింది. మామయ్య నీ చేతికి కారు యివ్వనన్నారు. నిన్ను కాలేజీలో డ్రాప్ చేసే డ్యూటీ నాది. నువ్వు మాత్రం నీ ఫ్రెండ్సుకి సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చానని డబ్బా కొట్టావు వాళ్ళు నమ్మలేదు."

అతను చెబుతూ వుండగానే సుమ పకపకా నవ్వింది. "కారు పార్కింగ్ చేశాక, వాళ్ళు కారులో యింకెవరన్నా వున్నారా అని చూస్తారని. నిన్ను వెనకాల సీట్లో అడ్డంగా పడుకోమని గోల చేశాను కదూ"

"వెనకాల సీట్లో కాదు సీటు ముందర కాళ్ళు పెట్టుకునే స్థలంలో పడుకోమని ఒకటే గోల. ఆరడుగుల మనిషిని, నువ్వు కాటన్ బాల్ అనుకున్నట్టున్నావు. ఎలాగో ఒత్తిపెట్టి యిరికించొచ్చని నీ ప్లాన్" అని మళ్ళీ నవ్వాడు.

"నాకు కంగారు వస్తే ఏం చేస్తున్నానో అర్థంకాకుండా వుండేది అప్పట్లో" ఒప్పుకుంది సుమ నిజాయితీగా.

"నువ్వు చెప్పినట్టు చేయలేదని నా మీద మూడురోజులు అలిగావు కూడా"

అతను చెబుతూ వుంటే ఆ దృశ్యం కళ్ళముందు కదిలినట్టైంది.

"నిన్ను బాగా విసిగించాను కదా.. ఆదీ!" జ్ఞాపకాల బరువు ఆమె మాటల్లో స్పష్టంగా తెలుస్తూ వుంది.

**"ప్రొద్దున బ్రష్** చేసుకున్నప్పటి నుంచి, రాత్రి పడుకోబోయేవరకు నేను చేసే ప్రతి పనిలో నువ్వు కనిపిస్తూనే వుంటావు. అంతలా ఏడిపించావు" మామూలుగానే అన్నా చివర్లో ఉన్నట్టుండి అతని మొహం పాలిపోయింది.

"బహుశా, గుండె కొట్టుకోవడం కూడా నొప్పి అనిపించేంతలా బాధపెట్టిన సంగతి గుర్తువచ్చిందేమో? దేవుడా మంటని రేపే జ్ఞాపకాల్ని తుడిచివేయగల శక్తి మనిషికి వుంటే ఎంత బావుండేది?" సుమ మనసు బాధగా మూలిగింది.

"ఇంతకీ ఎటు వెళ్ళాలి?" సిగ్నల్ పడడంతో బ్రేక్ వేస్తూ అడిగాడు ఆదిత్య.

"రాజారాం నగర్‌లో పార్కు ఎదురు సందులోకి తిప్పు"

ఆ అడ్రస్ వినగానే ఆదిత్య మొహంలో రంగులు మారాయి.

"నువ్వు ఒక్కదానివే ఆ యింటికి వెళ్ళడం మంచిదికాదు. నేనూ నీతో వస్తాను" అన్నాడు కారుని మలుపు తిప్పుతూ.

"ఇంకే విషయమన్నా అయితే నీకు అభ్యంతరం చెప్పేదాన్ని కాదు ఆదీ. ఈ విషయంలో నీ ప్రెజెన్స్ చాలా ప్రశ్నలకు అనుమానాలకు దారితీస్తుంది. సమస్య చిక్కుముడులు పడడం తప్పిస్తే యింకే వుపయోగం లేదు." సుమ చెబుతూ వుండగానే కారు చేరవలసిన చోటికి వచ్చి ఆగింది.

"సుమా జాగ్రత్త. నీకే మాత్రం యిబ్బంది అనిపించినా నాకు వెంటనే ఫోన్ చెయ్యి" బలవంతంగా కాళ్ళూ చేతులూ కట్టి ఆపేసినట్టు మొహం పెట్టాడు ఆదిత్య.

"డోంట్ వర్రీ నేను మేనేజ్ చేయగలను" చెప్పి కారు దిగింది సుమ.

"సుమా!" చేతిలో చీపురుని కిందపడేసి గబగబా వచ్చింది లలితాంబ.

సుమ చూసిన సంతోషం రెండు సెకన్లు కూడా నిలవలేదు ఆమెలో. "నువ్వెందుకు వచ్చావమ్మా యిక్కడికి" అంది భయంగా.

"ఫర్వాలేదులే పిన్నీ అనవసరంగా భయపడకు. లోపలికి వెళ్ళి కూర్చుందామా?" అంది సుమ నవ్వుతూ.

"నీ గురించి పేపర్లో చదివి చాలా సంతోషించాను. అచ్చం మీ అమ్మలాగే నీకు కూడా పట్టుదల ఎక్కువ. అనుకున్నది సాధించి చూపించావు. కూర్చో నోరు తీపి చేస్తాను" అంటూ పరుగున లోపలికి వెళ్ళి గుప్పిటతో చక్కెర తెచ్చి సుమ నోట్లో పోసింది.

"థాంక్యూ పిన్నీ! ఆ రోజు నువ్వు నాన్నకి ఫోన్ చేసి చెప్పినందుకు" కుర్చీలో కూర్చుంటూ అంది.

"నేను పెద్దదానిగా జీవితాన్ని చూసినదాన్ని. నువ్వు మీ నాన్న గౌరవం కోసం గెలిచి నిలబడేదాకా యిక్కడే ఉండాలనుకున్నావు.

కానీ తల్లిదండ్రుల ప్రేమ వీటన్నింటికీ అతీతం అని నాకు తెలుసు. నువ్వనుకున్న అభిమానం, గౌరవం యివన్నీ బిడ్డల కంటే ఎక్కువ కాదు. చనిపోయే చివరిక్షణంలో కూడా తమ రెక్కల చాటున కోడిపిల్లల్ని తల్లి కోడి దాచినట్టు పిల్లల్ని కాపాడాలని చూస్తారు తల్లిదండ్రులు. నువ్వేమో ఈ ఊబిలోనే వుండి ఏదో చేయాలని ప్రయత్నించావు. నేను నిన్ను బైటపడేయాలని చూశాను" అంతే.

"నిజమే" తలాడించింది సుమ.

లలితాంబ యిచ్చిన కాఫీ తాగి "ఒకసారి పైకి వెళ్ళొస్తాను పిన్నీ" అంటూ లేచింది.

ఆవిడ ఒక క్షణం ఏదో అనబోయి ఆగి, "జాగ్రత్తమ్మా" అని హెచ్చరించింది.

సుమ వెళ్ళేసరికి రాజేశ్వరి, మోహిత్ యిద్దరూ యింట్లోనే వున్నారు.

అనుకోకుండా ఆమె రావడం చూసి ఎలా రియాక్ట్ కావాలో అర్థంకానట్టుగా వుంది వాళ్ళ పరిస్థితి. ఇద్దరిలో ముందుగా రాజేశ్వరి తేరుకుంది.

"మొత్తానికి అనుకున్నది సాధించావు. నా కోడలు కలెక్టరు కాబోతుందన్నమాట" మొహమంతా నవ్వు పులుముకుంటూ అంది రాజేశ్వరి.

మోహిత్ వచ్చి సుమ ఎదురుగా సోఫాలో కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నాడు.

"ఇది మ్యూచ్‌వల్ కన్‌సెన్ మెంట్‌తో డైవర్స్‌కి ఫైల్ చేయడానికి కాగితాలు సంతకం పెట్టి పంపించు తొణక్కుండా చెప్పి హేండ్‌బాగ్‌లో నుంచి కాగితాల్ని తీసి అతని ఎదురుగ్గా పెట్టింది.

"నాకు అక్కర్లేదు విడాకులు. నేనెందుకు సంతకం పెట్టాలి?" సుమ మొహంలోకి చూస్తూ ధీమాగా అన్నాడు.

"అవునమ్మా! అయిపోయిందేదో అయిపోయింది. నువ్వూ నాకు రవళిలాంటి దానివే. మీ కాపురం పాడైపోవాలని నేను మాత్రం ఎందుకు కోరుకుంటాను?

నా మాట విని మీరిద్దరూ మళ్ళా కొత్తజీవితం మొదలు పెట్టండి. నువ్వు వెళ్ళిన దగ్గర్నుంచి నాకు మనశ్శాంతి కరువైందంటే నమ్ము. మా అన్నయ్యని తలుచుకు బాధపడని రోజు లేదు. మళ్ళా మీ యిద్దరూ ఒక్కటయ్యారంటే పైనున్న మా అన్నయ్య ఆత్మకూడా శాంతిస్తుంది" రాజేశ్వరి అంది.

సుమ ఒకసారి తలెత్తి ఎదురుగా చూసింది. గోడల మీద తన కన్నతండ్రి రామకృష్ణ ఫోటోలు కనిపించాయి.

ఆయన వర్థంతిరోజు వాళ్ళు చేసే హడావుడి గుర్తొచ్చి విరక్తిగా నవ్వింది.

"ఓ.కే.. అయితే" అంది నిట్టూరుస్తూ.

సుమ ఆ మాట అనగానే యిద్దరి మొహాల్లో ఆశ్చర్యం.

"తొందరపడకండి. ఇంకా నేను చెప్పదలుచుకున్నది పూర్తి కాలేదు. విడాకులు వద్దనుకుంటే ఎవాక్యుయేషన్ నోటీస్ వస్తుంది. అది తీసుకోవడానికి రెడీగా వుండండి. ఈ యిల్లు చనిపోయిన నా తండ్రి పేరు మీద రిజిస్టర్ అయినట్టు వున్న కాపీ. నా దగ్గర వుంది. ఆయన ఆస్తికి ఏకైక వారసురాలిగా ఈ యింటి మీద నాకు మాత్రమే హక్కు వుంది. దానికి కావల్సిన కాగితాలన్నీ నా దగ్గర సిద్ధంగా వున్నాయి. త్వరలో యిల్లు ఖాళీ చేయించగలను. నేను తలచుకుంటే. నా ఆఫర్ ఏంటంటే మీకు యిల్లు కావాలా? విడాకులు కావాలా?" కనుబొమలు ఎగరేస్తూ సూటిగా అడిగింది.

సుమకి యింటిని గురించిన నిజం ఎలా తెలిసిందో అర్థంగాక తికమక పడిపోయారిద్దరూ.

"మీలాంటి వాళ్ళని వదిలించుకోవాలనుకున్నప్పుడు వీలైనంత చౌకలో బైటపడిపోవడానికే ట్రై చేస్తారెవరైనా. అందుకే, నాకు అక్కర్లేని ఈ యింటిని మీ మీద ఖర్చుపెట్టాలని డిసైడ్ అయ్యాను. ఈ సలహా మా నాన్న యిచ్చారు నాకు. నా విలువైన సమయాన్నీ, పరువునీ మీ మీద వేస్ట్ చేయడం అంత తెలివితక్కువతనం యింకోటి వుండదు. మీకంత వేల్యూ కూడా యివ్వదలచుకోలేదు నేను.

ఒకవేళ మీరు సాగదీసే కేసులతో, టైం వేస్టు చేస్తూ మీడియా కెక్కి గొడవ చేయాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. నా జీవితం కోసం ఎంతదూరమైనా వెళ్ళగలను. ఇది మీకు ఒక ఆప్షన్ మాత్రమే " చెప్పి లేచి నిలబడింది.

సుమ నిలుచున్న చోటనుంచి కదలక ముందే రాజేశ్వరి ఠక్కున టీపాయ్ మీదున్న పేపర్లని చేతిలోకి తీసుకుంది. సుమ నవ్వి, వెనక్కి తిరగబోతూ ఏదో గుర్తొచ్చినదానిలా ఆగిపోయింది.

"అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మొన్న సుజీ.. అదే సుజాత నీ మాజీ గాళ్‌ఫ్రెండ్ కలిసింది. నీకు పెళ్ళైన సంగతి ఆమె దగ్గర దాచి ఛీట్ చేశావా? లేదా? అన్న విషయం కన్‌ఫర్మ్ చేసుకోవడానికి వచ్చింది. ఇప్పుడు ఆమె ప్రెగ్నెంట్. బిడ్డను కనాలనుకుంటున్నానని చెప్పింది. నీలాంటివాడిని పెళ్ళి చేసుకోవడం కంటే సింగిల్ మామ్‌గా బిడ్డని పెంచడం మేలని సలహా యిచ్చాను. డెలవరీ అయ్యాక డి.ఎన్.ఏ టెస్ట్ చేయించి, ఛైల్డ్ మెయిన్‌టెనెన్స్‌కి కేసు వేయమని కూడా చెప్పాను. 'యూ బెటర్ సేవ్ సమ్ మనీ'" మోహిత్‌తో చెప్పి వాళ్ళు నోళ్ళు వెళ్ళబెట్టుకుని చూస్తూ వుండగానే, వెనక్కి తిరిగి వచ్చేసింది.

"కాఫీ తీసుకోండి నాన్నా" ట్రే పట్టుకుని ప్రసాదరావు దగ్గరకు వచ్చింది సుమ.

"నాకూ ఒక కాఫీ ఒక స్పూన్ షుగర్‌తో" ఆదిత్య కూడా వచ్చి కూర్చుంటూ అన్నాడు.

"ఇవాళ నువ్వు ఆఫీసుకి మధ్యాహ్నం నుండి వెళ్ళు" ప్రసాదరావు ఆదిత్యకి ఆర్డరేశాడు.

"ఏమిటి విశేషం?" ఆశ్చర్యంగా అడిగాడు ఆదిత్య.

"దీప్తి వాళ్ళ అమ్మానాన్నా వస్తున్నారు. పెళ్ళి మూహూర్తాలు పెట్టుకోవడానికి. ఇప్పటికే వాళ్ళని దాదాపు సంవత్సరంపాటు వెయిట్ చేయించాము సుమ ఎగ్జామ్స్ గొడవలో వుండి నేనూ కావాలనే పెళ్ళి విషయాన్ని కదిలించలేదు. ఇక ఆలస్యం చేస్తే నేను ఒప్పుకోను" వార్నింగ్ యిస్తున్నట్టే అన్నాడాయన.

ఆయనా మాట అనగానే, అప్రయత్నంగా సుమ, ఆదిత్య ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఇద్దరి మనసుల్లో ఏదో వెలితి. దాన్ని చూపుల్లో బైటపడనివ్వకుండా ఇద్దరూ మొహాలు పక్కకి తిప్పుకున్నారు.

దీప్తి కుటుంబానికి ఆహ్వానం పలకడానికి ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతున్నాయి.

బజారు నుంచి స్వీట్సు, పళ్ళు వచ్చాయి. వచ్చేవాళ్ళకి భోజనాల ఏర్పాట్లు ఎలా చేయాలో వంట మనిషికి వివరంగా చెప్పింది సుమ.

సోఫాల్లో దిళ్ళకి కవర్లు మార్చి తోటలోని తాజా గులాబీలు తెచ్చి ఫ్లవర్ వేజ్‌లో సర్దుతూ వుంది. ఆ పూలలో అరచేయంత పెద్దవిగా విరబూసిన పసుపుపచ్చని గులాబీని చూస్తూనే సుమకి చిన్నప్పటి సంగతులు గుర్తుకు వచ్చాయి.

టీచర్స్ డేకి ఎల్లో గులాబీనే కావాలని పట్టుబట్టి అవి దొరకలేదని ఏడుస్తూ కూర్చుంటే, ఆదిత్య వచ్చాడు.

"ఏడ్వకు నేను నీ కోసం చాలా ఎల్లో రోజెస్ మొక్కల్ని పెంచుతాను. అప్పుడు నువ్వు ఎన్ని పూలు కావాలంటే అన్ని పూలు కోసుకోవచ్చు సరేనా?" అతనన్నాడు.

"ఎప్పుడో నాకు అక్కర్లేదు యిప్పుడే కావాలి" పట్టుబట్టింది.

"ఇప్పటికైతే యిది తీసుకో" అంటూ పసుపుపచ్చని కాయితంతో చేసిన గులాబీపువ్వు చేతిలో పెట్టాడు.

సరిగ్గా నాలుగు నెలల తర్వాత, ఒకరోజు ఉదయాన్నే సుమ గదిలోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఇదిగో నువ్వు అడిగిన ఎల్లో రోజ్. మనం పెట్టిన మొక్కకి పూసింది" అంటూ ఒక అందమైన గులాబీని చేతికిచ్చాడు. అప్పటికి ఆ విషయమే మర్చిపోయింది సుమ.

చేతిలోని గులాబీ రేకుల్ని మృదువుగా తాకుతూ గడిచిపోయిన క్షణాల్ని నెమరు వేసుకుంది.

"సుమా!" అని పిలుస్తూ అప్పుడే అటు వచ్చాడు ఆదిత్య. ఏదో చెప్పబోయినవాడల్లా ఆమె చేతిలోని పూలని చూసి ఆగిపోయాడు.

అతని మనసులోనూ అదే జ్ఞాపకం మెదిలినట్టు గ్రహించింది సుమ.

"నాతో ఏదైనా పనా?" అంది మామూలు ధోరణిలోకి వస్తూ.

"ఇప్పుడిదంతా అవసరమా?" అసహనంగా అడిగాడతను.

"మనం చేయాల్సింది యిప్పుడే తర్వాత ఫంక్షన్ హాల్ బుక్ చేయడం దగ్గర్నుంచి అన్నీ వాళ్ళే చూసుకుంటామన్నారు" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అది కాదు నేనడిగేది? నా పెళ్ళి యింట్లో అందరికీ అంత సమస్యగా వుందా? అని?" అన్నాడు కోపంగా.

"ఏమో నాన్నని అడుగు" నిర్లక్ష్యంగా జవాబిచ్చింది. "ముందు నీ సంగతి చెప్పు" అన్నాడతను మొండిగా.

"నాలుగు నెలల్లో నేను ట్రైనింగ్‌కి వెళ్ళాలి. నీ పెళ్ళి ఎంత త్వరగా జరిగితే నాకంత సంతోషం" నింపాదిగా చెప్పింది.

ఆమె వాక్యం పూర్తి కాకముందే ఆదిత్య ఆమె వంక కోపంగా చూసి గబగబా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

ఆదిత్య, దీప్తి జాతకాలను బట్టి ఆర్నెల్ల తర్వాత ముహూర్తం కుదిరింది. ప్రసాదరావుకి యిలాంటివాటి మీద నమ్మకాలు లేకపోయినా దీప్తి తల్లిదండ్రుల నమ్మకం మీద గౌరవంతో ఒప్పుకున్నాడు.

పెళ్ళి ముహూర్తం నిర్ణయం అయిందనగానే దీప్తి మొహం సంతోషంతో వెలిగిపోవడం గుర్తొచ్చింది సుమకి.

"అతిగారాబంగా పెరిగింది దీప్తి. వాస్తవ ప్రపంచం గురించి తెలియదు. కలల్లో విహరించే వయసులో కోరుకున్నట్టు జరిగితే ఎంత పొంగిపోతూ వుంటుందో"

ఆ రాత్రి మంచం మీద పడుకుని, ఆ విషయం గురించే ఆలోచిస్తూ వుంది సుమ.

ఉన్నట్టుండి 'ధన్'మని చప్పుడు. ఆ వెంటనే, ఒక అరుపు వినిపించింది. ఆ శబ్దాలు తండ్రి గదిలో నుంచి అని అర్థం అయిన మరుక్షణం సుమ మంచం మీద నుంచి లేచి పరుగున తండ్రి గదిలోకి వెళ్ళింది.

చీకటిగా వున్న గదిలో లైటు వేసి, తండ్రి కోసం చూసింది. ప్రసాదరావు మంచం మీద లేడు. గోడ పక్కగా సన్నగా మూలుగు వినిపిస్తూ వుండడంతో అటు వైపుకి చూసింది సుమ. ప్రసాదరావు గోడకీ, మంచానికీ వున్న సందులో కింద పడిపోయి వున్నాడు.

"నాన్నా!" అంటూ పరుగున దగ్గరికి వెళ్ళింది.

అప్పటికే ఆయన ఒళ్ళంతా చెమటలతో తడిసిపోయి వుంది. చేయి ఆడిస్తూ అస్పష్టంగా ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తూ వున్నాడాయన. మెడికల్ ఎమర్జెన్సీ అని గుర్తించడానికి సుమకి ఎక్కువ సమయం పట్టలేదు. వెంటనే, పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆదిత్యని పిలుచుకుని వచ్చింది.

"ఆదీ! డాక్టరు ఏమంటున్నారు?"

ఐ.సి.యు ముందు నిలబడి ఆదిత్య రాగానే, ఆతృతగా అడిగింది సుమ.

"మనం ఊహించిందే పెరాలసిస్ వచ్చింది. ఎడమచెయ్యి, ఎడమ కాలుకి ఎటాక్ అయ్యింది. మాట సంగతి కూడా తెలియడం లేదు. డాక్టర్లు వాళ్ళ ట్రీట్‌మెంట్ చేస్తున్నారు"

ఆదిత్య చెప్పింది విని సుమ భారంగా నిట్టూర్చింది.

"సుధీర్ అన్నయ్యకి ఫోన్ చేసి విషయం చెప్పావా?" అడిగింది.

"చేశాను. సుధీర్ యిమ్మీడియట్‌గా ఏ ఫ్లైటు దొరికినా పట్టుకుని వస్తానన్నాడు. స్నేహ, పిల్లలు చిన్నగా తర్వాత వస్తారేమో" చెప్పాడు.

సుమ సరేనన్నట్టు తలపంకించింది.

సుధీర్ వచ్చేదాకా హాస్పిటల్‌కి ట్రిప్స్ వేయడం ఇదివరకు ప్రసాదరావుగారు చూసుకునే వ్యవహారాలూ అన్నీ ఆదిత్య చూసుకున్నాడు. సుమ తండ్రిని కనిపెట్టుకుని హాస్పిటల్‌లోనే వుంది. సుధీర్ వచ్చిన తర్వాత మూడు రోజులకి ప్రసాదరావుని యింటికి పంపించారు.

"పెరాలసిస్ స్ట్రోక్ వచ్చిన తర్వాత, ట్రీట్‌మెంట్‌తో కొంతమందికి మాత్రమే వెంటనే నయం అవుతుంది ప్రసాదరావుగారి విషయంలో అది జరగలేదు. ఒక్కోసారి నరాల్లో బలాన్ని బట్టి, రెగ్యులర్‌గా ఫిజియోథెరపీ చేయిస్తుంటే కొద్దికాలానికి కోలుకునే అవకాశం వుంది. పేషెంట్ రెస్పాండ్ అయినంత వరకు మా ట్రీట్ మెంట్ మేము చేశాం. ఇక మీరు యింటికి తీసుకెళ్ళి, రెగ్యులర్‌గా చెకప్ చేయిస్తూ ఫిజియోథెరపీ చేయించడమే" డిశ్చార్జ్ చేయబోయే ముందు డాక్టర్లు చెప్పారు.

ప్రసాదరావు గది కిందకి మారిపోయింది. ఆయన కోసం ప్రత్యేకంగా ఒక నర్సుని ఏర్పాటు చేశాడు సుధీర్. సుధీర్ వచ్చిన తర్వాత వారానికి స్నేహ, పింకీని తీసుకుని వచ్చింది. బంటి స్కూల్ యియర్ మధ్యలో డిస్టర్బ్ చేయడం యిష్టంలేక యూ యస్ లో వాళ్ళ అక్క దగ్గర వదిలేసి వచ్చింది.

**రాత్రి పదిగంటలప్పుడు** సుమ తండ్రి గదిలోకి వెళ్ళబోతుండగా సుధీర్ అడ్డువచ్చాడు.

"నీకు ఆ గదిలో ఏం పని?" అన్నాడు కళ్ళు చిట్లిస్తూ.

"నాన్నకి మందులో యిచ్చారో లేదో అని చూడడానికి వెళుతున్నాను"

"ఆ పనులు చేయడానికి నర్సు వుంది. ఇన్నాళ్ళూ మా నెత్తిమీద సవారీ చేసింది చాలు. ఇంకా నీ యింపార్టెన్స్‌ని చాటుకోవాలని ట్రై చెయ్యకు" అన్నాడు కోపంగా.

సుధీర్ మాటలకి సుమకి కూడా కోపం వచ్చింది.

"మీరు పెట్టిన నర్సు ఎనిమిదింటికల్లా వెళ్ళిపోతుంది. ఒక్కోరోజు మందులు వేయడం కూడా మర్చిపోతుంది. నిన్నకూడా నాన్నకి టాబ్లెట్స్ నేనే వేశాను" చెప్పింది తొణక్కుండా.

"అవన్నీ నేను చూసుకోగలను. నువ్వేమీ కష్టపడక్కర్లేదు. మా నాన్న నీకు యింట్లో వాటా యిచ్చారు కాబట్టి. దాని ఖరీదు నేనూ, ఆదిత్య నీకు యిచ్చేస్తాం. నువ్వు యిక్కడనుంచి వెళ్ళిపోవచ్చు. యిప్పుడు ఈ యింట్లో పరిస్థితులు మారిపోయాయని గుర్తుపెట్టుకుని త్వరగా నిర్ణయం తీసుకుంటే మంచిది నువ్వు" విదిలింపుగా అన్నాడు.

సుధీర్ మాటలకి సుమ కళ్ళలో నీళ్ళు వచ్చాయి "ఇది నువ్వు నిర్ణయించే విషయం కాదని గుర్తుంచుకో. నాకూ నాన్నతో అనుబంధం వుంది" అంది ఉక్రోషంగా.

ఎప్పుడు వచ్చిందో స్నేహ, పక్కగదిలో నుంచి వచ్చి యిద్దరి మాటలు వింటూ నిలుచుంది.

"సుధీర్ నువ్వేమంటున్నావ్? మీ నాన్నని నువ్వు చూసుకుంటానని ధైర్యంగా చెబుతున్నావు. పెరాలసిస్ అంటే పర్మినెంట్ డిసేబిలిటీ. సంవత్సరాల తరబడి కనిపెట్టుకుని వుండాలి. మనకి యు.ఎస్ నుంచి రావడానికి ఎలా కుదురుతుంది? ఈ యిండియాలో నేను ఛస్తే వుండలేను. బంటి, పింకీల గురించి కూడా కాస్త ఆలోచించు. ఎంత నర్సులు వున్నా, పేషెంట్‌ని కనిపెట్టుకుని వుండడం నా వల్లకాదు" తెగేసి చెప్పింది.

సుమ.. "యిప్పుడేం జవాబు చెబుతావు?" అన్నట్టుగా సూటిగా సుధీర్ కళ్ళలోకి చూసింది.

తండ్రిని గురించి నిరసన వాక్యాలు. సుమ ముందు ఈగో దెబ్బ తినడం రెండూ కలిసి సుధీర్‌కి భగ్గున మండింది.

వెంటనే, చెయ్యి గాల్లోకి లేపి, స్నేహ చెంపమీద ఈడ్చికొట్టాడు. అనుకోని అతని చర్యకి సుమ బిత్తరపోయి చూస్తూ నిల్చుంది. స్నేహ పెద్దగొంతుతో అరుస్తూ ఏడుపు మొదలుపెట్టింది. తల్లి ఏడ్పు విని పరిగెత్తుకుంటూ వచ్చిన పింకీ, తల్లి కన్నీళ్ళు చూసి గుక్కపట్టింది.

మరు నిముషంలో, ఆదిత్య కూడా పరిగెత్తుకుంటూ వచ్చాడు. స్నేహ అరుపులకి సుధీర్ కోపంతో బుసలు కొడుతున్నాడు. పరిస్థితి యింకా దారుణంగా మారకముందే సుమ ముందుగా తేరుకుని చప్పున వంగి పింకీని ఎత్తుకుంది.

"మనం తర్వాత మాట్లాడుకుందాం. ముందు నువ్వు నీ గదిలోకి వెళ్ళు" అంటూ బలవంతంగా సుధీర్‌ని గదిలోకి తోసి తలుపేసింది.

స్నేహని కదిలించడానికి ఎవ్వరికీ ధైర్యం చాలలేదు. ఆమె ఎవరి మాటలు లెక్కచేసే రకం కాదని చూస్తూ ఉండిపోయారు సుమ, ఆదిత్య. కాస్సేపటికి అంతా సద్దుమణిగింది. ఎవరి గదుల్లోకి వారు వెళ్ళిపోయాక, మెల్లగా తండ్రి గదిలోకి వెళ్ళింది సుమ.

బెడ్‌లాంప్ వెలుతురులో మంచం మీద పడుకున్న తండ్రి ఆకారం కనిపించింది. లైటు వేసి, డిస్టర్బ్ చేయడం యిష్టంలేక, నెమ్మదిగా టార్చి వెలుతురులో మందుల డబ్బా తీసి టాబ్లెట్స్ చెక్ చేసింది.

సుమ వూహించినట్టుగానే, నర్స్ ఆ పూట మందులు యివ్వడం మరిచిపోయింది.

"నాన్నా! నాన్నా" టాబ్లెట్స్‌తో బాటు మంచినీళ్ళు తీసుకుని తండ్రి మంచం దగ్గరికి వచ్చి పిలిచింది.

"ఊ...ం..." పలికాడాయన.

"మందులు వేసుకోండి" అంటూ చిన్నగా తలకింద చేయిపెట్టి లేపి టాబ్లెట్స్ మింగించింది.

తిరిగి పడుకోబెట్టడానికి దిండు సరిచేస్తూ వుంటే దిండు చల్లగా తగిలింది. ప్రసాదరావు చెంపల మీద తడి. సన్నగా గురకలాంటి శబ్దంతో మూలుగుతున్నాడాయన.

"నాన్నా ఏడుస్తున్నారా?" సుమ గుండె గుబుక్కుమంది.

ఆ మాట అనుకోవడానికి కూడా ధైర్యం చాల్లేదామెకి.

ఏమీ తెలియనట్టే ఆయన్ని పడుకోబెట్టి, తలుపు దగ్గరకులాగి పరుగున మెట్ల మీదకి వెళ్ళి కూర్చుంది.

రెండు మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని, గుండెలదిరేలా వెక్కి, వెక్కి ఏడ్చినా ఆమె బాధ తీరలేదు.

"సుమా.. సుమా! ఏమైంది?" వచ్చాడు ఆదిత్య.

"ఏమైందో చెప్పు. సుధీర్ మాటలకేనా బాధపడడం?" పక్కన కూర్చుని తలమీద చేయివేస్తూ అడిగాడు.

సుమ తలయెత్తి రెండు చేతులతో కళ్ళు తుడుచుకుంది.

"మనం హాయిగా, నిశ్చింతగా నిద్రపోతున్నప్పుడు మనకింద భూమి చీలిపోయి మనం లోపలికి కూరుకుపోతే ఎలా వుంటుంది? ఆకాశం కన్నా గొప్ప నీడలేదు అనుకుంటే మన నెత్తిమీదే అది విరిగిపడితే ఏం చేయాలి? మనం పుట్టిపెరిగిన యింట్లో యిటుకలతో గోడలతో కూడా అనుబంధం పెంచుకుని మన జీవితం నిశ్చింతగా యిక్కడ గడిచిపోతుందనుకున్న తర్వాత ఆ యింటికి పునాదులే లేవని తెలిస్తే ఏమైపోతాం?"

ఎర్రగా వాచిపోయిన కళ్ళతో ఆదిత్య వైపు చూస్తూ అడిగింది.

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అస్సలు అర్ధం కావడంలేదు" అయోమయంగా అన్నాడతను.

"ఇవాళ నాన్న కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు ఆదీ! మనం ప్రార్ధించే దేవుడే కుంగిపోతే ఎంత భయపడతామో అంత భయం వేసింది నాకు.

యిన్నేళ్ళలో నాన్న కళ్ళనీళ్ళు పెట్టుకోవడం చూడలేదు నేను. అమ్మ చనిపోయినప్పుడు, సుధీరన్నయ్యకి యాక్సిడెంట్ అయ్యి ప్రాణాలమీదకి వచ్చినప్పుడు ఎప్పుడూ ఆయన ధైర్యం సడలలేదు. ఇందాక గదిబైట జరిగినదంతా నాన్న విన్నట్టున్నారు. ఇన్నాళ్ళూ ఆత్మవిశ్వాసంతో తలెత్తుకుని, దర్జాగా బతికిన మనిషి ఇప్పుడు నిస్సహాయంగా యింకొకరిపై ఆధారపడి వుండడం భరించలేకపోతున్నట్టున్నారు. అభిమానంగలవాళ్ళకి అంతకు మించిన నరకం యింకోటి వుండదు" బాధపడుతూ అంది.

"మామయ్యకి వచ్చిన అనారోగ్యం అటువంటిది. దానికి మనమేం చేయగలం చెప్పు?" ఓదార్పుగా అన్నాడు.

"అలా అని ఆయన యింకా బాధపడేట్టు చేయాలా? మీకందరికీ ఆయన డిసేబుల్డ్ పర్సన్‌లా కనిపించొచ్చు. కానీ, నాకు మాత్రం నాన్నే. ఇన్నేళ్ళపాటు ఆయన గడిపిన జీవితాన్ని అనారోగ్యం కారణంగా ఒక్కరోజులో తలకిందులు చేస్తే ఎలా వుంటుంది చెప్పు? భగవంతుడి దయవల్ల కొంత మెరుగ్గానే వున్నారు నాన్న. గాలిపీల్చే చివరిక్షణం దాకా జీవించాలనే కోరుకుంటారెవరైనా. భారంగా లాగాలనుకోరు. అందుకే, నాన్నని సంతోషంగా వుంచడానికి నాకు వీలైనంత ప్రయత్నిద్దామనుకుంటున్నాను" ఆవేశంగా చెప్పింది.

"నిజమే కానీ, నువ్వూ నేనూ అనుకుంటే సరిపోదు. సుధీర్‌కూడా సహకరించాలి కదా!" అన్నాడు ఆదిత్య ఆలోచిస్తున్నట్టుగా.

"నువ్వింకా ఆలోచిస్తూనే వుండు. సుధీర్‌కి వ్యతిరేకంగా నువ్వు ఒక్కమాట కూడా మాట్లాడవు" కోపంగా అని, అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది.

సుమ ప్రొద్దున్న నిద్రలేచి వంటగది వైపుకి వెళుతుంటే సుధీర్ గదిలోనుంచి మాటలు వినిపిస్తూ వున్నాయి.

"ఇన్నాళ్ళూ మనం సుమని స్వంతమనిషిలా ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు నాన్నగారిని ఆ అమ్మాయికి ఎలా అప్పగించడం?" సుధీర్ గట్టిగా అంటున్నాడు.

"మీ నాన్న సుమని బాగానే నెత్తినెక్కించుకుని ఆస్తిలో వాటా కూడా యిచ్చారుగా! ఆ అమ్మాయికి ఏ బాధ్యతలు ఉన్నాయి?

"ఇచ్చినందుకు చేయించుకుంటే తప్పేమీలేదు. అయినా, ఆ అమ్మాయీ నేను నాన్నని చూసుకుంటాను అంటుంటే మీకేం నొప్పి?"

"అంతేకానీ నీకేం బాధ్యతలేదంటావు?" అన్నాడు సుధీర్ కోపంగా.

"నేనేం అన్నా మీకు తప్పుగానే తోస్తుంది. పోనీ సుమ ఉండడం మీకు యిష్టం లేకపోతే వద్దు. ముసలివాళ్ళకీ, మంచానపడ్డవాళ్ళకీ ప్రత్యేకంగా హోమ్‌లు వుంటాయిగా! కాస్త ఎక్కువ ఖర్చైనా పర్లేదు. మంచి దాన్లో చూసి చేర్పిద్దాం"

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తుందా?" సుధీర్ గొంతు పెరిగింది. దాంతోపాటు "ధణేల్" మని చప్పుడు కూడా అవడంతో ఆ తర్వాత ఏం జరుగుతుందో అన్న భయంతో అక్కడే ఆగిపోయింది సుమ.

"మీరు నా మాట వినకపోతే నేనేం చేయలేను. నేనూ, పిల్లలు మాత్రం యిండియా వచ్చే ప్రసక్తే లేదు. మీరు రాకపోయినా నేను ఈ వారంలో టికెట్ చేయించుకుంటున్నాను. మీకు భార్యాపిల్లలు కావాలంటే ఏదో ఒకటి త్వరగా తెముల్చుకుని అమెరికా రండి" కూడా బద్దలు కొట్టినట్టు చెప్పింది.

"ఛ. నువ్వింత చీప్‌గా ఆలోచిస్తావనుకోలేదు" కోపంగా అని ధడాలున తలుపు తీసుకుని బైటకి వచ్చాడు.

గుమ్మం ఎదురుగా నిలబడ్డ సుమ మొహంలోకి ఒకసారి చూసి గబగబా మెట్లుదిగి కిందకి వెళ్ళిపోయాడు.

"ఈ కొంచెం తాగేయండి" సుమ ప్రసాదరావుకి సూప్ తాగిస్తూ వుంది.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడు "రావచ్చు"

సుమ జవాబు చెబుతూనే, తలుపు తీసుకుని సుధీర్ లోపలికి వచ్చాడు.

"ఇవాళ నర్సు రాలేదు.. ఆమెకి జ్వరం" ప్రసాదరావుకి నేప్‌కిన్ అందిస్తూ సుధీర్‌తో అంది సుమ.

అతను బదులివ్వకుండా నేరుగా తండ్రి దగ్గరకు వచ్చాడు.

"నాన్నా! నాలుగురోజుల తర్వాత నా ఫ్లైటు. టికెట్స్ కన్‌ఫర్మ్ అయ్యాయి. వీలుని బట్టి మిమ్మల్ని చూడడానికి వస్తూనే వుంటాను" అన్నాడు తండ్రి చేతులు పట్టుకుంటూ.

ఆలోచనల బరువుతో నలిగిపోతున్నట్టుగా వున్న సుధీర్ మొహం చూసి నిట్టూర్చింది సుమ.

గత నాలుగురోజుల నుంచి సుధీర్. స్నేహల మధ్య పోట్లాటల్ని బట్టి, సుధీర్ పరిస్థితి యింట్లో అందరికీ అర్థమైపోయింది.

ప్రసాదరావు 'సరే'నన్నట్టు నెమ్మదిగా తలాడించాడు.

ఒక్క నిముషం ఆ గదిలో నిశ్శబ్దం. గదిలో వున్న ముగ్గురూ ఎవరి ఆలోచనా స్రవంతిలో వారు పడిపోయారు ఆ కొద్దిసేపు.

"అయామ్ సారీ. నాన్నా!"

నిస్సహాయంగా తండ్రి మొహంలోకి చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు సుధీర్. క్షణంలో సగం సేపు చిన్న బాధావీచిక ప్రసాదరావు కళ్ళలో కనిపించింది. కానీ గాయపడ్డ మనసును బైటపెట్టకుండా, పరిస్థితిని హుందాగా స్వీకరిస్తున్నట్టు కొడుకు భుజం తట్టాడు. పరిస్థితిని గ్రహించి, వాళ్ళిద్దరి మధ్యా ఏకాంతం కలిపించాలన్నట్టుగా, అక్కడి నుంచి కదలబోయింది సుమ.

"సుమా! నేను నీతో మాట్లాడాలి ఒక్క నిముషం బైటకి వస్తావా?" సుధీర్ ఆమెని అడిగాడు.

ప్రసాదరావు వీల్ ఛెయిర్‌ని టేబుల్ దగ్గరకు తెచ్చి, ఆయన చదువుతున్న పుస్తకాన్ని తెరిచిపెట్టి సుధీర్‌తో బైటికి నడించింది.

"నాన్నగారిని జాగ్రత్తగా చూసుకుంటావు కదూ! నేనన్న మాటలేవీ మనసులో పెట్టుకోకు" సుమతో అన్నాడు.

మొదటిసారిగా సుధీర్‌లో కొత్తమనిషిని చూస్తున్నట్టు వుంది సుమకి.

"డోంట్ వర్రీ అన్నయ్యా! నాన్నకి ఏ యిబ్బందీ రానివ్వను" సుధీర్ చేతిలో చేయివేస్తూ చెప్పింది.

"ఇవాళ నీకో విషయం చెప్పాలమ్మా ఇన్నాళ్ళూ నీకూ, నాకూ ఏ సంబంధం లేదు. అని నన్ను నేను మభ్యపెట్టుకున్నాను. కానీ మనిద్దరినీ కలుపుతూ నాన్న వున్నారన్నది. మనకి పైన ఆకాశం వుంది అన్నంత నిజం. నాన్నని గురించిన తపన ఆరాటం నీ కళ్ళలో చూశాకే మనిద్దరి బాధా ఒకటేనని అర్థం అయ్యింది. నీకు ఈ యింట్లో అన్ని హక్కులూ ఉన్నాయి. నీకు నచ్చినట్టుగా చెయ్యి. ఏదైనా యిబ్బంది వున్నా డబ్బు అవసరమైనా నాకు చెప్పు" సుమ తలమీద చేయివేస్తూ అన్నాడు.

"నువ్వేం కంగారుపడొద్దు. వీడియోకాల్‌తో రోజూ నాన్నగారిని నీకు చూపిస్తాను. ఇంకో విషయం. నాన్నకి మనిద్దరమూ ఒకటే అని నువ్వనుకుంటే గిల్టీగా ఫీలవ్వడం మానెయ్యి. నిశ్చింతగా వెళ్ళిరా" నవ్వుతూ చెప్పింది.

మేడమీద స్టడీ రూంలోని పుస్తకాలన్నీ ఒక్కొక్కటే తీసి జాగ్రత్తగా అట్టపెట్టెతో సర్దుతూ వుంది సుమ. అటుగా వెళుతూ కూనిరాగాలు తీస్తూ పనిచేస్తున్న సుమని చూసి లోపలికి వచ్చాడు ఆదిత్య.

"ఏమిటీ యివాళ అమ్మాయిగారు హుషారుగా కనిపిస్తున్నారు?" అడిగాడు నవ్వుతూ.

"నాన్నగారి లైబ్రరీని కిందగదిలోకి మారుస్తున్నాను" పనిచేస్తూనే చెప్పింది.

"సుధీర్‌కీ, నీకూ మధ్య శాంతి ఒప్పందం కుదిరినట్టుందిగా వెళ్ళబోయేముందు నాతో మాట్లాడాడు" చెప్పాడు ఆదిత్య.

సుమ అతని మాటలు వింటూ, పనిచేస్తూ వుంది.

"నువ్వు బిజీగా వున్నట్టున్నావు. నేను వస్తాను" అంటూ కదలబోయాడు.

సుమ ఏదో గుర్తొచ్చినదానిలా చేత్తో నుదురిని మీద కొట్టుకుంటూ "ఆదీ చిన్న హెల్ప్" అంటూ ఒక్క అంగలో ముందుకు వచ్చింది.

"నాన్నకోసం ఎడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వున్న వీల్ ఛెయిర్‌ని ఒకదాన్ని నెట్‌లో చూశాను. దాన్ని నీ షిప్పింగ్ కార్ట్‌కి యాడ్ చేశాను కూడా. నీ లాప్‌టాప్‌లో సేవ్ చేసి వుంది అది. కొంచెం నీ వీసా కార్డుతో పేమెంట్ చేసి ఆర్డరివ్వవూ"

"సరే" అతను వెనక్కి తిరగబోయాడు.

"ఆ ఇంకో విషయం" మళ్ళీ పిలిచింది.

"మన గార్డెన్‌లోకి వెళ్ళే మెట్లపక్కగా వీల్ ఛెయిర్‌ని నడపడానికి వీలుగా ఒక చిన్న రాంప్‌ని కట్టించాలి. ఆఫీసులో నీ సెక్రటరీకి చెప్పి మనుషుల్ని పంపించు."

"జీ మేమ్‌సాబ్. ఇంకేమైనా వున్నాయా?"

"ఇప్పటికి యింతే. రేపటికి కొత్త డిమాండ్లు వస్తాయి" అంది నవ్వుతూ.

"నీ కోసం ఏదైనా సరే" అని అతనూ నవ్వాడు.

వారంకల్లా ప్రసాదరావు లైఫ్‌లో చాలా మార్పు వచ్చింది. మునుపటికన్నా మనిషిలో కాంతి, ఉత్సాహమూ వచ్చాయి. చాలావరకు ఆయన పనులు ఆయనే చేసుకునేట్టుగా ఏర్పాట్లు చేసింది సుమ.

రోజూ కొద్దిసేపు తండ్రికి పుస్తకాలు చదివి వినిపించేది. సాయంకాలాలు గార్డెన్‌లో సమయం గడిపేవారు.

ఆ సమయం అంతా ఎక్కువగా ఆయనకి ఎక్సర్‌సైజులు చేయించడం, టీ తాగుతూ కబుర్లు చెప్పడంతో గడిచిపోయేది.

"నాన్నా! ఇవాళ నుంచి మీరొక పనిచేయాలి" అంది సుమ ఒకరోజు ప్రసాదరావుతో ఎక్సర్ సైజులు చేయిస్తూ.

"మీరు సివిల్ సర్వెంట్‌గా మీ అనుభవాలు రాస్తూ వున్నారు. అది దాదాపు మూడు వంతులు పూర్తయ్యింద్ది. దాన్ని మనిద్దరం కలిసి పూర్తిచేద్దాం. ఏమంటారు?" అడిగింది తండ్రిని.

"అలాగే" అస్పష్టంగా చెప్పాడాయన.

ఆ రోజు నుంచే రాయడం మొదలుపెట్టాడు ప్రసాదరావు. కుడిచెయ్యి స్వాధీనంలోనే వుంది కాబట్టి. కొద్దిసేపు కుడిచేత్తో రాసేవాడు.

ఎక్కువసేపు వీల్ ఛెయిర్‌లో కూర్చోలేకపోయినప్పుడు ఆయన మంచం మీదే లాప్‌టాప్‌లో టైప్ చేయడానికి వీలుగా ఏర్పాటు చేసింది సుమ.

ఒక్కోసారి ఆయన కొన్ని ముఖ్యమైన విషయాలు, సంఘటనలు పాయింట్లుగా చెబితే ఆయన మాటల్ని జాగ్రత్తగా అర్థం చేసుకుని, వాటిని వివరంగా పేరాగ్రాఫులుగా రాసేది. మూడు నెలల్లో మిగిలిన భాగం పూర్తిచేశారు యిద్దరూ కలిసి.

"నాన్నా! ఇక దీన్ని టైప్ చేసి మీకు చూపిస్తాను. ఒకసారి మీరు చూసి ఓకే చేస్తే మనం పబ్లిషర్‌తో మాట్లాడుదాం" అంది సుమ రాయడం పూర్తయిన రోజున కాగితాలన్నీ ఆర్డర్లో పెడుతూ.

"నేను లేకుండా చూసి మాట్లాడుదాం అంటున్నావు ఏం మాట్లాడుకుంటున్నారిద్దరూ" అంటూ లోపలికి వచ్చాడు ఆదిత్య.

"నాన్న రాసిన పుస్తకాన్ని పబ్లిష్ చేయడం గురించి "కాగితాలన్నీ తీసి జాగ్రత్తగా అలమరలో పెడుతూ అంది సుమ.

ప్రసాదరావు ఆదిత్యని దగ్గరకి రమ్మని చేత్తో సైగచేసి, అతను రాగానే చేతిలో ఒక చీటీని ఉంచాడు.

ఆ చీటీని చూస్తూనే "సుమా త్వరగా రెడీ అవ్వు. మనిద్దరం బైటికి వెళ్ళి డిన్నర్ చేసి వద్దాం" అన్నాడు అతను.

"ఇప్పుడా? నాన్నని ఒంటరిగా వదిలేశా?" ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వు ఈ మూడునెలల్లో ఒక్కసారన్నా బైటికి వెళ్ళావా? నీకూ మార్పుగా వుంటుందనే మామయ్య నిన్ను తీసుకుని వెళ్ళమని అంటున్నారు" అంటూ చేతిలోని చీటీని చూపించాడు.

"టేక్ హర్ అవుట్" అని రాసి వుందందులో.

"కానీ" అంటూ సుమ సందేహంగా తండ్రివైపు చూసింది.

"వెళ్ళమ్మా" అస్పష్టంగా చెప్పి తలాడించాడాయన.

"ఇక నువ్వేమీ చెప్పకు. కొద్దిసేపు 'కాకా' మామయ్యకి తోడుగా వుంటాడు. త్వరగా వెళ్ళి రెడీ అవ్వు" తొందరపెట్టాడు ఆదిత్య.

సుమ వార్డ్‌రోబ్‌లో నుంచి నెమలిపింఛం రంగుకి బంగారు రంగు అంచులు కుట్టివున్న చుడీదార్‌ని తీసి వేసుకుంది. జుట్టును వదిలివేసి దువ్వుకుంటూ అనుకుంది.

"చిన్న పోనీటైల్ సైజుకి కత్తిరించిన జుట్టు భుజాలు దాటి ఎప్పుడు పెరిగిందో తెలియనేలేదు" అని.

చాలా నెలల తర్వాత అద్దం ముందు తీరిగ్గా నిలబడి తన రూపాన్ని పరిశీలించుకుంది.

కొత్త బట్టలు, తేలిగ్గా వేసుకున్న లిప్‌స్టిక్, కాటుక దిద్దిన కళ్ళు తన కంటికి తానే కొత్తగా కనిపించింది.

తెలియకుండానే మనసులో చిన్నపాటి ఉత్సాహం.

"ఆదీ నేను రెడీ" అంటూ హుషారుగా బైటికి వచ్చింది. వస్తూనే హాల్లో కొద్ది అడుగుల దూరంలో దీప్తి, సుమ వైపే చూస్తూ నిలబడి కనిపించింది. పక్కనే ఆదిత్య సోఫాలో కూర్చుని వున్నాడు.

ఎప్పుడూ సాదాసీదాగా కనిపించే సుమ ప్రత్యేకంగా తయారవడం చూసి దీప్తి మొహం చిట్లించింది. "నువ్వూ, ఆదీ బైటికి వెళుతున్నారా?" అడిగింది అనుమానంగా.

"లేదు" అని సుమ "అవును" అని ఆదిత్య ఒకేసారి అన్నారు.

దీప్తి యిద్దరి వంకా సందేహంగా చూసింది.

"నేను సీమ పెళ్ళికి వెళ్ళలేకపోయాను. దాన్ని చూసివద్దామని బయలుదేరాను. నువ్వు వచ్చావుగా రేపు వెళతాను" అంది నవ్వుతూ.

ఆదిత్య సుమ వంక పదునుగా చూశాడు. ఆమె సమాధానం నచ్చనట్టు అతని మొహంలో స్పష్టంగా తెలుస్తూ వుంది.

"మీరు మాట్లాడుకుంటూ వుండండి. నేను కాఫీ తీసుకుని వస్తాను" అంటూ ఆదిత్యకి తిరిగి మాట్లాడే అవకాశం యివ్వకుండా వంటగదిలోకి వెళ్ళింది.

**అరగంట** తర్వాత ట్రేలో కాఫీ కప్పులతోబాటు వేడివేడి పకోడీలు కూడా తీసుకుని బైటికి వచ్చింది సుమ. హాల్లో దీప్తి, ఆదిత్యలు కనిపించలేదు.

మేడమీదనుంచి సన్నగా అస్పష్టంగా మాటలు వినిపిస్తూవున్నాయి. సుమ తండ్రికి కాఫీ యిచ్చి, నేరుగా మేడమీదకి వెళ్ళింది. వాళ్ళ మాటలు వినిపించిన గది దగ్గరకు వెళ్ళి తలుపు తట్టింది. ఎవరూ తలుపు తీయలేదు.

రెండవసారి తట్టబోయి డిస్టర్బ్ చేయడం యిష్టంలేక వెనక్కి తిరగబోతుండగా దీప్తి మాటలు పెద్దగా వినిపించాయి.

"ఇంకా ఈ యింట్లో ఎన్నాళ్ళు వుంటావు?" అడుగుతూ వుంది ఆదిత్యని.

సుమ వెళ్ళబోయినదల్లా ఠక్కున ఆగిపోయింది.

"నువ్వు యిండిపెండెంట్‌గా సంపాదించుకుంటున్నావు. ఫ్యూచర్‌లో నీకే హెల్ప్ కావాలన్నా నా పేరెంట్స్ నీకు సపోర్ట్‌గా వుంటారు. ఈ యింట్లో మేనమామకి సేవలు చేస్తూ ఎన్నాళ్ళు వుంటావు? ఇక్కడ నీవాళ్ళెవరున్నారు? ఆయన నీకు మేనమామే కానీ, స్వంత తండ్రికాదు కదా! అయినా యింత పెద్ద యింట్లో నేను వుండలేను. మనం పెళ్ళవుతూనే ఒక అపార్ట్‌మెంట్ తీసుకుని అక్కడికి షిఫ్టయిపోదాం. ఏమంటావు?" గోముగా అడుగుతుంది దీప్తి.

"అలాగే...చూద్దాం" ఆదిత్య అంటున్నాడు.

సుమకి ఒక్కసారిగా అరచేతుల్లో చెమటలు పట్టాయి. చేతులు వణికి ట్రేలోని కప్పులు, ప్లేట్లు ఒకదానికొకటి కొట్టుకున్నాయి.

ఇంతలో 'థన్'మంటూ తలుపు తెరుచుకుంది.

"వాహ్! గుడ్‌టైమింగ్. నేనూ యిప్పుడే కాఫీ సంగతి గుర్తుచేద్దాం అనుకుంటున్నాను. థాంక్యూ" అంటూ సుమ చేతిలోని ట్రేని అందుకుని మొహం మీదే తలుపేసింది.

రాత్రి పదకొండు గంటల సమయంలో తలుపు చప్పుడు విని లేచి వచ్చాడు ఆదిత్య.

"ఇంత రాత్రప్పుడు వచ్చావేంటి? మామయ్యకి బాగానే వుంది కదా!" గుమ్మంలో నిలబడ్డ సుమని చూస్తూ కంగారుగా అడిగాడు.

"అదేం లేదు. నాన్నకి బాగానే వుంది. నీతో కొంచెం మాట్లాడాలి" అంది మొహమాటంగా.

ఇంకా నిద్రావస్థ వదలనట్టు అతని రెప్పలు వాలిపోతున్నాయి.

"రేపొద్దున మాట్లాడొచ్చు. కానీ, అప్పటిదాకా ఆగితే నాకు మనశ్శాంతి దొరికేట్టులేదు. అందుకే. హాల్లో కూర్చుని మాట్లాడుకుందామా?" నసుగుతూ అంది.

"ష్యూర్" ఆమెతోపాటు నడిచాడు.

"ఆదీ! నీకు తెలుసుగా నేను యింకో మూడువారాల్లో ముస్సోరీకి ట్రైనింగ్‌కి వెళ్ళాలి. నేను తిరిగి వచ్చేదాకా నాన్నని జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ సాయం అడగడానికి నువ్వు తప్ప నాకింకెవ్వరూ లేరు." అని ఆపింది.

"నువ్వేం కంగారు పడకు. మామయ్యని నేను జాగ్రత్తగా చూసుకుంటాను. సరేనా!?" సుమ చేతిని పట్టుకుంటూ చెప్పాడు.

"నీ పెళ్ళి యింకో రెండు నెలల్లో వుంది. నీ మీద ఈ భారం వెయ్యడం కరెక్ట్ కాదని నాకూ తెలుసు. కానీ ట్రైనింగ్ చాలా ముఖ్యం. నాది స్వార్థమే అనుకో.. అవసరమే అనుకో. కానీ ఈసారికి తప్పదు. మీ పెళ్ళి తర్వాత, నేను ట్రైనింగ్ పూర్తిచేసుకుని వచ్చేంత వరకూ ఈ యింట్లో నాన్నగారితో వుండండి. నేను తిరిగివచ్చాక, నిన్నూ, దీప్తిని అస్సలు యిబ్బందిపెట్టను ఆ తర్వాత మీకు యిష్టమైనట్టుగా అపార్టుమెంట్‌లో మీ కొత్తకాపురం పెట్టుకోండి" వివరణ యిస్తున్నట్టు అంది.

"అంటే సాయంత్రం మా మాటలన్నీ విన్నావన్నమాట" అన్నాడు ఆదిత్య కనుబొమ్మలెగరేస్తూ.

"కావాలని వినలేదు. అనుకోకుండా జరిగిపోయింది. అయినా మీ ఉద్దేశ్యం తెలియడం ఒకందుకు మంచిదే అయ్యింది. నీతో ముందుగా మాట్లాడడానికి అవకాశం దొరికింది."

"మామయ్యని చూసుకోవడం నాకు కష్టంకాదు. కానీ, దీప్తి సంగతి నీకు తెలుసుగా! పోనీ పెళ్ళిచేసుకోవడం మానెయ్యమంటావా?" అన్నాడు సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ.

"ఆదీ! నేనా? దీప్తినా? తేల్చుకో అని అడగడంలేదు. ఒక్క నాలుగునెలలు నీ సాయం కావాలని అడుగుతున్నాను అంతే" కోపంగా అంది.

"కానీ నువ్వు అడక్కపోయినా దీప్తి అదే ప్రశ్న అడుగుతుంది. అప్పుడు ఏం చేయమంటావు?" ఆమెనుంచి ఏదో రాబట్టాలన్నట్టుగా అడిగాడతను.

"ఆయన నాకు నాన్న అయితే నీకు నిన్ను పెంచి పెద్ద చేసిన మేనమామ. అవసరానికి అంతమాత్రం చేయాల్సిన బాధ్యత నీకు వుంది. నీకే యిబ్బంది వచ్చినా నాకు చెప్పాలి అని నా దగ్గర మాట తీసుకున్నావుగా! అందుకే అడుగుతున్నాను. ఇక నీ కాబోయే భార్యను ఎలా ఒప్పించుకుంటావో అది నీ తలనొప్పి. నాకు సంబంధంలేదు" ఆవేశంగా చెప్పి సోఫాలోనుంచి లేచింది.

"ఇప్పుడు కరెక్ట్‌గా చెప్పావు ఇలా ఎప్పుడు మాట్లాడతావా? అని ఎదురుచూస్తూ వున్నాను. డోంట్‌వర్రీ. అంతా నువ్వనుకున్నట్టే జరుగుతుంది" అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ.

అతను ఆటపట్టిస్తున్నాడా? అలా అనడం వెనుక ఏదైనా ఆంతర్యం వుందా? అని ఒక్క క్షణం ఆలోచిస్తూ వుండిపోయింది సుమ.

ట్రైనింగ్‌కి వెళ్ళబోయేముందు, షాపింగ్‌కి వెళ్ళి కావలసిన బట్టలు, వస్తువులు కొనుక్కుని వచ్చింది సుమ.

చివర్లో హడావుడి పడకుండా పదిరోజులముందు నుంచే ఏర్పాట్లు చేసుకోవడం మొదలుపెట్టింది.

ఆ రోజు రాత్రి ఏడుగంటలప్పుడు, బజారు నుంచి వస్తూనే, "కాకా! నాన్న భోజనం అయ్యిందా?" అంటూ రామయ్యని అడిగింది.

"ఇచ్చిన బిడ్డా!" రామయ్య చెప్పాడు.

సుమ తండ్రి గదిలోకి వెళ్ళింది.

మంచం మీద పడుకుని వున్నారాయన.

సన్నగా గురకశబ్దం వినిపిస్తూ వుంటే నిద్రపోతున్నారనుకుని చప్పుడు చేయకుండా వెనక్కి తిరగబోయి ఒక్క క్షణం ఆగిపోయింది.

"ఆ గురక శబ్దం మామూలుగా అనిపించడం లేదు." అనుమానం పరుగున మంచం దగ్గరకు వెళ్ళింది.

"నాన్నా! నాన్నా!" అంటూ పక్కకి కదిపి చూసింది.

ప్రసాదరావు కనురెప్పలు కొద్దిగా తెరుచుకుని వున్నాయి.

ఏ.సి చప్పుడులుగా ఆయన గొంతుతో నుంచి నిరంతరాయంగా శబ్ధం మనిషి నిలువునా కంపించిపోతున్నాడు.

సుమకి భయమేసింది.

"ఆదీ!..." అని పెద్దగా అరుస్తూ, ఒక్క పరుగున వెళ్ళి అతన్ని పిలుచుకుని వచ్చింది.

ఇద్దరూ గదిలోకి వచ్చేసరికి ఊపిరి అందనట్టుగా ఎగిరిపడుతున్నది ఆయన శరీరం.

అంబులెన్స్‌కి ఫోన్ చేసి ప్రసాదరావు తలని ఎత్తుగా ఒళ్ళో పెట్టుకుని కూర్చున్నాడు ఆదిత్య. ఏం చేయాలో తోచనట్టు అయోమయంగా వుంది యిద్దరికీ.

తండ్రి ఛాతీ మీద నెమ్మదిగా చేత్తో నిమురుతూ పేపర్‌తో గాలి విసురుతూ కూర్చుంది సుమ.

రెండు నిముషాలు కూడా గడవక ముందే, ఆదిత్య చేతుల్లో నిలవలేనట్టు ఎగిరిపడడం ప్రారంభించింది ఆయన శరీరం. ఉన్నట్టుండి. ఛాతీపై భాగం నుంచి ఒక్కసారిగా గాల్లోకి లేచి పక్కకి దొర్లి పడిపోయాడాయన. అతికష్టం మీద పట్టుకుని ఆపే ప్రయత్నం చేశాడు ఆదిత్య.

"ఆదీ!" భయంగా కళ్ళనీళ్ళతో అతనివైపు చూసింది సుమ. ఏదో ఒకటి చేసి ఆయన్ని కాపాడాలనే తాపత్రయం. ఏమీ చేయలేని నిస్సహాయత. చూస్తూ వుండగానే. ఆదిత్య ఒళ్ళో, సుమ దగ్గర కూర్చుని వుండగా ఆయన ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

తండ్రిని గురించిన వార్త వింటూనే, సుధీర్ కుటుంబంతో సహా వెంటనే బయల్దేరి వచ్చి, అంత్యక్రియలకు అందుకున్నాడు. ప్రసాదరావు అనే వ్యక్తి తాలూకు వునికిని, ప్రకృతి ధర్మానుసారంగా పంచభూతాల్లో కలిపేయడం జరిగిపోయింది. చివరిచూపుకి వచ్చినవారు సుధీర్‌నీ, ఆదిత్యనీ పలకరించి వెళుతూ, సుమని గురించి అడుగుతున్నారు. సుమ వాళ్ళనెవ్వరినీ కలవడానికి యిష్టపడనట్టుగా వెళ్ళి తన గదిలో ఒంటరిగా కూర్చుంది. బాధ, ఏడుపు, నిరాశ వీటన్నింటినీ మించిన ఫీలింగేదో లోపలనుంచి నలిపేస్తూ వుందామెని. గుండె కాలిపోయి బూడిదకుప్పలా మారినట్టు నిరోమయంగా మోకాళ్ళ మీద తలపెట్టుకుని కూర్చుంది.

"సుమా!" ఆమెని వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు ఆదిత్య. తలయెత్తి చూసిందామె.

ఆమె కళ్ళలో కనిపించిన నిస్పృహ చూసి భయమేసిందతనికి.

"సుమా! బాధ ఏడుపు ఒంటరిగా మోయాలని చూడకు. నలుగురిలో కూర్చో" అన్నాడూ దగ్గరకు వచ్చి కూర్చుంటూ.

"ఎవరున్నారు నాకు కావలసిన నలుగురు? నాన్న పోయిన బాధ ఎవరితో పంచుకున్నా తగ్గేదికాదు ఆదీ. 'నాన్న' అనేది ఒక పిలుపు మాత్రమే కానీ, ఆయన నాకేంటో నేను మాటల్లో చెప్పలేను. ఆయనే లేకపోతే నేను ఎక్కడుండేదాన్ని? నేను చేసిన తప్పుకి అమ్మ నా మీద అలిగింది. నువ్వూ నాతో మాట్లాడలేదు. కానీ, నాన్న ఒక్కరే నన్ను క్షమించి దగ్గరికి తీసుకున్నారు. ఏ రోజూ నేను తక్కువ అని కానీ తప్పుచేశానని కానీ ఆయన అనుకోలేదు. నా చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు మిమ్మల్ని డబ్బు అడగడానికి నాకు అభిమానం అడ్డొచ్చింది. కానీ నాన్న నా అవసరం తెలిసినట్టుగా నాకు డబ్బు యిచ్చారు. ఆయన గుండెలో ఒక భాగం ఎప్పుడూ నాకోసం కొట్టుకుంటూ వుండేదేమో అనిపిస్తూ వుంటుంది నాకు. నా జీవితానికో ఆశయాన్ని కల్పించింది నాన్నే. నేను ముందు, వెనుక పక్కల ఎటు చూసుకున్నా నాకు ఆయనే కనిపిస్తారు. నా చదువు, ఆలోచన, ఆశయం వ్యక్తిత్వం అన్నింటిలో ఆయన వేలిముద్రలే కనిపిస్తాయి. అలాంటి నాన్న లేకుండా ఎలా వుండాలి? చెప్పు. నాకు నా నాన్న కావాలి" అంటూ చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

ఆమె గుండెబరువు కరిగేదాకా ఏడిస్తేనే మంచిదన్నట్టు ఆమెని వదిలేసి కిందకి వెళ్ళాడు ఆదిత్య.

ఐదు నిముషాల తర్వాత, చిన్న ట్రే పట్టుకుని పైకి వచ్చాడు.

"సుమా ఈ పాలు తాగి, కాస్సేపు నిద్రపోవడానికి ప్రయత్నించు.లే" అంటూ గ్లాసుని ఆమె నోటికి అందించాడు.

సుమ చిన్నపిల్లలా మారుమాట్లాడకుండా అతను చెప్పినట్టే చేసింది.

"థాంక్యూ ఆదీ! నాన్నపోయిన దుఃఖాన్ని మనసులోనే వుంచుకుని, యింకోవైపు కార్యక్రమాలన్నీ చక్కబెడుతున్నావు. నేను నీకు అదనంగా యింకో తలనొప్పిలా తయారయ్యాను" అంది కృతజ్ఞత నిండిన కళ్ళతో.

"నువ్వు నాకు తలనొప్పి అని నేను ఎప్పుడైనా అన్నానా?"

"నువ్వు అనకపోయినా నేను అర్థం చేసుకోవాలిగా! నాలుగురోజుల్లో నేను ట్రైనింగ్‌కి బయలుదేరాలి. ఫ్రైడేకి డెహ్రాడూన్‌కి ఫ్లైట్ టికెట్ కన్‌ఫర్మ్ అయ్యింది" చెప్పింది. "ఈ పరిస్థితిలో నువ్వు ఒక్కదానివే వెళతావా? నో నేను కూడా వస్తాను" అన్నాడతను.

"నా గురించి నువ్వు ఆదుర్దాపడకు. ఇక్కడ కార్యక్రమాలు వదిలేసి నా వెనకాలే వచ్చి నువ్వు చేసేదేమీలేదు. ఒంటరిగా బతకడం అలవాటు కావాలి నాకు. అమ్మ, నాన్న, అక్క, తమ్ముడులాంటి బంధాలేవీ లేవు నాకు. దారాలన్నీ తెగిపోయిన గాలిపటంలా పూర్తిస్వేచ్ఛ" అంది. విరక్తిగా నవ్వే ప్రయత్నం చేస్తూ.

ఆదిత్య మొహం బాధతో చిన్నబోయింది.

"అంటే నన్నుకూడా లెక్కలోనుంచి తీసేశావన్నమాట. అలాంటప్పుడు నేను ఏమనుకోవాలి? నాకు మాత్రం ఎవరున్నారు?" అన్నాడు నిష్ఠూరంగా.

"అలా అనకు ఆదీ" అంటూ గబుక్కున అతని నోరు చేత్తో మూసివేసింది. "నీకు పెళ్ళయ్యాక ఒక కుటుంబం ఏర్పడి సంతోషంగా వుంటావు. నీ జీవితంలోని వెలితి పూడిపోతుంది"

గుమ్మంలో అలికిడి కావడంతో మాటలు ఆపి చప్పున తన చేతిని వెనక్కి తీసింది సుమ. తలుపు దగ్గర నిలబడిన దీప్తి కళ్ళు యిద్దరినీ గుచ్చి గుచ్చి చూస్తున్నాయి.

"మా అమ్మా, నాన్నా, నీతో మాట్లాడాలంటున్నారు పద" అంటూ ఆదిత్య దగ్గరకు వచ్చి చేయిపట్టి లేపింది దీప్తి.

సుమ ఆదిత్య మొహంలోకి చూసి అర్థవంతంగా నవ్వింది.

"నిన్ను కట్టిపడేసే నిజమైన బంధాలివే" అని చెప్పాయి ఆమె కళ్ళు.

**సూట్ కేస్** తీసి మంచం మీద పెట్టి ప్రయాణానికి కావలసినవి ఒక్కొక్కటిగా సర్దుకోవడం మొదలుపెట్టింది సుమ.

''ఏమిటి విశేషం. యివాళ ఉదయాన్నే వచ్చావు?'' స్నేహ గొంతు వినిపించింది హాల్లో.

''మిమ్మల్ని చూడాలనే వచ్చాను'' జవాబుగా దీప్తి గొంతు. ఇద్దరూ ఒకర్నొకరు పలకరించుకుని, మాట్లాడుకోవడం మొదలు పెట్టారు.

సుధీర్ తండ్రి చనిపోయాడని బంటీని స్కూల్ మధ్యలో సెలవలు పెట్టించి తీసుకొచ్చినందుకు సుధీర్ మీద నేరాలు చెబుతూ కూర్చుంది స్నేహ.

దీప్తి దానికి వత్తాసు పలుకుతూ ఆదిత్య తన విషయంలో ఎంత కేర్‌లెస్‌గా వుంటాడో చెప్పుకొస్తోంది.

''సుమ యింట్లో వుందా?'' మధ్యలో ఉన్నట్టుండి దీప్తి అడగడం వినిపించి చేస్తున్న పని ఆపి ఒక క్షణం నిలబడిపోయింది సుమ.

''ఆ గదిలోనే వుంది. ఆవిడతో నీకేం పని?'' స్నేహ గొంతు వినిపిస్తుండగానే... ధడాల్న తలుపు తోసుకుని లోపలికి వచ్చింది దీప్తి.

''హలో'' సుమ పలకరింపుని కూడా పట్టించుకోలేదు.

''చూడూ! నిన్ను ఆదిత్య యిదివరకు ప్రేమించాడని నాకు తెలుసు. అది వర్కవుట్ కాలేదు. అందులో నాకే ప్రాబ్లం లేదు. నువ్వు మళ్ళీ ఈ యింటికి తిరిగి వచ్చావు. ఎక్స్ గాళ్‌ఫ్రెండ్ పక్కన వుండడం పెట్రోలు పక్కన లైటర్‌లాంటిదే అని తెలిసినా నేను ఏమీ మాట్లాడలేదు. మీ నాన్న కోసం వున్నావని మంచితనంతో ఓర్చుకున్నాను. కానీ మీ నాన్న పోయిన దగ్గర్నుంచి సిట్యుయేషన్ పూర్తిగా మారిపోయింది. పొద్దున్న లేచినప్పటినుంచీ ఆదిత్యకి నీ ధ్యాసే. నువ్వు మంచినీళ్ళు తాగావా? అన్నం తిన్నావా? నిద్రపోయావా? అంటూ నీ ఆలోచనలే. ఈ సింపతీని నీకు అనుకూలంగా మార్చుకుందామన్న ఆలోచన వుంటే దాన్ని ఆపేయ్'' అంటూ సుమని దులిపేసింది.

''ఆదిత్య అలా అనుకుంటే దానికి నేనేం చేయాలి?'' అంది సుమ కోపంగా.

''ఏమీ తెలియనట్టు అమాయకత్వం నటించకు. నీకు తెలియకుండానే ఫ్రైడేకి డెహ్రాడూన్‌కి ఫ్లైట్ టికెట్ చేయించుకున్నాడా? చేస్తున్నారు కదా అని చుట్టూ కుక్కపిల్లలా తిప్పించుకోకు'' ఆవేశంగా అంది.

సుమ ఏం జవాబు చెప్పాలో తెలియనట్టుగా కొయ్యబారిపోయింది.

సుమ వాలకం చూసి దీప్తి కూడా మెత్తబడింది.

''ఇవన్నీ నీకు తెలిసే జరుగుతున్నాయని నేను అనడంలేదు కానీ రెండు నెలల్లో మా పెళ్ళి వుంది. అది గుర్తుంచుకో''

''అయితే? నేను చేసేదేముంది?'' మొండిగా అంది సుమ. జరిగిన అవమానానికి ఆమెకి గుండెల్లో మంట రేగినట్టుంది.

''ఆదిత్య ఎలాగూ నా మాట వినడు. అందుకే నీకు చెబుతున్నాను. మా పెళ్ళి సవ్యంగా జరగాలనుకుంటే ఏం చేయాలో అది చేయి చాలు'' చెప్పి, తిరిగి హాల్లోకి వెళ్ళిపోయింది.

''మా ఆస్తిలో వాటా కొట్టేసింది. మా మావగారి పుణ్యము అని పెద్ద ఉద్యోగం కూడా సాధించింది. అది చాలదన్నట్టు ఆదిత్యని బుట్టలో వేయడానికి చూస్తున్నట్టుంది. అసలు తండ్రివైపు వాళ్ళు వుట్టి లేకి మనుషులట. వాళ్ళవైపు అతన్నే చేసుకుని విడాకులు కూడా యిస్తుంది. కానీ ఆశలు చూస్తే ఆకాశంలో వుంటాయి. ఆవిడ అనుకోగానే అన్నీ జరుగుతాయా? నువ్వు కంగారుపడకు'' దీప్తి వెనకాలే వెళ్ళి నచ్చచెబుతూ వుంది స్నేహ.

ఆవిడ అన్న ఒక్కొక్క మాటకీ సుమకి అవమానంతో గుండె రగిలిపోయింది. ఆవేశంగా జవాబు చెప్పాలని తలుపు తీసుకుని బైటికి వచ్చింది.

అప్పుడే పనిమీద బైటకి వెళ్ళిన ఆదిత్య తిరిగి వస్తూ కనిపించాడు.

సుమని చూస్తూనే "హే! కాకా వాళ్ళబ్బాయిని రమ్మనావుట. అతను వూళ్ళో లేడని చెప్పాడు రామూకాకా! నీకేదైనా పనివుంటే నాకు చెప్పు" అన్నాడు.

"ఇప్పుడేం చెబుతావు?" అన్నట్టు సూటిగా సుమ వైపు చూసింది. దీప్తి.

ఆదిత్య అడిగిన ప్రశ్నకి బదులివ్వకుండానే గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళింది సుమ.

❦❦❦

"కాకా! సుమ తెల్లవారుఝామునే డ్రైవర్ని రమ్మని చెప్పిందట. ఎక్కడికి వెళ్ళింది?" రామయ్యని వెతుక్కుంటూ వచ్చి అడిగాడు ఆదిత్య.

రామయ్య ఒక సెకను ఆలోచించి "టైమెంతైంది బిడ్డా?" అడిగాడు.

అడిగిన ప్రశ్నకీ రామయ్య అనేదానికీ సంబధం ఏంటో అర్ధ కాలేదు ఆదిత్యకి. సెల్‌ఫోన్ చూసి "తొమ్మిదిన్నర" అని చెప్పాడు.

"కాకా! నేను నా ఫ్లైట్ టికెట్ రెండురోజుల ముందుకి మార్పించుకున్నాను. తెల్లవారుతూనే నేను బయలుదేరాలి. ఎందుకు అని అడగొద్దు. ఫ్లైటు గాల్లో ఎగిరేవరకు. ఆదిత్యకి ఈ విషయం చెప్పకు" అని సుమ ముందురోజు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి రామయ్యకి.

"నే జెప్ప బిడ్డ. నిన్ను ఈ యింట్ల గెట్ల మాట్లంటున్రో నే విన్న. ఏదన్న ఖరాబ్ అయితే పోగానీ ఇజ్జత్ గిట్ల కాపాడుకోవాలె" అని తను అన్న మాటలు కూడా జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

"సుమమ్మ ట్రైనింగు ముస్సోరినంట. ఆడికి బోయె. నువ్వడిగితే ఈ కవరిట్ల యియ్యమనె" అంటూ లాల్చీ జేబులో నుంచి ఒక తెల్లటి పొడుగాటి కవర్‌ని తీసి ఆదిత్య చేతిలో వుంచాడు.

దాన్ని చూస్తూనే ఆదిత్య కనుబొమ్మల మధ్య గీతలు పడ్డాయి. ఆశాభంగం కలిగించే వాక్యాలేవో అందులో రాసి వుంటాయని అనుమానిస్తూనే లోపల్నుంచి కాగితం తీసి తెరిచి చూశాడు.

డియర్ ఆదీ...

నీకు చెప్పకుండా వెళుతున్నందుకు కోపం వచ్చివుంటుంది. నీకు నా మీద ఉన్న ప్రేమాభిమానాలు నాకు తెలుసు. మనిద్దరి మధ్య వున్న అనుబంధం నిర్వచనానికి అందనిది. చిన్నప్పుడు ఆడుతూ, పాడుతూ గడిపిన క్షణాలు చేసిన ఆకతాయి పనులు, మళ్ళీ మళ్ళీ తలుచుకోవాలనిపించే జ్ఞాపకాలు, అన్నింట్లో నువ్వే వున్నావు. వాటిని దించుకోవాలని ప్రయత్నించేకొద్దీ నా వూపిరిలో భాగమై మనసులోకి లోతుగా దిగిపోతున్నాయి.

అలాంటి నిన్ను లెక్కచేయకుండా వదిలేసి వెళ్ళానని అనుకోవద్దు. ఒకసారి ఆ పొరపాటు చేశాను. రెండోసారి ఎలా చేయగలను? అందుకే ఈ వుత్తరం రాస్తున్నాను.

నువ్వు నా మీద కోపంతో మాట్లాడని రోజు నేనెంత బాధపడ్డానో నీకు తెలియదు. ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టే పని చేయకూడదని ఆ రోజే నిర్ణయించుకున్నాను. కానీ నా అవసరం, నాన్న అనారోగ్యంవల్ల నిన్ను దీప్తికి ఎదురుగా నిలబెట్టవలసి వచ్చింది. నా జీవితంలో వెలుగు నింపడానికే ఈ లోకంలోకి వచ్చాడేమో అనిపించే మా నాన్న నా మిద ఆ మాట కూడా రాకుండా చేశారు. నీకూ, దీప్తికి యిబ్బంది కలిగించకుండా తనే వెళ్ళిపోయారు.

ఆ ఇంటితో నాకున్న అనుబంధాలన్నీ ఆయన కలిపినవే. నీతో సహా. అందుకే ఆ యిల్లు ఆ యింట్లోని వాళ్ళు ఎప్పటికీ నన్ను మంచిగానే గుర్తుచేసుకోవాలని ఒక చిన్న ఆశ.

అందుకే బాగా ఆలోచించి, నాన్న నా పేరుతో రాసిన ఆస్తి తాలూకు కాగితాలు సుధీర్ అన్నయ్య పిల్లల పేరుతో రిజిష్టర్ చేయించాను. ఆ కాగితాలు నా గదిలో స్టడీ టేబుల్ డ్రాలో వుంటాయి.

సుధీర్ అమెరికాకి వెళ్ళిపోతాడు. నేనెలాగూ వుండను. అందువల్ల మీరు వేరే అపార్ట్‌మెంట్‌లోకి మారనవసరం లేదని నా ఊహ.

వీలైతే నాన్నగారి లైబ్రరీని అలాగే వుంచుతావని కోరుకుంటున్నాను. అందులోని ప్రతి పుస్తకంలో, ప్రతి పేజీలో ఆయన ఆత్మ వున్నట్టుంటుంది. అక్కడ కూర్చుంటే నాన్న పక్కనే కూర్చున్నట్టుంటుంది. ఎప్పుడైనా మనసు లాగితే కొద్ది క్షణాలైనా అక్కడ గడపాలని అనుకుంటున్నాను.

నీ పెళ్ళికి నేను రాలేను. అందుకే ముందుగానే నీకు నా శుభాకాంక్షలు. నీకూ ఓ కుటుంబం ఏర్పడి సంతోషంగా వుండాలని నా కోరిక.

దయచేసి నన్ను కలవాలని ప్రయత్నించకు. నా నిర్ణయానికి కారణాలు వెతకాలని చూడకు.

ఆకాశం నుంచి రాలిన వానచినుకులు గచ్చుమీద పడ్డప్పుడు సన్నని తుంపర్లుగా విడిపోతాయి. కిందపడి అస్తిత్వాన్ని కోల్పోయిన నీటి బిందువును మర్చిపోయి తుంపర్లలోని చల్లదనాన్ని మాత్రమే అనుభవిస్తాం. మన మధ్య బంధం కూడా ఆ నీటి బిందువులాంటిదే, దాన్ని మర్చిపోయి దాని తాలూకు తీయటి జ్ఞాపకాల్ని మనసుల్లో దాచుకుందాం.

ఉంటాను నువ్వు ఎప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకునే

**నీ సుమ.**

లెటర్ పూర్తిగా చదువుతూనే ఆదిత్య మొహం వాడిపోయింది. ఆ కవర్లో యింకేదో ఉన్నట్టనిపించి యింకోసారి తెరిచి చూశాడు.

సగానికి అడ్డంగా విరిచివేసిన సిమ్ కార్డు కనిపించిందందులో.

"నాతో మాట్లాడడానికి కూడా యిష్టపడటం లేదన్నమాట" ఆదిత్య మాటలు రానివాడిలా చూస్తూ ఉండిపోయాడు. "ఏమైంది బిడ్డా గట్లయిపోయినవు?" ఆదుర్దాగా అడిగాడు రామయ్య.

"ఎందుకు కాకా సుమకి ఎంత దగ్గరవ్వాలని ప్రయత్నించినా నా నుంచి దూరంగా పారిపోతుంది? ఏం చేస్తే తనకి నచ్చుతాను కాకా? కనీసం మాట్లాడటానికి కూడా యిష్టపడనంత తప్పు నేనేం చేశాను?" రామయ్య భుజాలు పట్టుకుని ఆవేదనగా అన్నాడు.

ఆదిత్య మాటల్ని బట్టి రామయ్యకి విషయం కొంతవరకు అర్థమైనట్టే అనిపించింది.

"సుమమ్మా నువ్వూ నా కళ్ళ ఎదట పెరిగిన్రు. సుమమ్మది తెలిసి ఒకర్ని బాధపెట్టే మనసుగాదు బిడ్డా! గిట్ల జేసిందంటే ఏదో కారణం ఉండాలె" రామయ్య అన్నాడు.

**దాదాపు** రెండు సంవత్సరాల తరువాత...

ఆరోజు సుమ యిండిపెండెంట్‌గా ఛార్జ్ తీసుకున్న మొదటిరోజు. హోమ్ స్టేట్‌లోనే పోస్టింగ్ వచ్చింది.

సెక్రటేరియట్‌లో అడుగుపెట్టగానే తండ్రితోబాటు పనిచేసిన కొంతమంది సీనియర్ ఆఫీసర్లు సుమని పలకరించారు. ప్రసాదరావు గురించిన ప్రస్తావన రాగానే సుమకి కళ్ళు చెమర్చాయి.

"తండ్రి తిరిగినచోటే ఈ రోజు నేను నిలబడివున్నాను" అనుకోగానే సుమకి మనసంతా ఉద్వేగంతో నిండిపోయింది. ఆయన చేసిన పనులు సంపాదించిన పేరు అడుగుజాడలుగా కనిపించాయి.

"నాన్నా యిక్కడ కూడా నీ గైడెన్స్ నాకు కావాలి" మనసులోనే తండ్రిని గుర్తుచేస్తుకుంటూ కుర్చీలో కూర్చుంది.

సాయంకాలం ఆఫీసు వదిలి క్వార్టర్స్‌కి వెళ్ళడానికి సుమ కారు ఎక్కబోతుంటే దూరంగా పరిచయం వున్న కంఠం పిలిచినట్టు అనిపించింది.

తలతిప్పి చూస్తే

కారు పార్కింగ్ దగ్గర నిలబడి కనిపించాడు ఆదిత్య. సెక్యూరిటీ వాళ్ళకి చెప్పి పరుగులాంటి నడకతో అతని దగ్గరకు వచ్చింది.

"ఎలా వున్నావు సుమా? హౌ ఈజ్ యువర్ ఫస్ట్ డే?" నవ్వుతూ పలకరించాడు.

అతని మొహం చూస్తే చాలాసేపటి నుంచి అక్కడే నిలబడి ఎదురుచూస్తున్నట్టుగా అనిపించింది ఆమెకి.

"ఫస్ట్‌డే ఎగ్జయిటింగ్‌గా వుంది. నేను మాట్లాడకపోయినా నా గురించి తెలుసుకుంటూనే వున్నావన్నమాట. నిజంగా యూ ఆర్ యింపాజిబుల్ ఆదీ. ఎనీ హౌ గుర్తుపెట్టుకుని వచ్చినందుకు థాంక్యూ, ఇంతకీ నువ్వెలా వున్నావు? దీప్తి ఎలా వుంది? " ఆప్యాయంగా అడిగింది.

"దీప్తి నీ గురించి అడుగుతూ వుంటుంది. నాతోబాటు ఒకసారి యింటికి వస్తావా? మామయ్య లైబ్రరీని నీకోసం అలాగే వుంచాను. దీప్తి కూడా నువ్వు వస్తే చాలా సంతోషిస్తుంది" చెప్పి సమాధానం కోసం ఆమె మొహంలోకి చూశాడు.

సుమ ఒక్క క్షణం తటపటాయించింది.

"నువ్వు రాలేదంటే దీప్తి కోపం తెచ్చుకుంటుంది. ఆమె సంగతి నీకు తెలుసుగా" అన్నాడతను.

సుమ వెంటనే సెక్యూరిటీ గార్డుని పిలిచి డ్రైవర్‌ని వెనక్కి పంపమని చెప్పి ఆదిత్య కారులో ఎక్కి కూర్చుంది.

"ఎలా వుంది ఆదీ కొత్త జీవితం?" అడిగింది సుమ. పైకి మామూలుగా అడిగినట్టుగా వున్నా లోలోపల అతని సమాధానం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తూ వుంది.

"నువ్వు వెళ్ళిపోయిన తర్వాత హఠాత్తుగా అంతా మారిపోయినట్టు అనిపించింది. కానీ నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. ఇప్పుడు నేను చాలా సంతోషంగా వున్నాను. తొందరలోనే యిల్లంతా పిల్లల సందడితో నవ్వులతో నిండిపోతే చాలా బావుంటుందనిపిస్తుంది" డ్రైవింగ్ మీదనుంచి దృష్టి మరల్చకుండానే జవాబిచ్చాడు.

అతను సంతోషంగా వుండాలనికోరుకున్నా ఎందుకో ఆ జవాబుకి మనసులో ముల్లు గుచ్చినట్టైంది సుమకి.

"నువ్వనుకున్నట్టే జరుగుతుంది" అంది బలవంతాన నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

కారు ఆగగానే దిగి ముందు నేరుగా స్టడీరూం వైపుకి నడిచింది సుమ. గదిలోకి వెళుతూనే పుస్తకాల షెల్ఫులో ఒక్కొక్క పుస్తకాన్నే ఆప్యాయంగా చేత్తో తడిమింది.

ఆమె వెనకాలే నిలబడ్డ ఆదిత్య "ఒకసారి ఆ పుస్తకాల్ని కూడా చూడు" అన్నాడు టేబుల్ వైపు చూపిస్తూ.

అక్కడ పసుపు రంగు అట్టతో కొత్తగా ప్రింటయినట్టున్న పుస్తకాలు కొన్ని కనిపించాయి సుమకి.

ఒక పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని తెరిచి చూసింది. అది ప్రసాదరావుగారు చివరగా రాసిన పుస్తకం. పబ్లిష్ అయివచ్చింది.

"ఆదీ ఎప్పుడు చేశావీపని?" అంటూ ఆశ్చర్యంగా అతని వైపుకి చూసింది.

"ముందు పేజీ ఒకసారి చదివి చూడు" అన్నాడతను నవ్వుతూ.

"నా బిడ్డగానే చేతుల్లో పెరిగి... నాకే తల్లిగా మారి నన్ను కటిరెప్పలా చూసుకున్న నా చిట్టితల్లి 'సుమ'కి అంకితం"

ఆ వాక్యాలు చదువుతూనే సుమ కళ్ళనుంచి రెండు కన్నీటిబొట్లు జారి పుస్తకం మీద పడ్డాయి.

"పుస్తకం ప్రింటయ్యేటప్పుడు ఆ వాక్యాలు చేర్చమని మామయ్య నాకు రాసి యిచ్చారు" చెప్పాడు ఆదిత్య.

"సారూ చాయ్"

పద్దెనిమిదేళ్ళ కుర్రాడు టీ కప్పులు ట్రేలో పట్టుకుని గుమ్మం దగ్గర నిలబడి వున్నాడు.

"లాన్‌లో టేబుల్ మీద ఉంచు. వస్తున్నాం" చెప్పాడు ఆదిత్య.

"ఈ అబ్బాయిని కొత్తగా పనిలోకి పెట్టుకున్నాను. చదువుకుంటూ పనిచేస్తుంటాడు. ఊరికే డబ్బు యిస్తే తీసుకోడట" అతను వెళుతూనే సుమతో అన్నాడు.

సుమ అతని వంక మెచ్చుకోలుగా చూసి లాన్‌లోకి నడిచింది.

"నీ గురించి చెప్పు. ఎలా వుంది నీ జీవితం?" అడిగాడు ఆదిత్య కుర్చీలో కూర్చుని టీ కప్పు అందుకుంటూ.

"ఉద్యోగ జీవితం యివాళే ఆరంభం. రాబోయే రోజులు నిర్ణయిస్తాయి నేనెంత సమర్ధురాలినో. ఇక పర్సనల్ జీవితం గురించి చెప్పడానికి పెద్దగా ఏమీలేదు. పదిరోజుల క్రితమే డైవోర్సు మంజూరు అయ్యింది. 'సుజీ, మోహిత్ పెళ్ళి చేసుకున్నారట' అని నవ్వి, ఒక్క క్షణం ఆగి మళ్ళీ మాట్లాడింది. మనుషుల మనస్తత్వాలు చాలా విచిత్రంగా వుంటాయి. మోహిత్ మోసగాడని తెలిసీ సుజీ ఎలా పెళ్ళి చేసుకుందో ఆలోచిస్తే నాకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది. తప్పు చేసినందుకు వాడికి ఎటువంటి శిక్షా పడలేదు. సుజీ అతనికి యింకో ఛాన్స్ యిచ్చింది. ఈ మానవత్వం మంచితనం అనేవి చాలా విచిత్రంగా వుంటాయి." అంటూ ఏదో గుర్తుకు వచ్చినదానిలా

"ఇంతకీ దీప్తి ఏది? కనిపించనేలేదు" అడిగింది ఆదిత్యని చూస్తూ.

"దీప్తి యిక్కడ ఎందుకు వుంటుంది? భర్త దగ్గర అమెరికాలో వుంటుంది గానీ" అన్నాడతను కూల్‌గా.

"ఆదీ ఏంటి నువ్వనేది? మీ యిద్దరూ పెళ్ళి చేసుకోలేదా? నాతో అబద్ధం చెప్పావా?" అంది ఆశ్చర్యపడుతూ.

"చెప్పకపోతే నువ్వు యింటిదాకా వచ్చేదానివా?" సూటిగా అడిగాడతను.

సుమ మాట్లాడలేదు.

"నువ్వు ఆ లెటర్ రాసిపెట్టి వెళ్ళిపోయాక నేను ఎలా వుంటాననుకున్నావు? 'నిన్ను మిస్సయినట్టు', 'నువ్వు లేకపోతే మనిషిలానే లేనట్టు' నా మొహం మీద రాసినట్టు కనిపిస్తూ వుంది."

"దీప్తి కూడా ఆ మాటే అంది. నిజానికి ఆమె నన్ను మార్చడానికి చాలా ప్రయత్నించింది. నేనూ ఆమెని ప్రేమించడానికి ట్రై చేశాను. కానీ యిద్దరం విఫలమయ్యాం" అన్నాడు నిట్టూరుస్తూ.

అతను చెప్పిన విషయం వింటూనే సుమ కనుబొమలు ముడుచుకున్నాయి.

"అయామ్ సారీ ఆదీ నాకు అర్జంటు పని ఒకటి గుర్తొచ్చింది. బయలుదేరాలి" అంటూ లేవబోయింది.

"ఆగు! నేను చెప్పేది యింకా పూర్తికాలేదు" అంటూ ఆదిత్య ఆమె చేయి పట్టుకుని ఆపాడు.

"నేనేమైపోయానో ఎలా కోలుకున్నానో నీకు తెలుసుకోవాలని లేదా?" అడిగాడు.

సుమ మాట్లాడకుండా తిరిగి కుర్చీలో కూర్చుంది.

"ఒకసారి నన్ను కాదని వెళ్ళిపోయావు. రెండోసారి కూడా నువ్వు కాదంటే నేనేమైపోతానో అన్న భయంతో నిన్ను అడగడానికి ధైర్యం కూడగట్టుకుంటూ వున్నాను.

కానీ నువ్వు నాకు ఆ అవకాశం కూడా యివ్వకుండా పారిపోయావు. నేను తిరిగి మనిషి కాలేనేమో అనే అనుకున్నాను. కానీ ఎప్పుడైతే నువ్వు, నేను భద్రంగా దాచుకున్న పెట్టెడు జ్ఞాపకాల్ని నీతోబాటు తీసుకెళ్ళిపోయావని గుర్తించానో అప్పుడు నాలో ప్రాణం వచ్చింది. ఒక చిన్న ఆశ. నాలాగే నువ్వుకూడా వాటిని ఆధారంగా చేసుకుని మనసుని కూడదీసుకునే ప్రయత్నం చేస్తున్నావేమో? నీకూ నేనంటే యిష్టమేనేమో అని"

సుమ పట్టుబడ్డ దొంగలా తలదించుకుంది. ఒంటరితనంలో ఎన్ని సార్లు ఆ పెట్టెలో ఆదిత్య భద్రంగా దాచుకున్న వస్తువుల్ని తాకి మనసులోనే ఏడ్చిందో గుర్తుకు వస్తూనే, ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"మాట్లాడు సుమా! ఇప్పటికైనా నోరు తెరిచి ఏదో ఒకటి మాట్లాడు. ఎప్పటిలా నన్ను ఏడిపించడానికి 'బావా' అని పిలువు. "నేనంటే నీకు యిష్టమేనా?" అనీ, "ధైర్యం చేసి ఈ పని ముందే ఎందుకు చేయలేదు ఆదీ! అనో అడుగు ప్లీజ్" ఆమె చేతులు పట్టుకుని కుదిపేస్తూ ఉద్వేగంగా అన్నాడు.

సుమ మాట్లాడకుండా బొమ్మలా కూర్చుని వుంది. జరుగుతున్నదంతా వాస్తవమని గ్రహించలేని పరిస్థితిలో వుంది ఆమె మనసు.

"రెండు నెలల క్రితం 'కాకా' చనిపోయాడు. ఈ యింట్లో 'నా' వాళ్ళు అనుకున్న వాళ్ళంతా నన్ను వదిలేసి వెళ్ళిపోయారు.

ఈ భయంకరమైన నిశ్శబ్దం నన్ను తినేస్తూ వున్నట్టుంది సుమా!

ఈ యింట్లో మన పిల్లలు నీలాగా అల్లరి చేస్తూ తిరుగుతూ వుంటే చూడాలని వుంది. ఈ నిశ్శబ్దం పారిపోయేలా మళ్ళీ నీ నవ్వులు వినాలని వుంది.

పూలతోటలో పూలలో లైబ్రరీలోని పుస్తకాల్లో మనుషుల్నీ, ఆత్మీయతనీ వెతుక్కుంటూ అలసిపోయాను. జ్ఞాపకాల్లో లోతుగా కూరుకుపోయినట్టుంది మనసు.

నాకు దీన్నుంచి బైటపడి నిజమైన జీవితాన్ని చూడాలని వుంది. అందుకే, నన్ను పెళ్ళి చేసుకుంటావా? అని అడుగుతున్నాను. దయచేసి కాదనకు ప్లీజ్."

ఆమె రెండు చేతుల్ని గుప్పిటలో బంధిస్తూ అడిగాడు.

సుమకి ఉద్వేగంతో కళ్ళవెంట జలజలా నీళ్ళు రాలాయి.

"భగవంతుడా!" మనసులోనే ప్రార్ధించింది. తల్లి, తండ్రి గుర్తుకు వచ్చారు.

ఆమె మౌనం భరించలేనట్టు సమాధానం కోసం ఎదురు చూస్తూ వున్నాడతను.

సుమ ఒక్క క్షణం గట్టిగా గాలిపీల్చుకుంది.

"ఒంటరితనం ఎంత భయంకరమో నాకు తెలుసు ఆదీ! తెలిసీ తెలిసీ నేను నీకా శిక్ష వేయలేను.

కానీ ముందొక ప్రశ్న అడుగుతాను చెప్పు. "మన పిల్లలని మా నాన్న మనల్ని పెంచినట్టు పెంచుతానని మాటిస్తావా?" పెదవంచుల్లో ఉద్వేగాన్ని అదిమిపడుతూ నీళ్ళు నిండిన కళ్ళతో అడిగింది.

"తప్పకుండా" అంటూ ఆమెని పైకి లేపి దగ్గరకు తీసుకున్నాడు.

ఆమె కూడా సంతోషం వ్యక్తమయ్యేలా గాఢంగా అతన్ని అల్లుకుంది. ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్న క్షణాలు ఆ కౌగిట్లో కరిగిపోవడం మొదలుబెట్టాయి.

వారికి, ఏకాంతం కల్పించాలన్నట్టుగా అప్పటిదాకా వున్న సందెవెలుగు. మెల్లగా మసక చీకట్లోకి తప్పుకుంది. ఆకాశంలో అప్పుడే మినుకుమినుకు మంటూ ప్రత్యక్షమైన రెండు నక్షత్రాలు పైనుంచి వాళ్ళని ఆశీర్వదిస్తున్నట్టుగా తొంగిచూశాయి.